# పంచ కావ్యాలలో జనజీవన పరిశీలన

# A STUDY OF SOCIAL LIFE IN PANCHA KAVYAS

డా॥ సమ్మెట మాధవరాజు, ఎమ్.ఎ., పి.హెచ్.డి.

(బెంగళూరు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం)

దుర్గా ప్రచురణలు

విద్యానగర్, గంగావతి

# PANCHA KAVYALALO JANAJEEVANA ARISHEELANAM

**Dr. S. Madhavaraju** M.A.,Ph.D.

First Edition : 1999

© With the Writer

No. of Copies : 1000

Price : Rs.50/-

For Copies : Smt. S. Jayalakshmi
W/o, Dr. S. Madhava Raju
Vidyanagar, Gangavathi
Koppal District
Karnataka - 583 227
Phone : 70153

D.T.P. : Sri. M. Parandhama Reddy
Mysore

Printed at : Shruthi Printers
Venkateshapuram
Bangalore - 560 045
Ph : 5477766

THIS BOOK IS PUBLISHED WITH THE
FINANCIAL ASSISTANCE OF
TIRUMALA TIRUPATI DEVASTHANAMS,
TIRUPATI
UNDER THEIR SCHEME
"AID TO PUBLISH RELIGIOUS BOOKS"


పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైదరాబాద్ వారి
ఆర్థిక సహాయముతో ఈ గ్రంథం ముద్రించబడింది.

# అంకితం

శా॥ తామేవేసిన బుక్కపట్టణపు విద్యారామ మందొప్పగన్
దీమంతుల్, యిదె గ్రంథ పుష్పముదయించెన్ దీనిలో పంచకా
వ్యామూలాగ్ర సమగ్ర శోధనము వ్రాయంగంటి మీ సత్కృపన్
స్వామీ! దీని పరిగ్రహింపు పరమేశా! సత్యసాయి ప్రభూ!

'తమ పేరిట ధన్యమైన,
బుక్కపట్న విద్యాలయ
దివ్యారామంలో విక
సించె గ్రంథ పుష్పంబిది.
స్వామీ! త్వచ్చరణాంబుజ
ముల నిడితిని భక్తితోడ,
స్వీకరించు, జీవితమున
అలసిపోతి సేదతీర్చు'

డా॥ ఎస్. మాధవరాజు



మంగర వృత్తం :

బ్రోవ పిపాసుల గంగ పుట్టిన పాదముల్
కావ విపన్నులలోన కాపగు పాదముల్
పావన భక్త హృదంత భావనముల్, విశ్వా
సావహాముల్ ఘన సత్యసాయి సుపాదముల్

## ఈ గ్రంథ ముద్రణకు విరాళదాతలు, మా పూర్వ విద్యార్థులు




శ్రీ వి.వి.వి.ఎస్.ఎన్. మూర్తి
డంగేరి క్యాంప్



శ్రీ కె. రామమోహనరావు
బసవన్న క్యాంప్



శ్రీ కె. సత్యనారాయణ
అంజూరు క్యాంప్



శ్రీ ఎస్. శ్రీనివాసరావు
వద్రహట్టి



శ్రీ కె. శ్రీనివాసరావు
బసవన్న క్యాంప్



శ్రీ ఎస్. సూరిబాబు
వద్రహట్టి

---

## ఈ గ్రంథ ముద్రణకు తోడ్పడిన నా శ్రేయోభిలాషులు, ప్రియ మిత్రులు



శ్రీ ఎమ్. వెంకటరమణప్ప
బెంగళూరు



శ్రీ. ఎమ్. పరంధామరెడ్డి
మైసూరు

# ముందుమాట

పంచకావ్యాల్లో జనజీవనం-ఒక పరిశీలన అనే విషయాన్ని ఎంపిక చేసుకుని కృషి చేయడానికి ప్రధానకారకులు సోదరుడు శ్రీ. కె. అమరనాథవర్మగారు. కర్ణాటక పాఠ్యపుస్తక రచనా మండలి సభ్యునిగా మైసూరులో డా. జి. యస్. మోహన్‌గారితో 1989లో పరిచయమైనప్పుడు ఈ విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. ఆ తర్వాత 1993వ సంవత్సరంలో వారు తమ మార్గదర్శకత్వంలో దీన్ని పిహెచ్. డి. పట్టా కోసం ఆమోదించారు. యోగ్యతనే కొలమానంగా పరిగణించి, ఎటువంటి సంబంధమూ లేని నన్ను అవ్యాజ అభిమానంతో చేరదీసి, పరిశోధనకు అవకాశమిచ్చిన డా. జి. యస్. మోహన్‌గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

పరీక్షాధికారులుగా వచ్చి నా కృషిని అభినందించిన డా. కె. సర్వోత్తమరావు (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి), డా. మలయవాసిని (ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు) గార్లకు నా కైమోడ్పులు.

ఈ సిద్ధాంత గ్రంథ రచనలో అడుగడుగునా సలహాలు, సూచనలు ఇస్తూ, తాను పరిశోధించిన విషయాల్ని, జనశ్రుతుల్ని అరమరికలు లేకుండా తెలియజేయడమే కాకుండా, ఇందులోని రెండో అనుబంధాన్ని కూడా రాసి ఇచ్చిన శ్రీ. కె. అమరనాథవర్మగారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ సిద్ధాంత గ్రంథంలో ఉపయోగించిన వ్యావహారిక భాషను సరిదిద్ది, అనేక సూచనలు, సలహాలు ఇవ్వడమే కాకుండా, ఈ గ్రంథాన్ని అందంగా డి.టి.పి. చేసి ఇచ్చిన భాషాశాస్త్ర నిపుణుడు, నా

ప్రియ మిత్రుడు అయిన డా. మునగాల పరంథామరెడ్డికి నా కృతజ్ఞతలు.

ఎక్కడా లభించని తమ అమూల్య గ్రంథాల్ని నాలుగేండ్ల పాటు నా హస్తగతం చేసిన సహృదయ మిత్రులు శ్రీ. ఎం. వెంకటరమణప్ప, శ్రీ. ఆర్. దేవన్న, గౌరవనీయులు బ్రహ్మశ్రీ యన్. శ్రీకంఠరావుగార్లకు నా నమస్సుమాంజలులు.

మేలుప్రతిని రాయడంలో తోడ్పడిన నా కుమారుడు చిరంజీవి విజయవర్ధన్, బి.టెక్,. కు నా విద్యార్థులకు ఆశీస్సులు. ఈ రచనలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను తోడ్పడిన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

డా॥ జి.ఎస్. మోహన్. M.A., Ph.D.
తెలుగు శాఖాధ్యక్షులు, బెంగళూరు విశ్వవిద్యాలయం
బెంగళూరు - 560 056

# ఆకాంక్ష

డా. మాధవరాజాగారితో నాకు పరిచయం 1989లో. ఇద్దరం మైసూరులో కర్ణాటక రాష్ట్ర పాఠ్య పుస్తక రచనా మండలి సభ్యులుగా దాదాపు నెలరోజులు కలిసి ఉన్నాం. ఆ సందర్భంలో ఆయన తాను పి.హెచ్.డి., చేయాలనీ, ఆ అవకాశం తనకు దొరకడంలేదనీ, నా దగ్గర అటువంటి అవకాశాన్ని కల్పించమనీ చెప్పడం జరిగింది. ఆయనలో ఉన్న ఆసక్తినీ, తపననీ గ్రహించి 1993లో 'పంచకావ్యాలలో జనజీవనం - ఒకపరిశీలన' అన్న విషయం మీద పరిశోధన చేయించడానికి అంగీకరించాను. ఆకారణంగానే ఆయన నామీద ఉన్న అభిమానంతో, గౌరవంతో ముందుమాటగా ఏదైన వ్రాసి ఇవ్వవలసిందిగా కోరడంతో ఈ నాలుగు మాటలని వ్రాయడానికి ఇష్టపడుతున్నాను.

డా. మాధవరాజాగారు ఎన్నుకొన్న విషయమే పరిశోధన స్వరూప స్వభావాలను విడమరచి చెప్తోంది. సాహిత్యానికీ, సమాజానికీ అవినాభావ సంబంధం ఉందని ఈ సిద్ధాంత వ్యాసం నిరూపిస్తోంది. జనజీవన విధానం ఆ ప్రజలు నివసించే ప్రాంతం మీద ఆధారపడి ఉంటుంది. పంచ కావ్యాలలో ప్రతిఫలించిన ఆ జనజీవనాన్ని విశ్లేషణాత్మకంగా వివరించారు డా.రాజాగారు.

సమాజం అంటే ఏమిటో, సాహిత్యానికీ సమాజానికీ సంబంధం ఎలాంటిదో నిరూపిస్తూ పంచకావ్యాలలో కనిపించే సాధారణ జీవనానికి సంబంధించిన అంశాలను వివరించడంతోపాటు సాంస్కృతికాంశాలను విశ్లేషించడంవరకూ ఒక విస్తృతమైన పరిశీలనా దృక్పథంతో ఈ సిద్ధాంతవ్యాసం రూపుదిద్దుకొంది.

ఈ సిద్ధాంత గ్రంథంలోని భాషసరళంగానూ, శైలి సూటిగాను, నిర్దిష్టంగానూ ఉండడం పరిశోధకుడి రచనా పటిమకు తార్కాణం. నేనేం చెప్పినా, ఈ సిద్ధాంతవ్యాసం నా మార్గదర్శకత్వంలో వచ్చింది కనుక, నేను కేవలం సిద్ధాంత గ్రంథం గురించి అతిశయోక్తిగా చెప్పినట్టవుతుంది, కనుక పాఠకులకే ఆ భారాన్ని వదలిపెడుతున్నాను. పాఠకులకు ఆసక్తికరంగా చదివించగల రచనే ఉత్తమ గ్రంథం అనిపించు కొంటుంది. అలా చదివించుకోగల సామర్థ్యం ఈ సిద్ధాంత గ్రంథానికి ఉందన్న విశ్వాసం నాకుంది.

డా. మాధవరాజాగారు కవి, భావుకుడు, అవధాని - ఆయన గళం నుంచి ఎన్నో ఆశుకవితలు వెలువడ్డాయి. ఆయన ఉత్తమ పరిశోధకుడు. అందువల్లే ఆయన కలంనుంచి ఒకమంచి సిద్ధాంతవ్యాసం కూడా వెలుగు చూస్తోంది. ఇలాగే ఇతోధికమైన సాహితీ సేవచేసి, ప్రయోజనకరమైన రచనలు చేస్తారని ఆకాంక్షిస్తూ, శిష్యమిత్రుడైన డా. మాధవరాజాగారిని హృత్పూర్వకంగా అభినందిస్తున్నాను.

బెంగళూరు
15.05.1999

జి.ఎస్. మోహన్

**ఆచార్య కె.జె. కృష్ణమూర్తి**
విశ్రాంత ఆచార్యులు (శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం)
కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్సు
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# అభిప్రాయం

తెలుగు పరిశోధన రంగంలో 'సిద్ధాంత వ్యాసాల' ది ఒక ప్రత్యేకమైన బాణీ. వాటిలో కొన్ని 'డిగ్రీ'ని సాధించటంతో సార్థకమైతే, మరికొన్ని సహృదయ పాఠకులను ఆకట్టుకొనే విషయ వైశిష్ట్యమూ, రచనా వైచిత్రీ కలిగి రాణిస్తూవుంటాయి.

''పంచ కావ్యాలలో జన జీవనం - ఒక పరిశీలన'' అనే ఈ పరిశోధనాత్మక ప్రబంధం పైన పేర్కొన్నవాటిలో రెండవ కోవకు చెందిన విమర్శ రచన. 'దాదాపు ఇరవై సంవత్సరాలు డిగ్రీ అపేక్ష లేకుండా కేవలం ఉత్సాహంతోనే' ఈ కృషి కొనసాగటం - దీని ప్రత్యేకతకు ఒక కారణం. సమకూర్చిన సాహిత్యాంశాలను, సేకరించిన జన శ్రుతులతో చక్కగా సమన్వయించే ప్రయత్నం కావించటం - రెండవ కారణం.

విషయం, విన్యాసం - అనే ఉభయ రీతుల్లోనూ ఈ పరిశోధకుని నిజాయితీ, నైపుణ్యమూ ఇందులో సుస్పష్ట రేఖలతో సాక్షాత్కరిస్తున్నాయి. ముఖ్యంగా ఇందలి శైలి సెలయేటివలె అలవోకగా, సహజంగా, అత్యంత సరళంగా సాగింది.

ఆంధ్ర కర్ణాటక వాఙ్మయ వాహినుల కూడలి ప్రదేశంలో నివసిస్తూవున్న ఈ విద్వత్కవి డా॥ సమ్మెట మాధవరాజు ఇలాంటి విశిష్ట కృతులను ఇతోధికంగా వెలువరిస్తూ సాహిత్య సరస్వతిని చక్కగా ఆరాధించగలడని ఆశిస్తున్నాను; హార్దికంగా ఆశాసిస్తున్నాను.

కె. జె. కృష్ణమూర్తి

**ఆచార్య ఎస్వీ. రామారావు**
తెలుగు విభాగం
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 7

# ప్రబంధ పాటవం

ప్రపంచంలోని ఏ ఉత్తమ సాహిత్యమైనా సామాజిక జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించలేని కొందరు ప్రాచీన సాహిత్యమంతా సమాజానికి దూరమైనదని అపోహపడుతుంటారు. 16వ శతాబ్దంలోని ప్రబంధ వాఙ్మయం గురించికూడా ఇటువంటి దురభిప్రాయాలు వ్యాప్తిలో వున్నాయి. నిజానికి అంతకుముందు వెలసిన సాహిత్యం ఇతిహాస పురాణాలకు అనువాదమేకాని స్వతంత్రమైనది కాదు. స్వేచ్ఛా ప్రియమైన ప్రబంధయుగ సాహిత్యం సమాజానికి చేరువలో పయనించిందంటే అత్యుక్తి కాదు. ''వ్రాసిన కవి సత్యమై వుండగా - అతడు జీవించి, సంచరించి, చూచి అనుభవించిన సంఘము కనుల ఎదుర సత్యమైవుండగా - అతడు వ్రాసిన కావ్యములలో మాత్రము అంతయును అసత్యమే అయివుండుట అసాధ్యము.'' అన్న రాళ్లపల్లివారి వాక్కులు స్మరణీయాలు.

**డా॥ ఎస్. మాధవరాజుగారు** ప్రబంధయుగంలోని పంచకావ్యాల జనజీవన చిత్రణను పరిశోధనాంశంగా గ్రహించి చక్కని సిద్ధాంత వ్యాసం వెలువరించారు. సంస్కృతంలో కాళిదాస కావ్యత్రయం, భారవి కిరాతార్జునీయం, మాఘుని శిశుపాల వధ పంచకావ్యాలుగా ప్రసిద్ధి పొందాయి. వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయగలిగితే సంస్కృత సాహిత్యాన్నంతా ఆపోశనం పట్టినట్లే. అయితే తెలుగు పంచకావ్యాల గురించి భిన్నమైన అభిప్రాయాలున్నాయి. శృంగారనైషధం, రాఘవ పాండవీయం మొదలగునవి వీనిలో చేరినా పాండితీప్రకర్షనుబట్టి కాక వస్తు ప్రాధాన్యాన్ని దృష్టిలోపెట్టుకొని ఆముక్తమాల్యద, మనుచరిత్ర, పారిజాతాపహరణం, వసుచరిత్ర, పాండురంగ మహత్మ్యం అను పంచకావ్యాలుగా స్వీకరించారు రచయిత.

మాధవరాజుగారు ఈ సిద్ధాంత వ్యాసాన్ని నాలుగు ప్రకరణాలుగా వింగడించారు. మొదటి ప్రకరణంలో సమాజ సాహిత్యాల సంబంధం, పంచకావ్యాల చర్చ ప్రస్తావించారు. మిగిలిన ప్రకరణాలలో ప్రబంధాలలో ప్రతిఫలించిన జనజీవనాన్ని విపులంగా విశ్లేషించారు. ఈ జన జీవన వికాసాన్ని రెండు భాగాలుగా వర్గీకరించటం సముచితంగా వుంది. సాంఘిక జీవనానికి (Social life) సంబంధించిన వ్యవసాయం, వాణిజ్యం, వృత్తులు, వైద్యం మొదలగునవి ఒక వర్గం కాగా - సాంస్కృతిక జీవనానికి (Cultural life) చెందిన విద్య, కళలు, దేవాలయాలు, జాతరలు, విశ్వాసాలు మొదలగునవి మరొకవర్గం. నగర - గ్రామ జీవితాలను ప్రత్యేకంగా గుర్తించటంకూడ రచయితలోని విషయావగాహనా స్పష్టతకు నిదర్శనం.

ఇతః పూర్వం తెలుగు కావ్యాలలోని సాంఘిక జీవనాన్ని పరామర్శించిన పరిశోధనగ్రంథాలు ఈ రచయిత కృషికి స్ఫూర్తినిచ్చాయి. పరవళ్లుత్రొక్కుతూ ప్రవహించిన విజయనగర సాంస్కృతిక వాహిని 16వ శతాబ్దంలో ఆగిపోయినా, ఆ ప్రవాహవేగంలో నిండిపోయిన సజీవ సరస్సులవంటి హంపీ పరిసరాల్లో నివసించటంచేత మాధవరాజులో ఈ పరిశోధనాభిలాష మొలకెత్తింది. అతని పరిశోధనా దీప్తికి దోహదం చేసిన పర్యవేక్షకులు డా॥ జి.ఎస్. మోహన్‌ను అభినందిస్తున్నాను.

బుక్కపట్నం సత్యసాయి ఉన్నత పాఠశాలలో, తిరుపతి ప్రాచ్యకళాశాలలో విద్యనభ్యసించి తెలుగు భాషలో నిష్ణాతులైన మాధవరాజుగారు 'కచదేవయానీయము' అను ప్రౌఢపాండితీస్ఫోరకమైన పద్య కృతిని వెలువరించి సృజనాత్మక రంగంలో కూడ తమ ప్రతిభను ప్రదర్శించారు. వారిలోని సృజన, విమర్శన శక్తులు మరింత నిగ్గుతేరి పెక్కు సాహితీకాంతులు విరజిమ్మాలని ఆకాంక్షిస్తున్నాను.

సికిందరాబాద్
తే : 7 జూన్ 1999 డా॥ ఎస్వీ. రామారావు

ఆచార్య. టి.యస్. గిరిప్రకాష్
తెలుగు మరియు తులనాత్మక అధ్యయన శాఖ
మదురై - కామరాజ్ విశ్వవిద్యాలయం
పల్కలైనగర్, మదురై - 625 021.

# అభినందన

వాఙ్మయము ఎల్లప్పుడూ జీవితానికి అద్దంలాంటిది. ప్రజల జీవితానికి ప్రతిబింబమే వాఙ్మయ మనికూడ చెప్పవచ్చు. ఆంధ్ర సాహిత్యచరిత్రలో దాదాపు అన్ని కావ్యాలు కూడ ఆంధ్రుల ఆచారాలకూ, సాంఘిక సంస్కృతాలకు ప్రబల నిదర్శనాలు. ప్రాచీన కాలంలో ప్రజలు భౌగోళిక, పరిసర వనరులను వారి జీవనయాత్రకోసం అలవరచుకొనేవారు. వాటినే అనుసరిస్తూ కవులు తమ కావ్యాలలో కూడ సామాజిక జనజీవన విధానాలను అక్కడక్కడ చొప్పిస్తూవచ్చారు. ఆనాటినుండి ఈ నాటివరకు ఈ సాంఘిక జీవన క్రమాభివృద్ధి మనకు గోచరిస్తున్నది. రాజుల చరిత్రకన్న ఆనాటి ప్రజల జీవన విధానం ఆంధ్ర సాహితీక్షేత్రంలో కుప్పలు తిప్పలుగా కనబడుతున్నాయి. కడలిని త్రవ్వగా త్రవ్వగా ముత్యాలెలా దొరుకుతాయో అదే విధంగా తెలుగు సాహితీ జగత్తులోని కావ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆణిముత్యాల్లాంటి సాంఘిక జీవన విధానాలు కాలక్రమాను సారంగా తెలియవస్తాయి. ఇవే తరతరాలుగా మన ప్రాచీనులు మన కందించిన భాండాగారాలు.

డా॥ నమ్మోట మాధవరాజుగారు బెంగళూరు విశ్వవిద్యాలయానికి 'సమాజం-సాహిత్యం-తెలుగు పంచకావ్యాలు' అన్న అంశంపై సిద్ధాంతవ్యాసాన్ని సమర్పించి ప్రస్తుతం ఆ వ్యాసాన్ని ముద్రించి ఆంధ్ర సాహిత్యానికి యెనలేని సహాయం చేశారంటె అతిశయోక్తికాదు. ఎందుకంటె తెలుగు సాహిత్యంలోని పంచకావ్యాలను కూలంకషంగా చదివి వాటిలోని సమాజ చిత్రణను చక్కగా చిత్రీకరించారు. ఈయన సహజకవి. ఇంతకు ముందే భారత ఇతిహాసవృత్తాన్ని 'కచదేవయానీయ' మనే కావ్యంగా రచించినవారు.

'సమాజం' 'సాహిత్యం' అన్న పదాలకు లక్షణాలను ఆంగ్ల గ్రంథాలుకూడ పరిశీలించి, లక్ష్య సమన్వయంచేసి 'Poetry is an interpretation

of life' అన్న Mathew Arnold ముఖ్య నిర్వచనాన్ని కూడా పేర్కొని, సాహిత్యంలో జనజీవన పరిశీలనావశ్య కతను ఉటంకించి, తెలుగు సాహిత్యంలోని పంచ కావ్యాల కథాసారాంశాలను తెలిపి, రెండవ ప్రకరణంలో వాటిలోని జనజీవన విలయాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు.

పారిజాతాపహరణంలో ముక్కుతిమ్మన శ్రీ కృష్ణదేవరాయల నివాసమైన 'మలయకూటా'న్ని వర్ణించిన తీరును డా॥ రాజాగారు చారిత్రికాంశాలతో విపులీకరించారు. ముక్కుతిమ్మన 'మలయకూటా'న్ని మదిలో చిత్రించుకొనే మదురైలో తిరుమలనాయకుడు ఒక బ్రహ్మాండమయిన మహలును కట్టించాడు. ఇసుక, బెల్లం, పాలు, సున్నం, నీళ్ళు మాత్రమే కాక కోడిగ్రుడ్లను వాటితో రంగరించి కట్టిన స్తంభాలు కొన్ని 60 అడుగుల ఎత్తు పదమూడు అడుగుల చుట్టుకొలతలు కలిగి ఆ మహలులో ఇంకా నిగనిగలాడుతున్నాయి. అది 'తిరుమలనాయక మహల్' అని ప్రశస్తిపొంది ఈ నాటికీ దేశ విదేశీయులను ఆకర్షిస్తున్నది.

నగర నిర్మాణానికి తగిన హంగులన్నీ పంచకావ్యాలలో వర్ణింపబడిన తీరును పేర్కొని, మూడవ ప్రకరణంలో సాంస్కృతిక అంశాలను చక్కగా డా॥ రాజాగారు ఎత్తిచూపారు.

మొత్తంమీద ఈ పుస్తకం తెలుగు సాహిత్యంలో సామాజిక దృక్పథంమీద పరిశోధన కావించే పరిశోధక విద్యార్థినీ విద్యార్థులకు ఉపయోగకారి కాగలదని చెప్పవచ్చు.

డా॥ యస్. మాధవరాజాగారు యింకా పెక్కు గ్రంథాలనురచించి, తెలుగు సాహితీ జగత్తుకు సేవ చేయాలని ఆంకాంక్షిస్తున్నాను.

12.6.1999 టి. యస్. గిరిప్రకాష్

కె. అమరనాథవర్మ
ఆనెగుంది
హొసపేట తాల్లూక
బళ్ళారి జిల్లా

# స్పంధన

మా పూర్వజుల వంశంలోని ఒక శాఖలో పుష్పించి సాహిత్య సౌరభాలు వెదజల్లుతున్న కుసుమరాజం పేరే మాధవరాజా. తనకంటె కొంత చిన్నవాడ్నైన నన్ను తనకు ప్రేరణకలిగించిన వ్యక్తిగా ప్రస్తుతించడం ఆయన సోదర వాత్సల్యానికి, సంస్కారానికి ప్రతీకగా భావించి డాక్టరేట్ గౌరవ పురస్కారం పొందిన శుభ తరుణాన శుభాకాంక్షలు తెలుపుతూ పులకాంకితుడనౌతున్నాను. ఈయనకు సంబంధించిన వాస్తవాలు వివరించడం పరస్పర ప్రశంసకాదని పొండిలీ ప్రకర్షకు కొలమానమని సవినయంగా ప్రస్తుత పరుస్తున్నాను. కనీస విద్యార్హతలతో కర్నాటక రాష్ట్రంలో ప్రవేశించి శీఘ్రగతిలో ఉన్నత విద్యాశిఖరాలను అధిరోహించడం ఈయన ప్రతిభకు తార్కాణం. పంచకావ్యాలలో జనజీవన పరిశీలన ఈయన పరిశ్రమకు పరిణతికి దర్పణం పడుతుంది. విజయనగర సామ్రాజ్య సంస్కృతివాహిని పంచకావ్యాలలో అంతర్లీనమై ప్రవహిస్తుంది.

పరమోత్కృష్టమైన ఆముక్తమాల్యదా మహాకావ్య వర్ణనలు సూక్ష్మాతి సూక్ష్మ విశ్లేషణలు మానసోల్లాసకర మలుపులగురించి నేనర్థంచేసుకున్న పరిభాషలో వివరించినప్పుడు ఆయన సాహిత్య మేధస్సులో విద్యుత్ సంచలనం జరగడం తత్ఫలితంగా అంతవరకు అంతగా పట్టించుకోని శ్రీ కృష్ణదేవరాయకృత ఆముక్తమాల్యదా మహాకావ్యాన్ని ఆయన తరచి తరచి చదవడం తత్ప్రేరణయే 'పంచకావ్యాలలో జనజీవన పరిశీలన'గా రూపం సంతరించుకోవడం జరిగింది. ఆముక్తమాల్యదా మహాకావ్యంపై విశేష పరిశ్రమచేసిన పరిమిత వ్యక్తుల జాబితాలో మాధవరాజాగారు కూడా ఒకరు. ఉత్తరోత్తరా వీరి రచనలు కర్నాటాంధ్ర రాష్ట్రాలకు విస్తరించి సాహిత్యాసక్తులకు మహోపకారం చేయాలని కాంక్షిస్తున్నాను.

కె. అమరనాథవర్మ

# కృతజ్ఞతాంజలి

ఈ గ్రంథానికి తమ అమూల్యాభిప్రాయాల నందించిన శ్రీయుతులు :

1) డా॥ జి.ఎస్. మోహన్, ఎమ్.ఎ., పిహెచ్.డి., తెలుగు శాఖాధ్యక్షులు, బెంగళూరు విశ్వవిద్యాలయం,

2) కె.జె. కృష్ణమూర్తి, నివృత్తాచార్యులు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, కంట్రోలర్ ఆఫ్ పబ్లికేషన్స్, తిరుమల తిరుపతి దేవాస్థానం, తిరుపతి,

3) ఆచార్య ఎస్వీ రామారావు, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్,

4) ఆచార్య టి.ఎస్. గిరిప్రకాశ్, తెలుగు మరియు తులనాత్మక అధ్యయన శాఖ, కామరాజ్ విశ్వవిద్యాలయం, మదురై,

5) 'స్పందన' నందించిన సోదరులు, ఆనెగుంది, శ్రీ కె. అమరనాథ వర్మకు నా కృతజ్ఞతలు.

గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు, అందునా మిత్రులు శ్రీ కోరాడ రామకృష్ణగారికి అలాగే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం - రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. శివరామమూర్తి గారికి, ఆ విషయంలో దారిచూపిన అంతర్జాతీయ తెలుగు కేంద్రం అధికారులైన డా॥గౌరీ శంకర్, డా॥ మునిరత్నం నాయుడు గార్లకు - D.T.P. చేయించడంలో తోడ్పడిన శ్రీM. పరంధామరెడ్డిగారికి, ముద్రణకు సంబంధించిన అన్ని విషయాల్లోనూ అండగా నిల్చిన ప్రియ మిత్రుడు శ్రీ. M. వెంకటరమణప్ప, కర్నాటక తెలుగు ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి గారికి నా కైమోడ్పులు, కైమోడ్పులు.

ఒకే ఒక్కమాటతో 30 వేల రూపాయల కట్టలను ఎంతో గౌరవంగా అందించిన నా ప్రియ విద్యార్థులు చిరంజీవులు V.V.V.S.N. మూర్తి, K. సత్యనారాయణ, N. శ్రీనివాసరావు, N. సూరిబాబు, K. రామమోహనరావు గార్లకు, నా హృత్పూర్వక శుభాశీస్సులు. వారికి వారి కుటుంబానికి భగవంతుడు ఆయురారోగ్య సంపదలతోపాటు వారి చిరంజీవులకు చక్కని విద్యాబుద్ధులను ప్రసాదించుగాక!

ఇంకా ఈ గ్రంథం ఈ రకంగా వెలుగు చూడటానికి కారకులైన మహానుభావులందరికీ నా కృతజ్ఞతాభివందనాలు.

డా॥ ఎస్. మాధవరాజు

# విషయసూచిక


| క్రమ సంఖ్య | | పుట సంఖ్య |
|---|---|---|
| ముందుమాట | | iii-iv |
| విషయసూచిక | | v |
| సంజ్ఞా వివరణ పట్టిక | | vi |
| 1. | సమాజం-సాహిత్యం-తెలుగు పంచకావ్యాలు | |
| | A. ప్రవేశిక | 1-3 |
| | B. సమాజం | 4-7 |
| | C. సాహిత్యం-సమాజం-పరస్పర సంబంధం | 8-14 |
| | D. తెలుగు పంచకావ్యాలు-ఒక పరిశీలన | 15-18 |
| | E. సాహిత్యంలో జనజీవన పరిశీలనావశ్యకత | 19-22 |
| | F. పంచకావ్యాల కథా సారాంశాలు | 23-40 |
| 2. | పంచకావ్యాలు-జనజీవన నిలయాలు | 41-77 |
| 3. | వేష భూషణాదులు - స్వరూప స్వభావాలు | 78-101 |
| 4. | పంచకావ్యాలు-సాంస్కృతికాంశాలు | 102-138 |
| 5. | పంచకావ్యాలు-కులాలు-వృత్తులు | 139-174 |
| 6. | పంచకావ్యాలు-పరిపాలనా విధానాలు | 175-208 |
| 7. | పంచకావ్యాలు-అభిరుచులు-అలవాట్లు-మనస్తత్త్వాలు | 209-266 |
| 8. | పంచకావ్యాలు-ముగింపు | 267-273 |
| | అనుబంధాలు | 274-281 |
| | ఉపయుక్త గ్రంథాలు | 282-286 |

# సంజ్ఞా వివరణ పట్టిక

| సంకేతం | వివరణ |
|---|---|
| ఆము. | ఆముక్తమాల్యద |
| ఆం.సాం.చ. | ఆంధ్రుల సాంఘిక చరిత్ర |
| నా.కృ.కు | నాయని కృష్ణకుమారి |
| పాండు. | పాండురంగమహాత్మ్యం |
| పారి. | పారిజాతాపహరణం |
| ప్ర.ము. | ప్రథమ ముద్రణ |
| భా.దే.సాం.చ. | భారతదేశ సాంస్కృతిక చరిత్ర |
| మను. | మనుచరిత్ర |
| వసు. | వసుచరిత్ర |
| వెం.సూ.శా. | వెంవరాల సూర్యనారాయణ శాస్త్రి |
| సు.ప్ర.రె. | సురవరం ప్రతాప రెడ్డి |
| F.E. | Forgotten Empire |

# సమాజం -సాహిత్యం -తెలుగు పంచకావ్యాలు

## ప్రవేశిక

"ఆదిరాజా యశో బింబమ్ ప్రాప్య వాఙ్మయ దర్పణమ్,
తేషామ్ అసన్నిధానేఽపి నస్వయమ్ పశ్య నశ్యతి"

"ప్రాచీన రాజుల యశోబింబాలు వాఙ్మయమనే అద్దాన్ని చేరి, ఆ రాజులు గతించిన తర్వాత కూడా నశించకుండా అలాగే నిలబడతాయి". ఇలాగే ఆనాటి ప్రజాజీవన వ్యవస్థ కూడా. అందుకే 'చరిత్ర' ఒకనాటి సామాజిక పరిస్థితుల బాహ్య చిత్రణ మాత్రమే చేయగలుగుతుండగా, 'సాహిత్యం' ఆంతరంగిక పరిస్థితిని కూడా చిత్రించగలదు. ఒక వ్యక్తి ఛాయాచిత్రం (ఫోటో) ఆ వ్యక్తి ఆకారాన్ని మాత్రమే చూపించగలదు. సాక్షాత్తు అతను మాట్లాడిన రికార్డు మరింత లోతుకు వెళ్ళి, అతని మనోభిరుచుల్ని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది. అటువంటిదే 'సాహిత్యం'. సాహిత్యం అంటే అందమైన అబద్ధం అనే అభియోగం ఉన్నా, సమర్థుడైన పరిశీలకుడు, ఆ అబద్ధాల నుంచి కూడా కొన్ని సత్యాల్ని వెలికి తీయగలడు. దక్షుడైన న్యాయవాది తన ప్రతివాది ఎలాంటి దొంగసాక్ష్యాల్ని ప్రవేశపెట్టినా, తన మేధాశక్తితో ఆ సాక్ష్యాల్ని బోల్తా కొట్టించి, అసలు యథార్థాన్ని కక్కించగలడు. సత్యహరిశ్చంద్రుడి కథ చదివే సమర్థుడైన పరిశీలకుడు ఆ కథ నిజంగా జరిగిందా? లేదా? అనే తర్జన భర్జనలకు తావీయకుండా, ఆ కథలోని పాత్రల నోటినుంచి వెలువడ్డ మాటల్ని బట్టి కథ జరిగిన కాలం నాటివి కాకున్నా, కనీసం రచయిత కాలం నాటి పరిస్థితుల్ని అవగాహన చేసుకోగలడు. ఇలా హరిశ్చంద్ర గాథవల్ల

ఆనాడు సంఘంలో మనుషుల్ని అమ్మే బానిస వ్యవస్థ అమల్లో ఉండేదనే సత్యాన్ని కనుక్కోగలుగుతాడు. ఇలాగే పంచకావ్యాలలో (ఆముక్తమాల్యద, మనుచరిత్ర, పారిజాతాపహరణం, వసుచరిత్ర, పాండురంగమహాత్మ్యం) నిక్షిప్తమై ఉన్న జనజీవన పరిస్థితుల్ని పరిశీలించడం ప్రస్తుత గ్రంథకర్త ముఖ్యోద్దేశం.

నేను ఈ విషయాన్ని ఎంపిక చేసుకోవడానికి హంపీ పరిసరాల్లో నివసిస్తూ ఉండడం కొంతవరకు కారణం. పరవళ్లు తొక్కుతూ ప్రవహించిన విజయనగర సాంస్కృతిక వాహిని 16వ శతాబ్దం అంతానికే ఆగిపోయినా, ఆ ప్రవాహ వేగంలో నిండిపోయిన పరిసర జీవన సరస్సులనబడే ప్రాంతాలు నేటికీ సజీవంగా ఉన్నాయి. అక్కడ అనూచానంగా వస్తున్న జనశ్రుతులు, తెలుగు, కన్నడ భాషల్లోవి వినగలిగే అవకాశం మరికొంత ఉపయుక్తమైంది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటంతో, ఈ హంపీ ప్రాంతాలు ఆంధ్ర రాష్ట్రానికి దూరమయ్యాయి. దాని ఫలితంగా ఇక్కడి తెలుగు భాషా సంస్కృతులు ప్రభుత్వ ఆదరణకు నోచుకోలేక పోతున్నాయి. ప్రస్తుత కాలంలో వెర్రితలలు వేస్తున్న సంకుచిత భాషా దురభిమానం కూడా దీనికి కొంత కారణం అని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో అటు ఆంధ్రరాష్ట్రానికీ, ఇటు కర్ణాటక రాష్ట్రానికీ అందకుండా, ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో మిణుకు మిణుకుమంటూ, చావు బతుకుల్లో ఊగిసలాడుతున్న చారిత్రిక సత్యాలనబడే జనశ్రుతుల్ని సేకరించి, ప్రస్తుత విషయానికి తోడుగా వాడుకోవడం జరిగింది. ఇదే విషయం మీద చాలా మంది పరిశోధకులు ఆంధ్రరాష్ట్రంలో పరిశ్రమించి ఉన్నా, ఈ దిశగా అంటే సాహిత్యానికి తోడు జనశ్రుతుల్ని మేళవించిన ప్రయత్నం జరగలేదు. వీటికి తోడు విదేశీయులు రాసిన వాటిల్లో చెప్పబడ్డ అంశాలకు, సమానమైన అంశాల్ని మన సాహిత్యంలో చూపెట్టి సమన్వయించడం జరిగింది. దాదాపు ఇరవై సంవత్సరాలు డిగ్రీ అపేక్ష లేకుండా, కేవలం ఉత్సాహంతోనే కొనసాగుతున్న ఈ కృషిని యాదృచ్ఛికంగా డా. జి. యస్.

మోహన్‌గారితో ప్రస్తావించడం, వారు సంతోషంతో దీన్ని పి.హెచ్.డి. పట్టాకోసం అంగీకరించడం జరిగింది. ఫలితంగా ఇది రూపుదిద్దుకుంది.

# సమాజం

'సమాజం' అనేది ప్రకృతి సిద్ధమైంది. సమాజంలో అనేకమంది వ్యక్తులు ఉంటారు. అనేక సంస్థలు ఉంటాయి. ఒక వ్యక్తికీ, మరో వ్యక్తికీ సంబంధాలు ఉంటాయి. ఒకరి మీద మరొకరు ఆధారపడి జీవిస్తూ ఉంటారు. మానవుడు నిరంతరం మార్పు చెందే జీవి కాబట్టి, సమాజం సర్వకాల, సర్వావస్థల్లోనూ మార్పు చెందుతూ ఉంటుంది. మానవ సమాజం నిత్యనూతనమైంది. సమాజాన్ని గురించి అనేకమంది శాస్త్రజ్ఞులు వివిధ కోణాల్లో పరిశీలన జరిపి, అనేక నిర్వచనాల్ని ఇచ్చారు. 'సమాజం సాంఘిక సంబంధాల అల్లిక' అని మెకైవర్ అభిప్రాయం. విభిన్న ఆచార వ్యవహారాలు, భిన్నవృత్తులు, విభిన్న తరగతుల విశ్వాసాలు, విలువలు, వ్యవస్థలు, ప్రత్యేకమైన జీవన విధానాలు, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు కలిగి, నిర్ణీత ప్రదేశంలో నివసించే ప్రజా బాహుళ్యాన్ని 'సమాజం' అని నిర్వచించవచ్చు. ఈ సంబంధాలన్నింటికీ కేంద్ర స్థానంగా 'వ్యక్తి' ఉంటాడు.

సమాజ ఆవిర్భవానికి సమాజ శాస్త్రవేత్తలు, రాజనీతి శాస్త్రవేత్తలు వివిధ సిద్ధాంతాలు ప్రతిపాదించారు. జైవిక సిద్ధాంతం, సమూహ మనస్తత్వ సిద్ధాంతం, పరిణామ సిద్ధాంతం ఇలా ఎన్నో ఉన్నాయి. ఇలా మానవజాతి వికాసగతిని గమనించిన తర్వాత, సామాజిక పరిణామమనేది ఒకేసారి కాకుండా, కొన్ని వేల సంవత్సరాలపాటు జరిగిందని, ఆ తర్వాత 'సమాజం' పుట్టిందనే 'సామాజిక పరిణామవాదమే' హేతుబద్ధంగా కనిపిస్తోంది. మానవులందర్నీ ఒక సమాజంగా భావించినప్పటికీ, వివిధ అంశాల్లో వ్యత్యాసాల దృష్ట్యా అనేక సమాజాలు ఉన్నాయి. ఒక్కొక్క ప్రాతిపదిక మీద ఒక్కో సమాజంగా పరిగణిస్తుంటారు. గ్రామీణ సమాజం, నగర సమాజం, పాశ్చాత్య సమాజం ఇలా అనేక రకాలుగా వర్గీకరించవచ్చు. ఒక

ప్రాంతంలోని మానవ సమూహాన్ని సమాజంగా పరిగణించాలంటే ఉండాల్సిన లక్షణాలు:

1. *నిర్ణీత జనాభా భూభాగం* :- మానవ సమూహాలతోనే సమాజం ఏర్పడుతుంది. సమాజం శాశ్వతం. వ్యక్తులు అశాశ్వతం. మరణంతో కొంతమంది వ్యక్తులు నిష్క్రమించడం, జననంతో కొత్త సభ్యులు ప్రవేశించడం జరుగుతోంది. సమాజానికి నిర్ణీత భూభాగం ఉండాలి. ఆదిమ యుగంలో మానవ సమూహం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఆహారం కోసం తరలి వెళ్లేది. వ్యవసాయం తెలుసుకున్న తర్వాత స్థిర జీవనం ఏర్పడింది. ఆ స్థిర జీవనమే సమాజ భావనకు పునాది అయ్యింది. మానవ సమూహం ఒకచోట స్థిరజీవనం సాగించాలంటే నిర్ణీత పరిధి ఉన్న భూభాగంగా సరిహద్దులు ఉంటాయి. ఇలా శాశ్వతంగా నివసించడంవల్ల వాళ్లలో ఏకత్వ భావన బలంగా ఏర్పడి ఉంటుంది. తామంతా ఆ ప్రాంతానికి చెందిన వాళ్లమనే భావన దృఢపడింది.

2. ఏకరూపత-*వైవిధ్యం* :- ఒక సమాజంలో నివసించే ప్రజలందరూ ఒకే రకమైన ఆచారాన్ని, సంస్కృతిని కలిగి ఉంటారు. అయినా వాళ్లలో కూడా అనేక వైవిధ్యాలు ఉంటాయి. వాళ్లు భిన్న వృత్తులు కలిగి ఉంటారు. అందరూ ఒకే రకమైన పని చేయలేరు. కాబట్టి ఇటువంటి వైవిధ్యం సమాజంలో తప్పనిసరిగా ఉంటుంది.

3. *ప్రత్యేక సంస్కృతి* :- 'నాగరికత' అనేది ప్రజల బాహ్య లక్షణాలకు సంబంధించింది. అంటే ఆహారం, వస్త్రధారణం, గృహ నిర్మాణం మొదలైనవి. 'సంస్కృతి' అనేది ఆంతరంగికమైంది. చిత్త ప్రవృత్తులకు సంబంధించింది ఆలోచనా విధానం, ధార్మిక చింతన మొదలైనవి. రెండు సమాజాల మధ్య తేడా ఏర్పడటానికి, వాటి మధ్య ఉన్న సంస్కృతుల్లోని తేడాలే ముఖ్యకారణం.

4. *స్వతంత్రత* :- ఒక సమాజం మరే ఇతర సమాజానికీ లోబడకుండా ఉంటుంది. వాళ్లు నివసించే సమాజం వాళ్ల కోర్కెల్ని ఈడేరుస్తుంటుంది. వాళ్ల చర్యలు సమాజం చుట్టూ తిరుగుతుంటాయి. లేదా ఆ సమాజంలోని మిగతా సాంఘిక వ్యవస్థల చుట్టూ తిరుగుతుంటాయి.

5. *సహకారం* :- మానవుడు సంఘజీవి. ప్రతి దానికీ ఇతరుల మీద ఆధారపడక తప్పదు. అందువల్ల సహకారం అనేది మానవ సమాజంలో ముఖ్యమైంది. ఇది మొదట తల్లి-బిడ్డల మధ్య మొదలవుతుంది. క్రమేపీ సంతానం మధ్య, కుటుంబం మీద పూర్తిగాను, ఆ తర్వాత కుటుంబాల వెలువల ఆవరించుకుంటుంది. కాబట్టి మానవుడు సంఘంలో ఇతరుల సహకారంతో తన కోరికల్ని తీర్చుకుంటాడు.

6. *అధికారం* :- మానవుడి సంక్షేమార్థం కోసం రాజకీయ వ్యవస్థ ఏర్పడింది. ప్రతి సమాజం మనుగడకూ, సుఖమయ జీవనం పొందడానికీ ఏర్పడినటువంటిది రాజకీయ వ్యవస్థ. ఇందులో ప్రధానాంశం అధికారం. రాజ్య నిర్వహణ యంత్రాంగంలో ఒక భాగమే ప్రభుత్వం. ఇది సమాజంలో అంతర్భాగం. సమాజాన్ని అంతర్గత, బహిర్గత శత్రువుల నుంచి కాపాడటం అధికార కర్తవ్యం. ప్రధాన సామాజిక విధి కూడా. ఈ విధిని నెరవేర్చడంలో ప్రభుత్వ సిబ్బంది, పోలీసు, కోర్టులు, చట్టం, మిలిటరీ వ్యవస్థ మొదలైన అధికార యంత్రాంగం ఎంతగానో సహాయపడుతుంటాయి. పరిపాలనా వ్యవస్థలో అధికారం కీలకపాత్ర వహిస్తూ ఉంటుంది.

7. *సంస్థలు* :- సమాజంలో సంస్థలు ప్రధాన పాత్ర వహిస్తాయి. మెకైవర్ "సామాజిక కార్యక్రమాల్ని అమలుచేయడానికి ఏర్పడిన పద్ధతులు లేదా విధానాలను 'సంస్థ'లని పేర్కొన్నాడు. సంస్థలు లేకుండా ఏ మానవ సమాజమూ ఉండదు. మానవుల కోర్కెల్ని, అవసరాల్ని తీర్చడమే ఈ సంస్థల ప్రధాన కర్తవ్యం. మతపరమైన

సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, ఆర్థిక సంస్థలు, విద్యా సంస్థలు మొదలైనవి ఇందుకు ఉదాహరణలు".1

"Culture or civilization, taken in its wide enthrographic sense is that complex whole which includes knowledge, belief, art, morals, law, customs and any other capabilities and habits acquired by man as a member of society".2

"It is assumed as a working hypothesis, that each structural system is a functional unity, in which all the component parts contribute in a hormonious way to its existance and continuty. To test this hypothesis all kinds of social phenomena - moral, law, etiquette, religion, Government, economics, education,, language, need to be studied, not in abstraction or isolation, but in their direct and indirect relations to social structure. (i.e. with reference to the way in which they depend up on or affect, the social relations between persons and groups of persons".3

మొత్తం మీద సమాజం అంటే ఒకే రకమైన అభిరుచులు, జీవన విధానం కలిగి 'మనమందరం ఒకటి' అనే భావంతో ఒకే సమూహంగాను, నిర్దిష్ట భూభాగంలో నివసిస్తూ, ఒకే లక్ష్యాన్ని, ప్రయోజనాన్ని సాధించే ఉద్దేశంతో కొన్ని నియమ నిబంధనలకు లోబడి, శాశ్వత సంబంధం ఉన్న ప్రజల సమూహాన్ని 'సమాజం' అని చెప్పొచ్చు.

---

1. సమాజ శాస్త్రం - సామాజిక మానవశాస్త్రం. ఖండికలు, 4, 7. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.
2. Tylor. (1871) 1958. Vol.I. P.1), సాహిత్య మత్తు సమకాలీన వాస్తవికతె నుంచి పు. 4.
3. Red criffe - Brown. 1952. P. 195, Inter National Encyclopeadia.

# సాహిత్యం- సమాజం - పరస్పర సంబంధం

సామాజిక చరిత్రను పరిశీలిస్తే, చరిత్రకందని అతి ప్రాచీన కాలంలో మృగప్రాయుడైన ఆదిమానవుడు ఒకానొక ఉత్సాహపరిస్థితిలో పిచ్చికేకలతో, కేరింతలతో, చిందులు తొక్కాడని, ఇందుకతనికి, అతనితోపాటు జీవిస్తూ ఉండిన చింపాజీలు, గిబ్బన్లు, గెరిల్లాలు, కోతులు, కొన్ని జంతువులు, పక్షుల చేష్టలు, ఆదర్శమై ఉండొచ్చని ఊహించడమైంది. ఇంకా కొన్నివేల సంవత్సరాలకు ఆ కేరింతలకు, చిందులకు అనుగుణంగా శబ్దాలు చేయడం నేర్చుకున్నాడు. మరి కొన్నివేల సంవత్సరాలకు ఆ పిచ్చి కేకలు, కేరింతలు పాటలుగాను, పదాలుగాను పరిణతిచెందాయి. కాలక్రమేణా 'సాహిత్యం' అనేదశను చేరుకున్నాయి. అలాగే ఆనాటి అర్థంలేని చిందులు, అంచెలంచెలుగా మారి, నృత్తం, నృత్యం, నాట్యాలుగా పరిణతిచెందాయి.

ఆ చిందులకు అనుగుణంగా చేసుకున్న శబ్దాలే వాయిద్యాలుగాను, సంగీతంగాను రూపుదిద్దుకున్నాయి. ఇక ఆనాటి మానవులు వేటాడడానికి గుంపులు గుంపులుగా బయలుదేరి, తిరిగి వాళ్లు ఒక చోట చేరుకోడానికి ఏర్పరచుకున్న సంకేతాలే 'లిపి'గా చోటు చేసుకోగలిగింది. ఈ పరిణామలన్నిటికీ వందల, వేల సంవత్సరాలే కాదు. లక్షల సంవత్సరాలు పట్టిందని విజ్ఞుల అంచనా. లిపి, సంగీతం, శిల్పం, నాట్యాల అవసరాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాం. దీన్ని ఎవరూ కాదనలేరు. కాని సాహిత్యంవల్ల సమాజానికి కలిగే లాభం ఏమిటి? ఇదెందుకు అవసరం? అని ప్రశ్నించుకుంటే, దీని సమాధానాన్ని అర్థం చేసుకోవాలంటే కొంత ఆలోచించాల్సి ఉంటుంది. అసలు సాహిత్యం అనే పదానికి 'మంచిమాట' (హితంతో కూడింది) అని అర్థం. మృగప్రాయుడుగా ఉన్న ఆదిమానవుణ్ణి నేటి

నాగరికుడుగా తీర్చిదిద్దింది సాహిత్యమే అనడంలో సందేహంలేదు. ఏది చెయాలో? ఏది చేయకూడదో? ఎలా చేయాలో? విడమరచి చెప్పేది సాహిత్యమే. మానవుణ్ణి సరైన మార్గంలో ఆలోచించేటట్లు చేసేది సాహిత్యమే. ఈ ఆలోచన్నే యుక్తాయుక్త విచక్షణా జ్ఞానమనీ, లేదా జ్ఞానం అనీ అన్నారు. మానవుణ్ణి జంతువుల నుంచి వేరుచేసే అంశాలలో ఇది ముఖ్యమైంది. ఈ అనంతసృష్టిలో, అసంఖ్యాకమైన జీవకోటిలో అద్భుతమైన 'జ్ఞానం' అనే శక్తి కలిగిన వ్యక్తి ఒక్క మానవుడు మాత్రమే. కాబట్టి సమాజానికి ప్రయోజనం చేకూర్చడంలో మిగిలిన సంగీత, నాట్యాల కంటే ఇది ముఖ్యమైంది.

వేదాలు, పురాణాలు కూడా ఇదే పనిని చేస్తున్నా, 'సాహిత్యం' వాటి కంటే చురుగ్గా పనిచేస్తుంది. వేదాలు రాజశాసనాల వంటివైతే, పురాణాలు మిత్రుని సలహాల లాంటివి. మరి సాహిత్యమో! తన ప్రియురాలు ఏకాంతంగా ప్రేమతో చెప్పే మధురమైన మాటల వంటిది.4 అందుకే సాహిత్యం సమాజంతో పెనవేసుకుపోయింది. ఒకటి ఆధారమైతే, ఇంకొకటి ఆధేయం. అమృతానికీ, అమృత భాండానికీ ఉన్న సంబంధం. సమాజాన్ని విడిచి సాహిత్యం బతకలేదు. సాహిత్యం లేకుండా సమాజం మనజాలదు.

**సాహిత్యం పైన కొంతమంది మేధావుల అభిప్రాయాలు :-**

"If nature makes a horse an artist makes a bed". 5 (a) - Aristotle.

(ప్రకృతి ఒక గుర్రాన్ని ప్రసాదిస్తే, కళాకారుడు దానికొక జీనును అమర్చుతాడు. అంటే అతను ప్రకృతిని మరింత సంపద్భరితం చేస్తాడన్నమాట).

"Poetic imagination is an imitation of inner-human action". 5(b)

---

4. సరసభూపాలీయం. పీఠిక. 1-25.
5(a). Aristotle, సాహిత్య మత్తు సమకాలీన వాస్తవికతె, డా. తిప్పే రుద్రస్వామి, పు. 4.
5(b). అదే పు. 5

(మానవ అంతర్గత స్వభావానుకరణమే సాహిత్యం. అంటే కవి చెప్పేది నిజమైనా, అబద్ధమైనా, సాధ్యమైయినా, సాధ్యం కాకపోయినా అలా జరిగితే బాగుంటుందని అనుకునే మానవ స్వభావమన్న మాట).

"Art is the selection of the essential and substraction of the inessential".6

(సాహిత్య సృష్టిలో మంచిని ఎలా స్వీకరించాలని అనుకుంటామో, చెడును కూడా అలాగే త్యజించాలని అనుకోవడం చాలా ముఖ్యమైందని అర్థం).

"Poetry is an interpretation of life".7

(సాహిత్యం జీవితానికొక భాష్యం లాంటిది).

"Literature is the only way....truth and life can be kept alive".8.

(జీవిత యథార్థాన్ని వ్యక్తీకరించే చైతన్య లక్షణమే సాహిత్యం. సాహిత్యం తరతరాల సామాజిక జీవన సంపుటి. జాతి గమన సంకేతం).

అయితే కావ్యాలన్నీ అందమైన అబద్ధాలనీ, అందువల్లే వాటిని చదవరాదనీ ప్రాచీనకాలంలోనే 'కావ్యాలాపాంశ్చవర్జయేత్' అని ఎందుకన్నట్లు? కవులు తమ కావ్యాలు వేదాల్లాగా నృప శాసనాలు కాకూడదనీ, కాంతా సమ్మితాలుగాను, మరికొంత రసవంతంగాను ఉండాలనే తపనతో కొంచెం హద్దులు మీరిన మాట వాస్తవమే. కాని చివరకు 'చెడు' వీగిపోయేటట్లు, 'మంచి' జయించేటట్లు, కవులు తమ కావ్యాలలో చూపెడుతూనే వస్తున్నారు. రామాయణ కావ్యం విన్న

6. George Lukacs, ఆంధ్ర సాహిత్యం- సాంఘిక జీవన ప్రతిఫలనం. పు. 3. నుంచి, డా. ఎస్. వి. ఎస్. రామారావు.
7. Mathew Arnold, ఆంధ్రసాహిత్యం - సాంఘిక జీవన ప్రతిఫలనం. పు. 4. ఎస్. రామారావు.
8. నరోజినీనాయుడు. అదే పు.

తర్వాత 'రాముని లాగా నడచుకోవాలి. రావణుని లాగా నడచుకోకూడదు' అనే సందేశం పొందగలుగుతున్నాం.

"కవులకు సత్యమే చెప్పవలయునను నియమములేదు. అయినను వారి రచనలయందును కొంత సత్యము గోచరింపకమానదు. దీని వెనుకనే వారి కాలమునకును, వారు నివసించు సమాజమునకును సంబంధించిన ప్రజల త్రికరణ ప్రవత్తులు తొంగి చూచుచుండును ....కవులు భావాంబరములో విహరించేవారైనా, సంఘములో వారూ సభ్యులే కాబట్టి, లౌకిక ప్రపంచములోనికి యవతరింపక తప్పదు. అలా చేయనిచో వారి కృషి నేల విడిచిన సాము వంటిదగును....కవిని ఒక విధముగా అతడు నివసించు కాలమునకు ప్రతినిధియని చెప్పవచ్చును. (Poets are the un authorised legislatures of the society) అతడు తన కావ్యములో చెప్పు భావములు అతనివి ఒక్కనివేగాక, అకాలమునకు అప్పటి సమాజమునకు సంబంధించి యుండును. ఆ కారణముచేతనే కావ్యములను చదువునపుడు మనము అప్పటి ప్రజల భావములను, సంఘ పరిస్థితులను కూడ కొంచముగానైనా గ్రహింపవచ్చును. 'ఛానర్, కాంటర్బరీ టేల్స్' షేక్స్పియర్ నాటకాలు, స్కాట్ డికెన్స్, ఎడిసన్, గోల్డ్‌స్మిత్ మున్నగువారి రచనలను, వ్యాసములను చదివినచో ఆ కాలమునందలి ఆంగ్ల సాంఘిక పరిస్థితులను అవగాహన చేసుకోవచ్చును....వాఙ్మయములో పాల్కురికి సోమన గ్రంథములు, హంస వింశతి, సింహాసన ద్వాత్రింశిక, షోడశ కుమార చరిత్రము, ప్రబంధములు, తత్తత్కాల పరిస్థితులను తమలో ప్రతిబింబించు గుణ విశేషములు కలిగినవగుట చేతనే చరిత్రకారులు కూడ చరిత్రను రచించునెడ అకాలపు సాహిత్యమును కూడ మూలముగా గ్రహించి పరిశీలించుట అవసరమగుచున్నది.

ఈవిధముగా సాహిత్యమునకు సంఘమునకు సన్నిహిత సంబంధముండునని తెలియుచున్నది. సంఘము సాహిత్యమునకు

వస్తువు సమకూర్చి దానికి వైశాల్య వైవిధ్యమును కలిగించును. సాహిత్యము సంఘ పరిస్థితులకు అదర్శము వంటిదై, అవసరమైనపుడు దానిని సంస్కరించి సన్మార్గమునకు త్రిప్పుటకు ప్రయత్నించును. కవులెంత ప్రతిభా సంపన్నులైనను సంఘము నందంగములైన వ్యక్తులే కాబట్టి వారు దాని నాశ్రయించియే తమ కవితా వ్యాపారము సాగింతురు".9

"కవులు ఎంత కల్పనా జగత్తులో విహరించినను, వారి యునికి వాస్తవ జగత్తు కనుక వాస్తవిక విషయములు కవుల కావ్యము లందు దోబూచులాడుట సహజము. ఆ వాస్తవిక విషయములు అయా కవుల సమకాలిక సమాజ స్థితిగతులు".10

"తెలియజెప్ప చరిత తేదీలు మాత్రమే
చెప్పలేదు గుండె విప్పి చూపి
పెద్ద పెద్ద నిలువుటద్దాల మేడయై
వాఙ్మయమ్మె చరిత ప్రతిఫలించు".11

(గుండె లోతుల్లోని భావాల్ని విశదీకరించేది సాహిత్యం మాత్రమే కాని, చరిత్ర కాదు).

"Literature is the comprehensive essence of the intellectual life of a nation".12

(అంటే జాతి మేధా, జీవ మేధా, జీవన సంగ్రహ సారమే సాహిత్యం).

"It (Literature) is the nearest thing to life. It is mode of amplifying experience and extending our contact with our fellow men, beyond the boundaries of our personal life".13

---

9. విజ్ఞాన సర్వస్వం. 6వ సంపుటం, పు. 165-167.
10. డా. కొర్లపాటి శ్రీరామమూర్తి, ఆంధ్రసాహిత్యం-సాంఘిక జీవన ప్రతిఫలనం. పు. 4.
11. డా. నండూరి రామకృష్ణమాచార్య, అదే పు. 5.
12. Schillar. అదే పు.
13. George Elliot, అదే పు.

(అంటే సాహిత్యం జీవితానికి సన్నిహితమైందనీ, నైసర్గిక సరిహద్దుల్ని అతిక్రమించి, తోటివారితో వ్యక్తిగత అనుభవాల్ని పెంచేదని అర్థం).

"ఆ సాహిత్యం ఏదో ఒక రూపంలో సమకాలీన వాస్తవ పరిస్థితుల్ని తనలో ఇముడ్చుకోవాల్సి వస్తుంది. కవి సమకాలీన సమాజంలో బతకాల్సినవాడు. అందువల్ల సమాజంలోని కష్టనష్టాల్ని, జయాప జయాల్ని దగ్గర ఉండి కళ్లారా గమనిస్తాడు. ఆ అనుభవాల్లోనుంచి ఏదో ఒక అంశాన్ని తనదైన బాణీలో సాహిత్యంలోకికి చొప్పిస్తాడు. సమాజంలోని సర్వ విషయాలు ఒకే ఒక కృతిలో చోటు చేసుకోలేవు. సమకాలీన పరిస్థితుల్ని జీర్ణించుకుని, వాటిని చక్కగా వ్యక్తీకరించేటట్లు సాహిత్యం జీవితానికి చాలా దగ్గరగా ఉంటుంది. దీన్నే 'సామాజిక వాస్తవికత' అని పిలవొచ్చు".14

"For me Art is not a solitary delight. It is a means of string the greatest number of men by providing them with a priviledged image of our common joys and woes. Hence it forces the artist not to isolate himself. It subjects him to the humblest and most universal truth".15

(కళాకారుడు (సాహిత్యవేత్త) సమాజం నుంచి తాను వేరుపడడు. జీవిత మూల సత్యాన్వేషణకు సాహిత్యాన్ని ఒక సాధనంగా చేసుకుంటాడు. అందుకు తాను అంకితమై పోతాడు. సాహిత్యంలోని ఎటువంటి ప్రయోగమైనా దీన్ని పాటించక తప్పదు).

"A nation's literature is not a miscellaneous collection of books which happen to have been written in the same tongue or with in a certain geographical area. It is the progressive revolution age by

---

14. సాహిత్య మత్తు సమకాలీన వాస్తవికతె. పు. 6. అనుబంధం.I.
15. అదే పు.

age of such nation's mind and character".16

(ఏ భాషా సాహిత్యమైనా ఒకే భాషలో రాసిన ఒకే భౌగోళిక పరిధికి లోనైన పుస్తకాల కలగూరగంప కాదు. అది ఆ జాతి మనః ప్రవృత్తులకు సంబంధించిన క్రమాభివృద్ధికి ప్రతిబింబమని అర్థం).

ఇలా పలువురు సాహితీవేత్తలు సమాజానికీ, సాహిత్యానికీ ఉండే పరస్పర సంబంధాన్ని వివరించి చెప్పారు. కవి తాను రాస్తున్న ఇతివృత్తం ఏదైనా, ఏదో ఒక రకంగా తాను కళ్లారా చూస్తున్న విషయాల్ని, అనుభవిస్తున్న భావనల్ని, అందులో చొప్పించక మానడనేది జగమెరిగిన సత్యం. మొదటి నుంచీ మన పూర్వీకులకు పారమార్థిక దృష్టి తప్ప చారిత్రక దృష్టి లేదనే అభాండం ఉంది. ఈ లోటును సాహిత్యం కొంతవరకైనా పూడ్చగలిగినందుకు సంతోషించాలి.

తర్వాతి శీర్షికలో పంచకావ్యాలంటే ఏవో?, ఏ లక్షణాల్నిబట్టి ఒక కావ్యాన్ని 'ప్రబంధం' అని పండితులు నిర్ణయించారో?, పంచకావ్యాల నిర్ణయంలో పండితుల భిన్నాభిప్రాయాలు వంటి విషయాలు పేర్కొబడతాయి.

---

16. An Introduction to the study of literature, by W.H. Hudson, P.32. డా. మనన చెన్నప్ప. ప్రాచీన కావ్యాలు-గ్రామీణ జీవనచిత్రణ, పు. 6. నుంచి.

# తెలుగు పంచకావ్యాలు - ఒకపరిశీలన

సంస్కృత భాషలో రఘువంశం, కుమారసంభవం, మేఘసందేశం, కిరాతార్జునీయం, శిశుపాలవధ అనే ఈ ఐదు కావ్యాలకు పంచమహాకావ్యాలనే ప్రసిద్ధి ఉంది. అన్ని విషయాల్లోనూ సంస్కృత వాఙ్మయ మర్యాదల్ని అనుకరించిన మన పెద్దలకు తెలుగు భాషలో కూడా 'పంచమహాకావ్యాలు' కావాల్సొచ్చాయి. మరైతే అందుకు అర్హత కలిగిన కావ్యాలేవి? కవిత్రయంవారి భారతం, పోతన భాగవతం, శ్రీనాథుని రచనలు, తక్కిన రామాయణాదులు అన్నీ అనువాదాలే. అవన్నీ మనవని చెప్పుకునే అర్హతగానీ, అధికారంగానీ మనకు లేదు.

అందువల్ల ఆంధ్రకవితా పితామహుని 'మనుచరిత్ర' మొదటి స్వతంత్ర కావ్యమని అందరూ అంగీకరించారు. ఇలాంటి స్వతంత్ర కావ్యాల్ని 'ప్రబంధాలు' అన్నారు. హటికి లక్షణ గ్రంథాల్లోను, కావ్య పీఠికల్లోను కొన్ని నియమాలు ఏర్పరిచారు. ఆ నియమాల సారాంశమిది:

1. రచన అనువాదం కాకుండా స్వతంత్రమైందిగా ఉండాలి.
2. ఇతి వృత్తం (కథ) విధిగా ఏదో ఒక పురాణ అంతర్గత మైందిగా ఉండాలి. కల్పిత గాథ కాకూడదు.
3. కథానాయకుడు ధీరోదాత్తుడై ఉండాలి.
4. అష్టాదశ వర్ణనలుండాలి. అష్టాదశ వర్ణనలివి: వనవిహారం, జలక్రీడ, సూర్యోదయం, చంద్రోదయం, పుత్రోదయం, మంత్రాలోచనం, ప్రయాణం, రథోత్సవం, రాజవర్ణన, యుద్ధం, సముద్రం, ఋతువులు, మధుపానం, పురం, వివాహం, పర్వతం, విరహం, దూత్యం.
5. నవరసాలలో శృంగారం ప్రధానంగా తక్కిన రసాలు పోషించబడాలి.
6. పసైక్యం ఉండాలి.
7. కావ్యం 'శ్రీ'తో ప్రారంభించబడి, 'శ్రీ'తో ముగించబడాలి.

8. ఇష్టదేవతాస్తుతి, సుకవిస్తుతి, కుకవినింద, గురుస్తుతి, కృతిపతి వంశవర్ణన, షష్ఠ్యంతాలు వరసగా అయిన తర్వాత కథ ప్రారంభం కావాలి.1

ఈ ప్రబంధ లక్షణాలన్నీ 16వ శతాబ్దంలో వచ్చిన కావ్యాలన్నిటిలోను కొంచెం ఎక్కువ, తక్కువలుగా ఉన్నాయి. కాని నిన్న మొన్నటి వరకూ మనుచరిత్ర, ఆముక్తమాల్యద, రాఘవ పాండవీయం, శృంగారనైషధం, వసుచరిత్రలకు పంచ కావ్యాలనే రూఢి ఉన్నట్లు పండితుల్లో ఒక వర్గంవారు భావించారు. కాని అందులో 'శృంగారనైషధం' అనువాద గ్రంథం. సంస్కృతంలో శ్రీహర్షుని నైషధ కృతికి శ్రీనాథుని తెలుగుసేత. అందువల్ల అది ఈ గుంపులో చేరదని కొందరన్నారు. అలాగే సూరన 'రాఘవ పాండవీయం' కూడా 'ద్వ్యర్థి' కావ్యం కాబట్టి, ఇందులో గొప్ప పాండితీ ప్రకర్ష ఉన్నా, ఈ గుంపులో చేరదని అన్నారు. ఆంధ్ర పంచ మహాకావ్య లక్షణాలకు నోచుకున్నవి ఆముక్తమాల్యద, మనుచరిత్ర, పారిజాతాపహరణం, వసుచరిత్ర, పాండురంగ మహాత్మ్యాలని చాలామంది ఆమోదించారు. కాని ఇందులో కూడా పాండురంగ మహాత్మ్యం స్థలపురాణం, వస్తైక్యం లోపించిడంవల్ల దీన్ని ఈ పంచకావ్యాల్లో చేర్చకూడదని, సూరన 'కళా పూర్ణోదయాన్ని' దాని స్థానంలో చేర్చవచ్చుని మరికొంతమంది వాదన. అయితే ఇందులో ఇతివృత్తం కేవలం కల్పితం. పురాణ అంతర్గతమైంది కాదు. కాబట్టి ప్రబంధ లక్షణాలన్నీ ఉన్నటువంటి పింగళి సూరన 'ప్రభావతీ ప్రద్యుమ్నాన్ని' దాని స్థానంలో చేర్చారు. మరికొందరు ధూర్జటి మహాకవి రచించిన 'కాళహస్తి మహాత్మ్యాన్ని' ఈ కావ్యాల్లో చేర్చారు.

---

1. వన జలకేళీ రవి శశి
తనయోదయ, మంత్ర గతి రథ క్షితిప, రణాం
బునిధి, మధు, ఋతు, పురోద్వా
హ నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమై
(కుమా.సం. పీఠిక. నన్నెచోడుడు).

ఇలా ఈ నిర్ణయంలో భిన్నాభిప్రాయాలు గోచరిస్తాయి. వీటన్నిటినీ బట్టి చూస్తే మూడు విషయాలు అవగతమవుతాయి. అవి 1) వస్తుప్రాధాన్యం, 2) పాండిత్య ప్రకర్ష, 3) రాయలకు సామీప్యం. ఈ మూడు విషయాల్ని దృష్టిలో పెట్టుకుని పంచకావ్యాల్ని ఎంపిక చేసుకున్నారు.

వస్తు ప్రాధాన్యాన్ని బట్టి, అంటే ప్రబంధ లక్షణాలు ఉండేవి మాత్రమే పంచకావ్యాలని అంగీకరిస్తే, దాని ప్రకారం ఇవిగో ఇవి చేరతాయి. 1) మనుచరిత్ర, 2) ఆముక్తమాల్యద, 3) పారిజాతాపహరణం, 4) వసుచరిత్ర, 5) ప్రభావతీ ప్రద్యుమ్నం. పాండిత్య ప్రకర్షను బట్టి 1) ఆముక్తమాల్యద, 2) మనుచరిత్ర, 3) వసుచరిత్ర 4) రాఘవ పాండవీయం, 5) శృంగార నైషధం. రాయలకు సామీప్యతను బట్టి అంటే ప్రబంధాలు వెలసింది భువనవిజయ సభా ప్రాంగణంలోనే కాబట్టి, అందులోని కవులైన అష్టదిగ్గజాలకే వీటి కర్తృత్వం చెల్లుతుంది. దాని ప్రకారం 1) ఆముక్తమాల్యద, 2) మనుచరిత్ర, 3) పారిజాతాపహరణం, 4) వసుచరిత్ర, 5) పాండురంగ మహాత్మ్యం కావ్యాలు ఈ కోవకు చెందుతాయి. ఇదే సహజంగా ఉంది.2 ఎక్కువ మంది ఆమోదం పొందగలిగింది కూడా. అందువల్లే ఈ సిద్ధాంత గ్రంథంలో ఈ ఐదింటినే పంచకావ్యాలుగా పరిగణనలోకి తీసుకుని పరిశీలించడం జరిగింది.

ఏది ఏమైనా అష్టదిగ్గజ కవులు ఎవరెవరన్న విషయంలో పండితుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లే, ఈ విషయంలో కూడా- విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. సంస్కృతంలో పంచకావ్యాల్ని దృష్టిలో పెట్టుకుని, గీత గీసుకుని తెలుగులో కూడా అదే విధంగా ఉండాలన్న తపనతో ఐదింటికే పరిమితం చేసినా, అవే లక్షణాలున్న కావ్యాలు తెలుగు సాహిత్యంలో ఇంకా అనేకం ఉన్నాయనేది నిస్సందేహం.

---

2. మనుచరిత్ర వ్యాఖ్యానం- పీఠిక ఆధారంగా. వెం. సూ.శా.

సంస్కృతం రాజ్యమేలిన రోజుల్లో పెద్దలు రాసిన ఏవో నాల్గైదు పుస్తకాల్ని చదువుకుని తృప్తిపడి, బుద్ధిగా ఉండే మనస్తత్వం ఆనాటి ప్రజలది. కాని క్రమేపి తెలుగు భాష ఊపిరి పోసుకున్న తర్వాత, ఆ తృప్తితో ఆగక, తాము అంతకంటే మంచి కావ్యాలు రాయాలనే ఉబలాటం పండితుల్లో చోటు చేసుకుంది. అందువల్ల ముందు ఇచ్చిన కొలమానం తెలుగు కావ్యాలకు సరిపడకపోయింది.

సంస్కృత వ్యాకరణ మర్యాదల్ని అనుసరించి వచ్చిన తెలుగు వ్యాకరణాలు ఎన్నో తెలుగు పదాలకు ప్రక్రియ సాధించలేకపోతే, భాషాశాస్త్రజ్ఞులు వాటిని ఎలా సాధిస్తున్నారో, అలాగే ఈ పరిగణనకు ఆధునిక సాహిత్య విమర్శకులు ఒక దారిని చూపుతున్నారు.

తర్వాతి శీర్షికలో సాహిత్యంలో జనజీవన పరిశీలన చేయాల్సిన ఆవశ్యకత గురించి చర్చించబడుతుంది.

# సాహిత్యంలో జనజీవనపరిశీలనావశ్యకత

ఈ విశ్వంలో అనేక కోట్ల జీవరాశులున్నాయి. అందులో మానవుడూ ఒక జీవి. ఏ జీవికీ లేని ప్రత్యేకత ఈ మానవుడికి ఉంది. ఆ ప్రత్యేకతనే 'జ్ఞానం' అంటున్నాం. దీని సాయంతో మానవుడు ప్రతినిత్యమూ కొత్త విషయాన్ని తెలుసుకోవాలని అనుకుంటాడు. ఒకదాని తర్వాత మరొకటి ఇలా అంతం లేకుండా, తృప్తి లేకుండా సాగిపోతూనే ఉంటాడు. ఆహార, విహార, వేష, భాషా, భూషణాదుల్లో ఒక తరానికీ, మరో తరానికీ ఎంతో కొంత తేడా ఉండడం దీని మూలంగానే. ఈ మార్పు ఒకప్పుడు నెమ్మదిగా సాగింది. కాని విదేశీయుల రాకతో, భిన్న సంస్కృతుల సమ్మేళనంతో ఆ మార్పు వేగాన్ని పుంజుకుంది. అలా అంచెలంచెలుగా పయనించి, ఒకనాటి జంతు ప్రాయుడైన మానవుడు నేటి స్థితికి చేరుకోగలిగాడు. అయితే ఈ స్థితి ఇలాగే ఉంటుందనలేం. ఇంకో వందేళ్ళ తర్వాత అప్పటి మానవుడు ఏ దశలో ఉంటాడో కచ్చితంగా ఊహించలేం. కాని ఇప్పటి మన స్థితిగతులు, మన జీవన విధానం భవిష్యత్ మానవుడు చక్కగా తెలుసుకుంటాడు. దీనికోసం ఈనాడు తగినన్ని సాధనాలు, సౌకర్యాలు ఉన్నాయి. అయితే అతనికి ఉన్నట్లు మనకు, మన పూర్వీకుల జీవన విధానాల్ని తెలుసుకోవడానికి తగినన్ని సాధనాలు లేవు. అప్పటి వాళ్ళకి ఈ ఆలోచనే ఉన్నట్లు కనబడదు. పైగా తమ గురించి చెప్పుకోవడం పెద్ద తప్పుగా కూడా భావించినట్లు బోధపడుతోంది. స్వర్గాన్ని, నరకాన్ని, దేవతల్ని, పరమాత్మ, జీవాత్మల గురించి తప్ప, సామాన్య జనజీవనాన్ని గురించి పెద్దగా పట్టించుకున్నట్లు కనబడదు. ఆ ప్రయత్నం చేసిన వాళ్ళకి తగిన ప్రోత్సాహం లేకపోగా, చీవాట్లు కూడా పెట్టినట్లు కనబడుతోంది. దాని పర్యవసానమే 'మా తాతలు నేతులు తాగేరట. కావాలంటే మా మూతులు వాసన చూడండి' అనీ, 'మా చచ్చిపోయిన గేదె పగిలిపోయిన దుత్తెడు పాలిచ్చేదట' లాంటి

అపహాస్య ప్రాయాలైన సామెతలు పుట్టడం జరిగింది. అంటే గతంతో పనేమిటనీ? గతంలో జరిగిన విషయం ఎవరైనా చెబితే, ఎవరు చూశారన్నట్లు? పై సామెతలవల్ల ఆనాటి ప్రజలకు చరిత్ర పట్ల ఉన్న ఉదాసీనత బయటపడుతోంది. అయితే గతాన్ని నెమరువేసుకుంటూ, వర్తమానంలో నడచుకుంటూ, భవిష్యత్తుకు తగిన ఆలోచన చేయాలనేది మేధావుల నలహా కాబట్టి, ఆనాటి మనవాళ్ల సాంఘిక స్థితిగతుల్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం. అయితే ఈనాడు మనకు వాళ్ల జీవన పరిశీలన చెయ్యాలంటే ఎంతో కష్టమవుతోంది. 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు' ఎంతో కష్టపడితేగాని ఒక చిన్న విషయాన్ని సేకరించలేకపోతున్నాం. ఈ విషయాన్నే కీ. శే. నురవరం ప్రతాపరెడ్డిగారు ఇలా వివరించారు. "రాజుల చరిత్రలు మనకంతగా నంబంధించినవి కావు. సాంఘిక చరిత్రలు మనకు పూర్తిగా నంబంధించినట్టివి. అవి మన పూర్వుల చరిత్రను మనకు తెలుపును. మన తాత ముత్తాతలెట్టి వారై యుండిరో, మన అవ్వలు ఎట్టి సొమ్ములు దాల్చిరో, యెట్టి అలంకరణములతో నుండిరో, మన పూర్వులే దేవతలను గొలిచిరో, ఏ విశ్వాసాలు కలిగియుండిరో, ఏ యాట పాటలతో వినోదించిరో, దొంగలు, దొరలు దోపిడీలు చేసినప్పుడు, క్షామాదీతిబాధలు కలిగినప్పుడెటుల రక్షణము చేసుకొనిరో, జాడ్యాలకే చికిత్సలు పొందిరో, ఎట్టి కళలందు ప్రీతి కలవారై యుండిరో, ఏయే దేశాలతో వ్యాపారాలు చేసిరో యని తెలుసు కొనవలెనని మనకు కుతూహలముండును....రాజుల రాజ్యాల చరిత్ర వ్రాయుట అంత కష్టము కాదు. కాని, సాంఘిక చరిత్ర వ్రాయుట కష్టము. దీనికాధారములు తక్కువ. తెనుగు సారస్వతము, శాసనములు, స్థానిక చరిత్రలు (కైఫీయతులు), విదేశీ జనులు చూచి వ్రాసిన వ్రాతలు, శిల్పములు, చిత్తరువులు, నాణెములు, సామెతలు, ఇతర వాఙ్మయములలోని సూచనలు, దాన పత్రములు, నుద్దులు, జంగము కథలు, పాటలు, చాటువులు, పురావస్తు నంచయములు (Collections)- ఇవి సాంఘిక చరిత్రకు పనికి వచ్చు సాధనములు.

సాహిత్యంలో జనజీవన పరిశీలనావశ్యకత

కావ్య ప్రబంధములలో నూటికి 90 పాళ్ళు సాంఘిక చరిత్రకు పనికి వచ్చునవి కావు. పురాణాలు, మధ్య కాలపు ప్రబంధములు ఇందుకు పనికి రావు". "కేళీ నట ద్గేహ కేకి, కేకారవో! న్మేషంబు చెవుల దేనియలు చిలుకొ" (కవికర్ణరసాయనము) వంటి వర్ణనలు మనకు సహాయపడవు.

"గొంగడి మునుగుతో గొల్లలు చత్రాతి
పైని బందారాకు పరచికొనగ" (శుకసప్తతి)

అనే వర్షర్తు వర్ణన మనకు చాలా పనికి వచ్చును.

"తతనితంబాభోగ ధవళాంశుకములోని,
యంగ దట్టపు కావిరంగువలన" (మనుచరిత్ర)

అంటే మనకు సరిగా అర్థమే కాదు.

"చలువ దువ్వలువ కుచ్చెలయంచు ముత్తెముల్
పద నఖ ప్రభకు సలాము చేయ"(శుక సప్తతి)

అని అంటే ఆ స్త్రీ కన్నుల యెదుట నిలిచి పూర్వకాలపు మన యువతుల విలాస మిట్లుండెనని తెలుపును".1

18వ శతాబ్దం చివర్లో 'మెకాలే దొరగారు గ్రామ కైఫీయతుల్ని సేకరించడంతో మనవారికి సాంఘిక చరిత్రల పట్ల కనువిప్పు కలిగింది. వీరేశలింగంపంతులుగారి ఆంధ్రకవుల చరిత్రలో సాంఘిక చరిత్ర కూడా తొంగి చూస్తుంటుంది. ఆ తర్వాత ఎన్నో సాంఘిక చరిత్రలు తెలుగులో పుట్టాయి. సురవరం ప్రతాపరెడ్డి గారి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరంగార్ల 'ఆంధ్రుల చరిత్ర' ఏటుకూరి బలరామమూర్తిగారి 'ఆంధ్రుల చరిత్ర' మొదలైనవి వాటిలో ముఖ్యమైనవి.

---

1. ఆం. సాం. చ. ప్ర.ము. పీఠిక. v-xi.

వీటి మార్గదర్శకత్వంలో కావ్యాల ఆధారంగాను, శాసనాల ఆధారంగాను ఎన్నో పరిశోధనా వ్యాసాలు పుట్టుకొస్తున్నాయి. ఫలానా శతాబ్దం నుంచి ఫలానా శతాబ్దం వరకు వచ్చిన కావ్యాల్లో సాంఘిక జీవనం అని, పురాణాలు, కావ్యాల ఆధారంగా సాంఘిక జీవనమనీ, ప్రబంధాలలో జనజీవన పరిశీలనమనీ, ఇలా నేడు విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి.

ఆ మార్గంలోనే పంచకావ్యాలలో జనజీవనం - ఒకపరిశీలన అనే పేరుతో ఉన్న ఈ సిద్ధాంత గ్రంథంలో సాంఘికజీవనాన్ని అవలోకించడం జరుగుతుంది. దానికి ముందు పంచకావ్యాలు అంటే 1. ఆముక్తమాల్యద, 2. మనుచరిత్ర, 3. పారిజాతాపహరణం, 4. పాండురంగమహాత్మ్యం, 5. వసుచరిత్రల కథా సారాంశం తెలుసుకుందాం.

# పంచకావ్యాల కథా సారాంశాలు

మనుచరిత్ర :- 'అరుణాస్పదం' అనే పురంలో ప్రవరుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆతను నియమనిష్ఠలు కలవాడు. మన్మథుడంతటి అందగాడు. పడుచువాడైనా విరాగి. ప్రతిరోజూ తీర్థయాత్రలు చేయాలని కలలుగంటూ ఉండేవాడు. ఒకనాడు అతని ఇంటికి ఒక సిద్ధుడు వస్తాడు. అతనిచ్చిన 'పాదలేపం' అనే పసరు ప్రభావంతో హిమాలయానికి వెళ్తాడు. అక్కడి వింతల్ని చూస్తుండగా, మంచునీటితో పాదలేపం కడిగివేయబడుతుంది. త్వరిత గమనశక్తిని కోల్పోతాడు. గృహ గమనోపాయాన్ని చింతుస్తూ తిరుగుతుండగా, 'వరూధిని' అనే అప్సర అతన్ని చూసి, మోహించి పైన పడగా, ఆతనామెను తోసివుచ్చి, 'గార్హపత్య'మనే అగ్నిని ప్రార్థించి, తదనుగ్రహంతో ఇల్లు చేరుకుంటాడు. వరూధిని అతనిపైన విరహంతో బాధపడుతుంటుంది. ఆ పరిస్థితిలో పూర్వం ఆమెను కామించి తిరస్కృతుడైన ఒక గంధర్వుడు ఆ వృత్తాంతం దివ్యజ్ఞానంతో గ్రహించి, ప్రవర రూపం ధరించి, ఆమెతో సుఖంగా కాపురం చేస్తుంటాడు. వరూధిని ఒక పుత్రుణ్ణి కంటుంది. అతడే 'స్వరోచి'. ఈ స్వరోచి మంధరపర్వత ప్రాంతాన విశ్వకర్మ సృష్టించిన పట్టణాన్ని ఏలుతూ, ఆటవికులతో సేవించబడుతూ, సామ్రాజ్య సౌఖ్యాల్ని అనుభవిస్తూ ఉంటాడు. ఒకరోజు వేటకు వెళ్ళిన స్వరోచికి స్త్రీ రోదనం వినిపిస్తుంది. దీని తర్వాత మనోరమ వృత్తాంతం.

ఇందీవరాక్షుని శాప వృత్తాంతం, మనోరమ-స్వరోచుల వివాహ వృత్తాంతం, కళావతి, విభావసులనే పేరు కలిగిన మనోరమ చెల్లెళ్ల శాప వృత్తాంతాలు ఉన్నాయి. స్వరోచి ఈ ముగ్గురునీ వివాహమాడి, వాళ్ల వల్ల పుత్రుల్ని పొంది సుఖంగా ఉంటాడు. ఒకనాడు వేటకు వెళ్ళిన అతనికి వనదేవత మొదట లేడి రూపంలో కనిపించి, తర్వాత స్త్రీ

రూపం ధరించి అతని ద్వారా ఒక పుత్రుణ్ణి కంటుంది. అతనే స్వారోచిషుడు. అతను విష్ణువు గురించి తపస్సు చేసి, మనుత్వ పదానికి పట్టాభిషిక్తుడై, ధర్మానుసారంగా ప్రజాపాలన చేసి, చివర్లో మోక్ష ప్రాప్తి పొందుతాడు.

*ఆముక్తమాల్యద* :- శ్రీవిల్లి పుత్తూరులోని విష్ణువుకు మాలా కైంకర్యం చేసే భక్తుడు విష్ణుచిత్తుడు. అతను తన ధనమంతా భాగవతార్చన కింద దేవాలయార్థం వినియోగించి దరిద్రుడయ్యాడు. వేనవి కాలాన విలాసవతి అయిన భోగిని గృహానికి వెళ్తున్న మధురనేలే 'మత్స్యధ్వజుడు' అనే పాండ్యరాజు వెన్నెలలో అరుగుల మీద పడుకున్న బ్రాహ్మణులలో ఒకరు చెప్పుకుంటున్న "వర్షార్థమష్టౌ ప్రయతేత మాసాన్" అనే సుభాషితాన్ని వింటాడు. పరం కోసం ప్రస్తుతం చేస్తున్న ఆలోచన ఏమిటి? అతని మాట రాజును కలవరపరచింది. ఇంటికి వెళ్ళి తన పురోహితుడైన 'శెల్వనంబి'ని పిలిపించి, బ్రహ్మ, విష్ణు, శివేంద్రులలో ఎవరిని ఉపాసిస్తే ముక్తి లభిస్తుందో చెప్పమని అడుగుతాడు. కొలువుకూటం ముందు ఒక స్తంభం పాతించి, దాని కొనన ఒక బంగారు నాణేల సంచిని వేలాడదీయించి, ఎవరైతే 'పర్వతత్వ'మేది? అనే అంశాన్ని చాటగలరో వాళ్లకి అది లభ్యమవుతుందని చాటిస్తాడు. అన్ని మతాలవాళ్లు అందుకు వస్తారు.

శ్రీవిల్లి పుత్తూరులో భగవంతుడైన విష్ణువు, విష్ణుచిత్తుని కలలో కనిపించి పై విషయాన్నంతా తెలిపి, అతన్ని వాదనలో పాల్గొనమని, అందుకు తాను సహాయపడతానని చెబుతాడు. విష్ణుచిత్తుడు అలాగేనని వెళ్తాడు. వాదం గెలుస్తాడు. ఖాండిక్య, కేశిధ్వజుల కథను ఇలా వివరిస్తాడు.

నిమి వంశంలో ధర్మధ్వజుడు, కృతధ్వజుడని ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. ధర్మధ్వజునికి ఖాండిక్యధ్వజుడు, కృతధ్వజునికి కేశిధ్వజుడు జన్మించారు. ఖాండిక్యుడు కార్యశూరుడు. కేశిధ్వజుడు

విజ్ఞాని. పెద్దవాళ్లయిన తర్వాత వాళ్లిద్దరికీ రాజ్యకాంక్ష పెరిగింది. కేశిధ్వజుడు యుద్ధంలో సోదరుణ్ణి జయించాడు. ఖాండిక్యుడు భటులతో, హితులతో అడవులకు పోయాడు. ఇక్కడ కేశిధ్వజుడు యజ్ఞం చేస్తుండగా, యజ్ఞ పశువును పెద్దపులి చంపేస్తుంది. యజ్ఞం నిర్విఘ్నంగా జరగడానికి చేయాల్సిన ప్రాయశ్చిత్తం ఏమిటని కేశిధ్వజుడు మునుల్ని అడిగాడు. వాళ్లు కసేరువుణ్ణి అడగమన్నారు. కసేరుడు శౌనకుణ్ణి అడగమన్నాడు. శౌనకుడు తనకూ తెలియదని, అరణ్యవాసం చేస్తున్న ఖాండిక్యుడు చెప్పగలడని అన్నాడు. కేశిధ్వజుడు సోదరుడు తనను చంపినా సరే అని అరణ్యానికి వెళ్లాడు. కేశిధ్వజునికి ధర్మ సూక్ష్మం చెప్పొద్దని మంత్రులన్నారు. కాని ఖాండిక్యుడు వాళ్ల మాటలు వినకుండా ప్రాయశ్చిత్తాన్ని తెలియ జేశాడు. కేశిధ్వజుడు గురుదక్షిణ ఇవ్వబోయాడు. మంత్రులు రాజ్యం కోరమన్నారు. కాని ఖాండిక్యుడు ఇహలోక చింతన వదిలి మోక్షోపాయాన్ని బోధించమని కోరాడు. కేశిధ్వజుడు ఆత్మవిద్యా విశారదుడు కాబట్టి, నిమి వంశం పవిత్రం కావడానికే నీకు ఈ తత్వ విచారం కలిగిందని చెప్పి, ఖాండిక్యునికి తత్వబోధ చేశాడు. అష్టాంగక సాధనమే మోక్షోపాయమన్నాడు. విష్ణువే పరదైవం అన్నాడు. ఖాండిక్యుడు తన కుమారునికి పట్టాభిషేకం చేసి, మంత్రులకు రాజ్యం అప్పగించి విష్ణువులో కలిసిపోయాడు. ఇలా విష్ణుచిత్తుడు చివరకు "శ్రీమన్నారాయణుడే మోక్ష ప్రదాత" అని సిద్ధాంతీకరిస్తాడు. నాణేల మూట తెగిపడుతుంది. ప్రతి వాదులందరూ ఆశ్చర్యపోతారు. రాజు అతన్ని ఏనుగు మీద ఊరేగించి, పెద్ద ఉత్సవం జరిపిస్తాడు. శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవితో పాటు అంతరిక్షంలో గరుడవాహనం మీద అతనికి దర్శనమిస్తాడు. విష్ణుచిత్తుడు అతన్ని స్తుతించి, తన గ్రామానికి వెళ్తాడు.

ఒకనాడు విష్ణుచిత్తుడు స్వామికి మాలార్పణం చేసి వెళ్తాడు. అప్పుడు భగవంతుడు "పూర్వం యామునాచార్యుని వంటివాడు ఈ

విష్ణుచిత్తుడు" అని తన దేవేరితో అన్నాడు. ఆమె యామునాచార్యుని చరిత్ర చెప్పమని కోరగానే స్వామి ఇలా చెప్పసాగాడు.

యామునాచార్యుడు భక్తుడైన నాథముని మనుమడు. బాల్యంలోనే వేదశాస్త్రాధ్యయనం చేశాడు. మధురలో మత్స్యధ్వజుని పూర్వీకుడు రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతను వీరశైవుడు. పైగా వైష్ణవ ద్వేషి. అతని భార్య విష్ణు భక్తురాలు. తన భర్తను ఎలాగైనా శైవమత పక్షపాతం నుంచి తప్పించి, విష్ణు భక్తునిగా చేయాలనుకుంటుంది. భర్తతో ఏకాంతంగా యామునాచార్యుని గురించి చెబుతుంది. అతను ఆస్థాన విద్వాంసులతో వాదించి, విష్ణు పారమ్యాన్ని స్థాపించగలడని కూడా చెబుతుంది. ఆమె మాటల్ని రాజు అవహేళన చేస్తాడు. ఆస్థాన విద్వాంసుడు యామునాచార్యుని చేతిలో ఒకవేళ ఓడిపోతే, తాను విభూది, రుద్రాక్షల్ని పరిత్యజించి చక్రాంకితుణ్ణి అవుతాననీ, లేదా యామనుడు ఓడితే, శివదీక్ష వహించాల్సి ఉంటుందనీ రాజు తన భార్యతో అంటాడు. రాణి సమ్మతించి యామునాచార్యుణ్ణి వాదానికి పిలిపిస్తుంది. అతను శైవమతస్థులతో వాదించి, సప్రమాణమైన యుక్తులతో జయించి, విష్ణుదేవుడే పరతత్త్వమని సిద్ధాంతం చేస్తాడు. అక్కడ ఎదురుగా ఉన్న రావిచెట్టు నుంచి ఒక అశరీరవాణి అతని మాటలు నిజమని, విష్ణువును పూజించమని పలుకుతుంది. రాజు సంతోషించి తన అర్ధరాజ్యంతో పాటు తన చెల్లెలినిచ్చి వివాహం చేస్తాడు. ఆ తర్వాత యామనుడు దిగ్విజయం సాధించి, యజ్ఞాలు చేసి భోగభాగ్యాల్ని అనుభవిస్తూ భగవంతుణ్ణి మరిచిపోయి ఉంటాడు.

శ్రీరామమిశ్రుడు యామునాచార్యుని తాతకు ప్రశిష్యుడు. యామునాచార్యుణ్ణి ఈ బంధాల నుంచి ఎలా తప్పించాలని ఆలోచించి, అతనికి అతి సాత్వికాహారంగా ముల్లుముస్తె కూర పెట్టించాడు. దానితో యామునికి జ్ఞానోదయమైంది. రాజ్యాన్ని కుమారుడికి ఇచ్చి, శ్రీరంగనాథుణ్ణి సేవిస్తూ జీవితాన్ని ముగిస్తాడు.

*గోదాదేవి చరిత్ర* :- పాండ్యరాజు సభలో ప్రతివాదుల్ని ఓడించి విష్ణుచిత్తుడు శ్రీవిల్లి పుత్తూరుకు తిరిగి వస్తాడు. యథాప్రకారం తన మాలా కైంకర్య సేవలో నిమగ్నమై ఉంటాడు. ఒకరోజు తులసీ తోట తవ్వుతుండగా ఒక ఆడ శిశువు భూమి నుంచి ఆవిర్భవిస్తుంది. శుభాంగి అయిన ఆ బిడ్డను భార్యకు అప్పగించాడు. ఆమె భూదేవి అవతారమైన గోదాదేవి. ఆమెను వాళ్లు ఎంతో వాత్సల్యంతో పెంచుకోసాగారు. ఆమె దినదిన ప్రవర్ధమాన అయ్యింది. శ్రీమన్నారాయణుణ్ణి తప్ప అన్యుల్ని పెండ్లాడనని ప్రతిజ్ఞ చేసింది. గుడిలో దేవునికి అర్పించి రమ్మని తన తండ్రి ఇచ్చిన పూలమాలల్ని మొదట తాను ధరించి, తన సౌందర్యాన్ని చూసుకుని, ఆ తర్వాతనే దేవుడికి అర్పించేది. ఒకనాడు ఆమె చేస్తున్న ఈ పనిని తన తండ్రి చూసి మందలించాడు. ఆ మాలను ఆ రోజు దేవునికి సమర్పించలేదు. ఆ రాత్రి కలలో భగవంతుడు అతన్ని కారణం అడిగాడు. జరిగింది చెప్పి, క్షమించమని అతను దేవుణ్ణి ప్రార్థించాడు. అతని మాటలకు భగవంతుడు నవ్వి, ఆమె ధరించి ఇచ్చిన మాలలే తనకు ప్రీతికరమైనవని వివరించాడు.

అప్పటి నుంచి ఆమెను ఎంతో గారాభంతో చూసుకోసాగాడు. గోదాదేవి ధనుర్మాసంలో వేకువజామునే లేచి తోటి బాలికలతో స్నానం చేసి, వటపత్రశాయిని సేవిస్తూ, రోజుకొక 'గాథను' ద్రావిడ భాషలో రాస్తూ వ్రతం చేసింది. ఆమె మనస్సును తెలుసుకోలేక ఆమెకు ఉన్మాదం కలిగిందని విష్ణుచిత్తుడు స్వామికి విన్నవించాడు. అతని అమాయకత్వానికి జాలిపడి, పూర్వం భూదేవికి వరాహదేవుడు చెప్పినట్లు "చండాల బ్రహ్మరాక్షస్సంవాదాన్ని" తెలిపాడు.

ఒక భక్తుడు తన నివాసానికి కొంత దూరంలో ఉండే దేవాలయానికి వెళ్ళి, అక్కడ 'మంగళకైశికి' రాగంలో పదాలు పాడి, ప్రతినిత్యం భగవంతుణ్ణి స్తోత్రం చేస్తుండేవాడు. అయినా అతను తన కులవృత్తిని విస్మరించలేదు. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో మేలుకుని

తెల్లవారిందని భావించి గుడికి బయలుదేరాడు. కొంతదూరం వెళ్లేసరికి అర్ధయోజన దూరం ఆక్రమించుకున్న ఒక మర్రిచెట్టు కనబడింది. అక్కడ దారి తప్పాడు. ఆ మర్రిచెట్టును ఆశ్రయించుకుని కుంభజానుడనే బ్రహ్మరాక్షసుడు ఉన్నాడు.

ఆ రాక్షసుడు మాలదాసరిని ఆహారంగా గ్రహించాలని కిందికి దూకాడు. దాసరి రాక్షసుని మీద బాణాలు వేయసాగాడు. కాని రాక్షసునికి పట్టుబడ్డాడు. ఆ మాలదాసరి అనేక నీతులు, ధర్మాలు చెప్పినా, భగవంతుణ్ణి సేవించుకుని తిరిగి వస్తానని ఎంత బతిమాలినా విడువలేదు. చివరకు "అన్య దేవతలతో శ్రీమన్నారాయణుణ్ణి సమానంగా చూసినవాడి పాపం పొందిన వాడనవుతాను" అని ప్రమాణం చేస్తాడు. అప్పుడు రాక్షసుడు అతన్ని విడిచిపెట్టాడు. ఆ దాసరి మాట ప్రకారం తిరిగి వస్తాడు. తనని భక్షించమని రక్కసుణ్ణి కోరతాడు. అప్పుడా రాక్షసుడు "ఓయీ! నీవు మహానుభావుడవు. నీ లాంటి వాడికోసమే నేను ఎదురు చూస్తున్నాను. శాపవశాత్తు ఈ రూపంలో ఉన్నాను. నువ్వు భగవంతుని సన్నిధిలో పాడిన పాట పుణ్యఫలం నాకిచ్చి నన్ను రక్షించమని" వేడుకున్నాడు. తన పూర్వజన్మ వృత్తాంతాన్ని ఇలా చెప్పాడు.

"చోళ రాజ్యంలో పండిత వంశంలో పుట్టిన సోమశర్మనైన నాకు విజ్ఞానినన్న అహంకారం ఉండేది. రాజుతో అబద్ధాలు చెప్పి నా అధికారం చెలాయించుకునేవాణ్ణి. ఒక బ్రాహ్మణునికి మాయ మంత్రాలతో ప్రాయశ్చిత్తం చేసి, అతనిచ్చే బంగారానికి ఆశపడి పంక్తిభోజనం చేశాను. బ్రాహ్మణులు వెలివేసేసరికి ఒక వర్తకుని దగ్గర తూకం తూచే ఉద్యోగిగా చేరి అతణ్ణి మోసం చేశాను. ఆ వర్తకుడికి నా మోసం తెలిసిపోయేసరికి కొంత సామగ్రి జాగ్రత్తపరుచుకుని అర్ధరాత్రి పారిపోవడానికి ప్రయత్నించాను. ఒక బ్రహ్మచారి నన్ను వాగులోకి నెట్టివేశాడు. ప్రాణ భయంతో ఒక నర శవాన్ని తెప్పగా

చేనుకుని దాటబోతుంటే కొందరు మనుషులు మామీద బాణవర్షం కురిపించారు. ఒక చండాల జాతివాడు నన్ను వెముకలు విరిగేటట్లు కొట్టి వెళ్లిపోయాడు. తర్వాత దారిలో నన్ను దొంగలు అడ్డగించారు. వాళ్ళను ఎదిరించడంవల్ల నన్ను బలంగా కొట్టారు. కాకళ్ళుతుడనే చోరుడి భయంకర రూపాన్ని చూస్తూ మరణించడం వల్ల నాకీజన్మలో పిశాచి రూపం కలిగింది" అన్నాడు. అది విన్న మాలదాసరి ఆ రక్కసుడికి కైశికి గాన పుణ్యం ఇచ్చాడు. దానితో అతనికి మునుపటి రూపం సిద్ధించి, ఆ మాలదాసరిని పూజించాడు. ఈ కథ చెప్పి భగవంతుడు తనకు సంగీతం మీద ఉన్న మక్కువతోనే ఈ జన్మలో గోదాదేవి కూడా తనమీద పాటలు రాస్తూ, పాడుతోందని చెప్పాడు. ఆమెను శ్రీరంగనాథుణ్ణి సేవించడానికి తీసుకుపోయి అర్చన చేయమని చెప్పాడు. విష్ణుచిత్తుడు అలా చేయగానే ఆమె రంగనాథుని సాయుజ్య పదవి పొందింది.

***పారిజాతాపహరణం*** :- ద్వారకలో శ్రీకృష్ణుడు తన అష్ట మహిషలతో కాపురం చేస్తుంటాడు. రుక్మిణీదేవి ఇంట్లో ఉండగా నారదుడు ఒకనాడు వచ్చి, పారిజాత పుష్పాన్ని ఇచ్చి దాని మహిమను వివరిస్తాడు. దీన్ని ఎవరికిస్తావో వారిపట్ల నీకు ఎక్కువ మక్కువ ఉన్నట్లు అని చెప్పాడు. శ్రీకృష్ణుడు దగ్గర్లో ఉన్న రుక్మిణికి ఇస్తాడు. ఆ విషయమంతా చెలికత్తె ద్వారా సత్యభామకు తెలుస్తుంది. ఆమె బాగా కోపించి, తనమీద కృష్ణుడు ఇన్నాళ్ళు చూపినదంతా కపట ప్రేమగా భావించి, తన గృహానికి వచ్చిన కృష్ణుణ్ణి నానా విధాల దూషిస్తుంది. ఆయనెంత ఓదార్చినా వినలేదు. చివరకు పారిజాత వృక్షాన్నే తెచ్చి, ఆమె పెరటి చెట్టుగా నాటిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. అప్పటికి ఆమె కోపం చల్లారింది. మరునాడు గరుత్మంతుణ్ణి రప్పించి, ఇంద్రుడి మీద దండెత్తడానికి బయలుదేరుతాడు. దారిలో కృష్ణుడు సత్యకు, సిద్ధ, సాధ్య, యక్ష, కిన్నెర, వధూ విశేషాల్ని, స్వర్గంలోని విశేషాల్ని వివరిస్తాడు. అంతకు ముందే కృష్ణుడి రాకను నారదుడి ద్వారా ఇంద్రుడు విని, సపరివారంగా వెళ్ళి అతన్ని ఆహ్వానిస్తాడు. కృష్ణుణ్ణి

చూడడానికి వనితలు తహతహలాడతారు. అతను అమరావతి ప్రధాన వీథులగుండా సాగి, దేవమాత అయిన అదితిని దర్శిస్తాడు. ఆమె కృష్ణుణ్ణి చూసి సంతోషించి; అతని అవతార వర్ణన గావిస్తుంది. తర్వాత కృష్ణుడు వైజయంతమనే ఇంద్రుని భవనంలో విడిది చేస్తాడు. వైజయంతానికి చెందిన విపుల వర్ణన, నందనోద్యాన వర్ణన, రంభాద్యప్సరసలతో పాటు వనవిహారం, దేవతాంగనల పుష్పాపచయ క్రీడా వివరణ, మధ్యాహ్న సమయ విశేషాలు, వేడికి తాళలేక సత్యాకృష్ణుల జలక్రీడ, నగర ప్రవేశం, సూర్యాస్తమయ వర్ణన ప్రస్తావించబడ్డాయి. మరునటిరోజు పారిజాత వృక్షం కోసం సత్యతోపాటు కృష్ణుడు నందనోద్యానం ప్రవేశిస్తాడు. అతన్ని వనపాలురు అడ్డగించి నిందిస్తారు. వాళ్లకేదో సమాధానం చెప్పబోయే కృష్ణుణ్ణి వెంటనే సత్య వారించి, ఆ వృక్షం తనకు ఎలా సంక్రమించాల్సిందో వివరించి, అది తన హక్కు అని వాదిస్తుంది. అప్పుడు వనపాలురు వెళ్ళి ఎంతో ఉద్విగ్నంతో 'ఇంద్రుడికి ఈ విషయం చెబుతారు. ఇంద్రుడు, దిక్పాలురు యుద్ధానికి సన్నద్ధులవుతారు. భయంకర యుద్ధం జరుగుతుంది. చివర్లో ఇంద్రోపేంద్రులు తలబడతారు. ఇంద్రుడు తనపైన వజ్రాయుధాన్ని వేయగా, శ్రీకృష్ణుడు దాన్ని చేత్తో పట్టుకుంటాడు. చివరికి ఇంద్రుడు తన ఓటమిని అంగీకరించి, శ్రీకృష్ణుడు ఎన్నాళ్ళు భూలోకంలో ఉంటాడో, అన్నాళ్ళూ అక్కడ పారిజాతం ఉంటుందని చెబుతాడు. కృష్ణుడు సంతోషిస్తాడు. ఇద్దరూ ద్వారకకు తిరుగు ప్రయాణమవుతారు. దారిలో విశేషాల్ని ముచ్చటించుకుంటారు. సత్యాకృష్ణులకు ద్వారకలో స్వాగతం చెబుతారు. ఆ పారిజాత పుష్ప పరిమళంతో ద్వారకలోని దరిద్రులు ధనవంతులవుతారు. వృద్ధులు పడచువాళ్ళు అవుతారు. కుంటి, గుడ్డి, చెవిటివాళ్లు మామూలువాళ్లు అవుతారు. బంధు, మిత్రుల్ని సందర్శించి, గరుత్మంతుణ్ణి పంపించి, శ్రీకృష్ణుడు సత్యభామతో తన మందిరానికి వెళ్తాడు.

సంతోషంతో సత్యభామ తన గృహారామం మధ్యలో ఆ కల్ప వృక్షాన్ని పాతిస్తుంది. ఆ విషయాన్ని పదహారువేల సతులందరూ అదేపనిగా ముచ్చటించుకుంటారు. ఆ పారిజాత పుష్పం ఆ నగరంలోని అందరికీ దాని అద్భుతాల్ని ప్రసరింపజేస్తుంది. కల్పవృక్ష సంపాదన ఆమోదంతో సుఖంగా ఉండే సత్యాకృష్ణుల్ని నారదుడు ఒకనాడు పుణ్యక వ్రతం చేయమని చెప్పి, తద్విధానాన్ని ఇలా వివరిస్తాడు. చైత్రశుద్ధ నవమి మొదలకుని నెలరోజులపాటు ఆ వ్రతాన్ని చేయాల్సి ఉంటుంది. అత్తమామలు, భర్త అనుమతితో ప్రతిదినం పదివేల మంది ముత్తైదువుల్ని సత్కరించాలి. వ్రత పరిసమాప్తి నాడు గొప్పవాడైన ఒక వ్యక్తిని ఆచార్యునిగా నియమించుకోవాలి. నారదుడు చెప్పిన విధానాన్ని ఆచరించి, బంధు, మిత్రుల్ని పిలిచి, చివరిరోజు అందరి సమక్షంలో కల్పవృక్షంతో పాటు సత్యభామ శ్రీకృష్ణుణ్ణి నారదుడికి దానం చేస్తుంది. తర్వాత నారదుడు పరిహాసానికి కృష్ణుడి చేత సేవకుడిలాగా పనులు చేయిస్తాడు. ఆ తర్వాత అతని ఎత్తు సొమ్ముల్ని గ్రహించి, నారదుడు కృష్ణుణ్ణి సత్యభామకు తిరిగి అప్పగిస్తాడు. సత్య ముత్తైదువలందరికీ పారిజాత పుష్పాలతోపాటు వాయనాలు ఇస్తుంది. శ్రీకృష్ణుణ్ణి నారదుడు అనేక రకాలుగా స్తుతించి, తన దారిన తాను వెళ్తాడు. సత్యాకృష్ణులు సంతోష సాగరంలో ఓలలాడతారు.

*పాండురంగ మహాత్మ్యం* :- శౌనకాది మహామునులు సూతుడితో క్షేత్ర, దైవత, తీర్థాలు మూడూ సమ ప్రాధాన్యం గలిగిన స్థలమేదో చెప్పమని కోరగా, అతను ఇలా చెప్పాడు. తీర్థయాత్రలకు లోపాముద్రతోపాటు బయలుదేరిన అగస్త్యుణ్ణి దేవతలు వింధ్య గర్వాన్ని అణచివేయమని కోరతారు. అతను అలా చేసి, దక్షిణ దిక్కుగా బయలుదేరి, కొల్హాపురంలో ఉన్న మహాలక్ష్మిని సేవించి, తుంగభద్రను దాటి స్వామిమల చేరుకుని, కుమారస్వామిని క్షేత్ర, దైవత, తీర్థాలు మూడూ మేళవించిన చోటెక్కడ ఉందని అడుగుతాడు. అతను ఆ విషయాన్ని చెప్పడానికి శివుడే సమర్థుడని,

ఆయన దగ్గరకు వాళ్లతోపాటు వెళ్లాడు. పార్వతి కూడా అదే ప్రశ్న అడిగినందువల్ల చెప్పడానికి సిద్ధంగా ఉన్న శివుడు విష్ణువును ధ్యానించి ఇలా చెప్పసాగాడు.

ఘర్మవీరానది, భైమీనదిలో కలిసే చోట దక్షిణ తీరాన తీర్థ క్షేత్రమైన పౌండరీకం ఉంది. అక్కడ శ్రీమహావిష్ణువు పాండురంగ నామంతో వెలసి ఉన్నాడు. ద్వాపరంలో పుండరీకుడనే ముని తపస్సు చేసి ప్రత్యక్షమైన దేవుణ్ణి ఆ స్థలంలోనే ఉండేలాగా, ఆ క్షేత్రానికి తన పేరు కలిగేటట్లు ప్రార్థించాడు. ఆ దేవుడు సమ్మతించాడు. ఆ క్షేత్ర మహిమను శివుడు ఇలా చెప్పసాగాడు. ఆ క్షేత్రం లోకోత్తరమైంది. దానికి తూర్పు ద్వారాన సరస్వతి, దక్షిణాన నారదుడు, పడమర భువనేశ్వరీ దేవి, ఉత్తరాన దుర్గాదేవి ఉన్నారు.

త్రిదంష్ట్రుడనే రాక్షసుడు పాండురంగని ఎడమవైపున గదతో కొట్టగా, ఆ దేవుని మొలనున్న జాలెనంచి తెగిపోయి ఇప్పటికీ అక్కడే పడి ఉందట. అక్కడ పద్మతీర్థం, శంఖ, పద్మ నిధులు, పిప్పలాకరంలో నరనారాయణులు ఉన్నారు. కుండల తీర్థం, అశ్వత్థ రూపాన నారసింహుడు, ముక్తకేశినీక్షేత్రం, భైమీ తీర్థాలు ఉన్నాయి. అగస్త్య, గాణాపత్య తీర్థాలు, సంరక్షణ తీర్థం, జాబాలి తీర్థం, బ్రహ్మ తీర్థం, కలశ తీర్థం, పితృ తీర్థం, చక్ర తీర్థం, లక్ష్మీ తీర్థం, కౌమోదకీ, పద్మ, శంఖ, చక్ర తీర్థాలు, సంగమ, రామ, దేవ సూర్య, సరస్వతీ తీర్థాలు ఉన్నాయి.

ఇలా శివుడు పౌండరీక క్షేత్ర మహాత్మ్యాన్ని వివరించిన తర్వాత, శౌనకుడు సూతుణ్ణి చూసి "మహాత్మా! విష్ణువు నందుని కొడుకుగా ఎందుకు పుట్టాడు? రాధాకృష్ణుల సంబంధం ఎలాంటిది?" అని అడిగాడు.

అప్పుడు సూతుడు తాను వేదవ్యాసుని ద్వారా విన్న పుండరీక ముని చరిత్ర వినమని, అది వింటే ఆ అనుమానాలు తీరుతాయని చెప్పాడు.

కళింగదేశ పీఠికాపురంలో వేదవేదాంగ వేత్త, ఉత్తమశీలుడు అయిన సభావతి అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. నిగమశర్మ అతని పుత్రుడు. అతను సమస్త విద్యల్ని నేర్చినా, అల్లరిచిల్లరిగా తిరుగుతూ, ఆస్తిని పాడుచేయసాగాడు. అతన్ని సంస్కరించడానికి అతని అక్క సకుటుంబంగా పుట్టినిల్లు చేరుకుంది. తమ్ముణ్ణి ఆదరించి నయాన హితబోధ చేసింది. వాడు మారినట్లు నటించి, ఒకనాటి రాత్రి ఇంట్లో ఉన్న సమస్త ఆభరణాల్ని మూటకట్టుకుని పారిపోయాడు. దారిలో దొంగలు అతన్ని మూర్ఛపోయేటట్లు కొట్టి, సొమ్ము దోచుకుని వెళ్లిపోయారు. ఒక కాపువాడు అతన్ని ఇంటికి తీసుకువచ్చి సపర్యలు చేశాడు. కాపువాడి కోడలు అతన్ని మోహించింది. ఇంతలో జాతర వచ్చింది. ఆ సమయంలో నిగమశర్మ కాపువాడి కోడల్ని లేవదీసుకుపోయాడు. బోయకులంలో కలిశాడు. కొంత కాలానికి ఆ యువతి మరణించింది.

ఆ తర్వాత ఒక చండాల యువతిని పెండ్లాడాడు. ఆమెతో సంతానం పొందాడు. ఒకరోజు అతని గుడిసె కాలిపోయి భార్యాబిడ్డలు మరణించారు. అతనికి మతిచెడిపోయి అక్కడక్కడా తిరుగుతూ, నృసింహ క్షేత్రంలో మరణించాడు. తీసుకుపోవడానికి వచ్చిన యమదూతల్ని వారించి, విష్ణుచక్రం అతన్ని కాపాడింది. విష్ణుదూతలు నిగమశర్మను సగౌరవంగా శ్వేతద్వీపంలోని పరమపదానికి తీసుకుపోయారు. అతను వైకుంఠంలో 'కుముదుడు' అనే పరమ భాగవతోత్తముడయ్యాడు. కాబట్టి పుండరీక క్షేత్రంలో మరణించిన ఎలాంటి పాపాత్ముడికైనా ముక్తి లభిస్తుంది. విష్ణువు ఆ క్షేత్రంలో నివసించడానికి కారణమేమిటని నారదుడు శివుణ్ణి అడగ్గానే- పుండరీకుడనే ముని ఘోరతపస్సు చేస్తుండగా లోకం అట్టుడికి పోయినట్లయ్యింది. అప్పుడు బ్రహ్మ విష్ణువు దగ్గరికి వెళ్ళాడు. ఆ సమయంలోనే భూదేవి పాపభారాన్ని మోయలేనని విన్నవించు కుంటోంది. విష్ణువు భూదేవికి అభయమిచ్చి, పుండరీకునికి వరమిస్తానని చెప్పి, బ్రహ్మను సాగనంపాడు. శ్రీకృష్ణుడిగా పుట్టి

మహిమలు చూపాడు. బ్రహ్మ ఒక శక్తిని పంపి, శ్రీకృష్ణుడికి ప్రీతి కలిగించటానికి రాధగా సృష్టించాడు. ఆ రాధాకృష్ణుల ప్రేమ వర్ధిల్లసాగింది.

విష్ణువే తనకు భర్తగా కావాలని తపస్సు చేస్తున్న రాధకు శరత్కాలంలో విష్ణువు ప్రత్యక్షమై ఆమె కోరిక తీర్చాడు.

పుండరీకుడు ఘోర తపస్సు చేయసాగాడు. బ్రహ్మ ప్రత్యక్షమై నేడో, రేపో విష్ణువు నీకు ప్రత్యక్షం అవుతాడని, ముక్తిని ఇస్తాడని, ఆ క్షేత్రం దేవర్షి నరగణ సేవితం అవుతుందని చెప్పాడు. అలా ప్రత్యక్షమైన విష్ణువు అద్భుత తేజాన్ని చూసి, బెదరిపోయి అరుస్తూ పారిపోతున్న పుండరీకుణ్ణి చూసి కృష్ణుడు నవ్వాడు. పుండరీకుడు వెనుకనే మరలి దేవుణ్ణి చూసి, వేయి విధాల కొనియాడాడు. వేరేమీ కోరకుండా, ఈ క్షేత్ర తీర్థాలు గొప్పగా ఉండాలి. నీ దర్శనం ఇక్కడ భయ కర్మల్ని పొగొడుతూ, ప్రజలకు లభించుగాక! ఈ తీర్థక్షేత్రాలు నా పేరుతో వెలియునుగాక! అని ప్రార్థించగా, విష్ణువు అలాగే వరాలిచ్చాడు.

విష్ణువు రెండు మూర్తులతో, రెండు చేతుల్ని కటి మీద ఉంచుకుని పశ్చిమ, ప్రాక్ ప్రముఖుడుగా వెలసి ఉన్నాడు.

ఫణి భర్త అతని పాద పీఠంలో లక్ష్మీదేవిని హ్రీ, శ్రీ రూపాలతో అతన్ని రెండు వైపులా సేవిస్తుంది. ఎదుట గరుత్మంతుడు, దక్షిణ భాగాన బ్రహ్మ సనకాదులు, ఎడమవైపు శివ రుద్రాదులు, వెనుక ఇంద్రాదులు ఉన్నారు. విష్ణువు ఐదు సంవత్సరాల బాలుడుగాను, దిగంబరిగాను ఉన్నాడు. అయన్ని దర్శించినవాళ్లకి ఎలాంటి పాపాలైనా పోతాయి. మొదట గోవు, కాకి, హంస, చిలుక, పాము, తేనేటీగలు, ఆ దేవుణ్ణి సేవించి, ఉత్తమ జన్మాలు పొంది, చివరలో ముక్తిని పొందాయి. ఆ కథలివి:

*సుశీలోపాఖ్యానం*- భీమానది తీరాన శ్రీకృష్ణుడి వేణుగానం విన్న గోవొకటి పాలు స్రవించగా, ఆ సురగ గాలికి ఎగిరి వచ్చి శ్రీకృష్ణుడి

శిరస్సు మీద పడింది. దానితో ఆ గోవుకు దేవునికి క్షీరాభిషేకం చేయడంవల్ల పుణ్యం లభించి, మరుజన్మలో సుశీల అనే పేరుతో ఒక బ్రాహ్మణుని కూతురుగా జన్మించింది. ఆమెకు ఒక లోభితో వివాహమైంది.

ఒకనాడు భర్త పొరుగూరికి వెళ్లాడు. కృష్ణుడు ఒక పొట్టి వటుని రూపంలో ఆమె ఇంటికి వచ్చాడు. చాలా ఆకలిగా ఉందని నటించి, వంట చేసే దాకా ఆగలేనని, చద్ది అన్నం పెట్టమన్నాడు. ఆమె పెట్టిన చద్దిని, భక్ష్యాల్ని ఎన్ని పెట్టినా ఇంకా కావాలని మారాం చేశాడు. ఆమె అతన్ని భగవంతునిగా గ్రహించింది. అగ్నిదేవుణ్ణి ప్రార్థించి, అపరిమితమైన పలురకాల ఆహారపదార్థాల్ని పొందింది. ఆమె భక్తికి మెచ్చి కృష్ణుడు ప్రత్యక్షమై, ఆమె పూర్వ జన్మ వృత్తాంతం చెప్పాడు. ఆమెను పరీక్షించడానికే అలా చేశాడని, ఆమె భర్త కఠినుడుగా ఉండడానికి తానే కారణమని, పూర్వం పాపాత్ముడైన అకృత సత్క్రియుడు తనకు పెట్టిన నైవేద్యం చూసిన సుకృతం వల్ల, ఈ జన్మలో ఆమె భర్తగా పుట్టగలిగాడనీ, ఆమె నూరేండ్లు జీవించి భర్తతో కూడా మోక్షం పొందగలదనీ చెప్పి మాయమయ్యాడు.

పాండురంగని దేవాలయ సమీపంలో రావి చెట్టుపైన ఉన్న కాకి ఒకటి అక్కడి బలిపీఠం మీద వేసిన మెతుకులు తినడానికి రాగా, దాని రెక్కల గాలికి దుమ్ముపోయి, గుడి తుడిచిన పుణ్యం లభించి, మరుజన్మలో సుశీల పుత్రుడుగా పుట్టింది.

ఒక హంస వేసవిలో నదిలో మునిగి, గుడిలో చేరి రెక్కలార్పగా, దానికి గుడి అలికిన పుణ్యం లభించి, మరుజన్మలో సుశీల కొడుకుగా పుట్టింది.

ఒక హరిదాసి పెంచుతూ ఉన్న చిలుక పంజరం నుంచి తప్పించుకుని, ఆమె ముత్యాలహారం నోట కరచుకుని పాండురంగని గుడిలో ఒక దండెం మీద కూర్చుని ముత్యాల్ని ముక్కుతో పొడవగా, అవి రాలి

పడి గుడిలో ముత్యాలముగ్గు పెట్టిన పుణ్యం దానికి లభించి మరుజన్మలో సుశీల కొడుకుగా పుట్టింది.

ఎలుకను తరుముకుని వచ్చిన పాము ఒకటి విఠలుని పాదపీఠం మీద ఉన్న మొగలి పుప్పొడిని ఆఘ్రాణించి, ఆ ఆనందంతో పడగ విప్పగా, ఆ పడగ మీద ఉన్న మణి ప్రకాశించి, దానికి దీపారాధనమొనర్చిన పుణ్యం లభించి మరుజన్మలో సుశీల పుత్రుడుగా పుట్టింది.

ఒక తేనెటీగ పాండురంగని పూజించిన పుష్పంలోని మధువును తాగడంవల్ల దానికి భగత్పాద తీర్థం గ్రోలిన పుణ్యం లభించి మరుజన్మలో సుశీల సుతుడిగా పుట్టింది.

విఠలునికి ఈశాన్య దిక్కులో క్షేత్రపాలుడనే కాలభైరవుడు ఉన్నాడు. గుడిపైన విమానంలో వెళ్ళే గంధర్వుణ్ణి అతను నేలమీద పడేసి చంపే లోపు పాండురంగడు అతన్ని వారించాడు. భక్తులు మొదట క్షేత్రపాలకుణ్ణి దర్శించిన తర్వాతనే పాండురంగణ్ణి చూస్తారు.

పండరీక్షేత్రంలో ఉన్న వివిధ తీర్థాలు, వాటికి ఏర్పడిన పూర్వగాథలు, అందులో మునిగి తరించిన భక్తుల చరిత్రలు, చాలా వరకు పునరుక్తిలో ఉన్నాయి. ఇంతమంది భక్తులు సంసార జీవితాన్ని గడుపుతూనే ముక్తిని పొందినప్పుడు, ఇక సన్యాసులు కావాల్సిన అవసరమేముందని? నారదుడు శివుణ్ణి ప్రశ్నించాడు.

అందుకు శివుడు గృహస్థ ధర్మాన్ని మించిన ధర్మం లేదు. దానికి సంబంధించిన ఒక కథ ఉంది. వినమని 'ఆయత-నియతుల' కథను ఇలా చెప్పాడు.

ఆయతుడు-నియతుడు అగస్త్యుని శిష్యులు. విద్యాభ్యాసం తర్వాత అగస్త్యుడు బ్రహ్మ కూతుళ్లైన గాయత్రి, సావిత్రి అనే కన్యల్ని తెచ్చి, వాళ్లకి వివాహం చేయ నిశ్చయించాడు. కాని ఆయతుడు అందుకు ఒప్పుకోలేదు. అందువల్ల ఆ ఇద్దరిని నియతుడికిచ్చి పెళ్ళిచేసి, అగస్త్యుడు ఆయతుణ్ణి ఆశ్రమం నుంచి వెళ్లగొట్టాడు.

ఆయతుడు ఘోర తపస్సు చేస్తూ ఉండగా, అంతలో ఇంద్రుడు బ్రాహ్మణ రూపంలో తన కామధేనువు, శచీదేవితో పాటు వచ్చి, అతని తపస్సు ఆపి, గృహస్థాశ్రమాన్ని స్వీకరించమని నచ్చజెప్పాడు. కాని అతనందుకు సిద్ధం కాలేదు. అప్పుడు విసిగిపోయిన ఇంద్రుడు తన కార్యసాధన కోసం కామధేనువును అక్కడే ముసలిగోవు రూపంలో విడిచి వెళ్ళాడు. ఆ గోవు చావడానికి సిద్ధంగా ఉన్నట్లు నటించగా, ఆయతుడు దాని సంరక్షణకే తన సమయాన్నంతా వెచ్చించేవాడు. చివరకు అది తన తపోభంగానికి కారణమని గ్రహించి, ఆ గోవును ఇంకొక అడవికి తరిమాడు. అది పరుగెత్తుకుంటూ పోతూ, దారిలో తపస్సు చేస్తున్న వాధూల మునిని తొక్కింది. అతను కోపించి గోవును తరుముకుని వస్తున్న ఆయతుణ్ణి కప్పవు కమ్మని శపించాడు. అతను తన నిర్దోషిత్వాన్ని విన్నవించగా, కప్ప రూపంతోనే సంతానం పొంది, పితౄణం తీర్చి, ముక్తిని పొందుతావన్నాడు. ఇలా ఆయతుడు 'హరిదాస'మనే పేరుతో ఆ పండరిక్షేత్ర సమీపంలోనే పూర్వజన్మ వాసనా ఫలంగా భగవంతుణ్ణి ధ్యానిస్తూ కాలం గడపసాగాడు. కొన్నాళ్ళకు కన్యాకుబ్జ రాజతనయ చెలికత్తెలతో పాండురంగణ్ణి సేవించి, హరిదాసాన్ని చూసి, దాన్ని అల్లరిపెట్టి, కప్పకు వెరచిన ఒక బ్రాహ్మణుని పైన దానిని విసిరారు. అతను కోపించి వాళ్లందరినీ కప్పలు కమ్మని శపించాడు. వాళ్లు కప్పలై హరిదాసాన్ని మోహించి, సంతానవంతులయ్యారు. ఇలా ఆయుతుడు శాప విముక్తుడయ్యాడు. కాబట్టి గృహస్థ ధర్మాన్ని ధిక్కరించేవాళ్లు కష్టాలలో పడతారని శివుడు నారదునికి చెప్పాడు.

ఈవిధంగా సూతుడు శౌనకాదులకు పాండురంగ మహాత్మ్యాన్ని చెప్పాడు.

*వసుచరిత్ర* :- చేది దేశంలో ప్రతిష్ఠాన పురాన్ని వసురాజు పాలించేవాడు. అతను ఇంద్రుడి నుంచి విమానం మొదలైన అనేక దివ్య చిహ్నాలు పొందాడు. ఆ నగరానికి సమీపంలో శుక్తిమతీ నది

ప్రవహిస్తోంది. ఒకనాడు హిమాలయపర్వత సుతుడైన కోలాహలుడు శుక్తిమతీ నదిని అడ్డగించాడు. అప్పుడు వసురాజు ఆ పర్వతాన్ని తన కాలిగోటితో ఎగురగొట్టాడు. ఈ గొప్ప సంఘటనను అతను దేవేంద్రుని పక్కన సమానమైన గద్దెపైన కూర్చుని ఉండగా చారణులు ప్రస్తుతించారు. సిగ్గుతో తలవంచుకుని దిక్కులేక పడి ఉన్న కోలాహల పర్వతాన్ని వసురాజు తన కేళీశైలంగా చేసుకున్నాడు. ఒకనాడు ఉద్యానవన విహారానికి తన నర్మ సచివునితో పాటు రాజు దివ్యరథారూఢుడై వెళ్లాడు. అప్పుడు ఎక్కడి నుంచో ఒక కమ్మని పాట వినబడింది. అది ఎక్కడ నుంచి వినబడిందో తెలుసుకోవడానికి రాజాజ్ఞతో నర్మసచివుడు బయలుదేరాడు. చెట్ల చాటునుంచి చూడగా ఒక అందమైన యువతి చెలికత్తెల మధ్యలో వీణ వాయిస్తూ ఉండడం చూశాడు. రాజు దగ్గరకు వచ్చి ఆమె రూప గుణాతిశయాల్ని వర్ణించి చెప్పాడు. ఆమెను చూడడానికి రాజు వెళ్ళాడు. ఆమె అందచందాల్ని చూసి మదన పరవశుడయ్యాడు. నర్మసఖుడు యతి వేషంలో ఆమె జననాదికాలు తెలుసుకోవడానికి బయలుదేరాడు. సఖీజనుల మధ్యనున్న గిరికను చూసి ఆశీర్వదించాడు. ఆమె వివరాలు అడగ్గా, చెలికత్తె అయిన మంజువాణి ఇలా చెప్పింది.

అధిష్ఠాన నగరానికి సమీపంలో శుక్తిమతీ నది ఉంది. ఆ నదీమతల్లి బ్రహ్మ కొలువుకు వెళ్ళి వస్తుండగా ఒకనాడు కోలాహలుడనే హిమవంతుని పుత్రుడు ఆ నదిపైన వ్యామోహంతో అడ్డగించాడు. ఆ నదీమతల్లి ఎంత వద్దని వారించినా అతను తన బలమైన ప్రేమను ప్రకటించి, ఆమె మీద పడ్డాడు. దానితో నది స్తంభించిపోయింది. నీళ్లు ఎక్కువై పరిసర గ్రామాల్ని ముంచివేయగా, ప్రజలు వసురాజుతో మొరపెట్టుకున్నారు. ఆ రాజు వెళ్ళి, బంతిని మీటినట్లు ఆ పర్వతాన్ని కాలిగోటితో ఎగురగొట్టాడు. ఇంద్రుడు మెచ్చుకుని ఒక దివ్య విమానాన్ని బహూకరించాడు. అందువల్ల అతను ఉపరిచర వసువనే ఖ్యాతిని పొందాడు. శుక్తిమతీ నదిని, కోలాహల పర్వతాన్ని తన

విహారభూమిగా మన్నించాడు. అంతలో కోలాహల సంగమంతో శుక్తిమతి గర్భిణి అయింది. ఒక కుమారుణ్ణి, కూతుర్ని కనింది. కుమారుడికి 'వసువదుడ'ని, కూతురికి 'గిరిక' అని నామకరణం చేసింది.

ఇలా మంజువాణి గిరిక జన్మవృత్తాంతం తెలిపింది. అప్పుడు మాయాముని తన మంత్ర ప్రభావంతో అక్కడికి వసురాజును రప్పిస్తానని 'మజ్ఝా' అని పలుకగానే, పొదలమాటున పొంచి ఉన్న రాజు, అదే సమయమని భావించి, వారి మధ్యకు వచ్చాడు. అందరూ ఆశ్చర్యపడ్డారు. ముని ప్రభావాన్ని కొనియాడారు. వాళ్లిద్దరూ పరస్పరం ఆలోకన సౌఖ్యాన్ని పొందారు. ఇంతలో గిరిక తల్లి అయిన శుక్తిమతి కూతురికి కల్పక వనవాన్ని ఇవ్వడానికి రమ్మంటుంది అని ఒక కలహంసి వచ్చి చెప్పగా ఆమె వెళ్ళింది. వసురాజు ఆమె మీది వ్యామోహాన్ని వీడలేక, ఎలాగో తన నగరానికి చేరుకున్నాడు. వాళ్లిద్దరూ పరస్పరం విరహవేదనను అనుభవిస్తారు. గిరిక పరిస్థితి చూసి ఆమె చెలికత్తె మంజుభాషిణి వసురాజు దగ్గరకు వెళ్తుంది. దేవగమనంతో ఇతరులకు కనిపించక, ఆకాశమార్గాన అదిష్ఠాన నగరానికి వెళ్తుంది. అక్కడ దివ్య సౌధాన్ని చూసి, అది రాజగృహమని భావించి లోపలికి వెళ్తుంది. వసురాజు గిరిక కోసం పడే విరహవేదనను కనులార చూసి, పురుషుడైన నీవే ఇలా అయితే, ఇక మా చెలి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోమని ఆమె వసురాజును ప్రార్థించి, గిరికాముద్రికను అతనికిస్తుంది. అది చూసి సంతోషపడి, తాను కూడా తన రత్నాలహారాన్ని ఇస్తాడు. త్వరలోనే ఇంద్రుడు గిరిక తండ్రి అయిన కోలాహలుణ్ణి కూతుర్ని ఇమ్మని అడిగి, ముహూర్తం నిర్ణయించడానికి వస్తాడని చెప్పి పంపుతాడు. విషయమంతా మంజుభాషిణి వసురాజు దగ్గర నుంచి తిరిగి వచ్చి గిరికకు చెబుతుంది. అప్పుడామె సంతోషిస్తుంది.

ఆ తర్వాత ఇంద్రుడు, దిక్పాలురు, మునులు, దేవతా స్త్రీలతోపాటు కోలాహలుని దగ్గరికి వచ్చి, అతని కూతురైన గిరికను వసురాజుకు ఇవ్వమని అభ్యర్థిస్తాడు. బృహస్పతి ఒక దివ్య ముహూర్తం (మిథున లగ్నం) నిర్ణయిస్తాడు. విధియుక్తంగా పెళ్ళి నాలుగు రోజులు ఘనంగా జరుగుతుంది. వివాహ సందర్భాన అల్లునికి ఘనమైన వస్తువులతోపాటు శుక్తిమతీ, కోలాహలులు తమ కుమారుడైన వసువదుణ్ణి కూడా వసురాజు వశం చేస్తారు. అతన్ని రాజు తన సైన్యాధిపతిగా చేసుకుంటాడు. ఇంద్రుడు స్వర్గానికి సపరివారంగా వెళ్తాడు. వసురాజు గిరికతో ఆనందసాగరంలో తేలిపోతాడు.

రాబోవు ప్రకరణంలో జనజీవన నిలయాల గురించి వివరించ బడుతుంది.

రెండో ప్రకరణం

# పంచకావ్యాలు - జనజీవన నిలయాలు

ఆదిమానవుడు తనకు కావాల్సిన ఆహారం ఎక్కడ దొరుకుతుందో అక్కడ నివసించేవాడు. దొరక్కపోతే మరో చోటుకు వెళ్ళేవాడు. ఇలా సంచారజీవిగా ఉన్న అతను వ్యవసాయం నేర్చుకున్న తర్వాత ఒకచోట స్థిరంగా నివసించడం మొదలుపెట్టాడు. అప్పటి నుంచి ఇల్లు నిర్మించుకోవడం, ఆహారం, దుస్తులు మొదలైనవి తయారు చేసుకోవడం తెలుసుకున్నాడు. నలుగురూ కలిసి ఒకచోట కూర్చున్నప్పుడు ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడం, తద్వారా కొత్త విషయాలు తెలుసుకోవడం జరుగుతూ ఉండేది. అలా ఏర్పడ్డవే కళలు, శాస్త్రాలు, వృత్తులు, దేవుళ్ళు, దేవాలయాలు, జాతరలు, విశ్వాసాలు మొదలైనవి. ఇవన్నీ ఒకచోట చేరి జనజీవన వికాసం రూపుదిద్దుకుంది.

ఈ జనజీవన వికాసాన్ని రెండు భాగాలుగా వర్గీకరించవచ్చు. సాంఘిక జీవనానికి (Social life) సంబంధించిన వ్యవసాయం, వాణిజ్యం, వృత్తులు, వైద్యం మొదలైనవి ఒక వర్గం, సాంస్కృతిక జీవనానికి (Cultural life) సంబంధించిన విద్య, కళలు, దేవుళ్ళు, దేవాలయాలు, జాతరలు, విశ్వాసాలు మొదలైనవి మరోవర్గం. ఈ రెండింటికీ ఆధారాలైన నగరాలు, పట్టణాలు, పల్లెలు మొదలైన వాటి స్వరూప స్వభావాలు పంచకావ్యాల్లో ఎలా చోటు చేసుకున్నాయో పరిశీలిద్దాం.

జనజీవనానికి ఆవాసాలు నగరాలు, గ్రామాలు. నగరాల్లో చక్రవర్తులు, రాజులు, అధికారులు, పండితులు మొదలైన ఉన్నత వర్గాలవారు నివసిస్తుంటారు. వాళ్ళకి రక్షణ (Security) చాలా ముఖ్యం కాబట్టి, నగరం చుట్టూ పెద్ద కోట, వెలుపల లోతైన కందకం ఉంటుంది.

నగరంలో ఎత్తైన మేడలు, సుందరమైన ఉపవనాలు, అందులో క్రీడా సరస్సులు ఉంటాయి. వివిధ రకాల వక్షులు, పూలు కనువిందు చేస్తుంటాయి. విభిన్న వర్గాల ప్రజలు అంటే సైనికులు, అధికారులు, కచేరీలు, కళామంటపాలు, అంగళ్లు, వేశ్యావాటికలు, అక్కడ ప్రధానాంగాలు. నగరంలో నివసించేవాళ్ల ఆలోచనలు, మనస్తత్వాలు, గ్రామీణుల కంటే భిన్నంగా ఉంటాయి.

ఇక గ్రామాల్లో భూస్వాములు, రైతులు, వాళ్లని ఆధారం చేసుకుని జీవించే కమ్మరులు, కుమ్మరులు, వడ్రంగులు, మేదరులు, చాకలి, మంగలి, మాదిగ మొదలైన వృత్తుల వాళ్లుంటారు. సాధారణమైన గృహాలు, మట్టిమిద్దెలు, పూరిళ్ళు, గుడిసెలు, దొడ్లు, గడ్డివాములు, బండెలదొడ్లు అక్కడ కనబడతాయి. పంటచేలు, తోటలు, పశువులు, అడవులు, క్రూరమృగాలు, వేట, జాతరలు అక్కడ ప్రధాన పాత్ర వహిస్తాయి. స్థూలంగా ఇవన్నీ జనజీవనంలో ప్రసక్తమయ్యే విషయాలు. వీటిలో అంతర్భాగాలు కోకొల్లలు. జనజీవనానికి సంబంధించిన విషయాలు ఆముక్తమాల్యదలో సమగ్రంగాను, మనుచరిత్ర, పాండురంగ మహాత్మ్యాలలో కొంతవరకూ, వసుచరిత్ర, పారిజాతాపహరణాలలో అంతంత మాత్రంగానూ లభిస్తాయి. చివరి రెండింటిలో నగరజీవనం, అంతఃపుర వ్యవహారాలు, నాయికానాయకుల ప్రణయ వృత్తాంతాలు తప్ప, సాంఘిక జీవనవిశేషాలు ఏమాత్రం కనబడవు. అయినా సందర్భ వశాత్తు చెప్పిన ఉపమానాలు, ఉత్ప్రేక్షలు, రూపకాలు మొదలైన అలంకారాల్లో ప్రసక్తమయ్యే విషయాల్ని ఆధారంగా తీసుకుని జనజీవనానికి సంబంధించిన విషయాల్ని వెలికి తీయాలి.

విమానంలో లేదా ఆకాశ మార్గాన వెళ్ళేవాళ్లకి భూమి మీద దృశ్యాలు కనబడే తీరు ఎలా వర్ణించబడిందో చూడండి.

'మంజువాణి' అనబడే గిరిక చెలికత్తె వసురాజు దగ్గరకు ఆకాశ మార్గాన వెళ్తుంది. అప్పుడు ఆమెకు భూమి మీద కొండలు అచ్చున

గాయల్లాగాను, నిండు చెరువులు అద్దపు బిళ్ళల్లాగాను, ఏర్లు ముత్యాల దండల్లాగాను, అరణ్యాలు నారుమళ్ళులాగాను కనబడ్డాయట.

> "కొండలచ్చన గండయి,నిండు చెరువు
> లెల్ల నద్దంపు బిళ్ళలై, యేర్లు ముత్తి
> యంపు సరులై యరణ్యంపు గుంపులెల్ల
> నారులై తోచె పుడమిని నారులారా "
>
> (వసు, 4-59)

ఇంకా దగ్గరకు వెళ్ళేకొద్దీ మేడలమీద ఉన్న పతాకాలు, బంగారు కలశాలు, కోట బురుజులు, ఇళ్ల తోరణాలు, సాముగరిడీలు, నాటకశాలలు, గజశాలలు, అశ్వశాలలు, సుగంధ ద్రవ్యాలుండే అంగళ్లు, వాటి ముందు భాగాన రత్నాలు చెక్కిన అమ్మాయిల ప్రతిమలు, ఒకదాని తర్వాత ఒకటి కనిపించాయట.1

*నగర నిర్మాణం* :- ఆ అధిష్ఠాన నగరంలో ఏ మేడా మరో మేడకు తీసిపోయేటట్లు లేదు. ఒకదాన్ని మించి మరొకటి ఉంది. అందులో ఒక గొప్ప భవనానికి లోపల, బయట సైనికులు కాపలా కాస్తున్నారు. అదే రాజసౌధం. అందులోని కొలువుకూటానికి పాలసున్నం వేయడానికి వజ్రాల్ని, చాదు (నల్లరంగు) వేయడానికి ఇంద్రనీల మణుల్ని, నీళ్లు చల్లడానికి చంద్రకాంత మణుల్ని, అలకడానికి (కళ్లాపి చల్లడానికి) మరకతమణుల్ని, వింతైన ఎర్రరంగుల వరదాలు వేయడానికి వైడూర్యాల్ని, దీపాలు పెట్టడానికి పద్మరాగ మణుల్ని వాడారేమో! అనిపిస్తుంది.2 దీన్నిబట్టి ఆనాడు భవనాల్ని అలంకరించే తీరు నవరత్నాల్ని ఎంత ఎక్కువగా వాడేవారో అనే విషయం తెలుస్తోంది.

ఆ కొలువుకూటం తర్వాత ముందుకు వెళ్తే కేళీగృహాలు, చావళ్లు, పూజామందిరాలు, పానీయశాలలు, భోజనశాలలు, ఎర్రని పెంకుతో నిర్మించిన గరిడీశాలలు, చల్లని చంద్రకాంత శిలామందిరాలు, చుట్టూర మేడలు, జలయంత్రాల్ని అమర్చిన స్నానశాలలు మొదలైనవి

1. వసు. 4-59, 60, 61.
2. అదే. 4-71.

కనిపిస్తాయి.3 నగరంలో కనిపించే వివిధరకాల కట్టడాల్ని తెలియజేయడం జరిగింది.

*నగరాన్ని నిర్మించాలంటే దానికి కావాల్సిన అంగాలు* :- కోటలు, అగడ్తలు, భవనాలు, వాటికి తోరణాలు, శిఖరాలు, అలంకరించడానికి మణులు, మేడలమీదికి వెళ్లడానికి మెట్లు, అంగడి వీధులు, ఆ వీధుల్లో జనసంచారం ప్రధానంగా అందమైన యువతులు, వాళ్ల అందచందాలు, తీయనిమాటలు, వాళ్లని ఆటపట్టించే యువకులు ఇవన్నీ ఉండాలి. ఈ చిత్రణ వసుచరిత్రలో వసురాజు కోసం ఒక నగరాన్ని నిర్మించే సందర్భంలో కనిపిస్తుంది. ఇంద్రుని సంకల్పంతో అక్కడ చుట్టూ ఉన్న పర్వతశ్రేణులే కోటలయ్యాయి. ఆ పర్వత పాదాల్లో ప్రవహించే లోతైన సెలయేళ్లే అగడ్తలు. గుహాలే గృహాలు. అక్కడి మణికాంతి పుంజ సమూహాలే తోరణాలు. కొండ శిఖరాలే మేడలు. అక్కడి చంద్రకాంత శిలాశకలాలే సోపానాలు. ఆ పర్వత తటాంగంలో ఉండే కర్పూరపుటరటులు, రత్నాలు, చందన వృక్షాలే అంగళ్లు. లతలే యువతులు. కోకిలాది పక్షుల అవ్యక్త మధుర ధ్వనులే వాళ్ల మాటలు. వృక్షాలే యువకులు.4 ఇలా వసుచరిత్రలో అడుగడుగునా ప్రకృతిని తలపోయడం, ప్రపంచాన్నంతా ప్రకృతిలో దర్శించడం కనిపిస్తుంది.

ఇంకా ఆ నగరంలో బ్రాహ్మణుల ఇళ్లు, శోభనగృహాలు, రాజులు, కంచుకీ సమూహాలు (అంతఃపుర రక్షకులు యాభై సంవత్సరాలు దాటినవాళ్లు), ఖడ్గధారులు, అశ్వాలు, క్షత్రియులు, సేనానాయకులు, యువతులు, విటులు, రసికులైన యువతీయువకులు, వాళ్ల రహస్య స్థలాలు, వేశ్యల వినోదాలు, పిల్లనగ్రోవుల నాదాలు అంతటా కనిపిస్తాయి.5 నగర వీధుల్లో ఎలాంటి మనుషులు తారసపడతారో ఇక్కడ తెలియజేయబడింది.

---

3. వసు. 4-72.
4. అదే. 5-41.
5. అదే. 5-46.

వరుణానదీ తీరంలోని అరుణాస్పద పురంలో కోటలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మేడలకు వేసిన సున్నం తెల్లగా మెరుస్తోంది. ఆ తెల్లదనానికి చంద్రుడిలోని మచ్చ కూడా తెల్లగా అవుతోంది.6

శ్రీవిల్లి పుత్తూరులోని ఎత్తైన మేడల చూరుల్లో నీలాలతో చెక్కబడ్డ కోయిలలు, మరకతాలతో చెక్కిన చిలుకల బొమ్మలు ఉన్నాయి. దగ్గర్లో ఉన్న ఉద్యాన వనాల్లో చిలుకలు, కోయిలలు అరుస్తుంటే, వాటి ప్రతిధ్వనులు మేడల్లో వినిపిస్తున్నాయి. వీథుల్లో వెళ్ళేవాళ్ల నిజంగా అవే అరుస్తున్నాయేమో!7 అని అనుకున్నారట.

ఆ మేడలమీద తామర మొగ్గల్లాంటి కెంపుల కలశాలు, బంగారు వన్నె కప్పు పెంకులు కలిగి, దేవేంద్రుడి వైజయంతీ సౌధంలాగా ఉన్నాయి.8

ఇక పారిజాతాపహరణంలో దేవేంద్రుడి వైజయంతీ భవనాన్ని గురించి విపులమైన వర్ణన ఉంది. అపర దేవేంద్రుడు శ్రీకృష్ణదేవరాయల నివాసమైన 'మలయకూటా'న్ని మనసులో పెట్టుకునే తిమ్మన ఈ వర్ణన చేసి ఉంటాడని విమర్శకుల భావన. ఆ వర్ణన ఇది:

అదొక దివ్యమైన మేడ. దానికి బంగారు తామరల మాలలు తోరణాలుగా ఉన్నాయి. అవి మెరుస్తుంటే మెరుపు తీగల్లా కనబడుతున్నాయి. ఆ వైజయంతీ ఆకారాన్ని పోలిన విమానాలు దాని పక్కనే ఉన్నాయి. వాటికున్న బంగారు చిరుగంటలు గాలి వీచినప్పుడల్లా మోగుతున్నాయి. ఆ వైజయంతీ సౌధ శిఖరాగ్రాన 'చింతామణి' అనే దివ్యమణి అమర్చబడి ఉంది. అందులో అన్ని వస్తువుల ప్రతిబింబాలు కనిపిస్తాయి.

---

6. మను. 1-49.
7. ఆము. 1-51.
8. అదే పు. 1-52.

ఆ భవనానికి ఎన్నో కిటికీలు ఉన్నాయి. అవి ఇంద్రనీల మణులతో నిర్మించబడ్డాయి. అనేక రత్న కంబాల ప్రతిబింబాలు వాటిలో కనబడతాయి. గోడలకు అనేక చిత్రపటాలు ఉన్నాయి. గోపురాలకు స్ఫటికాలు అమర్చడంవల్ల వాటి నుంచి తెల్లని కాంతులు నలువైపులకు విరజిమ్ముతున్నాయి. అక్కడ అమర్చిన యంత్రపాలికలు (యువతుల మరబొమ్మలు) వాటంతటవే కదలాడుతున్నాయి. వాటి చేతుల్లో తాంబూలపు పెట్టెలు, విసనకర్రలు, అద్దాలు మొదలైన అనేక వస్తువులు ఉన్నాయి. లోపలి పైకప్పుకు సుగంధ పరిమళంలో ముంచిన దువ్వలువ (తెల్లనివస్త్రం) కట్టారు. కర్పూర దీపాలు, చందనాగరు ధూపాలు, శంఖ, పద్మ, మకరాది చిత్రాల ముగ్గులు కన్నుల పండువుగా ఉన్నాయి.9

మధురాపురం అంగళ్లలో నవరత్నరాసులు అమ్ముతారట9b. ఇందీవరాక్షుడు స్వరోచికి తన నగరాన్ని గురించి ఇలా చెబుతాడు. "ఆ నగరం మందరపర్వతం మీద ఉంది. కోట గోడలు ఆకాశాన్ని తాకేటట్లు ఉన్నాయి. ఏనుగులు, గుర్రాలు కిక్కిరిసి ఉన్నాయి. బజార్లో రత్నాలు రాసులుగా పోసి అమ్మే అంగళ్లున్నాయి. ఇంకా సకల వస్తువులతో దేవేంద్రుని అమరావతిలాగా ఉంది.10

ఈ వర్ణనలో 'రత్నాలు పోసి అమ్మేవారు' అనే మాటను మనం విశ్వసించం. కవులకు అతిశయోక్తి సాధారణం అనుకుని మిన్నకుంటాం. కాని ఇదే మాటను విజయనగరాన్ని సందర్శించిన 'న్యూనిజ్', పయజ్ మొదలైన యాత్రికులు ఇలా రాశారు. "Going forward, you have a broad and beautiful street, full of rows of fine houses and streets....In this street live many merchants, and there you will find all sorts of rubies, and diamonds, and emeralds and pearls and seed-pearls"*. ధనవంతుల ఇళ్లలో నేలకు గచ్చు వేయించి,

9. పారి. 3-41.
9 (b). 'కాంత నవరత్నరాసులంగళ్ల బోలుచు' ఆము. 2-32.
10. మను. 5-102.
* F.E. - Paes. P. 255.

దానిమీద గరుడపచ్చలు, వజ్రాలు, బంగారుపూత వేయించేవాళ్లు. యామునాచార్యుడు పాండ్యరాజు ఆస్థానం ప్రవేశించేటప్పుడు అక్కడ 'గారుడమహీ వేదికమీద ఉన్న రావిచెట్టును చూశాడు. లోపల విశాలమైన ఆస్థాన మండపం ఉంది. దాని గచ్చుకు బంగారు పూత పూయబడి ఉంది. దానికి మూడు సోపానాలున్నాయి'.11

ఇదే విషయాన్ని విదేశీయులు కూడా తమ రాతల్లో నమోదుచేశారు.

"They had begun to paint this chamber....and that it was to be all plated with gold, as well the ground below as all the rest."+

పాలగచ్చు వేయడానికి నీళ్లు, గండ్ర ఇసుక, బెల్లపు పానకం, మీగడ తగు పాళ్లలో కలిపిన సున్నాన్ని గోడలు, స్తంభాలు మొదలైన వాటికి పూసి, అది గట్టిపడేదాకా తాపీతో రాసేవాళ్లు12. ఇలాంటి పాల గచ్చుతో నిర్మించిన 'పద్మమహల్' హంపీలో ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది.

మనోరమ-స్వరోచుల కేళీగృహం, నేలంతా ఇంద్రనీల మణుల పలకలు తాపి ఉంది. కిటికీల నుంచి అగరు ధూప ధూమం బయటికి వస్తోంది. భవంతి అంతస్థులు అంతస్థులుగా ఉంది. గదులన్నీ సుగంధ భరితాలు. ముంజూర్లలో పావురాలు అరుస్తున్నాయి. బంగారుపూత పూసిన ప్రతిమలు ఉన్నాయి. మెత్తటి పరుపులు వేసిన నకినెల మంచాలు లోపల ఉన్నాయి13. మేడల చివరి అంతస్థు మీద నాటక శాలలు ఉండేవి.

'చిలుకల కొల్కి కల్కి యొక చేడియ నాటకసాల మేడపై'
(మను. 5-63)

---

11. ఆము. 4-57 & 58.
* F.E. - Paes. P. 287.
12. మను. 5-38.
13. అదే. 6-03.

**ఉపవనాలు** :- భవనాలకు ముందు ఉపవనాలున్నాయి. వాటిని, 'నిష్కుటా'లని, 'ఉద్యానవనా'లని, 'గృహారామా'లని అనేవాళ్లు. అందులో వివిధ పుష్పలతలు, మొక్కలు, తామర కొలనులు, వాటిలో రాజహంసలు, చక్రవాకాలు విహరిస్తుంటాయి. ఇళ్లలో పెంపుడు కస్తూరి మృగాలు తిరుగుతుంటాయి. పంజరాల్లో చిలుకలు పెంచుతుంటారు (మను. 5-102).

***నూతులు (బావులు)*** :- నగర వీథుల్లో అక్కడక్కడా బావులు ఉండేవి. వాటి అడుగు భాగం ఇంద్రనీల మణులతో నిర్మించబడేవి. నీరు తేటగా ఉండి, అందులో రకరకాల చేపలు తిరుగాడేవి. ఆ పక్క ఉపవనాల్లో ఉన్న వృక్షశాఖలు వీథుల్లోని భవంతుల చూరుల పర్యంతం వ్యాపించి ఉన్నాయి. అక్కడ కూర్చున్న లకుముకి పిట్టలు బావుల్లోని చేపల్ని తినడానికి, మాటిమాటికీ 'టఫీ' మని దూకి, ముక్కుతో పట్టుకుని వచ్చి, చూరుల్లో కూర్చొని తింటాయి. అవి అలా మాటిమాటికీ నీటిలో దూకడం బంతిలాగా ఎగిరినట్లు కనబడుతోంది. అక్కడి ద్రావిడ స్త్రీలు మామూలుగా బంతులాటలాడుతారట."

> "కలయన్నీలమయంపు తల్లి యొరదాకన్ తేట నీరొప్పు, ర
> థ్యల తూపంబుల మీాల జూచి వలభివ్యానంగి తుంగద్రు, శా
> ఖలతో నుండి గబాలునన్ లకుముకుల్ క్రందె పడున్ లేచు, ద్రుము
> చ్ఛలి గేహాందిర ద్రావిడీ పరిచితిం జెండాడు ఛందంబునన్"
>
> (ఆము.1-57)

వేసవిలో నూతుల్లోని నీళ్లు బాగా లోపలికి పోయాయి. గిలక మీాదుగా యువతులు చేంతాళ్లతో నీళ్లు చేదుకుంటున్నారు. ఎంతో సేపు చేదితేగాని బిందెల్లో నీళ్లు పైకి రాకున్నాయి. అదెలాగుందంటే 'సూర్యుడి తాపానికి భయపడి పాతాళంలో దాక్కున్న చల్లని నీరు పిట్టను దీమైన పిట్ట* ఆకర్షించినట్లుగా యువతులు తల్లి యొరకానించిన

---

'ధీము' అంటే వేటగాడు ఒక జాతి పిట్టను పట్టుకోడానికి అదే జాతికి చెందిన ఆడుపిట్టకు అభ్యాసాన్నిచ్చి, దాన్ని ఒక పంజరంలో ఉంచుతాడు. అది అరచినప్పుడు ఆ జాతి పిట్టలు వచ్చి వలలో చిక్కుకుంటాయి. స్త్రీల కుచాలు వేసవిలో చల్లగా ఉండడం ప్రసిద్ధి.

కుచాల్లోని చల్లదనం ఆకర్షించగా పైకి వచ్చాయేగాని, (ఆ నీళ్లు) అతుకుల చేంతాళ్లతో చేదడం వల్ల కాదు' అనేటట్లు ఉన్నాయి .14 (a)

ఈ నూతుల్లోని నీళ్లు కేవలం స్నానపానాదులకు మాత్రమే ఉద్దేశించినవి. అందువల్ల ఈ బావులు పరిమాణంలో చాలా చిన్నవిగా ఉండేవి. ఇవి నగరాలు, గ్రామాల మధ్యలోనే ఉండేవి. కాని పొలాల్లో ఉండే బావులు వ్యవసాయం కోసం ఉపయోగపడేవి. వీటినుంచి నీళ్లు ఏతాముల ద్వారా, కుండల ఏతాముల ద్వారా పైకి తోడేవాళ్లు. 'ఏతం తొక్కేవాళ్లు పాట పాడుతుండగా, ఏతం కుండలు నీళ్లు నింపుకునేటప్పుడు వచ్చే శబ్దం ఆ పాటకు మృదంగ వాద్యం లాగా ఉండేదట'.14 (b) ఇలా తోడిన నీళ్లు చాలా పరిమితంగా కొద్ది పొలానికి మాత్రమే సరిపడేది. అయితే నదులు, చెరువులు లేని ప్రాంతంలో వీటి వాడకం తప్పనిసరి అయ్యేది. ఇలా ఎన్నో బావులు విజయనగర సామ్రాజ్యంలో కనబడేవి. ".... these wells served modest areas of land only since the availability of water from such sources was very much limited. Yet they became indespensable for the agricultural community perticularly when the lands cultivated by them happened to be situated away from the tanks and rivers. There five thousands of wells came into existance in all localities and through out the Vijayanagar Empire".14 (c)

సంస్కృత మాటలైన 'వాపీ, కూప, తటాకాల్ని' తెలుగులో వరుసగా నూతులు, బావులు, చెరువులు అని అంటారు. నూతి నుంచి 'గిలక' ద్వారా నీళ్లు చేదితే, బావుల నుంచి మెట్ల ద్వారా దిగి తెచ్చుకుంటారు. ఆముక్తమాల్యద వేదంవారి సంజీవనీ వ్యాఖ్యలో నూతుల్ని, బావుల్ని ఒకే అర్థంలో ప్రయోగించారు (పే.161).

---

14(a). ఆము. 2-66.
14(b). అదే. 2-55.
14 (c). The Vijayanagar Heritage - P.62. 'Irrigation systems under Vijayanagar Empire', by C.T.M. Kotraiah.

*నదుల నుంచి కాలువలు* :- నదులకు నేటిలాగా ఆనకట్టలు కాకుండా, ఆనాడు వాటి ప్రవాహాల్ని కొద్దిగా అడ్డుకునేటట్లు అడ్డకట్టలు కట్టేవాళ్లు. అప్పుడక్కడ నీళ్లు నిలబడి, తవ్విన కాలువల్ ద్వారా నీళ్లు పారేవి. వీటిని 'కంజాల'ని అంటారు.

"శుక్తిమతీ నది కాలువలు మూడు పంటలకు నీరందిస్తాయి. ఆ నదిలో సువాసినులైన యువతులు జలకాలాడతారు. వాళ్ల శరీరానికి పూసుకున్న 'పునుగు' మొదలైన వాటి వాసన నీటిలో కరుగుతుంది. ఆ నీళ్లు వరిచేలకు పారి, ఆ పొలాల్లో పండిన ధాన్యానికి కూడా పునుగువాసనే వస్తుంది"15 అని చమత్కారంగా 'బానుమతి' అనే సువాసన బియ్యాన్ని పండించే విషయం ప్రస్తావించబడింది.

విజయనగర రాజులు శాంతి సమయాల్లో అసంఖ్యాకమైన సైన్యాన్ని చెరువులు, కాలువలు తవ్వడానికి, సత్రాలు నిర్మించడానికి ఉపయోగించుకునేవాళ్లని చరిత్ర వల్ల తెలుస్తోంది. "This tank I saw so many people (soldiers) at work that there must have been fifteen or twenty thousand men, looking like ants....this tank the king portioned out amongst his captains, each of whom had the duty of seeing that the people placed under him did their work".+

ఒక్కొక్క దండనాయకునికి ఇంత సైన్యమని అప్పగించి, వాళ్లకి ప్రజోపయోగ కార్యాలు (Public works) కేటాయించేవాళ్లు. ఆ పనులు జరిగేటప్పుడు ఏర్పరచుకున్న 'విడుదులే' (camps) ఆ తర్వాత గ్రామాలుగా ఏర్పడి, ఆయా దండనాయకుల పేర్లమీద పిలువబడేవి. ఇలాంటి 'దనాపురాలు' (దండనాయక పురాలు) విజయనగర సామ్రాజ్య పరిధిలో (బళ్లారి, రాయచూరు, కొప్పల్ జిల్లాల్లో) చాలా.

---

15. వసు. 1-110&113.
+. F.E. Narratives of paes. P. 245.

కనబడతాయి. నేటి కొప్పళ్ జిల్లా మునిరాబాదుకు దగ్గర్లో ఉండే 'ముద్దనాపుర' అలా ఏర్పడిందే. 'ముద్దన' అనే దండనాయకుని ఆధ్వర్యంలో తుంగభద్ర నుంచి ఈ గ్రామానికి ఒక కాలువ ఉండేది. అది ప్రస్తుతం ఆనకట్టలో మునిగిపోయింది. ఆ కాలువ తవ్వేటప్పుడు పాల్గొన్న ఇతర కూలీలకు ప్రతి సాయంకాలం అనుముల బస్తాలో గుప్పెడు నాణేలు కలిపి, దోసిళ్ళతో కొలిచి పోసేవారట. అదృష్ట మున్నవారికి గింజలతోపాటు నాణేలు దొరికేవి. ఇలా కూలికి గింజల్ని (ధాన్యాన్ని) ఇవ్వడాన్ని కన్నడ భాషలో 'కూలికాళు' అనేవాళ్లు*.

***కుంటలు-కాల్వలు*** :- 'కుంట'లంటే చిన్నపాటి చెరువులు. చిన్న చిన్న వంక(వాగు)లకు అడ్డంగా కట్ట కట్టి వీటిని నిర్మిస్తారు. వీటిలో నీళ్లు చాలా తక్కువ ప్రమాణంలో ఉంటాయి. చెరువులు వీటికంటే పెద్దవి. చిన్నపాటి 'ఆనకట్ట'లని చెప్పొచ్చు. వీటిని పెద్దపెద్ద వాగులకు లేదా చిన్న నదులకు అడ్డం కట్టి నిర్మిస్తారు. అనంతపురం జిల్లాలోని బుక్కపట్నం, ధర్మవరం, చెరువులను చిత్రావతీ నదికి అడ్డంగా బుక్కరాయల కాలంలో నిర్మించారు. రాయలసీమలో కుంటగాని, చెరువుగాని లేని గ్రామం లేదు. అవి నేటికీ వ్యవసాయానికి ఉపయోగపడుతున్నాయి.

ఆముక్తమాల్యదలో కుంటల ప్రసక్తి వస్తుంది. "రాజ్య విస్తీర్ణం ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువ ఆదాయం వస్తుంది. ఎంత చిన్న భూభాగమైనా కుంటలు, (ఊట)కాలువలు తవ్వించి, పేదలకు ఆ భూమిని అరకోరుకు ('కోరు' అంటే పంటలో భూస్వామికి కొంత వాటా ఇవ్వటం) ఇస్తే, దానివల్ల రాజుకు పుణ్యం, ఆదాయం రెండూ సిద్ధిస్తాయి*

---

* ఈనమాచారం డంబల బసప్ప కరియప్పది (వయస్సు 80 సంవత్సరాలు). ఇతనిది హొసకనకాపుర గ్రామం, కొప్పళ్ జిల్లా.

* He gave the people the lands which are irrigated by this water; free for nine years until they had made their improvements - F.E. P. 365.

"దేశవైశాల్య మర్థసిద్ధికిని మూల
మిల యొకింతైన కుంటె కాల్వలు రచించి,
నయము పేదకు నరి కోరునను నొనంగి
ప్రబల జేసిన నర్థ ధర్మములు పెరుగు".16

అని ఆ విజయనగర రాజులు నీటి విలువను చక్కగా గ్రహించినట్లు బోధపడుతోంది. ఏ మాత్రం చిన్న అవకాశమున్నా నీటి వనరుల్ని సద్వినియోగం చేసుకోవడంలో అశ్రద్ధ చూపినట్లు కనిపించదు. విజయనగరరాజ్యం పతనమైన తర్వాత ఈ ప్రాంతాలమీద పెత్తనం సంపాదించిన బ్రిటీష్ అధికారులు ఇక్కడి నీటిపారుదల ఏర్పాట్లను గమనించి ఆశ్చర్యపడ్డారట. "During Vijayanagar period, where ever feasible without missing any site, tanks were built, be it big or small one. So intensive and extensive were the efforts to build tanks for irrigation purposes during the Vijayanagar days, that the British Engineers, who happened to be incharge of management of those old irrigation works subsequently after the Vijayanagar rule ended, had to go on record expressing their arrangement and at the same time with due appreciation at the way the original builders exploited every source of water to great advantage, all for the welfare of the people and the kingdom".17

పాండురంగమహాత్మ్యంలో కాలువల ప్రసక్తి వస్తుంది. కాశీపురంలో పంటకాలువల్లో నీళ్లు చాలా సారవంతంగా ఉంటాయి. ఎందుకంటే అక్కడ చెరకుతోటల చుట్టూ ఎత్తైన కొబ్బరిచెట్లు ఉన్నాయి. అప్పుడప్పుడు గాలికి కాయలు రాలి, చెరకుగడల మీద పడుతుంటాయి. అప్పుడు వాటిలోనుంచి రసం కారి కాలువలల్లో

16. ఆము. 4-236. ఈ పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ 'వేదం' వారు 'అరిన్, కోరునన్' అంటే ధన రూపమైన, ధాన్యరూపమైన వస్తువులకు అని చెప్పారు. కాని, ఈ సందర్భంలో 'అరికోరునన్' అంటే 'సగంకోరుకే' అనే అర్థమే సమంజసంగా కనిపిస్తోంది.
17. Vijayanagar Herritage, p. 62.

కలుస్తుంది. అలాగే 'రసదాడి' అనే అరటిపండ్లను ఉడుతలు కొట్టినప్పుడు కారేరసం, బాగా పండిన పనసపండ్లు పగిలి అందులో నుంచి కారే రసం, తీయమామిడిపండ్లను చిలుకలు కొట్టినప్పుడు వాటిలో నుంచి కారే రసం మొదలైనవన్నీ కలిసి ఆ పురంలోని పంటకాలువలల్లో కలుస్తాయట. అలా సారవంతమైన ఆ భూములు ఏడాదికి మూడు పంటలు పండేవట.18

***పొలాలు - తోటలు*** :- పొలాలు విస్తీర్ణంలో ఎక్కువగాను, తోటలు తక్కువగాను ఉంటాయి. పొలాలు వర్షాధారంగా పండేవిగా ఉండొచ్చు. చెరువులు, బావులు, కాలువలు మొదలైన వాటి ద్వారా నీటి సౌకర్యం కలిగినవిగాను ఉండొచ్చు. వర్షాధారంగా పండేవి మెట్టపొలాలనీ (Dry lands), నీటి సౌకర్యం ఉండేవి మాగాణి (తరి, నీరావరి) పొలాలనీ (Wet lands) అంటారు. తోటలు సాధారణంగా గ్రామానికి ఆనుకుని కొద్దిపాటి విస్తీర్ణం కలిగి ఉంటాయి. ఆయా గ్రామాలు కొత్తగా నిర్మించినప్పుడు అవి సాగులోకి వస్తాయి. జనసంఖ్య పెరిగే కొద్దీ బీళ్లుగా ఉన్న భూములు సాగులోకి వచ్చి పొలాలు అవుతాయి. మెట్టపొలాలు సంవత్సరానికి ఒక పంట మాత్రమే ఇస్తాయి. మాగాణి పొలాలు రెండు పంటలు ఇస్తాయి.

సాధారణంగా వరి, శనగ, పత్తి, జొన్న మొదలైనవి మెట్టపొలాల్లో అయినా, మాగాణి పొలాల్లో అయినా పండుతాయి. అరటి, చెరుకు, కాయగూరలు, పూలమొక్కలు మొదలైనవి తోటల్లో పండుతాయి. కొన్నిచోట్ల దీనికి భిన్నంగాను ఉండొచ్చు. వరిచేను, పత్తిచేను అంటాం. అలాగే అరటితోట, చెరుకుతోట అంటాం.

'విల్లిపుత్తూరులో వరిచేలు విస్తారంగా ఉండేవి. ఎన్నోరకాల వరి పంటను పండిస్తారు. 'తీగెమల్లెలు, ఖర్జూరాలు, పుష్ప మంజరులు, మామిడి గుత్తులు, కునుమాలు, సంపెంగలు, పచ్చగన్నేరు, పాళలు,

---

18. పాండు. 1-118.

రాజనాలు అనే పేర్లున్న వరి రకాలు అక్కడ పండుతాయి. వరిచేలల్లో కొంగలు గుంపులు గుంపులుగా (పురుగులు, నత్తలు, కప్పలు మొదలైన వాటికోసం) ఉండేవట'.19

వరిచేలు గింజ పాలు పోసుకునేటప్పుడు గిజిగాళ్లు గుంపులు గుంపులుగా వాలి, వాటిని తాగి వెన్నులన్నీ లొత్తలయ్యేటట్లు చేస్తుంటాయి. అవి వాలకుండా రైతుల అమ్మాయిలు డబ్బాలతో శబ్దం చేస్తూ, 'వడిసె'లతో రాళ్లను విసరుతూ కావలా కాస్తుంటారు. వీళ్లని కావ్యాల్లో 'శాలిగోపిక'లని పేర్కొన్నారు. ఆ వరిమళ్ల కాలువగట్లల్లో రాత్రిళ్లు బాతులు నిద్రపోతుంటాయి. తలను రెక్కల్లో మడిచి పెట్టుకుని పిండిన బట్టల ముద్దలాగా ఉన్నాయట. తెల్లవారుజామున అటుగా వెళ్ళిన ఆరెకులు (కావలా కాసేవాళ్లు) వాటిని చూసి, అవి అంతకు ముందు స్నానం చేసి వెళ్ళిన బ్రాహ్మణుల మడుగు ధోవతులనుకుని, వాటిని తీసుకునేందుకు వెళ్ళగా, ఆ బాతులు బుడుక్కున నీటిలోకి జారుకున్నాయట. అది చూసి పక్కనే చేలకు కావలా కాస్తున్న శాలిగోపికలు పగలబడి నవ్వుతున్నారట"20.

"వరిచేలు వెన్నులు ముదిరిన తర్వాత చిలుకలు వాటిని ముక్కుతో విరిచి తీసుకునిపోతాయి. వాటిని బెదరగొట్టడానికి శాలిగోపికలు ఎంతో అవస్థపడతారు. డబ్బాల శబ్దానికి అవి బెదరి పోకుండా మొండిగా అలాగే ఉన్నప్పుడు కలువ మొగ్గలతో విసరుతారట. అంత దూరం విసరలేకపోవడం వల్ల అవి మధ్యలోనే పడతాయట. అప్పుడు చేసేదిలేక చేతులతో చప్పట్లు చరుస్తారట. వాళ్లు అంత పనిలో ఉండి కూడా బాటసారులు దారి అడిగితే, తప్పుదారి చెప్పి, వాళ్లని ఆట పట్టిస్తారట".21

19. ఆము. 1-66.
20. అదే. 1-65.
21. అదే. 4-163.

మాగాణి పొలాలకు నీళ్లు సక్రమంగా పారుతున్నాయో, లేదో చూసుకుంటూ ఉండాలి. లేకపోతే ఎండిపోయే ప్రమాదముంది. 'పై పరామరిక, చొప్పడమి పక్వముదప్పి, పండబారిన పొలమెండ బారె'.22 నగరానికి వెలుపల ఉండే తోటపొలాల్ని గురించి, అందులో పోకతోటల గురించి విదేశీయులు తమ రాతల్లో పొందుపరిచారు.

"Outside these two cities (Vijayanagar & Anegundi) are fields and places richly cultivated with wheat and gram and rice and millet; for this last is the grain which is most consumed in the land; and next to it betel (betre) which is a thing that in the greater part of the country, they always eat and carry in the mouth".23

***దేవాలయాలు*** :- జనజీవనంలో దేవాలయాలకు మహత్తరమైన స్థానముంది. ఆదిమానవుడి బుర్రలో పొటమరించిన 'జ్ఞానం' యొక్క మొట్టమొదటి రూపకల్పనే 'దేవాలయం' అనడంలో తప్పులేదేమో. ఒకప్పుడు ప్రజల్ని శాసించేవాడు రాజైతే, ఆ రాజును శాసించేవాడు గురువైతే, ఆ గురువుల కార్యాలయాలుగా ఈ దేవాలయాలు విలసిల్లాయి. ఇవి ఆనాడు బహుళార్థ సాధకాలుగా సమాజానికి ఉపయోగపడ్డాయి. భగవంతుని నిలయాలుగానే కాకుండా, విద్యాసంస్థలుగాను, కల్యాణమంటపాలుగాను, ఆధ్యాత్మిక బోధనాలయాలుగాను, కోశాగారాలుగాను, శిల్పకళా క్షేత్రాలుగాను, ప్రవాసులకు విశ్రాంతి మందిరాలుగాను, పురాణకథ, నాట్య, నాటక శాలలుగాను వర్ధిల్లాయి. ఒక రాజును ఓడించి మరొక రాజు రాజ్యాన్ని ఆక్రమించుకున్నా, అతను ఈ దేవాలయాల జోలికి వెళ్ళేవాడు కాదు. పైగా తనకు జయం ప్రసాదించినందుకు కృతజ్ఞతా పూర్వకంగా ఆ దేవాలయానికి తన వంతు ధన, కనక, వస్తు, వాహనాలు మొదలైన వాటిని సమర్పించుకునేవాడు. ఇలా ఆలయసంపత్తి విపరీతంగా

22. మను. 3-129.
23. F.E. P. 366, (Chronicels of Fernao nuniz).

పెరిగిపోతుండేది. రాజు నుంచి ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వయం ప్రతిపత్తి కలిగినవి (Autonomous boides)గా ఇవి నిర్వహించబడుతూ ఉండేవి. దాదాపు 12వ శతాబ్దం ఆరంభం వరకు మనదేశంలో మహమ్మదీయుల ప్రవేశం జరగనంతవరకూ ఈ విధానం కొనసాగింది. అపార ధనరాశులకు నిలయాలని, ఈ దేవాలయాల్ని దోచుకోవాలనే ప్రధాన ధ్యేయంగా మహమ్మదీయులు దాడులు నిర్వహించారు. వీటితో ఈ దేవాలయాలకు కష్ట దశ ప్రారంభమైంది. అయినా తర్వాతి కాలంలో మెల్లగా పుంజుకున్నాయి. విజయనగర రాజుల కాలంలో ఇవి ఉచ్ఛదశకు చేరుకున్నాయి. సంగమ, సాళువ వంశీయుల కాలంలో శైవ దేవాలయాలు అభివృద్ధిచెందగా, తుళువ, ఆర్వీటి వంశీయుల కాలంలో వైష్ణవ దేవాలయాలు పుట్టుకువచ్చాయి. వీటి నిర్మాణానికి రాజులు అపారమైన ధనాన్ని వ్యయం చేసేవారు. శిల్పకళా నిలయాలుగాను, కన్నులు మిరుమిట్లుగొలిపే అపర వైజయంతాలుగాను వీటిని తీర్చిదిద్దారు. అందుకే కాబోలు 'రాజుల సొమ్ము రాళ్లపాలు' అనే సామెత పుట్టింది. దేవాలయ నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక వాస్తుశాస్త్రం ఉంది. ఆలయానికి గర్భగుడి ప్రధానమైంది. దానికి ఎదురుగా ధ్వజస్తంభం ఉంటుంది. దానికి గంటలు వేలాడదీయబడి ఉంటాయి. చుట్టూ ఎత్తైన ప్రాకారం, దాని వెంబడి చెట్లు, ముఖ్యంగా పూలచెట్లు-వాటి మీద రాత్రిళ్ల పక్షులు నిద్రిస్తుంటాయి. శ్రీవిల్లి పుత్తూరులో మన్నారు కృష్ణస్వామి ఆలయం ఉంది. రాత్రిళ్ల మలయమారుతం ఆ గుడి ధ్వజస్తంభం చిరుగంటల్ని కదలిస్తుంది. ఆ గంటలు సన్నగా మోగుతాయి. ఆ శబ్దానికి పక్షులు మేల్కొని అరుస్తాయి. అది విని ప్రజలు తెల్లవారిందేమో! అని భ్రమ పడతారట".24

దేవాలయానికి ధర్మకర్తల సంఘం ఉంటుంది. అది ఆలయ నిర్వహణ బాధ్యత వహిస్తూ ఉంటుంది. ప్రధాన పూజారి, పూజారులు, మాలా

---

24. ఆము. 1-74.

కారులు, వంటవాళ్లు, దేవదాసీలు, వాద్యబృందం, కాపాలాదారులు మొదలైనవాళ్లు ఆలయ సిబ్బంది. స్వామికి ముప్పూటా నైవేద్యం, బాజాభజంత్రీలతోపాటు సమర్పిస్తారు. ఆగమ శాస్త్రానుసారంగా పూజలు, బ్రహ్మోత్సవాలు మొదలైనవి నిర్వహిస్తారు.

మన్నారు కృష్ణస్వామి ఆలయంలో సాయంకాలపువేళ సన్నాయి, కాహాల(కాళె)ల్ని ఊదుతారు. భేరీల్ని వాయిస్తారు. ఆ శబ్దానికి పక్కనే ఉన్న ఉపవనాల్లోని సరస్సుల్లో విహరించే హంసలు 'పటపట'మని రెక్కలు కొడుతూ 'క్రేం, క్రేం' అని అరుస్తూ తమతమ గూళ్లు చేరుకుంటాయి. .ఆ శబ్దాలు దగ్గర ఉండే పొదరిండ్లలో ప్రతి ధ్వనిస్తాయి. శబ్దాలు విన్నవాళ్లు అవి గుళ్ళో వాయించే మద్దెల, డోలు మొదలైన వాటి ప్రతిధ్వనులేమో! అని అనుకుంటారట".25

పూజారులు దేవునికి అర్చన చేస్తారు. మాలాకారులు కోవెల తోటలోని రకరకాల పూలతో దేవునికి వివిధ రకాల మాలలు కడతారు. వంటలు చేసేవాళ్లు నైవేద్యం వండుతారు. దేవదాసీలు భగవంతుడి సన్నిధిలో నాట్యం చేస్తారు. ఆ నాట్యం భగవంతుడి లీలల్ని, ముఖ్యంగా దశావతారాల్ని వర్ణించేదిగా ఉంటుంది. వాళ్ల నాట్యం చేసేటప్పుడు అందుకు అనుగుణమైన వేషం ధరిస్తారు. విల్లి పుత్తూరు మన్నారు కృష్ణస్వామికి మెడలో తులసీమాలలు వేస్తారు. పిండి వంటలతో నైవేద్యం పెడతారు. గుడిలో నాట్యం చేసే దేవదాసీలు వాలుకొప్పులు చుట్టి, చెంగలువ దండలు ముడుచుకుంటారు. ఆ స్వామి గుడిమీదుగా వీచే పిల్లతెమ్మెరలు తులసి మాలల మీదుగా, నైవేద్యం మీదుగా, చెంగలువల మీదుగా వీచి, భక్తులకు శుభాన్ని కలిగిస్తాయట".26

ఆలయంలో ఇంతకు ముందు చెప్పిన సిబ్బందితోపాటు ఏనుగులు, గుర్రాలు, జింకలు, దుప్పులు, కస్తూరి మృగాలు, ఆవులు మొదలైన

25. ఆము. 1-72.
26 అదే. 1-73.

సాధుజంతువుల్ని కూడా పోషిస్తారు. వీటికి ఎవ్వరూ అపకారం చేయకుండా, ఎంతో అపురూపంగా చూసుకుంటారు. "దేవళం పక్క ఇళ్ల ముంగిళ్లలో వడ్లు ఎండబోసుకుంటారు. ఆ ధాన్యానికి ద్రావిడ కన్యలు కావలా కాస్తుంటారు. అప్పుడప్పుడు గుడిలోని దుప్పిపిల్ల వచ్చి ఆ గింజల్ని బొక్కుతుంది. అప్పుడా కన్నెలు దాన్ని చేత్తో కొడితే దెబ్బ తగులుతుందేమో! అని చెంగలువ దండతో సున్నితంగా అదలిస్తారట. ఆ దండల్ని పల్లెటూరి స్త్రీలు తట్టల (బుట్టలు) నిండా తెచ్చి అమ్మడానికని అప్పుడే దించారట."

> "కలమపు టెండుగుల్ ద్రవిడ కన్యలు ముంగిటగాచుచుండి, త
> జల రుహనాభగేహ రురు శాబము సారెకు బొక్కులాడ, గొం
> డ్లేల వయి కమ్మ గ్రామ్య తరుణీ తతి డించిన పేవగంపలం
> దలమగుచున్న, చెంగలువ దండల దోలుదు రవ్వు రంబునన్".
> (ఆము.1-75)

దేవాలయ పాలన మిగతా పరిపాలన లాంటిది కాదు. పూర్తిగా భక్తి దైవ చింతన, పాపభీతి వంటి విశ్వాసాల మీద ఆధారపడి ఉంటుంది. దొంగలెక్కలకుగాని, మోసానికిగాని ఇక్కడ తావుండదు. దేవుని సొమ్ము తినేవాడు ఎప్పటికీ బాగుపడడని గట్టిగా నమ్ముతారు.

కోట్లాది రూపాయల వ్యవహారం భగవంతుడి మీద విశ్వాసంతోనే సాగుతుంటుంది. ఈ అభిప్రాయం ఎన్ని తరాలు మారినా, నేటికీ పూర్తిగా మారలేదు. ప్రభుత్వ ఆధీనంలోకి రావాల్సినదైనా ఆలయ నిర్వహణ మాత్రం నాటికీ, నేటికీ స్వయం ప్రతిపత్తిగానే సాగుతోంది.

యామునాచార్యులు తన కుమారునికి రాజనీతిని ఉపదేశిస్తూ ఇలా అంటాడు. 'రాజ్యానికి ఆదాయాన్ని వసూలు చేసే అధికారికే ఆలయ నిర్వహణాధికారం కూడా ఇవ్వొద్దు. ఎందుకంటే అతను అవినీతికి పాల్పడి, ప్రభుత్వధనం కాజేసి, ఆ లోటును పూడ్చడానికి ఆలయ ధనాన్ని ఉపయోగించే ప్రమాదముంది. దేవునిసొమ్ము ఖజానాకు చేరితే రాజుకు మంచిదికాదు. కాబట్టి ఆ అధికారం ప్రత్యేకంగా వేరే

వ్యక్తికి ఇవ్వ్వ. అప్పుడు అతనుకూడా దేవనిసొమ్ము తిన్నాడనుకో, ఆ పావం అతనే అనుభవిస్తాడు. రాజుకు సంబంధం ఉండదు."

> "అయతి కాని కీకు మమరాలయ ముఖ్యము, లాతదర తృ
> షాయతుడై నిజోర్వినగు నషికి దదనముం దరల్చి, రౌ
> జాయతనంబు జేర్చు, మఱి యెటిదీపథ్యము, కాన నొంటిగా
> డేయధికారి గావలయు, నించుకొతిన్న ను వాడె రూపఱున్"
>
> (ఆము. 4-218)

***జలయంత్రాలు*** :- నన్నని గొట్టాలు అమర్చిన లోహ స్తంభాన్ని నీటి తొట్టెలో బిగిస్తారు. ఆ గొట్టాల ద్వారా యంత్రం సాయంతో చిమ్మన గ్రోవిలాగా నీటిని వెదజల్లుతారు. ఈనాడు పార్కుల్లోను, వివాహాది శుభకార్యాల్లోను ఇలాంటి ఏర్పాట్లను చూస్తున్నాం. వీటిని 'Fountains' అని అంటున్నాం. వీటి ప్రసక్తి వసుచరిత్రలో మూడు సందర్భాల్లో వస్తుంది. జలసూత్రాలని, జలసూత్ర స్తంభాలని, అంబు యంత్రాలని వీటిని పేర్కోవడం జరిగింది. ఇవి ఉపవనాల్లో ఉంటాయి.

(1) ఆ ఉపవనంలో రకరకాలైన పూలపొదలు ఉన్నాయి. అందులో గొజ్జంగి (గులాబీ) పొదల నుంచి ప్రవించిన నీళ్లు సన్నగా ఏకమై జాలుగా ఏర్పడి, అక్కడ రాలిపడిన కర్పూరపు పుప్పొడిని ముంచివేసి, ఆ తర్వాత నీటి తొట్టెలు నిండి, వాటిల్లో అమర్చిన జల సూత్రాల్లోకి (కారంజాల్లోకి) పాకి, తుంపర్లుగా వెదజల్లబడుతోంది. అది మంచులాగా ఉంది".27

(2) ఆ ఉపవనంలో మరోచోట ఒక గుజ్జు నారికేళ వృక్షం (గున్న టెంకాయచెట్టు) ఉందట. దాని నిండా కాయలున్నాయి. వాటిని అక్కడక్కడా ఉదతలు కొట్టాయి. అందులో నుంచి నీళ్లు కారుతున్నాయి. అది చూడడానికి ఒక జలయంత్రం లాగా ఉంది. ఆ చెట్టు చుట్టూ ఉన్న పాదు నీటితొట్టె లాగా, కాయల్లోనుంచి ప్రవించే నీళ్లు కారంజాల్లో నుంచి చిమ్మే నీళ్లలాగా ఉన్నాయట.28

---

27. వసు. 1-139.
28. అదే. 1-160.

గిరికాదేవి నల్లని నూగారు, నల్లని నీలమణులు పొదిగించిన జలయంత్రం లాగా ఉందట. జలయంత్రానికి కావాల్సిన ఇతర హంగులు 'నీటితొట్టె, నీటిని ఎగజిమ్మే పూలగుత్తుల వంటి కాయలు' ఆమె పొక్కిలి తొట్టెగాను, స్తనాలు పూలగుత్తులుగాను భావించడం జరిగింది.29

పై నన్నిపేశాల్ని గమనిస్తే జలయంత్రాల స్వరూపం గోచరిస్తోంది. ఆ సందర్భంలో చెప్పిన మకరంద ప్రవాహాల్ని, పుప్పొడి తిప్పల్ని మొదలైన వాటిని ఒకవేళ అతిశయోక్తులుగా కొట్టిపారవేసినా, ఈ జలయంత్రాల్ని అభూత కల్పనలుగా తృణీకరించలేం. శొంఠి భద్రాద్రి రామశాస్త్రి గారు తమ వసుచరిత్ర వ్యాఖ్యానంలో ఈ జలయంత్రాల్ని 'కారంజా'లని చెప్పారు. కర్ణాటకలో తుంగభద్ర ఆనకట్ట, కృష్ణరాజసాగర్ మొదలైన ప్రాంతాల్లో 'Fountain' అనే అర్థంలో 'కారంజా'లని ఇప్పటికీ వ్యవహరిస్తారు.

స్నానశాలలు :- అష్టవిధ భోగాల్లో 'స్నానం' ఒకటిగా ఆనాటి ప్రజలు గుర్తించారు. అందుకు తగిన ఏర్పాట్లు ఇంటింటా ఉండేవి. నదులు లేదా వాగులు అనుకూలంగా ఉంటే, స్నానానికి అక్కడికే వెళ్ళేవాళ్లు. వాతావరణ కాలుష్యం లేని ఆరోజుల్లో నదులు, వాగులు ఎంతో పవిత్రంగా భావించబడేవి.

శనివారం అభ్యంగన స్నానం వైష్ణవులకు తప్పనిసరి. చేతిలో ఇప్ప పిండి ముద్దను కుదురుగా చేసుకుని, అరటి దొప్పల్లో నూనె పోసుకుని, ఉతికిన బట్టలు తీసుకుని నదికి వెళ్ళేవారట.

> 'కదళి గర్భిర పుష్ప పుటికాచ్ఛుట జేతుల నిప్ప పిండిపై,
> గుదురుగ నిల్పి, యొప్పుగలి గూనల నూనియ నించి, త్రాట ము
> న్నుదికిన శాటి[illegible]వేల, నది నొక్కట గ్రుంకిడి వత్తు రెందఱే
> వదలక యాతనింట శనివారమునక్ పరదేశి వైష్ణవుల్.'
>
> (అము. 1-83).

---

29. వసు. 2-40.

వసువు, ఉసిరికపొడి, పెసరపిండి కలిపి నలుగుపిండిగా వాడేవాళ్ళు (ఆము. 5-89).

రాజులు, ధనవంతులు సుగంధద్రవ్యాలతో తలంటుకునేవాళ్ళు (మను. 5-57).

సామాన్యులు మంచినూనె (నువ్వులనూనె) వాడేవాళ్ళు (పాండు. 2-19).

మురికి బాగా పోవడానికి కుంకుడుకాయల రసం వాడేవాళ్ళు (ఆము. 4-157).

స్నానం తర్వాత వెంట్రుకలకు స్త్రీ, పురుషులు కాలాగరుధూపం మొదలైన సుగంధ ద్రవ్యాలతో సంస్కారం చేసేవాళ్ళు (మను. 6-04.)

కార్యార్థం పొరుగూళ్ళకు వెళ్ళిన వాళ్ళకోసం, పూటకూళ్లిండ్లతో పాటు, క్షౌరశాలలు, వేడినీళ్ల అంగళ్లుండేవి.

> 'కూర్చంబు గొరిగించుకొని యుష్ణతోయంపు
> టంగడి దలగరుగారు తడవు' ( ఆము-7-07.)

దబ్బులు తీనుకుని, స్నానంతో పాటు అంగమర్దనం కూడా చేసేవాళ్ళు.

> 'తలకడు గంగమర్దనము ధౌతవటావరణంబు, సంస్కృతో
> జ్జ్వల కలమాన్న భోజనము, చందనచర్చ, ప్రసూనదామకం
> బులు, గవురంపు వీడ్యమును, భూషణవంత్తులు గల్గి నిచ్చలుం
> బులు గదుగంగబద్ధ నును ముత్యము బోలుచు వాలుచుంబురిన్'
>
> (పాండు. 3-09)

ఆకాశగమనంలో మంజువాణికి అధిష్ఠాన నగరంలో మిగిలిన వాటితో పాటు స్నానశాల కూడా కనిపించిందట.

> 'తటుకు వసింది యోవరులు దంతపుజావడు, లర్చనాగృహం
> బులు, గుడి నీరు మేడలును, భోజనశాలలు, గెంపుటోడు వి
> శ్లల గరిడీలు, శీతలశిలాతలము, ల్బువవేశ్వరంబు లు
> జ్జ్వల జలయంత్ర ధామములు, నజ్జలు, దాటి ధరావతీర్ణనై'
>
> (వసు.4-72)

ముఖ్యపట్టణాలల్లో ఇటువంటి సార్వజనిక స్నానశాలలు (Public baths) ఉండేవి. హంపీ శిథిలాల్లో విశాలమైన స్నానశాలలు బయల్పడ్డాయి. వీటికి రాతికాలువల ద్వారా తుంగభద్రానది నుంచి నేరుగా నీళ్లు వచ్చే ఏర్పాట్లు ఉండేవి. ప్రతి ముఖ్యమైన ఇంటికి కూడా ఇటువంటి రాతి కాలువల ద్వారా నీటి సరఫరా అమర్చిన స్నానశాలలు హంపీ శిథిలాల్లో చూడొచ్చు. పోర్చుగీస్ ఇంజనీర్లతో కృష్ణరాయలు వీటిని నిర్మించినట్లు విదేశీయులు చెప్పి ఉన్నారు. ఈ స్నానశాలల్ని 'యౌతుఖానా'లని అనేవాళ్లు.

గరిడీశాలలు :- 'తాలింఖానా'లనీ, 'సాముగరిడీలనీ', 'వ్యాయామ శాల'లనీ వీటిని వ్యవహరించేవాళ్లు. మల్లయుద్ధం (కుస్తీ) 'నంగడం, గర్దన్' మొదలైన సాధనాలతో ఇక్కడ సాధన చేసేవాళ్లు. ప్రతి గ్రామం లోను ఇవి ఉండేవి. యువకులు ఇక్కడ సాధన చేసి యోధులుగా తయారయ్యేవాళ్లు. యుద్ధవిద్యలకు ఇది పుట్టినిల్లు.

ఆకాశగమనంలో వస్తున్న మంజువాణికి అధిష్ఠాన నగరంలో మిగిలిన వాటితోపాటు 'కెంపుటోడు బిళ్లల గరిడీలు' కూడా కనిపించాయట (వను. 4-72). ఈ గరడీల పైకప్పు చాలా ఎత్తుగా ఎర్రని పెంకుతో నిర్మించబడిందట.

సాధనచేసేటప్పుడు మెత్తగా ఉండడానికి నేలమీద ఎర్రని మట్టిని పరచేవాళ్లట. 'తిరగలి' లాగా గుండ్రంగా ఉండి, పట్టుకోవడానికి అనుకూలంగా నడుమ బెజ్జం వేసి వంచిన ఇనుప ఊచ బిగించబడిన రాయిని 'నంగడం' అనేవాళ్లు. అలాంటి రెండు నంగడాల్ని రెండు చేతులతో పట్టుకుని ఒకటి పైకి, మరొకటి కిందికి ఉండేటట్లు సాధన చేసేవాళ్లు. దీన్ని ఆధారం చేసుకుని కవి చంద్రాస్తమయ, సూర్యోదయ వర్ణనలు ఇలా చేశాడు. 'ఉదయమైంది. చంద్రుడు పశ్చిమాద్రిలో కుంకాడు. సూర్యుడు ఉదయాద్రి మీద వస్తున్నాడు. ఆకాశమంతా సంధ్యారుణిమతో ఎర్రగా ఉంది. ఆ ఎరుపు గరిడీశాలలో పరచిన ఎర్రమట్టి లాగా, సూర్యచంద్రులు రెండు

సంగడాల్లాగా, కాలవురుమడు వ్యాయామం చేసే వ్యక్తిలాగా పోల్చి చెప్పడం చూస్తే, అనాడు వీటికున్న ప్రాధాన్యం తెలుస్తుంది.

'ఉరు సంధ్యాతప శోణ మృత్కలితమై యొప్పారు బ్రహ్మాండ, మ
న్గరిడిన్ కాలవు హాంతకారు చరమాగ స్కంధముంజేర్చు, ని
ప్పురవున్ సంగడమో యనన్ శశి డిగెన్ ప్రాగ్భూమి భృత్కేతవి
తర బాహాగ్రవు సంగడంబనగ, మార్తాండుండు దోచెన్ దివిన్
(మను. 3-59)

మొన్న మొన్నటి వరకు 'అనెగొంది'లో 'తాలింఖానా' ఉండేది. అక్కడ గోతం నిండా రాళ్లు నింపి, వేలాడదీసి, దాన్ని పిడికిలితో గుద్దేవాళ్లు. ఈ విషయం స్వరోచి వృత్తాంతంలో చెప్పబడింది.

'గ్రుద్దున్ గోత్రాచలంబుల్ గులగులలయిపో గోతముల్ గ్రుద్దులిలన్
(మను. 4-08)

వరూధిని తన వివరాల్ని ప్రవరుడికి తెలిపే ఘట్టంలో తన నాట్యకళా నైపుణ్యాన్ని త్రిమూర్తుల కొలువుకూటాల్లో ప్రదర్శిస్తానంటూ-

'పద్మ సంభవ వైకుంఠ భర్గ సభలు, సాముగరిడీలు మాకు గోత్రా మహేంద్ర!'
(మను. 2-43)

అని అంటుంది. సందర్భంగాని చోట ఈ పదం ప్రసక్తమైందంటే వీటికి అనాడు ఎంత ప్రచారముండేదో ఊహించుకోవచ్చు. కృష్ణదేవరాయలు వేకువజామునే సాముగరిడీలు, గుర్రపుస్వారీ చేసేవాడట. "This king is accustomed every day....till dawn." (F.E. narratives of paes. P. 249-50.)

రంగస్థలం-నాటకాలు :- లలితకళలకు నిలయమైన రాయలకాలం నాటకాదులకు పెట్టింది పేరు. నటీనటులకు, నాట్యగత్తెలకు విహార భూమి అయిన విద్యానగరంలో రంగస్థలాలకు నిర్విరామంగా అలంకరణలు సాగి ఉంటాయనుకోవడంలో సందేహం లేదు.

"రాయలు నిర్మించిన భువనవిజయ సభాప్రాంగణము కేవలము కవిత్వ పాండిత్యాదులకు మాత్రమే పరిమితముగాక కళలకు కూడా నిలయమైయుండేది. సంగీత నృత్యాలకు రాయలు ఎంతో దోహదమిచ్చెను. వీధినాటకములు కూడ ఉండెను. తర్వాతి కాలంలో తంజావూరిలో విశేష ప్రచారానికి వచ్చిన యక్షగానములు ఈ కాలమున (ప్రబంధ కాలమున) పైకి వచ్చుచుండినవి. "తాయికొండనాటక'మను దానిని ఆడినందుకు చాగయ్యకుమారుడు నట్టువ నాగయ్యకు రాయలిచ్చిన శాసనము దొరికి యున్నది. క్రీ.శ.1514లోని పోతవరపు నట్టువ తిమ్మయ్య కూతురు ఒక పాత్రియట. 'గంగావతరణ'మనబడు మరియొక నాటకము గూడ నాడినట్లు తెలియుచున్నది. ఈ నాటకములేగాక, ఆ నాడు సంస్కృత నాటకములు కూడ ఆడుచుండిరి. నాటకశాలలు కూడ ప్రత్యేకముగా నుండెనని ప్రబంధముల వలన తెలియుచున్నది. ఈ నాటకములాడు సంగీత సంఘములకు 'మేళము'లని పేరు. 'భాగవత మేళము'లని వసంతోత్సవ బ్రహ్మోత్సవాది కాలములలో నాడుచుండిరి. జన సామాన్యము కొరకేగాక ప్రభువుల, రాణివాసముల కోర్కెల మీద అంతఃపుర ప్రాంగణములో కూడ నాడువారట....బొమ్మలాట విరూపాక్షయ్య కుమారుడు బొమ్మలాట కాళయ్య రాయలవారికి చాల అప్తుడు".30

సంపన్నులు మేడల పైభాగాన నాటకశాలలు ఏర్పాటు చేసుకునేవాళ్లు. ముఖ్యంగా విలాసవతులైన వేశ్యలు విధిగా ఈ ఏర్పాట్లు చేసుకునేవాళ్లు. "చిలుకల కొల్కి కల్కియొక చేడియ నాటకశాల మేడపై నిలుపున నాడుచుండి...." (మను. 5-63) అని ఈ విషయం ప్రస్తావించబడింది.

రంగస్థలం పైకి ఒక పాత్ర ప్రవేశించాలంటే నాటకలక్షణాల ప్రకారం కొన్ని నియమాలున్నాయి. వందిమాగధులు సారంగరాగంలో పాట

30. ఆము. పీఠిక. సంజీవనీ వ్యాఖ్య. వే.వెం.శా. పు. 29.

పాడుతుండగా కథా సందర్భాన్ని బట్టి వాళ్ల పాటలోగాని, లేదా మాటలోగాని ఏదైనా అంశాన్ని తనకు వర్తించుకుని పాత్ర ప్రవేశిస్తుంది. ఒక్కోసారి సూత్రధారుని ప్రత్యక్ష భాషణాన్ని బట్టి కూడా పాత్ర ప్రవేశం జరుగుతుంది. వేదిక మీద ఉండే నల్లని తెరను తొలగించుకుని సంగీతానుగుణమైన నడకతో పాత్ర ప్రవేశిస్తుంది. తన నర్మసచివుని మాటవిని చెలికత్తెల మధ్య ఉండే గిరిక వద్దకు, ఆమె అందచందాల్ని పొదలమాటు నుంచి చూస్తున్న వసురాజు ప్రవేశించడం పైన చెప్పిన నాటక లక్షణానికి అనుగుణంగా ఉంది.31

ఇలాగే నాట్యకత్తె (శైలూషి) రంగప్రవేశం చేయడానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. ముందుగా రంగస్థలం మీద ఇద్దరు చెరొక వైపున నల్లని తెరను అడ్డంగా పట్టుకుని ఉంటారు. తాళమేళాలతో పాట పాడుతుండగా నాట్యకత్తె వచ్చి తెరచాటున నిలబడి పాటకు అనుగుణంగా అడుగువేస్తుంది. తర్వాత మెల్లగా ఆ తెరను లయానుగుణంగా పైనుంచి కిందికి తొలగించుకుంటూ వస్తారు. అప్పుడా నటి తల, పాలభాగం వరుసగా ప్రేక్షకులకు కనిపిస్తాయి. ఈ విషయం చంద్రోదయ సందర్భానికి వర్తించి చెప్పడం జరిగింది. 'ఆకాశమనే నల్లనితెర ఎత్తగానే 'రాత్రి' అనే నాట్యగత్తెకు క్రమంగా నొసటిమీద అలంకరించుకునే పట్టా, నొసలు, ఆ తర్వాత ముఖం కనబడతాయేమో! అనేటట్లు తూర్పున చంద్రుడు మొదట సన్నని రేకులాగా, ఆ తర్వాత మెల్లమెల్లగా సగం, అలాగే చివరికి పూర్తిగా ఉదయించాడు'.

> "హరిదంభోరుహలోచనల్ గగన రంగాభోగ రంగత్తమో
> భర నేపథ్యము నొయ్య నొయ్య నడలింపన్ రాత్రి శైలూషికిన్,
> వరుసన్ మౌక్తిక పట్టమున్ నిటలమున్ వక్త్రంబునుందోచెనా
> హరిణాంకాకృతి వొల్చె రేకయి, సగం బై బింబమై తూర్పునన్."
> (వసు- 4-17)

---

31. వసు. 3-45.

16వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో నాటకాలేవీ వెలువడకున్నా, అవి ఆనాడు బాగా ప్రచారంలో ఉన్నట్లు మనకు కావ్యాల ద్వారా తెలుస్తోంది.

రచ్చబండలు:- 'రచ్చ' అంటే చిన్న తగాదా లేదా గొడవ. విద్యాగంధం కొరవడితే నిజమైన చదువు అబ్బకపోతే ప్రతి చిన్న దానికీ గొడవపడే మనస్తత్వం ఏర్పడుతుంది. పైగా ప్రాచీనకాలంలో గ్రామీణులు కల్లాకపటాలెరుగని వాళ్లు. కాబట్టి వాళ్ల మనసులో పుట్టే భావోద్రేకాల్ని అణచుకోలేరు. ఇతరులతో అనకుండా ఉండలేరు. అందువల్ల చిన్నపిల్లల తగాదాలు, భార్యభర్తల గొడవలు, అత్తా-కోడళ్ల ఆరళ్లు, పొలాల తగాదాలు, పశువులు, కోళ్లు, కుక్కలు, పిల్లులు మొదలైన వాటి గురించి తగాదాలు ఏర్పడుతుంటాయి. అలాంటి వాటికి సంబంధించిన విచారణ గ్రామానికి సంబంధించిన ఒక కేంద్ర స్థానంలో జరిగేది. గ్రామ మధ్యంలో గుబురుగా ఉండే మర్రి, జువ్వి లేదా వేపచెట్టు కింద అరుగు, దాని మీద వెడల్పైన బండ పరిచేవాళ్లు. దీన్నే 'రచ్చబండ' అంటారు. ఇక్కడకు చేరని విషయం ఉండదు. చెట్లులేని చోట చుట్టూ గోడలు లేని సత్రాల వంటివి ఉండేవి. వీటిని కూడా 'రచ్చబండ'లనిగాని లేక 'రచ్చకట్ట'లనిగాని అనేవాళ్లు. ఇవి గ్రామాల్లోనే కాకుండా మార్గమధ్యంలో కూడా అక్కడక్కడ ఉండేవి. అక్కడ బాటసారులు విశ్రాంతి తీసుకునేవాళ్లు. వాళ్ల మధ్యలో లోకాభిరామాయణం సాగుతుండేది.

స్వభావోక్తులకు, గ్రామీణ జీవనానికి అద్దం పట్టిన ఆముక్త మాల్యదలో ఈ 'రచ్చల' ప్రసక్తి వస్తుంది. వర్షం రావడంతో అన్ని వైపుల నుంచి వచ్చే బాటసారులు 'రచ్చబండ' దగ్గర చేరారు. నలుగురూ కలిసిన తర్వాత ఏదో ఒక విషయం ప్రసక్తికి వస్తుంది. మెల్లగా అది రాజకీయాల్లోకి పోతుంది. ఆ రాజు గొప్పవాడని ఒకడంటే, కాదు ఈ రాజు గొప్పవాడని మరొకడు. అశ్వపతి (ముస్లింరాజు) గొప్పవాడంటే, కాదు గజపతి (కళింగరాజు)

గొప్పవాడనీ, అతడూ కాదు, నరపతి (విజయనగరరాజు) గొప్పవాడని వాదులాటలు. అంతలో వర్షం కాస్త తగ్గుముఖం పడితే, అంత ఉద్రేకంగా సాగిన చర్చ అర్ధాంతరంగా ఆగిపోయి, అక్కడి వాళ్లంతా విచ్చుమొగ్గలాగా దిక్కులకు చెదరిపోతారట.

> "రయమున వృష్టికై యొదిగి రచ్చలపై విధియింతురుగ్రతన్
> హయపతి మీద దంతిపతి నాతనిపై నృపతిన్ గజాది ని
> ర్ణయముల మొత్తులాడుదురు, క్రమక్రొక యింతయు విప్ప విచ్చుమొ
> గ్గయి మరి పాసిపోదురు సమస్త దిశాగతులైన యధ్వగుల్.
> (అము. 4-131)

'రచ్చలందలు' కాకున్నా అలాంటివే పెద్ద అరుగులు (మార్గవేదులు) వీథి పక్కల్లో ఉండేవి. పరస్థలం నుంచి వచ్చినవాళ్లు, రాత్రి భోజనాలైన తర్వాత, వాటిమీద పడుకుని, కాలక్షేపానికి ఏవేవో పద్యాలు, శ్లోకాలు చెప్పుకునేవాళ్లు. భుజానికి రెండు వైపులా వేలాడదీసుకునే సంచిని 'అసిమిసంచి' అనేవాళ్లు. ప్రయాణం చేసేవాళ్లు తమ వస్తువులన్నీ ఇందులో పెట్టుకునేవాళ్లు. అలాంటి సంచుల్నే తలగడలుగా పెట్టుకుని పడుకునేవాళ్లు.

> 'మాత్రసంచి తలాడగా, మార్గవేది,
> నొక్కడార్యలు, గీతలొండొకడు, దాను
> భాషితంబులుగా, దోడి బ్రాహ్మణౌఘ
> ముటునుపోకకు జదువ బరున్న వేళ
> (అము. 2-74)

గ్రామాలు :- పంచకావ్యాల అయిదింటిలోను నగరాలే కథా వేదికలు. ఆముక్తమాల్యదలో విల్లిపుత్తూరు, మధురానగరాలు వర్ణించబడ్డాయి. పేరుకు తగినట్లు 'మధుర' నగరానికి ప్రాతినిధ్యం వహిస్తుండగా, విల్లిపుత్తూరు' గ్రామ లక్షణాల్ని కలిగి ఉంది. (అము. 1-65 నుంచి 70వరకు) 'ఊరు'ను సంస్కృతంలో 'గ్రామం' అంటారు (ఊరో గ్రామః). 'ఊరు' అనగానే ప్రశాంత వాతావరణానికి నిలయం అని గుర్తుకు వస్తుంది. గ్రామాల్లో ప్రధానంగా వ్యవసాయదారులు

ఉంటారు. వాళ్లను ఆశ్రయించి కమ్మరులు, కుమ్మరులు, చాకలి, మేదరి, మంగలి మొదలైన వృత్తుల వాళ్లుంటారు. నగరజీవనం చక్కగా సాగిపోవాలంటే గ్రామాలు సక్రమంగా వర్ధిల్లాలి. ఈ విషయాన్నే రాయలు

'నృపుల పదహాలరేఖల కెల్ల మాభు
జాగ్రహ రేఖలే మూలమనుచు గోటి
కొండలుగ ధాన్యరాసులు పండుపీట
నుజన భజనైక విఖ్యాతి శూద్రజాతి'
(ఆము. 2-36)

అనే పద్యంలో చెప్పాడు. కుటుంబ వ్యవస్థకు గ్రామాలే పుట్టినిళ్లు. ఉమ్మడికుటుంబంలో వ్యవసాయం బాగా అభివృద్ధిచెందుతుంది. వ్యవసాయమే అన్ని రంగాలకు ప్రాణం పోస్తుంది. ఈనాడు ఈ సంఘ జీవనం ఇంకా పూర్తి పాడుకాకుండా నిలబడగలిగిందీ అంటే అందుకు గ్రామాల్లో వేళ్లు పాతుకుని పోయిన కుటుంబ వ్యవస్థే అని చెప్పొచ్చు. ఆత్మీయతకు, అనురాగానికీ ఈ గ్రామాల్లోని కుటుంబాలే పుట్టినిళ్లు. అన్నింటిలోకి గృహస్థాశ్రమం చాలా గొప్పదని శివుడు నారదునికి వివరిస్తూ 'ఆయత-నియతు'ల కథ చెబుతాడు. గృహస్థాశ్రమాన్ని తృణీకరించిన ఆయతుడు పడినపాట్లు ఏకరువు పెడతాడు.32

గ్రామాల్లో యజమాని ఇంటి దగ్గర లేకుంటే ఎలాంటి అనర్థాలు జరుగుతాయో చూడండి. "ఈ పర్యవేక్షణ సరిగా లేనందువల్ల పండడానికి సిద్ధంగా ఉన్న చేను ఎండిపోయింది. కట్టివేయనందువల్ల, కావలా సరిగా కాయనందువల్ల పశువులు ఊరూర బందెలదొడ్లలోను పడిపోయాయి. రావాల్సిన బాకీలు ఆగిపోయాయి. అవసరానికి అప్పు ఎక్కడా పుట్టలేదు".33

---

32. పాండు. 5-216.
33. మను. 3-129.

గ్రామజీవనం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. కేవలం అడవులు మనిషి మనుగడకు తగిన అవసరాలు తీర్చలేవు. నగరాలు ప్రశాంత జీవనానికి అటంకాలు. ఈ రెండింటి మాదిరి కాకుండా గ్రామాలు నివాసయోగ్యాలు. ప్రకృతి నిలయమైన హిమవన్నగంలో అన్నీ చూసిన తర్వాత ప్రవరుడు వెంటనే తన ఊరికి వెళ్ళాలనుకుంటాడు. 'ఇక్కడి రత్న కంధరాలు, నందన చందనోత్కరాలు, గాంగ సైకతాలు, లవలీనికుంజాలు, మీ గుడిసెలతో సమానం కావా? ఏమి? అని వరూధిని ప్రశ్నిస్తుంది.34 అంటే ఎంత గొప్ప నెలవులైనా గుడిసెలతో సమానం కాజాలవని కవి అభిప్రాయం.

కొన్ని గ్రామాలకు ఒక 'సామంతుడు' అధికారిగా ఉండేవాడు. అతను పర్యవేక్షణార్థం వచ్చినప్పుడు వేసవికాలంలో అతనికోసం ప్రతి గ్రామాంలోను చలువపందిళ్ళు వేసేవాళ్ళు. ఆ విపరీతమైన ఎండల్లో అవి కుంవటిలోని తామరల్లా ఉండేవట.

'గ్రామ గ్రామంబుననొక,
సామంతున కిడిన చలువ చప్పరములు, త
న్నైప మీదని గుంపటిలో
తామరలుంలోర నక్షితతి నొప్పారెన్
(అము. 2-69)

సంతలు:- నగరంలో అంగడి వీధులు ఉంటాయి. కావాల్సిన వస్తువులన్నీ అక్కడ ప్రతినిత్యం దొరుకుతాయి. కాని గ్రామాలలో అలా కాదు. వారంలో ఏదో ఒక నిర్ణీత రోజున అన్నిరకాల నిత్యావసర వస్తువులు ఒకచోట అమ్ముతారు. దాన్నే 'సంత' (Market) అంటాం. ఈ సంతలు నేటికీ అలాగే నడుస్తూ ఉండటం గమనార్హం. సంతలో చేరిన జనం వర్షం పడినప్పుడు చెల్లాచెదరైపోతారు. 'నెలమి బొల్పగు యూథికలకు సంతల కూటములకును మటి విచ్చుమొగ్గలొదవె' (అము. 4-123).

---

34. మను. 2-50.

వర్తకులు ఊరూరి సంతలకు సరకులు వేసుకుని వెళ్లడానికి 'గోడిగలనే పొట్టిగుర్రాల్ని ఉపయోగించేవాళ్లు. 'ఊరూరి సంతలకుం దిరుగ పెద్దలింటింట సంతరించిన పిలుకువాటు గోడిగల....' (ఆము. 4-35). అన్ని వస్తువులు ఒకేచోట దొరుకుతూ ఉండడంవల్ల, కొనేవాళ్లకి ఇవి ఎంతో ఉపయోగాలు. అలాగే కొనేవాళ్లంతా ఒకేచోట ఉండడం వల్ల, అమ్మేవాళ్లకి ఇవి ఎంతో అనువైనవి. అమ్మకపు పన్ను వల్ల ప్రభుత్వానికి ఇవి ఆదాయాన్ని సమకూరుస్తాయి. ఇలా నేటికీ ఇవి సజీవాలే.

**పల్లెలు** :- దేశ పరిపాలన ప్రధానోద్దేశంగా విశాల భూభాగంలో నిర్మించబడిన అత్యధిక జనసాంద్రత కలిగిన ప్రాంతం నగరం. వ్యవసాయం, పశుపాలనకు అనువైన పర్వతారణ్య ప్రాంతంలో వెలసిన అత్యల్ప జనసాంద్రత కలిగిన ప్రాంతం పల్లె. వ్యవసాయం, పశుపాలన, వేట మొదలైన వాటిలో నైపుణ్యం తప్ప, సాధారణంగా పల్లెవాసులు చదువుకున్నవారు కాదు. అందువల్ల నగరవాసుల మాదిరి ఇక్కడి వాళ్ల సాంఘికజీవనంలో మార్పు ఎక్కువ ఉండదు. నగరాల్లో భవనాలు, మేడలు కొత్తకొత్త పద్ధతులతో, శిల్పకళా నైపుణ్యంతో నిర్మించబడుతుండగా, పల్లెవాసులు సాధారణమైన పూరిపాకలతోనే తృప్తిపడతారు. పశువులతోపాటు, కోళ్లు, కుక్కలు, పిల్లులు కూడా వాళ్ల జీవితంలో విడదీయరానివి. కాలం తెలుసుకోవడానికి నగరవాసులు ఇనుక గడియారాలు ఉపయోగించేవాళ్లు. 'కెరలు ప్రవంతి పై యినుక క్రిందగువేళ (ఆము. 4-150), 'ఆనలి నాయతాక్షు గడియారము నందభిసారికా'....(పారి. 2-51).

కాని పల్లెవాసులకు 'కోడికూతే గడియారం'గా ఉపయోగపడేది. 'వినుడంచు తెల్పుగతి చెంతన్ కొండపై పల్లెలన్ కృకవాకుల్ మొరసెన్ గృహోపరి త్రిభంగిన్' (మను. 3-55) అనే దాన్నిబట్టి కొండలమీద పల్లెలు ఉండేవని, అక్కడ ఇళ్ల పైభాగాన మెడ వంచి

'కొక్కొరోకో'యని కోళ్లు కూసినవని తెలుస్తోంది. 'కొండపై' అంటే (సమీపార్థంలో) కొండ పాదానికి దగ్గర్లో అని అనుకోవాలి. కాని కొండలమీద కూడా అక్కడక్కడా జనజీవనానికి అనుకూలమైన జల సౌకర్యాలు లేకపోలేదు. పల్లెవానులకు శుక, పిక, శారికాది (చిలుక, కోయిల, గోరువంక మొదలైన) పక్షులంటే చాలా ఇష్టం. అందులోను నెమలి వీళ్లకు అత్యంత ప్రీతి పాత్రం. పొదల్లో, గూళ్లల్లో దొరికిన నెమలి గుడ్లను తెచ్చి, ఇంట్లో కోళ్ల కింద పొదగేసి, పిల్లలు చేయించి పెంచేవాళ్లు. 'అరుణ చూడ గుప్త భుజగాశనాండముల్ గుఱులు కానె, (ఆము. 4-179) నెమలి ప్రతి కదలికను తనివితీరా చూసేవాళ్లు. వాళ్లు పరిశీలించిన తీరు: 'శరదృతువు నెమలికి నచ్చదు. ఎప్పుడైనా సూర్యుడికి మేఘం అడ్డమొస్తే అదేమైనా వర్షిస్తుందేమో! అనే ఆశతో తినే తిండిని మాని పైకి చూస్తుంది. గుహాలో గాలి ప్రవేశించినప్పుడు ఘుమఘుమ శబ్దం వస్తే, అది ఉరుమనుకుని ఆడటానికి కుంచె (తోక)ను పైకెత్తి, ఆ తర్వాత వాస్తవం తెలుసుకుని నిట్టూరుస్తుంది. పూతతోనే ఆగిపోయిన మొగలిపువ్వును చూసి బాధపడుతుంది. కప్పలు అరిస్తే వర్షం వస్తుందని, అవి అరుస్తాయేమోనని చూస్తుంది. అరవడానికి తగినంత శక్తిలేక ఏదో మెల్లగా అరుస్తుంది. ఎండకు తాళలేక నీడకోసం ఏడాకుల అరటిచెట్టును సమీపించకుండా, గుమ్మడు వృక్షం మీద వాలుతుంది. ముక్కుతో ఇరువైపులా రెక్కల మొదళ్లను పొడచుకుంటుంది. అర్థంలేని చూపుతో రొమ్ము పక్కల్ని చూస్తూ వెర్రిగా ఉంటుంది (ఆము. 4-182).

మరీ అరణ్యాలలో కొండజాతి వాళ్లుండే నివాసాల్ని 'పల్లె' లనే కంటే 'గూడెం' అనీ, 'పెంట' అనీ వ్యవహరించడం కద్దు. 'పెంట' అనేది 'పేట' శబ్ద భవం. అక్కడి వాళ్లకి వ్యవసాయం కంటే పశుపాలన, అడవుల్లో దొరికే తేనె 'గుగ్గిలం' మొదలైన వాటిని సేకరించడం ముఖ్య వృత్తులు. పట్టణాలకు వెళ్ళేటప్పుడు ముఖ్యంగా రాజుల్ని దర్శించేటప్పుడు అడవిలో దొరికే అపురూప వస్తువులైన గోరోజనం, జారపప్పు, బాణాలు మొదలైన వాటిని కానుకలుగా ఇచ్చేవాళ్లు. అవి వైద్యానికి

వనికి వచ్చేవి. 'ఒక ఎరుకరాజు స్వరోచికి ఇప్పుడు చెప్పిన అడవిలో దొరికే వస్తువుల్ని తెచ్చియిచ్చి, వేటకు రమ్మని ఆహ్వానిస్తారు.

"ఒక్క యెఱుకు ఱేడు నక్కకొమ్మును నిఱ్ఱి,
గోరజంబు జున్ను, జాజవప్పు,
బీలిగఱుల యంప కోలలు సెలవిండ్లు,
కానుకిచ్చి కరయుగంబు మొగిచి,"
(మను. 4-14)

పూరిళ్లు :- పంచకావ్యాలలో భవంతుల్ని, అందులోని విలాస జీవితాన్ని అతిశయోక్తులతో, ఉదాత్తాలంకారాలతో కళ్లు జిగేలు మనేటట్లు వర్ణించడమే ఉద్దేశమనిపిస్తుంది. అయినా ఆముక్తమాల్యదలో మాత్రం పూరిళ్లు, మట్టిమిద్దెలు, గుడిసెలు, సామాన్య జనుల నిరాడంబర జీవితాల్ని గురించి చక్కగా వర్ణించారు.

పూరిళ్లను 'కొట్టా'లని 'పాక'లని అంటారు. వీటిని సాధారణంగా నీటి పారుదల ప్రాంతాలలో జమ్ము, రెల్లుగడ్డితో కప్పుతారు. కొండ ప్రాంతాల్లో అయితే అక్కడ లభించే బోద (బాద) అనబడే కొండ గడ్డితో కప్పుతారు. వర్షాకాలంలో 'జడి' పట్టుకుంటుంది. ఇంటింటికీ తిరిగితే కాని ఇంత నిప్పు దొరకదు. దాన్ని జాగ్రత్తగా తెచ్చి ఇంటి చూరుకు ఉన్న బోద పీచు లాగి, దాని మీద పెట్టి విసిరితే గాని రగులు కోదు. ఒకవేళ రగులుకున్నా, దానికి ఇంటి వాసాలు విరిచి పెడితేగాని మండదు. (ఇంటి వాసాలు తప్ప దేన్ని ముట్టుకున్నా, ఆ జడిలో నానిపోయి తడిగా ఉంటుంది. ఇంటి కంటే వంట ముఖ్యం. బోదగానీ, వాసాల్నుగానీ ఆ కొండల్లో విరివిగా దొరుకుతాయి. ఆ తర్వాత వాటిని నరిచేనుకోవచ్చు). పొయ్యి మండినా, వంట కావడం చాలా కష్టం. అయినా ఇల్లంతా పొగ చుట్టుకుని, సుఖంగా భోంచేయడం కష్టం. ఎంతోమందికి వండిన అన్నం మొదటి బంతికే అయిపోతుంది. (వర్షాకాలంలో దాహం తగ్గి ఆకలి ఎక్కువగా ఉంటుంది. ఆ రోజుల్లో ఉమ్మడి సంసారాలు ఉండేవి కాబట్టి ఇంట్లో ఎక్కువ మంది ఉండేవాళ్లు మళ్లీ వండుకోవాలి. విసిగిపోయి అరిపోయిన పొయ్యిని

మళ్లీరగిలించుకోవడానికి పాతబట్టను నెయ్యిలో ముంచి నిప్పుమీద వేస్తారు. అది మండగానేదానిమీద వాసాలు విరిచి, అవి దొరక్కపోతే కర్ర సామాన్లయినా సరే చీల్చివేస్తారు. 'నెయ్యి' వృథా అవుతుందని గాని, ఇంట్లో కర్రసామాను పాడైపోతుందనిగాని ఆ ఇల్లాండ్రు ఆ జడిలో లెక్కచేయరు. ఇన్ని తిప్పలూ పడి వాళ్లు కడుపు కింత వేసుకుని, రాత్రి పొద్దుపోయి పడకటిల్లు చేరతారు. వాళ్లకోసం వాళ్ల భర్తలు ఎదురుచూసి విసిగిపోతారు.

"ఇల్లిల్లు దిరుగ నొక్కింతయు శిఖి, యబ్బి
నేనింటిలో జూరియిడి వినరక,
రాజదు రాజిన రవులుకో ల్వాసాల
గాని కల్గదు మజీ దాన గలిగె
నేని, కూరగుట మందైన బెన్పొగ నుఖ
భుక్తి సేకూరదా భుక్తి కిడిన
బ్రాగ్నేక్తలకె తీఱు, బహుజనాన్న ముతీర
నారుల కొదవు బునః ప్రయత్న

మాణిక్యపట ముఖ్యలయ మెన్న రాలయాంగ,
దారులయ మెన్న రంతిక, కారజనిక,
వచన నాంధ్రో గృహిణి రామి, బడుక మరుదు
వెడవెదనె యార్పు నొగిలి రజ్జడిని గృహులు"

(ఆము. 4-127)

ఇలాంటిదే మరో ఇల్లు, అదొక పాక (పూరిల్లు). వర్షం బాగా కురుస్తూ ఉంటుంది. పగటిపూట భయంకరమైన పిడుగులు. ఆ పూరిల్లు బాగా తడిసి వంటింట పొగ చుట్టుకుని కప్పు పైభాగాన ఆవిరిలాగా కమ్ముకుని ఉంది. చూడడానికి మేఘంలాగుంది. భోజనాలు అయిన తర్వాత ఇల్లాండ్రు పిడుగులకు భయపడి కంచాలు కడిగిన నీళ్లు చల్లడానికి బయటికి వెళ్ళలేక లోపలనుంచే చల్లుతారు. ఆ కంచాల కాంతి మెరుపులాగా తళక్కుమందట. ఆ ఇళ్లు మెరుపుతోటి మేఘాల్లాగా ఉన్నాయి. మేఘాలు భూమిమీద ఎందుకు ఉంటాయి? అంటే, అవి పైనుంచి భూలోకాన్నంతా జలమయం చేసి, ఇక

పాతాళానికి వెళ్లడానికి భూమికి దిగాయట. వర్షంలో వూరిళ్ల స్వరూపం ఇలా తెలుస్తోంది.

"పిడుగుల కల్కిలో దొలచి భీరులు కంచము జల్లు దీధితు
ల్గదవల వెళ్ళిరా బొగల కావిరి బ్రుంగిన వుల్ర్పహంబు లె
ల్లెద కనుపట్టె, నీళ్ళ నిల యెల్లను ముంచి రసాతలంబుపై
విడియగ దండు డిగ్గిన నవిద్యుదురున్తనయిత్నులోయనన్"

(ఆము. 4-128)

గుడిసెలు :- సాధారణంగా తాత్కాలిక నివాసానికి గుడిసెలు వేసుకుంటారు. పంటకావలాలకు పశువుల దొడ్లకు ముందర గుడిసెలు వేసుకుంటారు. ఆకులతో గుడిసెలు వేసుకునేవారు.

"ఆకుల గుడిసెల వసియించె మంత్రి గురుభటయుతుడై."

(ఆము. 3-17)

ఒక యువతి భర్తకు 'అంబలి' తీసుకుని వెళ్తుంది. వర్షం వస్తున్నందు వల్ల పైన జమ్మిగూడ వేసుకుంది. భర్త చేను దగ్గర గుడిసెలో ఉన్నాడు. గుడిసె ద్వారం చాలా చిన్నదిగా ఉంది. అందువల్ల ఆమె లోపలికి వెళ్ళబోతే 'గూడ' ద్వారానికి సరిగ్గా తగులుకుంది. అంతవరకు ఆ చలిలో కంకుల పినుకుళ్లు (గింజలు) నలిపే అతని చేతులు తన భార్య స్తనాల వైపు వెళ్ళాయట.

'వనతుల్వెడి వానకై గుడిసె మోవన్ రాక తానాని యి
వనగా నిల్చిన జమ్ము గూడ, పొలమంబళ్లోంచు చుం బట్టి, పె
న్మనురుస్పిగెడు కావుగుప్పితల పెన్నబ్బల్పు నాన ల్వేలిం
బిసి కిళ్ళుం బిసికిళ్ల హాలికుల కర్పించెన్న భస్యంబునన్.

(ఆము. 4-133)

మట్టి మిద్దెలు :- "విశాలంగా మిద్దెలు కట్టుకునేవాళ్లు. వంటగది, స్నానాలగది, ధాన్యంకొట్టడి, పడసాల (వరండా) అనే విభాగాలు ఉండేవి. తమ పశువుల్ని కూడా తమతోపాటే ఇంట్లోనే కట్టేసుకునేవాళ్లు. వర్షాకాలంలో పశువులన్నిటినీ పొలాలకు

తోలించి, ఒక రెడ్డి ఇంట్లో మంచం కింద మేకల ఎరువు కుంపటి పెట్టుకుని, మంచంకోడుకు లేదా పక్కనే గుంజకు కట్టేసుకున్న లేగదూడ తన శరీరాన్ని నాకుతుండగా, బాగా ఫోంచేసి పడుకున్నాడు".35

"మట్టిమిద్దెల పైన అప్పుడప్పుడు తగినంత 'చౌడు' వేయాలి. లేకపోతే వర్షానికి కారుతుంది. వర్షాకాలంలో కారుతున్నందువల్ల మట్టిమిద్దెల వాళ్లకి నిద్రాభంగం అవుతుంది".36

బందెలదొడ్లు :- రైతులు నిర్లక్ష్యంగా పశువుల్ని వదలిపెడితే, అవి ఎక్కడ పడితే అక్కడ పంటపొలాల్ని మేసి పాడుచేస్తాయి. అప్పుడు పొలాల్ని పర్యవేక్షించే 'కావలికాండ్లు' ఆ పశువుల్ని బంధించి తెచ్చి, ఒక దొడ్లో తోలేవాళ్లు. దానికి నీళ్లు, మేత పెట్టేవాళ్లు. వాటి యజమానులు వచ్చి నిర్ణీత అపరాధ రుసుం చెల్లించి, విడిపించుకుని వెళ్ళేవాళ్లు. ఒకప్పుడు ఇలాంటి 'బందెలదొడ్లు' ఊరూరా ఉండేవి. ఇప్పుడు వీటి అవసరం లేకుండా పోయింది. ఒకప్పుడు బీడు భూములు (గడ్డి మైదానాలు) ఎక్కువగా ఉండేవి. కాబట్టి పశువులు మేయడానికి ఆ బీళ్లలో స్వేచ్ఛగా వదిలేవాళ్లు. ఎటు చూసినా కనుచూపు మేరలో బీళ్లే ఎక్కడో అక్కడక్కడ మాత్రమే పొలాలు ఉన్నాయి. ఈనాడు యంత్రపరికరాలతో బీళ్లే కాకుండా, అడవులు కూడా సాగులోకి వస్తున్నాయి. పెరిగిపోయే జనాభా దీనికి మరో కారణం. ఎక్కడ చూసినా కనుచూపు మేరా పొలాలే ఉండడంతో పశువుల్ని మేతకు స్వేచ్ఛగా వదలడం తగ్గిపోయింది. జాగ్రత్తగా అక్కడక్కడా ఖాళీ ప్రదేశాల్లో వాటిని మేపుకుంటారు. ఇందుకు ప్రజలలో వచ్చిన మార్పు (తెలివి) కూడా కారణం కావచ్చు. 'మాయాప్రవరుడు పరూధినితో తానొకసారి ఇంటికివెళ్ళి వస్తానని చెబుతూ, తానక్కడే ఉండిపోవడంవల్ల ఇంటిదగ్గర చూసుకునేవాళ్లు

---

35. అము. 4-134.
36. అదే. 4-131.

లేక, తమ పశువులన్నీ ఊరూర బందెలదొడ్డిలో వద్దాయని, వెళ్ళి విడిపించుకుని రావాలంటాడు. 'కట్టకాపింప దక్షత లేమి, నూరూర బందెల పడిపోయె పశుగుణంబు' (మను. 3-129).

పశువుల దొడ్లు :- బందెలదొడ్లు గ్రామాల్లో ఉంటాయి. వాటి చుట్టూ ఎత్తైన గోడలు, ద్వారం, (తలుపు) తాళం అన్నీ ఉంటాయి. కానీ పశువుల దొడ్లు ఊరి వెలుపల, సాధారణంగా అడవుల్లో ఉంటాయి. ఆవులు, ఎద్దులు, మొదలైన పశువులకే కాకుండా, గొర్రెలు, మేకలు, పందులుకు కూడా దొడ్లు ఉంటాయి. ఆనాడు వ్యవసాయం కంటే పశుపోషణ మీద ప్రజలు ఎక్కువగా జీవిస్తూ ఉండేవాళ్లు. చుట్టూ ముళ్ల కంపల్ని ఎత్తుగా పెట్టి ఒకచోట సన్నపాటి ద్వారం ఉంచేవాళ్లు. ముఖ్యంగా వీటికి పెద్ద పులులు, చిరుతల వల్ల అపాయం. అందుకని దొడ్ల కావరులు మంత్రించి, తద్వారా ఆ క్రూర మృగాలు నోరు తెరవకుండా (వాకట్టు -> వాయి + కట్టు) చేసేవారట. అప్పుడప్పుడు మాత్రం మంత్రాన్ని వదలించేవాళ్లు. అప్పుడవి ఆహారం కోసం బయలుదేరేవి. ఈ విషయం మనుచరిత్రలో వేట వర్ణనలో తెలియజేయబడింది. "గంతులిడు గబ్బి బెబ్బులుల నలగుడుల దొడ్ల జనంబులు మంత్రించి పొరకదిగిచిన నీరు మేవుడిగి గిరులు గ్రద్దల వాపోవుచుం తిరిగి తిరిగి వాకట్టు విడిచినప్పుడు, దప్పికై పారి సెలయేటి టెంకులం----".37

ఇప్పటికీ రాయలసీమలో అక్కడక్కడా గొర్రెలదొడ్లు మాత్రం కనిపిస్తాయి. వాటిని కావలా కాసేవాళ్లని సంప్రదిస్తే కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. రాత్రి సమయాల్లో మంట లేదా వెలుతురున్న చోటుకు ఎలుగులు అసలు రావట. వాటికి మంటంటేనే భయమట. వాటి శరీరం మీద దట్టమైన వెంట్రుకలు ఉంటాయి. ఆ వెంట్రుకలకు మంట తగులుతుందని వాటి భయం. ఇక చిరుతలు లేదా

37. మను. 4-37.

పెద్దపులులు వెలుతురును చూసే వస్తాయట. అందువల్ల వాటిని పసికట్టడానికి పెద్ద కుక్కల్ని పెంచుతారు. కుక్కల మాంసమంటే కూడా పులులకు చాలా ఇష్టమట. అందుకని ఆ కుక్కల మెడకు ఇనుపముళ్లు పొదిగించిన పట్టీని కడతారట. ఎందుకంటే పులి పట్టిందంటే మెడనే పట్టుకుట్టుందట.

శుక్తిమతీ నదిమీద కోలాహల పర్వతం పడినప్పుడు అది పొంగి లోకమంతా జలమయమైందట. "తోట, చేను, కొటారంబు, దొడ్డి యనెడి నానలన్నియు నినుమంతలయ్యె స్వామి!".38 ఇది తోట, ఇది చేను, ఇది కొటారం, ఇది దొడ్డిఅని తెలుసుకోవడానికి వీలుకాకుండా అంతా జలమయమైంది. 'దొడ్డి' అంటే పశువుల దొడ్డి' అని అర్థం. ఇలాగే గడ్డివాము(మేట)లున్న వాటిని గడ్డిదొడ్లు అంటారు. దొడ్డిలో తోలిన పశువులు ఇక ఎక్కడికీ వెళ్ళలేవు. వర్షాకాలంలో దేశమంతా బురదబురదగా అయినందువల్ల అడవి జంతువులు కొండ దిగిరావడానికి వీలులేకుండా పోయింది. అవి దొడ్డిలో ఉన్నట్లు ఉన్నాయి. "అవురనళ్లకు డిగక మేఘాళి పొదువు నచలములపైనె దొడ్డి కట్టగు మృగాళి".39

రాబోవు ప్రకరణంలో ప్రజల వేషభూషణాదుల్ని, వాటి స్వరూప స్వభావాల్ని ప్రస్తావించడం జరుగుతుంది.

38. వసు. 2-149.
39. ఆము. 4-117.

*మూడో ప్రకరణం*

# వేషభూషణాదులు - స్వరూప స్వభావాలు

ఒక వ్యక్తిని చూసీచూడగానే అతని నాగరికత ఎలాంటిదో కనిపెట్టడానికి తోడ్పడే అంశాలు అతని వేషభూషణాదులే! ఈ నాగరికత ఒక తరంనుంచి మరోతరానికి వెళ్ళే లోపు మారుతూ ఉంటుంది. ఈ మార్పు విదేశీయుల దండయాత్రలు, విదేశీయ పరిపాలన, విదేశ వ్యాపారం మొదలైనవాటి ప్రభావంవల్ల మరింత వేగం పుంజుకుంటుంది. విజయనగర రాజుల పరిపాలనా కాలంలో హిందూ, ముస్లిం నాగరికతల్లో ఆదానప్రదానాలు చోటు చేసుకున్నాయి. పోర్చుగీసువారి ప్రవేశం కూడా అప్పుడే జరిగింది. అందువల్ల కూడా కొన్ని మార్పులు రావడానికి ఆస్కారం ఏర్పడింది.

*పురుషుల వేషధారణ* :- సాధారణంగా పురుషులు పంచె కట్టి, బొందుల చొక్కా ధరించేవాళ్లు. శైవ, వైష్ణవ మత సూచకాలైన విభూది రేఖల్ని, నామాల్ని (పట్టెవర్ధనాలు), తిలకాన్ని పెట్టుకునేవాళ్లు. ఆభరణాలమీద మోజు కలిగి, స్త్రీలమాదిరే దాదాపు అన్ని ఆభరణాల్ని (నూనకం, నాగరాబిళ్ల లాంటి తలలో పెట్టుకునేవి తప్ప) ధరించేవాళ్లు. తలజుట్టును పోషించుకోవడంలో స్త్రీలలాగే శ్రద్ధ చూపేవాళ్లు.

*ప్రవరుడు* :- ప్రవరునివి తుమ్మెదల్లాంటి తెగ బారెడు నల్లని కురులు. శరీరం పచ్చని బంగారు కాంతితో మెరిసిపోతుండేదట.

> 'కమ్మని కుందనంబు కనుగందని మీ, నెలతేటి దాటులన్,
> బమ్మెర వోన తోలు, తెగబారెడు వెంట్రుకలు....'( మను. 3-06)

అతను ప్రతిరోజూ ఉతికిన ధోవతిని ధరించేవాడు. ఏ రోజు ఉతికిన దాన్ని ఆ రోజే అరవేసుకుని కట్టుకునేవాడు. నదిలో స్నానం చేసిన

తర్వాత విడిచిన వంచెను శిమ్యులు ఉతికి తీసుకుని వచ్చేవాళ్లు. '....ఉదికిన మడుగు ధోవతులు గొంచు, బ్రాహ్మచారులు వెంటరా బ్రాహ్మణుండు, వచ్చునింటికి ప్రజ తన్ను మెచ్చి చూడ' (మను. 1-54). ఇలా ప్రతిరోజు ఉతికినందువల్ల అవి ఎర్రని కావిరంగుగా మారేవి. 'బెడగారు నీర్కావి పింజెతోడ' (మను. 3-71).

*స్వరోచి* - పెండ్లికొడుకైన స్వరోచి స్నానం చేసిన తర్వాత ఒళ్ళు తుడుచుకునే వస్త్రం మునలి పాము కుబుసంలాగా నన్నగా మిసమిసలాడిపోతుందట. అతను ధరించిన తెల్లని పట్టుదోవతి గట్టిగా ఊదితే ఎగిరిపోయేటంత పల్చగా ఉందట.

> 'మజ్జన మాడె రాజు కృశ మధ్యమ లింపున వంప గుంపులై
> గొజ్జగ నీటి వెల్లువల గోవ జవాజుల నిగ్గు జావ, జం
> చ్చజ్జరజాహి కంచుకము దాయ మడుంగుల నొత్తె, జెమ్మ నీ
> రుజ్జగిలన్ వహించె మెయి నూదిన బాఱు దుకూల చేలముల్.
> (మను. 5-57)

స్వరోచి తలకు ఎర్రని బట్టను ఒక చెంప వైపుకు ఒరిగేటట్లు చుట్టుకున్నాడు. ఆ బట్ట అంచు బంగారు నరిగె తీగెలతో నేయబడింది. జుట్టులో ఎర్రకలువ పూలు అలంకరించుకున్నాడు. ఒంటికి పరిమళ భరితమైన కస్తూరి పూతను పూసుకున్నాడు. నవరత్నాలు పొదిగిన ఆభరణాల్ని పెట్టుకున్నాడు.1

*మాయాప్రవరుడు* :- నొసటిమీద గంగమట్టితో బొట్టు పెట్టుకున్నాడు. చెవులకు పోగులున్నాయి. బంగారుపూత జరీ అంచు కలిగిన ఎర్రని ఉత్తరీయం నడుముకు బిగించుకున్నాడు. రత్నాలు చెక్కిన బంగారు మొలతాడు మెరుస్తోంది. కుచ్చెళ్ళు వేలాడేటట్లు నీరు కావి ధోవతి కట్టుకున్నాడు. తెల్లని జందెం, కాశిముద్ర కలిగిన ఉంగరం ధరించి, శాంతరసం ఉట్టిపడేటట్లు బ్రహ్మ వర్చస్సుతో ఒప్పి ఉన్నాడు. అతని జుట్టుముడి పిరుదల దాకా వేలాడుతోంది.2

1. మను. 5-58.
2. అదే. 3-71 & 88.

*సిద్ధుని వేషం* :- తల వెంట్రుకలన్నీ ఒకే ఒక పెద్ద జడగా ముద్ద కట్టుకుని ఉన్నాయి. ఆ జడ ఎర్రగాను, చాలా పొడవుగాను, నేలను తాకేటట్లు ఉన్నందు వల్ల మడిచి కట్టుకున్నాడు. దాన్ని పెద్దపులి చర్మంతో కప్పి బంధించాడు. చూడడానికి అది కిరీటం లాగా ఉంది. ముంజేతికి పంచలోహ నిర్మితమైన కడియం, చంకలో కపాల (సంచి), చేతిలో యోగదండం, నడుముకు అరజింక తోలు పట్టె, ఇత్తడి వంటి శరీరానికి తెల్లని విభూది, చెవులకు రుద్రాక్ష పోగులు, కావి రంగు చొక్కా, మరొక చేతిలో జల కమండలం కలిగి ఉన్నాడు.3

*వేటకు వెళ్ళిన రాజకుమారులు* :- వాళ్ళ తల వెంట్రుకల్ని చక్కగా పాయలు దీసి గుండ్రని ముడివేసుకున్నారు. వేటలో అటూ, ఇటూ పరుగెత్తేటప్పుడు కదలకుండా వాటి మీద నన్నని బట్టతో తలపాగాలు చుట్టుకున్నారు. లాగులు తొడుక్కుని వాటి మీద ఒంటికి బిగుసుకునేటట్లు కాసె కోకలు బిగించుకున్నారు. ఆ కాసె కోకలు ఎర్రమట్టి నీటిలో ముంచబడ్డవి. వాటిల్లో బాకులు దోపుకున్నారు. భుజాల మీద వేటాడే డేగల్ని ఎక్కించుకుని వెళ్తున్నారు.4

*ముసలి కిరాతులు* :- బరువైన పంది వలల్ని మోసుకుని వస్తున్నారు. వాళ్ళ నడుములు బాగా వంగిపోయి ఉన్నాయి. (బరువు మోయలేక) ఏదో గొణుక్కుంటూ తిట్టుకుంటున్నారు. వాళ్ళ మీసాలు పొడవుగా నెరసిపోయి ఉన్నాయి. అవి చూడడానికి మగ కుక్కలు తెల్లని దూదేకుల్ని నోట కరచుకుని వెళ్ళేటట్లు కనబడుతున్నాయి.

"గూని వీపులదుర గొణిగి తిట్టుచు నేకు
గరచినట్టి కుక్క గండ్లనంగ
మూతి నెరవ మీసముల ఖోయ ముదునళ్ళు
పంది వలల మోచి పరచిరవుడు"
(మను. 4-36)

---

3. మను. 1-59
4. అదే. 4-30.

*విలాస వంతులు* :- (*దేవాపి అనే గంధర్వుడి వర్ణన*) :- నెమలి పింఛాలతో అలంకరించబడ్డ వచ్చని తలపాగా చుట్టుకున్నాడు. చేమంతి పూలు తలనిండా పెట్టుకున్నట్లు అది కనిపిస్తోంది. కల్లు బాగా తాగాడు. కళ్లు ఎర్రగా ఉన్నాయి. తాయెత్తులుండే భుజానికి వేలాడుతున్న కత్తి, అటూ, ఇటూ తిరిగినప్పుడు పొందాగా కదులుతోంది. కల్లు వాసన రాకుండా తాంబూలం నములుతున్నాడు. అందులో వచ్చు కర్పూరం ఎక్కువగా వేసుకోవడంతో నోరు ఆ వాసన కొడుతోంది. తాంబూలం బాగా నములుతూ ఉండడంవల్ల నల్లబడ్డ పెదాలు, వళ్ళు నవ్వినప్పుడు కనబడుతున్నాయి. ఒంటికి పూసుకున్న గంధం పూతలు అరిపోయి పేట్లుగా రాలిపోతున్నాయి. నోటికి అలవాటైన దురుసైన మాటలు వెలువడుతున్నాయి.5

*గానుగలాడించడానికి వెళ్ళేవాళ్లు* :- వేసవిలో చలువకని కావి బట్టలు కట్టుకున్నారు. తలలో మల్లెపూలు తురుముకుని చెరుకు గానుగిండ్లకు వరుసగా వెళ్తున్నారు. తమ గుడ్డను నోటితో కరచుకుని వెళ్ళే ఎర్ర చీమల బారులాగా ఉన్నారు.

"తోట బగలుండి, మల్లెలు దుఱిమి కావు
లమర, మా పైన నిక్షుయంత్రముల కొయ్య
తీరు వ్రజ వొళ్ళె భావి వృష్టికిని గ్రుడ్డు
తో మధురి మీచ్చు దిగునెఱ్ఱ చీమ లనగ"

(ఆము. 2-70)

*శైవుడైన పాండ్యరాజు* :- తెల్లని తలపాగా చుట్టుకుని దాని మీదకు వచ్చేటట్లు దుప్పటి కప్పుకున్నాడు. నొసటి మీద ఎక్కువగా విభూది రాసుకున్నాడు. వీస్తున్న వింజామరల గాలికి అది రాలివడుతోంది. చెవులకు రుద్రాక్ష గుత్తులున్న దుద్దులు పెట్టుకున్నాడు. మెడలో వేసుకున్న ముత్యాలహారంలో అక్కడక్కడా రుద్రాక్ష కాయలు కూడా

5. మను. 6-42.

ఉన్నాయి. నందీశ్వరుడి ముద్ర కలిగిన ఉంగరం పెట్టుకున్నారు. చేతిలో మోదుగు కర్ర పట్టుకుని ఉన్నారు.6

*యామునాచార్యులు* :- నల్లజింక చర్మం కట్టుకున్నారు. అది లేచినప్పుడు పటపటమని శబ్దం వస్తోంది. పసుపు గోచీ పెట్టుకున్నారు. చేతిలో మోదుగుకర్ర పట్టుకుని ఉన్నారు.7

*మాలదాసరి* :- చమరు (నూనె) అంటుకున్న తోలుచొక్కా, చమురంటిన టోపీ ధరించాడు. శంఖు, చక్ర ముద్రలున్న ఇత్తడి చెవి కమ్మలు పెట్టుకున్నారు. దీపపు స్తంభం, తోలుసంచి, ములికిలేని బాణం, మెడమీద మొగలి ఆకుల గొడుగుతో ఉన్నారు. విష్ణుపాదుక, పొడవైన గుర్రపు వెంట్రుకలతో కుట్టబడి చీలిపోయిన తంబూర, చిటి తాళాలు, చంకలో బుట్ట, పెద్దపెద్ద తులసి పూసలతో చేసిన కంటె, మలిన దేహం, పట్టె తిరునామాలు, పసుపుపొడి ఉన్న తోలుసంచి అతని సొమ్ములు.8

*ప్రభువులు వేశ్యాగృహానికి వెళ్ళేటప్పటి వేషం* :- పన్నీటితో కలిసి కస్తూరిని పూసుకున్నారు. అలా పూసుకోవడం రాచనగరులో ఉండే రాజుకు మాత్రమే సాధ్యం. కాబట్టి ఆ వాసనను బట్టే రాజు వస్తున్నారని తెలుస్తోందట. తలలో పాటల పుష్పాలు (కలిగొట్టు పువ్వులు) పెట్టుకున్నారు. దాని మీదుగా వచ్చే గాలికి తలమీద పెట్టుకున్న తపారం (టోపీ) చుంగలు కదలుతున్నాయి. ఆ కదలికలు తలమీది పూలపైన హాలిన తుమ్మెదల్ని చోపుతున్నాయి. (అప్పటి విజయనగర రాజులు ఒక విధమైన కుళ్లాయిని తలమీద పెట్టుకునేవాళ్లు. దీనికి 'తపార'మని పేరు. చెవులకు వేలాడుతున్న ఆభరణాల ముత్యాల కాంతులు కిందికి ప్రసరిస్తున్నాయి. అలాగే మెడలోని హారాల ముత్యాల కాంతులు పైకి ఎగబాకుతున్నాయి. ఈ

---

6. ఆము. 4-58.
7. అదే. 4-66.
8. అదే. 6-06.

కాంతుల్ని కర్ణాభరణ కాంతులు కిందికి అదిమేస్తున్నాయి. ఆ రాజు చెంగావి (ఎర్రని కావిరంగు) వంచెను కట్టుకున్నాడు. దాని అంచు చంద్రకాంతి లాగా మెరుస్తోంది. చేతిలో కత్తిని పట్టుకుని ఉన్నాడు. ఆ కత్తికి బంగారు పిడి ఉంది. అయన వస్తుంటే నడుస్తున్న మేరువర్వతం లాగా ఉన్నాడు.9

కృష్ణరాయల వస్త్రధారణను ప్రత్యక్షంగా చూసిన విదేశీయులు ఇలా వివరించి ఉన్నారు.

"There the king sits, dressed in white clothes all covered with (Embroidery of) golden roses and wearing his jewels - he wears a quantity of these white garments, and I always saw him so dressed - and around him stand his pages with his betel, and his sword, and the other things which are his insignia of state".10

*నిగమశర్మ* :- ఆనాడు కొందరు బ్రాహ్మణ యువకులు పోకిరీవేషాలు వేసేవారు. నిగమశర్మ జందెం కనబడీ కనబడకుండా చేప మీనం లాగా సన్నగా ఉండేటట్లు ధరించాడు. చుంగులు వేలాడేటట్లు గోచికట్టు (తాళిగోణం) కట్టుకున్నాడు. ఆపకుండా ఎప్పుడూ తాంబూలం నమలుతుంటాడు. అందువల్ల పెదాలు చందురు కావిరంగు పోలి ఉన్నాయి. వేశ్యా సంగమం వల్ల కలిగిన దంతక్షతాల్ని ఆ రంగు కప్పివేసి ఉంది. మెడకు నఖక్షతాలున్నాయి.11

*బుక్కావాళ్ళు (గంధోడివాళ్ళు)* :- వీళ్ళు చెవులకు శంఖులతో చేసిన ఆభరణాలు పెట్టుకున్నారు. భుజాలు లోపలికి వంగి ఉన్నాయి. వాళ్ళ జుట్టు ముడులు వంకరంగా ఉన్నాయి. కావి రంగు దుప్పట్లు కప్పుకుని ఉన్నారు. పరిమళ ద్రవ్యాలు తయారుచేయడంలోను, పూలదండలు కట్టడంలోను, మునలివాళ్ళైనా పొరపాటు లేకుండా ఉంటారు12.

9. ఆము. 2-78.
10. F.E . P. 269. Narratives of paes.
11. పాండు. 3-10.
12. అము. 4-35.

విజయనగర ప్రజాజీవనం గురించి కీ.శే సురవరం ప్రతాపరెడ్డిగారు విజ్ఞాన సర్వస్వం నాలుగో సంపుటం 1138వ పుటలో ఇలా వివరించారు.

"....రాచవారు వస్నీటితో కలసిన కస్తూరిని పూసుకొనుచుండిరి. పొడవైన కుచ్చుటోపీలు ధరించిరి, ముత్యాల పెద్దపోగులను, ముత్యాల హారములను ధరించి కావియంచు తెల్లని వస్త్రములను కట్టిరి. మరియు పెద్ద పెద్ద జుట్టును లోపలికి జొనిపి, పైని చుంగు పాగా జుట్టి, చల్లాడములపై నడుముకు, కాసె చుట్టి యందు పిడికత్తులను దోపి తిరుగుచుండిరి. మరికొందరు సన్నని నూలు లేక పట్టు అంగీలను తొడిగిరి. కాళ్ళకు చెప్పులుగాని ముచ్చెలుగాని తొడుగుచుండిరి (ముచ్చెలు మునల్మానుల నుండి గ్రహించినవై యుండును). మెడపై పెద్ద సెల్లాలను వేసుకొనిరి. వారి స్త్రీలు చాలా సన్నని నూలు లేక పట్టుచీరెలను, అయిదు గజముల పొడవైన వానిని గట్టిరి. పట్టుతో జలతారుతో కప్పిన ముచ్చెలను తొడగిరని యూరోపియన్ రాయబారులు వ్రాసిరి. పలువురు రెడ్లు పసుపురంగుల తలపాగా కట్టి, మాధవళి (కపిల వర్ణపు) పచ్చడము వేసుకొని వంకుటుంగరము డొల్లు పోగులు ధరించెడివారు....

విజయనగర రాజ్యకాలములోను, తరువాతను సర్వ సాధారణముగ పురుషులు గుండు రుమాలును లేక చుంగు విడిచిన పాగాను కట్టుకొనుచుండిరి. బ్రాహ్మణులు, కోమట్లు పలువురు ధనికులు రాచవారు దోవతులు కట్టుచుండిరి. కాని జనసామాన్యము మోకాళ్ళకు పైనుండు చల్లాడము తొడిగి నాలుగు వ్రేళ్ళ వెడల్పుగల కాసె దట్టిని నడుము చుట్టు బిగించుకొనుచుండిరి. స్త్రీలు తొడుగకున్నను చాలా మంది పురుషులు కాలిబొటన వ్రేలునకు సరిపోవు తోలుంగరమును వ్రేళ్ళకు తగుల్కొను వార్లును కల కిర్రు చెప్పులను వేసుకొనుచుండిరి. ధనికులు, రాజులు ముచ్చెలను కూడ ధరించిరి. పురుషులు సాధారణముగా చెవుల క్రింది కొనలందు పోగులను, కమ్మలను ఒక

చెవి పైభాగములందు ముత్యాలపోగును చేతికి దండ కడెములను, వ్రేలి యుంగరములను ధరించిరి. హిందువులందరు జుట్టును, కొందరు జులపాలను పెంచుచుండిరి. మరియు కులములను తెలుపు నామములను, విభూది తిలకము మున్నగునవి ధరించెడివారు. రెడ్లు మున్నగు మధ్యతరగతి ప్రజలు గొంటువూనలు, రెండు గుండ్ల ముంగరలు, మైజారు చీరెలు, తూలెడు కొంగులు, బలు చెంప కొప్పులు, అంచుకమ్మలు, నన్న కాటుక రేకలు, నాభి నామము, (శివులైన విభూదిరేకులు, వ్రత్తిబొట్లు) వనువు వూతలు కలిగి యుండెడివారు. ఇది స్థూలముగా నాటి పురుమల వేషభూషణాదులు".

***స్త్రీల వేషధారణ*** :- విజయనగర కాలం నాటి పురుమల వస్త్రధారణకు, నేటి పురుమల వస్త్రధారణకు ఎంతో తేడా ఉంది. కాని స్త్రీల విషయంలో అంత తేడా లేదనిపిస్తోంది. సుగంధద్రవ్యాలు, ఆభరణాల విషయంలో నాటికీ, నేటికీ ఉన్న తేడా వస్త్రధారణంలో కనిపించదు. స్త్రీల ముక్కెర, కంకణాలు, అందెలు, చెవి కమ్మలు, చేర్చుక్క, నూనకము, మట్టెలు, కడియాలు, బొట్టు, కాటుక, మకరికా వత్రాలు మొదలైన వాటి గురించి కావ్యాలన్నిట్లోను అక్కడక్కడా ప్రస్తావించడమైంది.

***విరహంతో మనను సరిగాలేని వరూథిని చేష్టలు*** :- మొగం కడుక్కున్న తర్వాత చెలికత్తె తెచ్చిన పచ్చకర్పూరపు గంధాన్ని ఇక తప్పదన్నట్లు వేలితో తాకి, ఒక చిన్నబొట్టును నొసటి మీద పెట్టుకుంది. ముడుచుకోమని పువ్వులు తెచ్చి ముందర పెట్టగా, అందులో కొన్ని ఎత్తులు మాత్రమే తీసి తలలో తురుముకుంది. రత్నపాదుకల్ని తెచ్చి తొడుక్కోమని కోరగా, తిరస్కరించి ముందుకు వెళ్ళింది. సన్నగా కత్తరించి ఇచ్చిన వక్కల్ని అన్నిందుకని ఒకటి, రెండు మాత్రం తీసి నోట్లో వేసుకుని వెంటనే బయటికి ఊసింది. తమలపాకును సగం మాత్రం కొరికి పారేసింది. చెలికత్తెల మాటలకు అర్థాబర్థం

సమాధానాలు చెప్పింది. మనను ఎక్కడో నిలిపి వరధ్యానంగా ఉంటోంది (మను. 3-66.).

పువ్వులు కోసేటప్పుడు జడలు వేసుకుని (కొప్పులైతే కొమ్మలకు చిక్కుకుంటాయి). చనుకట్లు (రవికెలకు బదులు స్తనాలకు కప్పేలాగా తిప్పి కట్టేకట్లు) కట్టుకుని వాటి మీద సన్నని పైటల్ని వేసుకుంటారు (మను. 3.83).

*మనోరమను అలంకరించడం* :- చెలికత్తెలు ఆమెకు స్నానం చేయించి, తడి తుడిచి, తళతళమనే నెమలిపురి లాంటి తలవెంట్రుకలకు నల్లని అగరు ధూపం పొగవేశారు. జవ్వాదిద్రవ్యంతో చిక్కుముడి తీశారు (మను. 6-4).

ఎర్రకలువ దండను కొప్పు మీద పెట్టి, వచ్చకర్పూరవు తిలకం ఉంచారు. దాన్ని తాకేటట్లు (పావటకు కింద) నూనకం (లలాట అభరణం) కట్టారు. పన్నీటితో కలిపిన కస్తూరిని ఒంటికి పూశారు. కుంకుమ సేనబొట్టు పెట్టి, కునుంబా (ఎరుపు) చీరపైన ముత్యాల మొలనూలు కట్టారు. తెల్లని కాంతులు వెదజల్లే ముత్యాల పతకాన్ని మెడలో వేసి, అది కదలకుండా రత్నాల నగల్ని, కాలికి అందెలు తొడిగారు. అందులో గండుచేవల బొమ్మలు ఉన్నాయి (మను. 6-05).

*'పుంజికస్థల' అనే అప్సర ఆకారం* :- వలచని చీర లోపల (ఎర్రని) కునుంభా రంగులో అద్దిన పావడా కనిపిస్తోంది. కొప్పులో పెట్టుకున్న ఎర్రకలువల నువాసన, ఎదమీద అద్దిన కస్తూరి పరిమళం అంతటా వ్యాపిస్తోంది. కాలి అందెల మోతతో పెద్ద నిధిలాగా, వదును పెట్టిన మన్మథాస్త్రం లాగా ఆ అప్సర (పుంజికస్థల) ఆ మునికి కనబడింది" (మను. 6.3l).

*వేసవి చలివేంద్రాల్లో ప్రపాళికలు* :- చలి పందిళ్ళలో నీళ్లుపోసే యువతుల పొక్కిళ్ళు నుడుల్లాగాను, కళ్లు తామరల్లాగాను, కొప్పులు నాచులాగాను, స్తనాలు చక్రవాకాల్లాగాను, నవ్వు నురుగు లాగాను

ఉంది. వాళ్లు జలదేవతల్లాగా ఉన్నారు. ఆ వేసవిలో నీళ్లు పూర్తిగా ఎండిపోతాయేమో! అనే భయంతో ఆ జలదేవతలు చలి పందిళ్ళలోని కడవల నీటిని రాబోయే కాలానికి మళ్ళీ నీళ్లు పుట్టడానికి బీజాల్లాగా ఉంచుకున్నట్లు అనిపిస్తోంది (అదే. 2-57).

*గోదాదేవి* :- బంగారు పళ్ళెంలో ఉసిరికపొడి, పసుపు మొదలైనవి, ఉతికిన బట్టలు, తడి తుడుచుకునే వస్త్రాలు చెలికత్తెలు తీసుకుని రాగా, గోదాదేవి తమ ఇంటి తోట లోపలి దారిగుండా వెళ్ళి, అందులోని దిగుడు బావిలో స్నానం చేసి, జుట్టుముడిని వెనక్కి నెట్టుకుని తడి తుడుచుకుంది(ఆము. 2-51). ఆ గోదాదేవి పళ్లు మల్లెమొగ్గల్లాగాను, నొసటి మీద తెల్లని (గంగ) మట్టిబొట్టు గుమ్మడిగింజలాగాను, పిరుదులపైన ఉన్న చెంగావి గజకుంభ స్థలాలకు సింధూరం చల్లినట్లుగాను, జుట్టుముడి పునుగు వాసన తుమ్మెదలకు విందులాగాను ఒప్పారింది (ఆము. 5-90).

*కాలాన్ని బట్టి అలంకరణలు* :- చలికాలంలో స్త్రీలు పెదాలు పగలకుండా మైనం పూసుకునేవాళ్లు (ఆము. 5-100). స్త్రీలు ఋతువును బట్టి అలంకారాలు చేసుకునేవాళ్లు. వసంత ఋతువు రాగానే అగరు చందనపు పూత పూసుకునేవాళ్లు. (అంతకు ముందు) శిశిరంలో కస్తూరి పూత పూసుకునేవాళ్లు. శిశిరంలో ఎదపైన ముత్యాలహారం వేసుకునేవాళ్లు కాదు. ఇప్పుడు అంటే వసంతంలో మళ్లీ వేసుకోసాగారు. కొప్పులో పూలతోపాటు నన్నని కురుగంటి వేరును కూడా పెట్టుకునేవాళ్లు ( ఆము. 5-106).

*వెన్నెల్లో జారిణీ స్త్రీల అలంకరణ* :- నన్నదైన తెల్లని చీర కట్టుకుని, ముత్యాల హారాల్ని వేసుకుని, అందరూ వెళ్లే దారిలోనే వెళ్లినా, వాళ్లు వెళ్ళేటప్పుడు తాకితే కూడా అన్నీ తెల్లగా ఉండడంతో ఆ వెన్నెల రాత్రిలో ఎవరూ గుర్తు పట్టలేరని తమను ప్రియుల దగ్గరికి చేర్చే దూతికలు వాళ్లకి ధైర్యం చెబుతారు (పారి. 2-52).

రాత్రి పడుకునే ముందు యువతులు పుక్కిట కమ్మకస్తూరి గుళికల్ని పెట్టుకుని మెల్లగా నమలేవాళ్లు(పారి. 2-61).

*హారాలంకరణ* :- గిరికకు తల్లి అయిన శుక్తిమతి నంకుల హారాన్ని వేసింది. అది చూసి తండ్రి కోలాహలుడు అవెందుకని, వాటిని తీసివేసి రత్నాలహారాల్ని మెడలో వేశాడు. అప్పుడు తల్లి అవి తన కూతురుకు బరువవుతాయని, వాటిని తీసి ఎర్రకలువల హారాన్ని వేసింది.

"పంకజ పాణి శంఖ పరిభావక కంధర, తల్లి యేలకో?
నంకులు గట్టినంచు కులశైల నుతాగ్రణి పాయద్రోచి, ర
త్నాంకిత హారముంప బరువానునొ, బిడ్డకివేల?కర్కశా
లంకృతులంచు హల్లక కలాపము లుంచె నదీలలామయున్."
(వసు. 3-31)

*పల్లెపడుచులు* :- "గోరు వెచ్చని నూనెతో తలంటుకున్నారు. పసుపు కలిగిన నీటితో స్నానం చేసి, చిన్న చిన్న గళ్లున్న చీరెలు కట్టుకున్నారు. కళ్లకు కాటుక, నొసట సింధూరపు బొట్టు గుండ్రంగా పెట్టుకున్నారు. పెద్ద కొప్పులో పూలు పెట్టుకున్నారు. మెళ్లో వేపచిగుళ్ల హారాన్ని చిన్న చిన్న మంగళ సూత్రపు బిళ్లలు ధరించారు. తెల్లగా మెరిసే పళ్లతో తాంబూలం నమిలారు".13

రాజకాంతలు, ధనవంతుల యువతులు నూనెకు బదులు పునుగు, జవ్వాదిద్రవ్యాలు, పసుపు నీటికి బదులు పన్నీరు, సింధూరానికి బదులు కస్తూరితిలకం, గళ్లగళ్ల చీరెలకు బదులు నన్నని పలిపాలు లేదా పట్టుచీరెలు, వేపచిగుళ్ల హారాలకు బదులు రత్నాల హారాలు, మామూలు తాంబూలం కాకుండా, కమ్మకస్తూరి తాంబూలం వాడేవాళ్లు.

*వీణ వాయించే స్త్రీలు* :- స్త్రీలు వీణ వాయించేటప్పుడు వేళ్లకు తీగెలు ఒత్తుకోకుండా బంగారుగోళ్లు పెట్టుకునేవాళ్లు. ఒక కిన్నెరాంగన వీణ

---

13. పాండు. 3-74.

చాలా సేపు వాయించి, రాజును చూడడానికి ముంగిట్లోకి వచ్చింది. అతన్ని చూస్తూ పైట సవరించుకుంది. అప్పుడైనా తన చేతికున్న బంగారుగోళ్లను తీయడం గుర్తుకు రాలేదు. ఆ గోరు మన్మథుడి నంపంగి పూబాణమో! అనేలాగా ఉంది.14

***తడి బట్టలతో స్త్రీ*** :- ఒక స్త్రీ ఎంతసేపు నుంచో స్నానం చేస్తోంది. ఆ మార్గంగుండా రాజు వస్తున్నారని తెలిసి, అలాగే వరుగెత్తికుని వచ్చింది. అప్పుడామె ఆకారం ఎలా ఉందంటే-సన్నని వస్త్రాన్ని ఒంటి మీద కప్పుకుంది. తడిసిపోయిన చంద్రకావివస్త్రం పావడా కొంగలకు అంటుకుంది. ఒంటిమీది బట్టలు తడిసి ఉండడంతో పటపటమని శబ్దం రావడంలేదు. పైటకొంగును ఎదపైన, నడుంపైన సవరించుకుంటూ చేతిలో తడిసిన వెంట్రుకల్ని పెట్టుకుని నిలబడి చూస్తోంది.15

***నీళ్లు మోసుకుని వెళ్లే ద్రావిడ స్త్రీలు*** :- ఉద్యానవనం లోపలి దారిగుండా చంకలో నీళ్ల బిందెలు పెట్టుకుని ద్రావిడాంగనలు వస్తున్నారు. ఎర్రకలువల దిగుడు బావిలో నుంచి దేవుని పూజ కోసం నీళ్లు ముంచుకుని, అక్కడి తామరపూలను కాడలతో పాటు కోసుకుని, ఆ పొడవైన కాడల్ని చేత్తో పట్టుకున్నారు. ఆ పూలు నీటి బిందెలలోకి ఒరిగి వాళ్లు నడచినప్పుడు తడబడుతున్నాయి. వాళ్లు ఒళ్ళంతా పసుపు పూసుకుని స్నానం చేసి ఉన్నారు. సన్నని నడుములు బిందెల్ని, పెద్దస్తనాల్ని మోయలేక అయ్యో! పాపం! అనేటట్లు ఉన్నాయి. అలా వాళ్లు ద్రావిడ ప్రబంధాల్ని పాడుకుంటూ వెళ్తున్నారు.

> "శయపూజాంబుజముల్ ఘటిం దరటరన్, జన్నోయి లేగౌనుపై
> దయదప్పన్ జనుపాడి, పాగరవు పాదంబొప్ప చెంగల్వడి
> గ్గియ నీరచ్యుత మజ్జనార్థము గటిం గీలించి, దివ్యప్రబం
> ధయుగాన్యల్ ద్రవిడాంగనల్ నడతురుద్యానంపు లోత్రోవలన్"
>
> (ఆము. 1-56)

---

14. మను. 5-64.
15. అదే. 5-68.

*ఒడ్డాణం* :- నడుముకు ఒడ్డాణం (కాంచిక) ధరించేవాళ్లు. అది బంగారుది. దానికి సన్నని గంటలు ఉండేవి. మాయాప్రవరుణ్ణి అల్లంత దూరంలో చూసి వరూథిని అతనికి ఎదురుగా వెళ్తుంది. ఆ హడావుడిలో ఆమె ఒడ్డాణపు చిరుగంటలు మధురమైన రవళి చేశాయట (మను. 3-89).

ఆభరణాలకు సంబంధించి పంచకావ్యాల్లో అడుగడుగునా సమాచారం లభిస్తుంది. తాటంకాలు (చెవి కమ్మలు), మొలనూలు, పసిడి గాజులు, కడియాలు (అంఘ్రి కటకాలు), ముత్యాలహారాలు, ముక్కెర మొదలైన ఆభరణాలు తారసపడతాయి.

*కాలిగోపికలు (వరిచేలు కాపలాకాచే అమ్మాయిలు)* :- చెవులకు తమ్మి దుద్దులు పెట్టుకుని సాక్షాత్తు లక్ష్మీదేవతలాగా ఉన్నారు. మంచె మీద నిలబడి చిలుకల్ని అదలిస్తున్నారు. వాళ్లు మన్మథుడి రథాన్ని లాగే చిలుకల్ని తోలే రతీదేవిలాగా ఉన్నారు. ఆ చిలుకల పైకి తామర మొగ్గల్ని విసరితే అవి అంతదూరం పోలేక మధ్యలో నేవడిపోయాయి. అందుకని చప్పట్లు చరచి వాటిని అదలించారు. అలా చరచినప్పుడు వాళ్ల స్తనాలు, జడలు కదలాడాయి. బాటసారులు దారి అడిగితే వాళ్లను ఆటపట్టించాలని తప్పుదారి చెప్పారు. వాళ్లు ఆ దారిన వెళ్తుంటే కిసుక్కుమని నవ్వారు. అది తెలుసుకుని వెనక్కితిరిగిన ఆ బాటసారుల్ని చూసి సిగ్గుపడ్డారు. ఆ వరిచేల పక్క చెరకు తోటలు ఉన్నాయి. అందులో చెరకులు బాగా పండి వాటి వెన్నుల్లో ముత్యాలు పగిలి రాలుతున్నాయి. ఆ చెరకుల్లోని పాలు ఆ స్త్రీల అధరామృత మాధుర్యాన్ని పోలలేవు. ఆ చెరకు వెన్నుల్లోని ముత్యాల కాంతులు ఆ స్త్రీల పళ్ళ తెలుపును పోలలేవు. ఆ చేలలోని వరి వెన్నులు వాళ్ల పిక్కల్ని పోలలేవు. అందువల్ల వాటిని తమ అధరామృత దంతకాంతులతో, పిక్కల సొంపులతో గెలిచినవాళ్లై, ఆ కాలిగోపికలు వాటిని ఏలుతున్నారేమో! అనిపిస్తోంది.16

---

16. ఆము. 4-163.

**పుష్పలావికలు (పూలమ్మే స్త్రీలు)** :- పుష్పలావికల్ని గురించి ప్రతి కావ్యంలోను తప్పనిసరిగా వర్ణించడాన్ని చూస్తే, ఆనాడు వాళ్ల ప్రాధాన్యమేమిటో తెలుస్తోంది. వాళ్లు అందంగా పూలు కట్టడమే కాకుండా, యువకుల హృదయాన్ని సరసనల్లాపాలతో మత్తెక్కించే వాళ్లు. మంచి మాటకారుల్లాగా కనిపిస్తారు. ద్వంద్వార్థాల్లో వేసే కుర్రకారు కొంటె ప్రశ్నలకు అంతే కొంటెతనంతో సమాధానం చెప్పగల దిట్టలు.

*మధురా నగరంలో పూల బజారుకు వెళ్తే కనిపించే దృశ్యాలివి* :-

యువకుడు :- ఓ అమ్మాయీ! నీ దండ వెల ఎంత?

'దండ' అంటే బాహువు (భుజం) అని కూడా అర్థం. నీ బాహు స్పర్శకు వెల ఎంత?అని.

పూలమ్మాయి :- నా దండకు వెల ఇవ్వడానికి ఎవరి తరం?

నాతోటి పొందుకు తగిన ధర చెల్లించడానికి ఎవరికి సాధ్యం?అని.

యువకుడు :- కలువ తావులు కానమే? కలువపూలు వాసన రావటం లేదేం? అని. నీతో కలవటానికి సరైన తావులు (చోట్లు) లేవే అని.

పూలమ్మాయి : కలువ తావులు వాడకయ కల్గునె? వాడుపట్టకుండానే కలువపూలు వాసన వస్తాయా? అని. నీకూ, నాకు కలయిక వాడుక (అలవాటు) లేకనే తగిన తావు దొరుకుతుందా? అలవాటైతే ఎక్కడైనా సరే చోటు దొరుకుతుంది అని.

యువకుడు :- కడిపోదు, ఈ గేదంగిని నాకిమ్ము. వాసన పోని ఈ మొగలిపువ్వును నాకివ్వు. కడి అంటే సువాసన, అన్నపుముద్ద అని రెండర్థాలున్నాయి. అలాగే 'గేదంగి' అంటే, మొగలిపూవు, అందమైన శరీరం అని అర్థాలు. కాబట్టి నిన్ను చూసినప్పటి నుంచి నాకు అన్నపుముద్ద సహించడం లేదు. నీ అందమైన శరీరాన్ని నాకు అర్పించు అని.

పూలమ్మాయి :- కదివోమి, ముందరికి జూడు. వానన పోదేమో! ఇంక్ొంచం ఆగి చూడు అని. ముద్ద ముట్టకపోవడం అప్పుడే ఏమైంది? నాతో కలిశాక చూడు తెలుస్తుంది అని.

యువకుడు :- జాతులేవి? జాజిపూలెక్కడ? అని. పద్మిని, హస్తిని, చిత్తిని, శంఖిని అనే జాతులలో నీవే జాతికి చెందిన దానవు?అని.

పూలమ్మాయి :- పద్మినులు కూడా ఉన్నచోట జాతులకు కొరతా? 'పద్మాలు కూడా ఉన్న చోట జాజులకు కొదవా?అని. పద్మినీ జాతి స్త్రీలే ఉండగా, తక్కిన జాతి స్త్రీలు ఉండడం అరుదా?అని.17

ఇలా సాగుతాయి వారి ప్రసంగాలు. ఇలాగే ఆముక్తమాల్యద, 2-21, 22, 23, పద్యాలలోను, వసుచరిత్ర 1-109 పద్యంలోను పుష్పలావికలకు రసికులైన యువకులకు మధ్య శృంగార ప్రసంగాల వర్ణన మితి మీరిన మోతాదులో కనిపిస్తోంది. ఈనాడు అవి కొంచెం ఎబ్బెట్టుగా అనిపించినా, అవన్నీ అనాటి సాంఘిక పరిస్థితుల్ని తెలునుకోవడానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఆ దృష్టితోనే వాటిని చూడాలి:

*వేశ్యలు* :- అనాటి కళాత్మక ప్రపంచంలో శృంగారమయ జీవితంలో పుష్పలావికలు కేవలం ఉత్తేరకాలనుకోవచ్చు. వాళ్లు కట్టే పువ్వులు, అమ్మే పరిమళద్రవ్యాలు శృంగార రసోద్దీపనకు ఎలా తోడ్పడేవో, వాళ్ల మాటలు, చూపులు, చేష్టలు కూడా అలాగే తోడ్పడేవని అనుకోవచ్చు. ఇక ఆ సరస జీవితంలో శృంగారపుటంచుల వరకూ తీసుకుపోయి పంచేంద్రియాల్ని పరవశింపజేసి, బ్రహ్మానంద రసానుభూతికి పరదేవతలనదగినవాళ్లు దేవదాసీలు లేదా వేశ్యలు. వీళ్లని 'భోగముసానులని, పణ్యాంగనలని, వెలయాండ్రని శైవంలో అయితే 'బసివి'లని పిలిచేవాళ్లు. వీళ్ల సమూహాన్ని భోగపుమేళాలని నాగవాసమని అనేవాళ్లు. వీళ్లు సంగీత, సాహిత్య, నాట్యశాస్త్రాలలో ఆరితేరి, నెరజాణలై ఉండేవాళ్లు. చదరంగం మొదలైన విలాస క్రీడలలో

17. ఆము. 2-19.

నేర్పరులై, తమ మాటలతో హొయలొలికించే శృంగారచేష్టలతో యువకుల హృదయాల్ని చూరగొనేవాళ్లు. ఆనాటి సాంఘిక జీవనంలో వీళ్లు ప్రధానపాత్ర వహించేవాళ్లు. ఉన్నత వర్గానికి చెందిన సామాజికుల నుంచి వీళ్లకి అపరిమితమైన మన్నన ఉండేది. కొన్ని సందర్భాల్లో రాజులు, చక్రవర్తులు కూడా వీళ్ల ప్రభావానికి లోనయ్యేవాళ్లు. రాజకీయ చరిత్రలే వీళ్లవల్ల మలుపు తిరిగిన సందర్భాలూ లేకపోలేదు. ఏమైనా ఆనాటి ప్రజా జీవనంలో వీళ్లకొక ఉన్నతస్థానం ఉన్నట్లు అనేక చారిత్రక అంశాలవల్ల తెలుస్తోంది. ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తునిలాంటి పరమ భాగవతోత్తమునికి ఎదురుగా వెళ్ళి తీసుకుని వచ్చేటప్పుడు కూడా రాయలు వీళ్లని గురించి వర్ణించడం మరచిపోలేదు.

ఈ విషయాన్నే డా. పుట్టపర్తి నారాయణాచార్యులుగారు ఇలా పేర్కొన్నారు. "గంభీర గ్రంథమునందు కూడ నీ విషయమును రాయలు మరువలేదు. ఆ సమాజమున పణ్యాంగనలకు గౌరవాగౌరములు సాధారణములు. శ్రీవిల్లిపుత్తూరులో వీరున్నారు. మధురలోనున్నారు. వీరి స్వభావములు భిన్నములు. విష్ణుచిత్తు నెదుర్కొనుటకు వచ్చిన స్థానికులు కూడ 'నాగవానములు' మరువలేదు.18

"దేవదాసీలు పవిత్ర జీవనం గడిపేవారని, 'దేవదాసిగా' నిర్దేశించబడిన వ్యక్తిని పదేండ్ల ప్రాయమున్నప్పుడే దేవాలయానికి అర్పించేవాళ్లని, అప్పుడు ఆ దేవునికి, ఆమెకు వివాహం మహోత్సవపురస్సరంగా జరిగేదని, దేవుని సేవకు అర్పించబడింది కావటంతో ఆమె 'దేవదాసి' అయిందని విజయనగర సామ్రాజ్యాన్ని దర్శించిన 'బార్బోజా' అనే విదేశీ యాత్రికుడు వర్ణించాడు".19

---

18. చైతన్యలహరి ఉపన్యాసమంజరి, శ్రీకృష్ణదేవరాయలు.
19. విజ్ఞాన సర్వస్వం- 3 వ భాగం.

రాజ్యంలో వీళ్ల నియామకాలు అధికారికంగా జరిగేవి. ఉన్నతమైన గౌరవం, రాజు మన్నన, దేవాలయంలో సాంప్రదాయకమైన బాధ్యతలు వీళ్లకు ఉండేవి. పోర్చుగీస్ యాత్రికుడైన 'పయస్' వీళ్ల గురించి విపులంగా రాశాడు.

"These women are of loose character, and live in the best streets that they are in the city. It is same in all their cities, their streets have the best rows of houses. They are very much esteemed and are classed amongst those honoured ones who are the mistress of the captains; Any respectable man may go to their houses without any blame attaching thereto. These women (are allowed) even to enter the presence of the wives of the king, and they stay with them and eat betel with them, a thing which no other person may do , no matter what his rank may be".20

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో నృత్యమేళానికి రంజకం శ్రీరంగరాజు నాయకుడు. వారి కుమార్తె 'కుప్పాయి' లేదా కుప్పాసాని నర్తకి. రాయలవారు 'విద్వత్సభారాయ' బిరుదాంకితుడు కాగా, వీళ్లిద్దరు 'విద్వత్సభారాయ రంజక' బిరుదాంకితులు. కుప్పాసాని కుమార్తె ముద్దుకుప్పాయి. అచ్యుతరాయలనగరిలో నర్తకి. క్రీ.శ. 6-6-1531వ తేదీనాటి ఒక శాసనాన్ని బట్టి అచ్యుతరాయలు ఈమెను తిరువతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో దేవదాసీగా నియమించినట్లు తెలుస్తోంది.21

ఇలా ఒక దశలో పవిత్రమైన భావంతో భగవత్కైంకర్యం కోసం నియోగించబడ్డ ఈ దేవదాసీలు క్రమేపీ భక్తి భావం నుంచి శృంగార భావం వైపు మొగ్గు చూపారు. అందుకు అనాటి సాంఘిక పరిస్థితులు

20. F.E.P. 242.
21. విజ్ఞాన సర్వస్వం. 3వ భాగం.

ఎక్కువ దోహదపడ్డాయి. దేవాలయ నిర్వాహకుల్లోను, మత గురువుల్లోను అక్కడక్కడా పవిత్రభావం పట్టుసడలం మొదలైంది. ప్రవరుని వంటి నైష్ఠికులున్నా, నిగమశర్మ, గుణనిధిలవంటి శీల రహితులైన బ్రాహ్మణ బ్రువులు కూడా బయలుదేరారు. దీనికితోడు అనాటి ఈడూ-జోడులేని పెళ్ళిళ్ళు, బహుభార్యాత్వం ఈ స్థితిని మరింత కుంగదీసింది. ఫలితంగా దేవదాసీలు వేశ్యలుగా పిలువబడ్డారు. వీళ్లు సమాజం సొత్తు (Public property)గా పరిగణించబడ్డారు. అయినా సమాజంలో వీళ్లకి తిరుగులేని పరపతి కొనసాగింది. ధనవంతులు, అధికారులు, రాజులు, వీళ్లకి బ్రహ్మరథం పట్టారు. వీళ్ల పొందు సమాజంలో గౌరవప్రదంగా భావించబడింది. అందువల్ల వీళ్లకి అంతులేని ధనం సంప్రాప్తమయ్యేది. చదువు, సంస్కారం ఉన్న వాళ్లు కాబట్టి చెరువులు, గుళ్లు, గోపురాలు, సత్రాలు నిర్మించిన దాఖలాలు ఉన్నాయి. క్రమంగా ఆదాయం పెరగడంతో ప్రభుత్వం వీళ్లకి పన్ను సైతం విధించింది. విజయనగరంలో ప్రత్యేకంగా వీళ్లకు ఒక వీథే నిర్మించబడింది+.

ఒక్కొక్క వేశ్యాగృహం నుంచి వసూలు చేసిన పన్నుతో కొన్ని వందల సైన్యాన్ని పోషించగలిగేవాళ్లని, విజయనగర చరిత్రలో పొందుపరచబడింది. ఇలాంటి పరిస్థితిలో వాళ్లు అమిత భోగ పరాయణులు, విలాస జీవనులు కావడంలో ఆశ్చర్యంలేదు. విలాస జీవితానికి కూడా వీళ్లు ఆలంబనులయ్యారు. భోగైక పరాయణులకు వేశ్యలు లేనిదే పొద్దు పొడవదు. వీళ్లు కూడా తదనుగుణంగా తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోసాగారు. సంగీత, సాహిత్య, నాట్య, ద్యూత క్రీడాదులలో నెరజాణలై రూపలావణ్యాల్ని పెంపొందించు కోవడంలో జాగరూకులై, శృంగార రసాధి దేవతలుగా విలసిల్లారు. వృద్ధ వేశ్యలు తల వెంట్రుకలు నెరసినట్లు కనబడకుండా మందు వాడే

---

\+ సూళే బజారని (వేశ్యావాటిక) నేటికీ హంపిలో ఒక వీధిని పిలుస్తారు.

వాళ్లు. దానికే 'అపలితంకరణౌషధ'మనేవాళ్లు. వడచు వేశ్యలు విటులతో కలిసినప్పుడు ఇతరుల కంటబడకుండా 'అంజనం' పెట్టుకునేవాళ్లు. చీకటిని కవి ఇలా వర్ణిస్తున్నాడు.

"వృద్ధ వార విలాసినీ వినరమునకు
నవలితంకరణౌషధంబనగ జార
నలిన ముఖుల కదృశ్యాం జనంబనంగ
నంధకారంబు జగమెల్ల నాక్రమించె"
(పారి. 2-34)

వీళ్లలో కొంచెం తక్కువ విద్యాపాటవాలు కలిగిన వాళ్లని ధనవంతులు తమ ఇళ్ళలో సుకుమారమైన పనులు చేయడానికి దాసీలుగా వినియోగించుకునేవాళ్లు. ధనవంతులు అల్లుళ్లకు కట్నంగా తమ కూతుళ్ళతోపాటు అధిక సంఖ్యలో ఇలాంటి యువతుల్ని కానుకలుగా పంపటం గొప్ప మర్యాదగా పాటించబడేది. "ఇందీవరాక్షుడు తన కూతురు మనోరమను స్వరోచికిచ్చి వివాహం చేసి రథ, గజ, తురంగాదులతో పాటు వారకాంతల్ని వేయిమందిని కూతురుకు 'అరణం'గా ఇచ్చాడు. ఆ వారకాంతల అర్హతలివి. "జవ్వనంపు క్రొవ్వున నివ్వటిల్లి, మవ్వంపు వాతెఱలు విప్ప, నవ్వు నునుపోగ వెన్నెలలం గలసి పిసాళించు చంచల దృంగంచల ప్రభలం బచారించి, మెఱుంగు జన్నుల కన్నె తమ్మి మొగ్గల వన్నె నటమటించి పెన్నెఱుల మెఱుంగుల తుమ్మెద వన్నె దటమటించి, నెన్నడుముల విన్ను వెన్ను దన్ని, బటువు (గలిగి) మిగిలి, విటనికాయంబు రాయిడింబడి వుటవుటనైన కూలంకష చాటువుల, మాటకారి తనంబు మెరసి, నాగరికపు వనుల గరగరికల గల రవచ్ఛలాలాపాచరణంబుల రవణంబుల మినమినల బనగలిగి షేలిమైన కులుకుల రసిక జనంబుల మనంబుల మరులు కొలుపంజాలి, సురుచిరాభరణ భూషితంబగు పరిచారికా నహస్రంబును కూతునకు నరణంబుగా నిచ్చి" (మను. 5-101).

అరుణాస్పద పురంలోని వేశ్యలు నాట్యవిద్యలో రంభాది అప్సరనల్ని సైతం తలదన్నగలరట. "నచటి వెలయాండ్రు రంభాదులైన నౌరయ, గాసెకొంగున వారించి కడువగలరు, నాట్య రేఖాకళా దురంధర నిరూఢి" (మను. 1-50).

దేవవేశ్య అయిన వరూధిని తనను గురించి 'రాళ్ళు కరిగి పోయేటట్లు పాడగల సంగీతం మాకు విద్య. కామశాస్త్రానికి సంబంధించిన చిట్కాలు మాకు వెన్నతో పెట్టిన విద్యలు' అని అంటుంది.

"రహి పుట్ట జంత్రగాత్రముల తాల్ గరగించు
విమల గాంధర్వంబు విద్య మాకు
నన విల్తు శాస్త్రంబు మినుకు లావర్తించు
పని వెన్నతోడ బెట్టినది మాకు"
( మను. 2-43)

వరూధిని హావభావాల్ని, నియమ వ్రతాలకంటే వలచి వచ్చిన ఆమెను ఏలుకోవడం ధర్మబద్ధమని సయుక్తికంగా, సప్రమాణంగా వాదించే ఆమె మాటలు విని వినుగుతో ప్రవరుడామెను "కామశాస్త్రోపాధ్యాయినిలాగా వచించెదవు" అని తిరస్కరించాడు (మను. 2-64).

శ్రీవిల్లి పుత్తూరులో వేశ్యలు అరుగుల మీద కూర్చుని పాచికలు ఆడుతూ ఉంటారు. వాళ్ల గాజుల గలగలలతో పాచికలు ఆడుతూ ఉంటే సన్యాసికైనా గుండె జల్లుమంటుంది. వాళ్ల చేష్టా విలాసాలు కలవరపెడతాయి.22

వాళ్లు (ఆ వేశ్యలు) అందచందాల్ని చక్కగా వృద్ధిచేసుకోవడంలోను, విటుల్ని రాబట్టుకోవడంలోను నైపుణ్యం ఉన్నవాళ్లు. ఎలాగంటే తాంబూలం వేసుకున్నందువల్ల ఎరుపెక్కిన వాళ్ల పళ్ళు వెన్నెల లాగా మెరవడానికి ఒక వడ్లగింజతో తోముకుంటారు. అదిమినాగాని బట్టకు అంటకుండా ఒంటికి మాత్రమే పట్టేటట్లు పనుపు రానుకుని స్నానం

---

22. ఆము. 1-59.

చేస్తారు. చేతిలోనే పరిమళభరితమైన చందనపు పూతను పైటలో రెండు స్తనాలకు పలుచగా అంటుకునేటట్లు పూసుకుంటారు. రతిలో పాల్గొన్నప్పుడు హారం తెగి, ముత్యాలు కింద పడినా పట్టించుకోరు. తమ దగ్గరకు వచ్చిన విటుడు ఎలాంటివాడైనా సరే, మొట్టమొదట అతని కులం తెలుసుకోగలరు. తమకు అలవాటైన విటుడు కాలం కలిసిరాక చెడితే, అతన్ని ఆదుకుంటారు. వాళ్ల భవనాలు రాజుగారి బయట అంతఃపురాల మాదిరి ఉంటాయి. కావ్యాలు రాయడంలో కూడా వాళ్లు దిట్టలు.23

ఆ వారకాంతలు ముత్యాలహారం, ముత్యాల కటకాలు ధరిస్తారే తప్ప, చిలుం పడతాయని బంగారు నగలు ధరించరు. ఒంటికి 'కస్తూరి పూత'వాడుతారే కాని, జిడ్డవుతుందని 'పునుగు'ను తగలనీయరు. ధూపం పట్టుకుంటారే తప్ప, చెమ్మ అవుతుందని పూలు పెట్టుకోరు. సన్నని వస్త్రాలు ధరిస్తారే తప్ప, ఒత్తుకొంటాయని తక్కిన వస్త్రాలు ధరించరు. అలా చేయడం వాళ్లకి అత్యాధునికం కాబోలు.24

వేశ్యలు అక్రమ సంబంధాల్ని ఒక వృత్తిగాను, బహిరంగంగాను కలిగి ఉండగా, విటకత్తెలు (రంకుటాండ్రు) అదే పనిని రహస్యంగా చేసేవాళ్లు. వీళ్లలో పెళ్ళయినవాళ్లు, కానివాళ్లు కూడా ఉంటారు. వివాహిత స్త్రీలు పరపురుషులతో సంబంధాన్ని కలిగి ఉండటం తప్పుగా భావించినట్లు, వివాహిత పురుషులు పరస్త్రీలతో సంబంధాన్ని కలిగి ఉండడం తప్పుగా భావించనట్లు కనిపిస్తోంది. ఈ తత్వం నేటికీ కొన్ని మారుమూల ప్రాంతాల్లో అంతగా అభివృద్ధి చెందని కొన్ని తెగల్లో కొంతవరకు కనిపిస్తుంది.

అక్రమసంబంధాల్ని పెట్టుకున్న వీళ్లకి విటులతో పొందు కూర్చడానికి 'దూతిక'లనే చెలికత్తెలు సాయపడేవాళ్లు. వెన్నెలరాత్రిలో తన ప్రియుణ్ణి

23. అము. 1-60.
24. అదే. 1-61

కలవడానికి భయపడే ఒక జారిణికి 'దూతిక' ఎలా ధైర్యం చెబుతుంద్ి
చూడండి.

తెల్లనిచీర కట్టుకుని, ముత్యాలహారాలు వేసుకుని, చందనం ఒంటికి పూసుకుని, కొప్పులో తెల్లని జాజిపూలు పెట్టుకుని, వెన్నెల్లో నడిదారిలో వెళ్తూ తగిలితే కూడా ఎవరూ గుర్తుపట్టలేరు.25

వనుచరిత్రలో విటీవిటుల ధూర్త చేష్టలు విపులంగా వర్ణించబడ్డాయి (4-23లో). ఇదంతా మనుచరిత్రలోని (3-28) పెద్ద వచనానికి అనుకరణంగా కనబడుతుంది. మితిమీరిన వచ్చిశృంగారం ఇందులో చిత్రించబడింది. వెన్నెల రాత్రుళ్లు వాళ్లు మద్యాన్ని తాగి కైపులో తడబడడం మొదలైన చేష్టలు అనాటి నంఘంలో నిత్యకృత్యాలే!

వంచకావ్యాలలో పాండురంగమహాత్మ్యం తప్ప, మిగిలిన నాలుగు కావ్యాలలోను వేశ్యల గురించి, విటీవిటుల గురించి గొప్పగాను, కళాత్మకంగాను వర్ణించబడింది. వాటి గురించి దూషణ తిరస్కారాలు ఎక్కడా లేవు. కాని పాండురంగమహాత్మ్యంలో నిగమశర్మ అక్క అతనికి హితబోధ చేస్తూ, వారకాంతల అవగుణాల్ని ఇలా ఏకరువు పెడుతుంది. "దుశ్శీలాగారము, వారయౌవతము, నిస్సీమేటీ వాటించునే? (3-42). వారవనితలు చెడిపోయిన శీలానికి నిలయాలు. వాళ్ల పొందు మేలు కలిగించునా? వాళ్లెటువంటి వాళ్లంటే, నర్మగర్భోక్తులు, నక్కటక్కులు, వింత నయగారాలు, అనేక నాటకాలు, పిలుపిచ్చు విద్యలు, పికవన్నియలు, పెలుచదనంబులు, ప్రేలడములు, వక్రభావంబులు, వలకారిబాగులు, వలసియొల్లములు, వట్టివనలు, కేరడంబులు, పాళగింపులు, కిల్బిషాక్రీడనంబులు, (పావవువనులు) నడకించువగలు, బానపోననములు, విడంబములు, భ్రమలు లేని మచ్చిక మొదలైన దుర్గుణాలకు నిలయాలు. ఎల్లప్పుడూ విటులకు ద్రోహాన్ని తలపెట్టేవారు".26

---

25. పారి. 2-52.
26. పాండు. 3-43

ఈవిధంగా ఆనాడు సంఘంలో శృంగారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు కనబడుతోంది. అధిక సంతానం అవసరమైన ఆ రోజుల్లో ఈ తత్వం అవసరమనుకున్నారేమో! పెద్దలు, ఈ అవగుణాల్ని వాళ్లు గర్హించలేదు. కావ్యాలు, నాటకాల ద్వారానే కాకుండా, దేవాలయాల్లో శృంగార శిల్పాలు (బూతుబొమ్మల) ద్వారా, జాతరలు, ఆచారాల ద్వారా, వీటికి మరింత ప్రేరేపణ కలిగించారు. తాళ్లపాక అన్నమాచార్యులు, క్షేత్రయ్య లాంటి పదకర్తలు శృంగారాన్ని ఒక పవిత్ర కార్యంగా భగవంతుని పేరు మీదుగా వేనోళ్ళ పొగిడారు. పాటలు రాశారు. దాని పర్యవసానమే దక్షిణాంధ్ర వాఙ్మయంలో శృంగారం వెర్రితలలు వేసింది.

మొత్తం ప్రబంధాలలో తారసపడే పాత్రల్ని అధ్యయనం చేసి డా. పల్లా దుర్గయ్యగారు తమ ప్రబంధ వాఙ్మయ వికాసంలో అనాటి స్త్రీల వేష భూషణాదుల గురించి ఇలా వివరించారు.

"....నాటి స్త్రీలు ధవళాంశుకములను, చెంగావి వలిసెములను, ధరించు చుండిరి. వీరు ఏలుచని చీరెల లోపల 'దట్టములు' లేదా 'అంగ దట్టము'లనబడు కావిరంగు పావడాలను తరచు దాల్చుచుండిరి. వాని చెందిర కావిరంగు నన్నని వలిపములనుండి వెలికి ప్రకాశించు చుండెడిది. పుష్పాపచయమునకు గడంగినపుడు చెట్ల కొమ్మలకు వెంట్రుకలు తగుల్కొనకుండుటకై జడలు వేసుకొనేవారు. వస్త్రములు చిక్కుకొనకుండా చెరగులచే చనుకట్టులు బిగించువారు.

గాజులు రత్న కంకణములు, పాదములు ఘల్లుఘల్లను గండుమీల పెండెములు (నూపురములు) కాలివ్రేళ్లకు మట్టెలు, చెవులకు హాటక తాటంకములు, చేతివ్రేళ్లకు ఉంగరములు, వజ్రాల కమ్మ వంజులు. ముక్కుకు ముత్యాల ముంగరలు, నడుమున ముత్యాల మొలనూలు, తారహారాదులు, మున్నగు నాభరణములను, 'స్త్రీలు ముఖ్యముగా నలంకరించుకొనుచుండిరి. కన్నుల కాటుక, గోళ్లకు గోరింటాకు, బుగ్గలందు ఘనసార మిశ్రిత కస్తూరికా మకరికా పత్రములు, సింధూర

తిలకమును గాని, ఘనసార గంధమును గాని చుక్క బొట్టుగా పెట్టుకొనువారు. శుభ సమయములందు కుంకుమతో సేన బొట్టు తీర్చి దిద్దుకొను చుండిరి. రాజకుమారికలు, రాణులు, మున్నగువారు, వన్నీట జలకమాడి, కేశములకు కాలాగరు ధూమములిచ్చి, తడియార్చి జవ్వాది నూనియతో చిక్కులు విడదీసి దంతపు దువ్వెనతో దువ్వి, కొప్పు చుట్టి వానితో పచ్చకప్పురము చేర్చి, సిద్ధము చేయబడిన ఘనసార నూవకములంకరించు కొనుచుండిరి. వస్త్రాలంకారాదులను తెల్పు నీ భాగమునకు మనుచరిత్రమునందలి, 2-27; 3-09; 28, 31, 36. 28, 71, 83, 88, 4-68; 6-04; 5. 8. 31, వద్యములాధారములు.27 "స్త్రీలు ఆకాలమున వివిధములగు రంగులును, అంచులునుగల చీరలను కట్టి రవికలను తొడుగు కొనుచుండిరి. వారికి ముఖ్యాభరణములు - నత్తు, ముక్కర, వంకి కమ్మలు, నెత్తి బిళ్లలు, హారములు, దండకడెములు, కంకణములు, ఒడ్డాణములు, కాలికడెములు, కాలి వ్రేళ్లకు మట్టెలు, బొబ్బిలి కాయలు, మునల్మానుల ననుసరించి కొందరు పాంజేబులను, ధరించుచుండిరి. కొందరు భోగముసానులు మాత్రమే రంగు పావడాలను ధరించు చుండిరి. బ్రాహ్మణస్త్రీలు, వెనుక కొప్పు కలిగి, పసుపుబొట్టు పెట్టి, చీరె కాసెకట్టు కట్టి, చెవులకు లోలక్కాలను పెట్టుకొనుచుండిరి".28 నురవరం ప్రతాపరెడ్డి.

తర్వాతి ప్రకరణంలో పంచకావ్యాలలోని సాంస్కృతికాంశాల గురించి వివరించబడుతుంది.

---

27. ప్రబంధ వాఙ్మయవికానము. పు. 364 & 365.
28. విజ్ఞాన సర్వస్వం. 4వ సం. పు. 38.

"ముందర రకరకాల వాయిద్యాలు వాయించుకుంటూ వెళ్తున్నారు. మద్దెల, నుతిపోసెడి తిత్తి, ఆవజంబు, దండెతాళం, ఉరుమ (చర్మ వాద్యం), కిన్నెర (తంత్రీవాద్యం), నన్నుగాళె, వీణ, ముఖవీణ, చయ్యంకి (తాళం), పిల్లనగోవి, డోలు, నాదస్వరం, భేరి, గౌరు (పెద్ద కాళె), గుమ్మెట, డప్పు, డుక్క, చక్కి మొదలైన వాయిద్యాలు లెక్కలేనన్ని మోగుతున్నాయి. ఈ వాయిద్యగాళ్లకు ముందు భోగవు మేళం, నాట్యం చేస్తూ వెళ్తోంది. అప్పుడప్పుడు ఆ నాట్యగత్తెలు వెనక్కి తిరిగి చూస్తున్నారు. వాళ్ల కాలి అందెలు ఘల్లుఘల్లుమని మోగుతున్నాయి. మధుర నుంచి వందలాది ఏనుగులు, గుర్రాలు వచ్చాయి. వాటి మెడల్లో గంటలు మోగుతున్నాయి. అవీఇవీ ఒకేలాగున్నాయి. అలా సాగుతోంది ఆ గుంపు. ప్రత్యేక ఏనుగులు నడుస్తున్నాయి. వాటి వీపుల మీద రత్నకంబళాలు అలంకరించి ఉన్నారు. వాటి మెడలమీద రాజకుమారులు కూర్చుని ఉన్నారు. వాళ్ల చేతుల్లో బంగారు అంకుశాలు ఉన్నాయి. భోగవుమేళంలోని వయ్యారులు, వాళ్లని చూసి, వాళ్ల దృష్టిని ఆకర్షించడానికి ఆత్రపడు తున్నారు. ఒకరినొకరు తోసుకుంటూ, తలలు పైకెత్తి, చేతులెత్తి నమస్కరిస్తూ ఖిలానంగా చూస్తున్నారు. వాళ్లందరూ ఆ రాజకుమారులకు పరిచితులే. ఆ పట్టణానికి వచ్చినప్పుడల్లా వాళ్లతో కలవడం, తమకు అనుభవమే. అందువల్ల వాళ్లని ఆటపట్టించాలని అనుకున్నారు. తమ కింది ఉద్యోగులైన గ్రామీణులనబడే గ్రామాధికారులు తమకు కానుకలుగా అర్పించుకున్న నారింజపండ్లు, మొల్లలు, బంతులు మొదలైన వాటిని వాళ్ళ మీదకు విసరుతున్నారు. ఆ వేశ్యలు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వాలు చూపులతో కోపాన్ని నటిస్తున్నారు. కొప్పులు కదలుతున్నాయి. మద్దెల కొడుతున్న మార్దంగికుల వీపు చాటున దాక్కొంటున్నారు. మార్దంగికులు మద్దెల్ని ఒకసారి పైకి ఎత్తడం, ఒకసారి కిందకు వంచడం చేస్తుంటారు. అలా కిందికి వంగినప్పుడు ఇక దాక్కోడానికి వీలుకాకుండా బయటపడుతున్నారు. ముఖం వక్కకు తిప్పి, కొప్పు

నవరించుకుంటున్నారు. చేతులు అడ్డం పెడుతున్నారు. చెవిలో వేలాడుతున్న పూలు చెక్కిళ్ళమీద మెరుస్తున్నాయి. వాళ్ల నవ్వే నవ్వు వెన్నెల్లాగా ఉంటోంది. వాళ్ల వెంట ఉన్న వయసుమళ్ళిన వేశ్యలు ఆ రాజకుమారులకు నమస్కరిస్తున్నారు. కాని పడచులైన వేశ్యలు తమ శరీరాన్ని అంతకుముందే వాళ్లకర్పించి ఉండటంతో, సిగ్గుతో వాళ్ల చాటుకు తప్పుకుంటున్నారు. వాళ్లని ఆటపట్టించాలని ఆ యువకులు 'పెద్దవాళ్లైన మీరే నమస్కారం చేస్తున్నారు. అలాంటప్పుడు వీళ్లకేమిటి? వీళ్లని మాకు మొక్కమనండి' అని హెచ్చరిస్తున్నారు. రాజు అక్కడ లేకపోవడంవల్ల మిగిలిన సామాన్య జనుల్ని లెక్కచేయకుండా వాళ్లిలా ఉత్సాహాన్ని ప్రకటించేటప్పటికి, ఆ యువతులు సిగ్గుతో చిరునవ్వులు ఒలకబోస్తున్నారు. ఆ రాజ కుమారులతో తమకు సంబంధం ఉందనే విషయాన్ని గొప్పగా తమ తోటి వేశ్యలకు తెలియబరచాలనే ఉబలాటంతో విలాసంగా తమ పెదవి లోపలికి మడచుకుని కిసుక్కుమని నవ్వుతున్నారు. అది చూసి ముసలివేశ్యలు ఆ పడుచులు దారికి వచ్చారని సంతోషించి, తమకు ఆ రాజకుమారుల నుంచి అపారమైన సంపదలు లభిస్తాయని, ఆ సుందరాంగుల్ని ముందుకు తోసి 'అక్కక్కా! మొక్కవే! మన పాలిట దేవుళ్ళే' అని బుజ్జగించి, వినకుంటే కోపించి, చివరికెలాగో ఒప్పించగలిగారు. ఇక చేయక తప్పదని సిగ్గుతో, బెదురు చూపులతో, వేళ్లు ఎడమెడంగా ఉండేటట్లు నమస్కారం చేశామనిపించారు. తమ పట్టు నెరవేరినందుకు వృద్ధవేశ్యలు గొల్లుమని నవ్వుతున్నారు. వాళ్లని లేని కోపం తెచ్చుకుని, కొట్టినట్లు నటించి, ఆ రాజకుమారుల్ని చురచుర చూసి, మళ్లీ చాటుకు వెళ్తున్నారు. వాళ్ల చేతుల గాజులు గలగలమని మోగుతున్నాయి.

బుక్కాపొడి చల్లేవాళ్లని, 'బుక్కావాళ్లని', ' గంధకారు'లని అంటారు. వీళ్లు ఆంధ్రదేశం నుంచి ఆ శ్రీవిల్లి పుత్తూరుకు వచ్చినవాళ్లు. సుగంధద్రవ్యాల్ని తయారుచేయడంలోను, పూలమాలల్ని కట్టడం లోను సాటిలేనివాళ్లు. ముసలివాళ్లై, తమ ప్రాంతానికి వెళ్ళలేక ఆ

పట్టణానికి అలవాటు పడిపోయి, అక్కడి పౌరుల ఆదరాభిమానంతో బతుకుతున్నారు. వాళ్ల చెవులకు శంఖులతో చేసిన ఆభరణాలు ఉన్నాయి. వాళ్ల భుజాలు లోపలికి వంగి ఉన్నాయి. వంకర జుట్టు ముడులు, భుజాల మీద కావి దుప్పట్లు ఉన్నాయి. వికృత చేష్టలతో రాజుల్ని చిన్నచిన్న పద్యాలతో పొగడుతూ, ఏనుగులు, గుర్రాల మీద ఉన్న వాళ్ల మీద, విష్ణుచిత్తులవారి మీద, ముందు నృత్యం చేస్తున్న ఆ సందరీమణుల మీద పరిమళయుక్తమైన ఆ గంధపు పొడిని చల్లారు. కళ్లు కనబడనంతగా, సూర్యరశ్మి చొరబడనంతగా ఆ జన సమ్మర్థం నిండా బుక్కాపొడినిండి ఆకాశానికి వ్యాపించింది. పన్నీరు నిండిన తోలుతిత్తుల్ని ఒత్తగా సన్నని రంధ్రం గుండా ఆ నీళ్లు ఆకాశానికి ఎగజిమ్మబడి వంకరగా జనం మీద తుంపర్లుగా పడుతున్నాయి. ఆ నీళ్లు చర్మ వాయిద్యాలైన మద్దెల, డోలు, తప్పెట మొదలైన వాటి మీద పడి వాటి శబ్దం సరిగా రాలేదు. వాటిని మళ్లీ కావడానికి ఆ వాయిద్యగాళ్లు మంట కోసం వెతుకుతున్నారు. ఊరేగింపు అలాగే సాగుతోంది. నృత్యం చూస్తూ ఆ గుంపులో ఉండే కుర్రకారు, అందమైన యువతులు (విటీవిటులు) మెల్లగా నడుస్తున్నారు. వాళ్లు అవకాశం చూసుకుని తాము తెచ్చుకున్న చద్ది అన్నం తినడానికి ఎర్రకలువలున్న కాలువల దగ్గరకు చేరుకున్నారు. ఆ కాలువలు దారికి ఇరువైపులా ఉన్న తోటలకు పారుతున్నాయి. ఆ తోటలు తెల్లని రెల్లుగడ్డి వెన్నులతో చుట్టబడి చూడముచ్చటగా ఉన్నాయి. వాళ్లు తెచ్చుకున్నది వరి అన్నం. అందులో గేదె పెరుగు, మీగడ వేసి నారింజ అల్లం ముక్కలు కలిపి కట్టారు. దానిని పోకమట్టల్లో పెట్టుకుని తింటున్నారు. అక్కడక్కడ తిరిగి బాగా అలసిపోయి ఆకలితో నకనకలాడుతున్న దానరులు వాళ్లని అడుగుతూ పెట్టింది తింటున్నారు. ఆ కాలువలకు దగ్గర్లో పెద్ద పెద్ద దీప స్తంభాలున్నాయి. (దివెదారి కోలలు) వాటి గుండ్రని రంధ్రాల్లో నుంచి జ్వాలలు వస్తున్నాయి. ధగధగమండే 'జగజ్జ్యోతు'లనబడే ఆ దీపాల మధ్య ధూప కుండికల (పరిమళ ధూపాన్నిచ్చే పాత్రల)

నిప్పుల మీద అంతకుముందు పన్నీరు పడి తడిసిన వాయిద్యాల్ని కావుకుంటున్నారు. శబ్దం సరిగా వస్తుందో, లేదో అని చూడడానికి వాటిని కొద్దిగా కొట్టినప్పుడు దారికి అటువైపు ఉన్న తోటలలోని పచ్చని చిలుకలు బెదరిపోయి ఇటువైపుకు, ఇటువైపు ఉన్న తోటలలోని చిలుకలు అటువైపుకు బారులుగా వెళ్తున్నాయి. అవి చూడడానికి పచ్చని తోరణాల్లా ఉన్నాయి. హరిదాసులు పదాలు పాడుతూ వస్తున్నారు. కాని ఆ జనం కోలాహలానికి అవేమీ వినబడడం లేదు. వాళ్లనోరు తెరవడం, చేతులు, తల తిప్పడం మాత్రం కనబడుతోంది. మూగవాళ్లు సైగలు చేస్తున్నట్లుగా వాళ్లు కనబడుతున్నారు.

ఆ పట్టణం సాలెవాళ్లు, కంసాలివాళ్లు, పట్టుసాలెలు ఒక జాతి కోమట్లు(వానెవాళ్లు), సాతులు (గోనెసంచులు నేసేవాళ్లు) ఏతుల (చాపలల్లేవారు) కులాలకు చెందిన కుర్రవాళ్లు చిన్నచిన్న గుర్రాల మీద ఎదురుగా వస్తున్నారు. ఆ చిన్న గుర్రాల్ని ఊరూరి సంతలకు సరకులు వేసుకుని వెళ్ళడానికి వాళ్ల పెద్దవాళ్లు వాటిని ఉపయోగిస్తారు. అవి 'గోడిగ'లనే అరి గుర్రాలకు వాళ్లింటనే పుట్టినటువంటివి. వాటిని ప్రత్యేక శ్రద్ధతో పెంచుతారు. కాలికి తాళ్లు కట్టి (అక్కడక్కడే తిరిగేటట్లు) మెత్తని గరిక ఉన్నచోట మేపుతారు. ప్రతి సాయంకాలం మంచి దానాపెట్టి పుష్టిగా తినిపిస్తారు. తోమడానికి ప్రత్యేకంగా చేసిన పిడక గొరపాలతో వాటి ఒళ్ళు బాగా తోమబడడంతో అవి నిగనిగలాడిపోతున్నాయి. ఏ కొంచెం పాత కంబడి పేలికల్ని చూసినా, నీడ చూసినా అవి బెదరుతున్నాయి. వాటికి కాళ్ల కింది దాకా వేలాడేటట్లు వీపున లాలుకుంచెలు (ఎర్రకుంచెలు), మెడలో గంటలు, గవ్వల దండలు వేశారు. నల్లదామ చెక్కను కాచి తయారుచేసిన నల్లమడ్డిలో దొల్లుటుల్లాడులు (వేలాడే జాలర్లు) నానబెట్టి, వాటిని మూరకొకటి, జానకొకటిగా కుట్టి, వాటిని అలంకరించిన జీనుల మీద చిల్లతైలం వాసన కొడుతున్న పుల్ని పూసి ఉన్న ఉతికిన తెల్లవస్త్రాల్ని కప్పారు. అవి ఆ ఊరేగింపులోని సైన్యానికి

సంబంధించిన పెద్దపెద్ద ఏనుగుల్ని చూసి భయపడి పారి పోతున్నాయి. వాటి పగ్గాల్ని ఎంత బిగబట్టుకున్నా ఆపడానికి సాధ్యం కాలేదు. ఆ వేడుకను చూడడానికి వచ్చినవాళ్లని తొక్కుకుంటూ ఆ కుర్రాళ్లతోపాటు అవి పరుగెత్తుతున్నాయి. ఆ గుంపులోని స్త్రీలు, వృద్ధులు, బలహీనులు ఆ గుర్రాల వాళ్లని తెగ తిడుతున్నారు. ఏమీ అనలేక ప్రాణాలు బిగబట్టుకుని పోతున్నారు. అవి కొత్తగా మన్నిన బురదమళ్లలోకి వెళ్ళి తొడల వరకు దిగబడి ఇక ముందుకు వెళ్ళలేక అటూ, ఇటూ చూస్తున్నాయి. ఆ యువకులు ఆ బురదలో దిగలేక నలువైపులా చూస్తున్నారు. వాళ్లని చూసి వగలాడి వేశ్యలు, వెక్కిరిస్తూ ఓహో! అని చప్పట్లు చరుస్తున్నారు. ఆ శబ్దాలు దగ్గర ఉన్న ఉపవనాల్లో ప్రతి ధ్వనిస్తున్నాయి".1

ఇక ఉత్సవాలు, రథోత్సవాలు ఆరంభమైన నాటి నుంచీ పూర్తి అయ్యే వరకూ ఆ గ్రామవాసులు ఊరు విడిచి వెళ్ళేవాళ్లు కాదు. అలా వెళ్ళడం అపచారంగా భావించేవాళ్లు. దీనికి దృష్టాంతం ఆముక్తమాల్యదలో వర్షాకాల వర్ణనలో సూచించడమైంది. "మెరుపుతో కూడిన మబ్బు వర్షిస్తోంది. గాలికి వర్షధారలు ఏటవాలుగా పడుతున్నాయి. ప్రజలంతా తడిసి మోపెడై, అటూ, ఇటూ తిరుగుతున్నారు. ఇళ్లల్లో నుంచి జనం బయటికి కదలడం లేదు. ఇది ఎలా ఉందంటే, ఆ మేఘం ఇంద్రుడి రథంగాను, వర్షధారలు దానిని లాగే మోకులుగాను, గాలులు ఆ రథాన్ని లాగే ప్రజలగాను, ధారలు సాగే వైపుకు మేఘం కదలడం రథం పోతున్నట్లుగాను, తడిసిన ప్రజలు రథమీద్ధే తొక్కిసలాటలో కలిసిపోయే ప్రజలుగాను, మిగిలిన ప్రజలు వర్షం వెలిసే వరకు బయటకు రాకుండా ఒదిగి పోవడం, ఉత్సవాంతం దాకా వేరే ఊళ్లకు వెళ్ళకుండా ఉత్సవ స్థలమందే ఉండడంగాను ఉత్ప్రేక్షింపబడింది.2

1. ఆము. 4-35.
2. అదే. 4-93.

జాతరకు సంబంధించిన వర్ణన పాండురంగమహాత్మ్యంలో ఉంది. రథోత్సవాలు ప్రతి సంవత్సరం నియమిత రోజున క్రమం తప్పకుండా జరుగుతాయి. కాని జాతరలు సాధారణంగా పరిస్థితుల్ని బట్టి ఎప్పుడో ఒకసారి ముఖ్యంగా ఆ గ్రామానికి అరిష్టాలు, పశువులకు, మనుషులకు మామూలుగా నయంకాని జబ్బులు కలిగినప్పుడు మాత్రమే జరపాలని చాటిస్తారు. ప్రతి గ్రామానికి ఒక శక్తి(దేవత) గుడి ఉంటుంది. అక్కడ జంతు బలులు జరుగుతాయి. ఆ వేడుక చూడడానికి చుట్టుపక్కల పల్లెల నుంచి జనం తండోపతండాలుగా వస్తారు. పల్లెటూరి పడుచులు తమదైన పద్ధతిలో (మోటుగా) సింగారించుకుని వస్తారు (స్త్రీల వేషధారణలో వీళ్ల సింగారం తెలియజేయబడింది). వీళ్ల భర్తలైన రెడ్లు మోటు అలంకారంతో వస్తారు. శక్తిగుడి దగ్గర బత్తులు (భక్తులు) మెరిసే కత్తులతో పశువుల (గొర్రెలు, మేకలు, దున్నపోతుల) తలల్ని నరుకుతారు. రక్తధారలు భయంకరంగా కారుతాయి. పురుషులే కాకుండా, స్త్రీలు కూడా విశేషంగా కల్లు తాగి మైకంతో ఊగిపోతారు. తర్వాత మొక్కుబడులు చెల్లిస్తారు. ఇవి రకరకాలుగా ఉంటాయి. కన్నులు, ముక్కులు, చేతులు, కాళ్ళు మొదలైన అవయవాల వంటి తొడుగులైన వెండి ఆభరణాలు, చీరెలు, రవికలు, బోనం మొదలైనవి సాధారణాలు. ఇక అసాధారణమైన మొక్కుబడులు కూడా ఉన్నాయి. సిడిప్రేలుట, గుండంలో మండే నిప్పుల మీద చిందులు తొక్కడం, మంటల్లో దూకడం లాంటివి".3

'సిడిప్రేలడ'మంటే పొడవైన వెదురుగడ చివర గుండ్రంగా తిరగడానికి వీలుగా అమర్చబడిన ఇనుప కొక్కెను శరీరానికి గుచ్చుకుని, గాలానికి చిక్కుకున్న చేపలాగా వేలాడడం. 'మూపున కందలివ్వడం' అనేది శక్త్యారాధనలో ఒక అంశం. కొరడాతో చరచుకోవడం, ఇనుపకడ్డీలు పొదిగించిన పావుకోళ్ళ మీద నిలబడడం, నాలుకకు దాకు గుచ్చు

---

3. పాండు. 3-75 నుంచి 79 వరకు.

కోవడం, ఇరుదవడలకు దబ్బనాలతో పొడుచుకుని, వాటిలోనుంచి దారాన్ని లాక్కోవడం లాంటి భయంకర చర్యల్ని నేటికీ వీరశైవారాధకులు బీజాపూర్, గుల్బర్గా మొదలైన ప్రాంతాల్లో చేయడం కనిపిస్తుంది. శక్త్యారాధకులు దాదాపు ఇలాంటి విధానాల్నే పాటించడం రాయలసీమలో చూడొచ్చు.

"సాధారణంగా ప్రజల్నీ, పశువుల్నీ గాయీగత్తరా పీడించినప్పుడు, ఊరికేదైనా రుగ్మరూపమైన అరిష్టం కలుగుతున్నదన్న శంక తోచినప్పుడు, వర్షాభావం వల్ల జనులు కష్టాలపాలవుతున్నప్పుడు ఈ పండుగల ప్రాముఖ్యం తలయెత్తుతుంది. ఇటువంటి ఉద్దేశంతో ప్రారంభించే వాటిల్లో జానపదులు ముఖ్యంగా గుర్తించి గౌరవించేది 'జాతర'."....( ఈదెమ్మ కథల్లో) ఎక్కడ చూచినా పటాల వందిళ్ళు వెలిశాయి. జమిడికెల్ని వాయించే బైనీండ్లు, మనస్సుకు గుబులు పుట్టించేలా తిరుగసాగారు. పోతురాజుల ఆటోపం ఎక్కువగా కనిపించింది. కొఱ్ఱునెక్కి ఆడేవారు, దివ్వెలవారు, గావులవారు, బారుకటార్లు ధరించినవారు, పగ్గాలు పట్టుకొన్నవారు, సిడిలెక్కి ఆడేవారు, ఎక్కడ చూచినా కనిపించసాగారు. అమ్మవారి ప్రీతికోసం కుతికిన ఱంపాలు జోపుకున్నవారు, గుండెల్లో గాలాన్ని దిగేసుకున్న వారు, నాలుక మడిచి ఇనుపకొక్కీలు తగిలించుకొన్న ధీరులు, నడినెత్తిన కొర్రులు దాల్చిన వీరభక్తులు; నేల యీనినట్లు ఎక్కడ బడితే అక్కడ ప్రత్యక్షం కాసాగారు. వీరికి తోడు అభేరీడమామీలు, బిరుదు మద్దెల్లు, బూరగొమ్ములు, ఢక్కాలు, తప్పెట్లు, సింగినాదాలు, చిఱుత వీణెలు, జేగంటలు, చేపిడి గంటలు, రుంజలు, జమిడికెలు, ఇవన్నీ ఘోరున మ్రోగసాగాయి. పల్లెపట్టుల్లో జరిగే ఏ జాతర చూసినా, పై వర్ణనకు చాలా చక్కగా సరిపోయే విధంగానే కనిపిస్తుంది".4

*వ్రతాలు* :- దక్షిణ భారతదేశ సంస్కృతిలో మొదటినుంచీ ప్రతి విషయంలోను ఆర్య, ద్రావిడ సంప్రదాయాలు ఒకటిగా పెనవేసుకుని

---

4. పల్లెప్రజలు-పండుగలు; పరిశీలనా వ్యాస సంకలనం. పు. 82. డా. నాయని కృష్ణకుమారి.

వర్ధిల్లినవనేది జగమెరిగిన సత్యం. అలాగే భాషా విషయంలోను, వేష భూషణాదుల్లోను, ఆచార వ్యవహారాల్లోను, ఆహార, విహారాల్లోను, ఇది అడుగడుగునా గోచరిస్తుంది. ఈ దిశగా గమనించినప్పుడు జాతరలు పురుషులు, మొక్కుబడులు, బలి విధానాలు, ద్రావిడ సాంప్రదాయాలుగాను, రథోత్సవాలు, పూజలు, వ్రతాలు ఆర్య సాంప్రదాయాలుగాను చెప్పుకోవచ్చు. మరికొన్ని ఉభయ సంప్రదాయాల్ని మేళవించినవీ ఉన్నాయి. వివాహ విధానం, కొన్ని క్రీడలు ఈ వర్గానికి చెందినవిగా చెప్పుకోవచ్చు. పల్లీయులు, పామరజనాల్లో ద్రావిడ సాంప్రదాయాలు చోటు చేసురుని ఉండగా, నాగరికుల్లో ఆర్య సాంప్రదాయాలు చోటు చేసుకున్నాయి. రోగాలు, అకాల మృత్యువులు, నష్టాలు, ప్రమాదాలు మొదలైన పీడల నివారణార్థం కొన్ని వ్రతాలు నిర్దేశించబడ్డాయి. అలాగే భర్తల్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకోడానికి కూడా వ్రతాలు అమల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి వాటిల్లో 'పుణ్యకవ్రతం' ఒకటి.

దీని విధానం గురించి 'పారిజాతాపహరణం'లో ఉంది. నారదడు సత్యభామకు దీని విధానం గురించి ఇలా ఉపదేశిస్తాడు. "తెలతెల వారుతుండగా మౌనంగా నదికి వెళ్ళి, స్నానం చేసి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి, భూషణాదుల్ని అలంకరించుకోవాలి. శరీరానికి సుగంధలేపనాన్ని అలముకుని, కొప్పులో పరిమళభరితమైన పుష్పాల్ని తురుముకోవాలి. అత్తమామలకు, భర్తకు నమస్కరించి, వాళ్ల అనుమతితో తన సవతులంతర్నీ ఆహ్వానించాలి. ఒకవేళ వాళ్లపట్ల మొదటి నుంచి ఏదైనా ద్వేషభావం ఉంటే, దాన్నంతా మరచిపోవాలి. చైత్రశుద్ధ నవమి మొదలు నెలరోజుల దాకా ప్రతిరోజూ పదివేల మంది ముత్తైదువుల్ని పూజించి, మంచి సుగంధ ద్రవ్యాలు, కొత్త పట్టుబట్టలు సమర్పించుకోవాలి. సదాచార సంపన్నుడు, గొప్ప విద్యావంతుడు, నియమవ్రతుడు అయిన ఆచార్యుని గురువుగా ఎన్నుకోవాలి. అతనికి ఏనుగులు, గుర్రాలు, వస్తువాహనాలు, అసంఖ్యాకంగా ఇచ్చుకోవాలి. వాటితోపాటు నీ పెరటిలో ఉన్న

కల్పవృక్షాన్ని అతనికి ధారాదత్తం చేయాలి. తర్వాత అతనికిష్టాలైన వాటిని సమర్పించుకుని, తిరిగి నీ భర్తను పొందాల్సి ఉంటుంది. ఇలా చేస్తే సతీపతులిద్దరూ పుత్రపౌత్రాభివృద్ధిగా ఆయురారోగ్య సౌభాగ్యాలతో వర్ధిల్లుతారు".5

ఇంకా ఇలాంటి అనేక రకాలైన వ్రతాలు ఆచరించటంలో నాటి సంపన్న గృహస్థులు ఉత్సాహం చూపేవారని తెలుస్తోంది.

*వివాహం* :- సాంఘికజీవన పరిశీలనలో వివాహం చాలా ప్రధాన మైంది. దీనికి చెందిన విశేషవివరణ మనుచరిత్ర, ఆముక్తమాల్యద, వసుచరిత్రలల్లో ఉంది. అలంకారాలు ప్రయోగించడంలోనేగానీ, విషయప్రకటనలో వైవిధ్యం లేదు. పెళ్ళి ముహూర్తం నిర్ణయించు కోవడం, లగ్నపత్రికలు రాయించి, వేగంగా పోగలిగిన సేవకులతో పంపడం, పెళ్ళి వధువు ఇంట్లోనే జరపడం, వరుడు వధువు ఇంటికి సపరివారంగా వెళ్ళేటప్పుడు 'ఉల్లడం' పట్టడం, వివాహోచిత వస్త్రధారణ, బాసికాలు కట్టడం, ముహూర్తం సమీపించే వరకూ వధూవరుల మధ్య తెరపట్టడం, మాంగల్య ధారణం, సన్నెకలు తొక్కించటం, అరుంధతీ దర్శనం చేయించడం మొదలైనవి అన్నిట్లోనూ ఒకేలాగా ఉన్నాయి.

వసురాజుకు గిరికను ఇవ్వమని అడగడానికి అతని పరంగా ఇంద్రుడు వెళ్తాడు (వసు.4-119). వరుడు వధువు కంటే తానెంత గొప్పవాడైనప్పటికీ సంశయించేవాడు కాదు. తనతో సమానంగా ఆమె ఉండాలని పట్టుబట్టేవాడు కాదు. అందుకు ఆనాడు సంఘంలో గౌరవప్రదంగా ఎంచబడే బహుభార్యాత్వమే కారణం కావచ్చు (పాండు. 3-41) కాని వరుడు వధువుకంటే తక్కువ గుణశీలం ఉన్నవాడని తెలిస్తే, వధువు తల్లిదండ్రులు ఒప్పుకునేవాళ్లు కాదు. ఇక కుల ప్రసక్తి సరేసరి. తన కూతురైన 'విభావరి'ని ఇవ్వమని అడగడానిక

5. పారి. 5-55 నుంచి 61 వరకు.

వచ్చిన 'దేవాపి' అనే గంధర్వుణ్ణి 'పౌరుడ' నే బ్రహ్మర్షి నోటికి వచ్చినట్లు తిట్టి పంపుతాడు (మను. 6-43). ఇటువంటి వాతావరణం ఉండబట్టే అనాడు సర్వసాధారణంగా 'గొప్పవాళ్లింటికి కూతుర్ని ఇవ్వాలి. బీదవాళ్లింటి పిల్లను చేసుకోవాలి' అనే సామెత వాడుకలోకి వచ్చింది. ఎవరెన్ని చెప్పినా ఈ అంతరమే రానురాను సమాజంలో పురుషాధిక్యతకు మూలబీజమైంది. వైవాహిక సంబంధంలో స్త్రీ, పురుషుల మధ్య ఏర్పడ్డ ఈ అగాధమే, సతీసహగమనం, వైధవ్యం లాంటి అమానుష సంప్రదాయాలకు దారితీసింది.

ఉదాహరణకు వసుచరిత్రలో గిరిక, వసురాజుల వివాహం జరిగిన తీరు ఇలా సాగుతుంది: కొత్తగా నిర్మించిన నగరాన్ని అలంకరించారు. బంగారు ఆకులమీద పెళ్ళిపత్రికల్ని రాయించి సమస్త రాజులకు పంపించారు. వాళ్లంతా సంతోషంగా వివిధ కానుకలతో వచ్చారు. అనేక మంగళతూర్య రవాలతో భూమ్యాకాశాలు దద్దరిల్లాయి. ఇంద్రుడి అనుమతితో సప్తఋషుల పత్నులు పెద్ద హరివాణాల్లో (పళ్ళెరాల్లో) పచ్చని గరిక, ఫలాలు, పీతవర్ణచందనం, ఆకులు, వక్కలు, అక్షింతలు తీసుకుని వచ్చారు. ముత్తైదువలు పెళ్ళిపాటలు పాడారు. సున్నం పూసిన జాజాల మూకుళ్ళతో, కొత్తకుండలతో, పారిజాత వృక్షంతో, అప్సర స్త్రీలతో, ఇంద్రుడి భార్య శచీదేవి వైభవంగా వచ్చింది. అప్సరసలు పెళ్ళికొడుక్కి తలంటి, మంగళ స్నానాలు చేయించారు. చెలికత్తెలు అతని కురుల తడి తుడిచి దివ్యాంబరాలు తొడిగించారు. కుబేర, శచీ, దేవేంద్ర, సముద్ర, గరుత్మంత, వరుణ, జయంతులు వరుసగా సమర్పించిన కిరీటం, ముత్యాల బాసికం, అంటుపోగులు ముత్యాలహారం, భుజాలంకారం, చేతికడియాలు, గండపెండేరం, చంద్రకావి పట్టు శాస్త్రాన్ని ధరించాడు. ఒక దేవతా స్త్రీ అతని ముందు అద్దం ఉంచింది.

ఇక అక్కడ గిరికకు మంగళ స్నానం చేయించి, తడి తుడిచి దివ్యాంబరాలు కట్టించారు. కల్పవృక్షం నుంచి ప్రసాదించబడిన అనేక

రకాలైన సొమ్ములు అలంకరించారు. కాటుక పెట్టి, చుక్కను తీర్చి, బాసికం కట్టి, పెళ్ళి కూతురుగా సింగారించారు.

బృహస్పతి ముహూర్తం సమీపిస్తున్నదనగానే నలువైపులా ముత్తైదువల పాటలతో, వందిమాగధుల స్తుతులతో వసురాజు తెల్ల ఏనుగును అధిరోహించాడు. మణులతో కూడిన అతి విశాలమైన తెల్లగొడుగుల మధ్య వివిధ వాయిద్యాలతో దిక్కులు అదిరేటట్లు ఉన్నాయి. చందన తైలంతో అసంఖ్యాకమైన దీపాలు వెలుగుతూ ఉన్నాయి. సాంబ్రాణి పొగ దట్టంగా అలుముకుంది. దానికి తోడు తెల్లగొడుగుల నీడల చీకట్లు అలముకున్నాయి. వాటిని పోగొట్టడానికి సూర్యచంద్రాగ్నులో అనేటట్లు చిత్ర యంత్రాకారాలతో వేడుక కోసం నిర్మించబడిన అగ్ని యంత్రాల కాంతిపుంజాలు దట్టమై పట్టపగలు చేశాయి. మంగళద్రవ్యాలు కలిగిన పాత్రలు పట్టుకుని నడుస్తున్న మెరుపు తీగెలవంటి దేవతా స్త్రీల మీద శరత్కాల మేఘం లాంటి తెల్లని 'ఉల్లడం' పట్టుకున్నారు. కొందరు సుందరాంగులు పూలమాలలతో అలంకరించబడిన నల్ల చెరకుగడల్ని పట్టుకుని ముందు భాగాన నడుస్తున్నారు. మరికొందరు వారవనితలు దేవభామనుల్ని మించేటట్లు అతి చాకచక్యంగా నాట్యం చేస్తూ, ముందు నడుస్తూ ఉన్నారు. ఆకాశం నుంచి దేవతలు కురిపిస్తున్న పారిజాత పుష్పపరాగధూళి జన సందోహం మీద దట్టంగా పడుతోంది. చక్రాకృతి కలిగిన తొట్లను అమర్చిన యంత్ర విశేషాల్లో తిన్నగా తిరిగే స్త్రీలు మన్మథ బాణాల్లా కనబడుతున్నారు. బంగారు చప్పరాల (పందిళ్ల) మీద యంత్ర పాంచాలికలు (కీలుబొమ్మలు) అందంగా అమర్చబడ్డాయి. అవి మద్దెల మోతలకు అనుగుణంగా తమంతట తామే నాట్యం చేస్తున్నాయి. కనురెప్పల్ని కొట్టలేని ఆ బొమ్మలు అనిమిష (దేవ) కాంతల్లా కనబడుతున్నాయి*. అక్కడ ఉండే భోగపుకాంతల మదగజయానం తమకు లేనందునేమో! దేవతాస్త్రీలు

---

* దేవతలు రెప్పలు కొట్టరనడం, వారి పాదాలు భూమిని తాకవనడం ప్రసిద్ధం.

సిగ్గుతో తమ పాదాల్ని భూమి పైన మోపకున్నారు. జన సమ్మర్దాన్ని నియంత్రిస్తున్న దండధరులు యమునిలాగా ఉన్నారు. అనేక భద్రగజాశ్వాలు నడుస్తున్నాయి.

పరిమళజలంతో రాజబంధువులు వసంతాలు ఆడుకుంటున్నారు. వందిమాగధులు బిగ్గరగా వసురాజు బిరుదావళుల్ని చదువుతూ ఉన్నారు. అందుకు మెచ్చి మిత్రామాత్య బంధు పురోహితాదులు వాళ్ళకి అసంఖ్యాక ధనకనక, వస్తువాహనాదుల్ని బహుకరిస్తున్నారు. వీరిలో కొందరు 'వీరతాండవం' చేస్తూ ముందుకు సాగుతున్నారు.

ఇలా ఊరేగింపుగా వస్తున్న వసురాజును పురస్త్రీలు ఇళ్లమీద నుంచి తహతహతో చూస్తున్నారు. అతని మీద పరిపేలాలు చల్లుతున్నారు. ఆప్త బంధువులతో, ఆకాశగంగ మొదలైన నదీమతల్లులతో పాటు కోలాహలుడు వాళ్ళకి ఎదురు వచ్చాడు. ఇంద్రుడు గిరికకు ఓలిని (కన్యాశుల్కాన్ని) ధనరాశుల రూపంతో తెచ్చి నిలిచి ఉన్నాడేమో! అనేటట్లు రోహణాచలం మేరుపర్వతంతో పాటు పెళ్ళికి వచ్చింది.

వసురాజు తెల్ల ఏనుగును దిగి అమాత్యులు దారి చూపుతుండగా చోపుదారులు (వేత్రహస్తులు) పరాకులు చెప్పుతుండగా మణులు పొదిగించి గట్టిగా చేయబడిన దారిగుండా సాగుతున్నారు. స్త్రీలు మంగళగీతాలు పాడుతున్నారు. హారతులు పడుతున్నారు. పాద్యం సమర్పిస్తున్నారు. ఇరువైపులా అరటి స్తంభాల్లోని పండిన ఫలాలు మధుపర్కం అర్పించగా కల్యాణ వేదికను చేరాడు.

కోలాహలుడు అల్లుడికి శాస్త్రోక్తంగా కామధేనువు పెరుగుతో కల్పవృక్ష పుష్పమంజరుల మకరందాన్ని కలిపి మధుపర్కం ఇచ్చారు. గిరికను ముత్తైదువలు తీసుకుని వచ్చారు. వాళ్ల దంపతుల మధ్య ఎర్రని పట్టుతెరను పట్టుకున్నారు. బృహస్పతి వేదమంత్ర విహితాలైన కంకణాల్ని దంపతులిద్దరికీ కట్టించాడు. ఇంతలో మునిశ్రేష్ఠులు ముహూర్తం సమీపిస్తోందని తెలిపారు. అప్పుడు కోలాహలుడు గిరికను వసురాజు పాణిగ్రహణం చేయించాడు. గిరిక సిగ్గుతో

తలవంచుకుంది. ఆమె తల మీద సూర్యచంద్రుల ఆకారం కలిగిన ఆభరణాలున్నాయి. సిగ్గుతో అలా వంగినప్పుడు ఆ సూర్యచంద్రుల బొమ్మలు ఆమె ముత్యాలహారంలో ప్రతిబింబించాయి. అప్పుడామె మెడలో రాజు మంగళసూత్రం కట్టాడు. ముత్తైదువల సహాయంతో గిరిక రాజు తల మీద తలంబ్రాలు పోసింది. తర్వాత ఆజ్యయుక్తంగా అగ్నికి హోమం జరిగింది. గిరిక పేలాలు హోమంలో చల్లింది. వసురాజు గిరిక పాదాల మీద సన్నికలు తొక్కాడు. తర్వాత దంపతులిద్దరూ అరుంధతీ దర్శనం చేసుకున్నారు. వాళ్లిద్దర్నీ వేదపండితులు అగ్నికి ప్రదక్షిణం చేయించారు. పెద్దల దీవెనలతోటి అక్షింతలు దంపతుల మీద చల్లారు. అందరికీ షడ్రసోపేత భోజనాలు ఏర్పాటు చేశారు. ఇంద్రుడు సాటిలేని మణుల్ని, వస్త్రాల్ని వధూవరులకు కట్నంగా చదివించాడు. కోలాహలుడు గజహయాల్ని అల్లుడికి వేలసంఖ్యలో అర్పించాడు. శుక్తిమతి అనేక మణులతోపాటు 'వసుపదు'డనే తన కుమారుణ్ణి కూడా అల్లుడికి అప్పగించింది. వసురాజు అతన్ని తన సైన్యాధ్యక్షునిగా చేసుకున్నాడు. అంతలో చంద్రుడు అస్తమించాడు. ఇలా నాలుగురోజులు వివిధ హోమాలతో సకల దేవతలు వాళ్లిద్దరికీ సకల శుభాలనిచ్చి స్వర్గానికి వెళ్ళారు.

కోలాహలుడు గిరికను కౌగలించుకుని హితబోధ చేశాడు. శుక్తిమతి తన కూతుర్ని ఓదార్చింది. వసురాజు భార్యతో పాటు దివ్యరథంలో ఆకాశ మార్గాన తన పురానికి బయలుదేరాడు. పౌరులందరూ మిద్దెలు, మేడలు, గోపురాలనుంచి ఆ వైభవాన్ని చూడసాగారు. ఇలా వసురాజు గిరికతోపాటు తెలిదివి నుంచి తన భవనం చేరుకున్నాడు.6

"ఎంతటి గొప్పవాళ్లయినా వరుడి పక్షం వాళ్లే వచ్చి వధువును ఇవ్వమని అడగాల్సి ఉండేది. ఎంత దేవుడైతే మాత్రం తనను అడుగకుండా తన కూతుర్ని దొంగలించాడని విష్ణుచిత్తుడు శ్రీరంగనాథుణ్ణి నిందించి 'కుయ్యో! మొర్రో!' అని తనకు న్యాయం

---

6. వసు. 5-40 నుంచి 6-40 వరకు.

చేయమని అందర్నీ అభ్యర్థిస్తాడు.7 చేసేది లేక శ్రీరంగనాథుడు తనకు గోదాదేవిని ఇవ్వమని విష్ణుచిత్తుణ్ణి అభ్యర్థించడానికి బ్రహ్మ రుద్రుల్ని, బ్రాహ్మగౌరుల్ని పంపుతాడు.8

*విద్య* :- వివాహం తర్వాత చెప్పుకోదగింది విద్య. నాటి విద్యా విధానమంతా గురువుల్ని ఆశ్రయించి ఉండేది. ఛందో వ్యాకరణాది శాస్త్రాలతోపాటు వైదిక విద్యలు బోధించబడేవి. విద్య అగ్రవర్ణాలకు మాత్రమే పరిమితమై ఉండేది. అందులోనూ బ్రాహ్మణులకు మాత్రమే అగ్రతాంబూలం. క్షత్రియ, వైశ్య కులాల వాళ్లు కూడా గురువును మెప్పించి విద్యను పొందేవాళ్లు. ఒకవేళ గురువులు అంగీకరించకపోతే మోసానికి సైతం పాల్పడేవాళ్లు. ఇందుకు మను చరిత్రలోని ఇందీవరాక్షుడి వృత్తాంతం పేర్కోవచ్చు. బ్రహ్మ మిత్రుడు శిష్యులకు ఆయుర్వేద విద్యను ఎంతో పట్టుదలతో చెప్పడం చూసి, గంధర్వుడైన ఇందీవరాక్షుడు అతని దగ్గరకు వెళ్ళి వినయంగా తనకు ఆ విద్యను నేర్పుమని బతిమాలతాడు. అతడు అంగీకరించడు. "నట, విట, గాయక, గణికాదుల నీచోక్తులు వినడానికి అలవాటు పడిన నీ చెవికి ఈ వైద్యశాస్త్రం చాలా కటువుగా ఉంటుంది. కాబట్టి ఇది నీకు రాదు. వెళ్ళిపో. నిన్ను చదివించకుంటే మాకు జరుగదా? ఏమిటి? అధికారంతోను, ధనంతోను పొగరెక్కి యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం కోల్పోయిన నీ వంటి వాణ్ణి శిష్యుడిగా చేరదీయడం కంటే వేరే దోషముంటుందా? నన్ను రెచ్చగొట్టకుండా మర్యాదగా ఇక్కడ నుంచి బయలుదేరు" అని నిష్ఠూరంగా పంపుతాడు. అతను అవమాన భారంతో వెళ్ళి, తన శాంబరి (మాయా) విద్యా నైపుణ్యంతో అతనికి కపటశిష్యుడై వైద్య విద్యను నేర్చుకుంటాడు. ఆ తర్వాత గురువుకు అసలు సంగతి తెలిసి, ' ఇప్పుడేమంటావు?అని ఎద్దేవా చేస్తాడు. అతను ఆగ్రహించి రాక్షసుడవు కమ్మని శపిస్తాడు".9

7. ఆము. 7-44.
8. అదే. 7-52.
9. మను. 5-08 నుంచి 19 వరకు.

ఇక ప్రవరుడు తన శిష్యులకు ఒక పూట పాఠం చెప్పలేకపోయినా ఎంతో బాధ పడతాడు (మను. 2-17). పాదలేపం కరిగిపోవడం వల్ల ఇంటికి వెళ్ళలేక ప్రవరుడు హిమాలయాల్లో చిక్కిపోతాడు. ఇంటికి చేరుకోలేకపోవడం వల్ల తనకోసం పరితపించే తన తల్లిదండ్రులతో పాటు తన విద్యార్థుల్ని కూడా గుర్తుకు తెచ్చుకుని విలపిస్తాడు. పుత్ర సమానంగా గురువులు శిష్యుల్ని ప్రేమించడంతోపాటు అరమరికలు లేకుండా వాళ్ళతో సేవలు చేయించుకోవడం కూడా తమ హక్కుగా భావించేవాళ్లు. ప్రవరుడు తన హోమానికి, దేవతా పూజకు కావాల్సిన సమిధలు, పూలు, ఉతికిన మడుగు దోవతులు మొదలైన వాటిని ఊరి ప్రజలందరూ చూస్తుండగా తన శిష్యులతో మోయించుకుని ఇంటికి వచ్చేవాడు. అలా చూసి వాళ్లందరూ అతని నిష్ఠకు మెచ్చుకునేవాళ్లు.10 గురువులు ఎంత గొప్ప వాళ్లయినా, శిష్యులు ఎంత వినయ సంపన్నులైనా తగినంత పర్యవేక్షణ లేకుంటే ఆ శిష్యులు దారి తప్పుతారు. మిడిమిడి జ్ఞానంతో అసలే విద్యాగంధం లేని ఆ సమాజంలో తామేదో గొప్ప పండితులైనట్లు, ధర్మ శాస్త్రాన్నంతా ఆపోశనం పట్టినట్లు నటించి తగాదాల్ని తీర్చే న్యాయమూర్తుల్లాగా చలామణి అయ్యేవాళ్లు. చదువులన్నీ గురువులకే అప్పగించేవాళ్లు. అంటే పుస్తకాలు ముట్టేవాళ్లు కాదు. మాయా ప్రవరుడు వరూధినితో పై మాటలు ప్రస్తావించి తాను వెంటనే ఇంటికి వెళ్ళి రావాలంటాడు.11

పైన పేర్కొన్న పర్యవేక్షణవల్ల విద్యార్థికి, ఉపాధ్యాయునికి మధ్య గౌరవవాత్సల్యాలు పెంపొందుతాయి. విద్య పట్ల గౌరవ భావం పెరుగుతుంది. దాంతో విద్యార్థుల్లో వినయం-పాత్రత, ధనం-ధర్మం, ఐహికం-ఆముష్మికం వరుసగా చోటు చేసుకుంటాయి. ఈ అనుబంధం లోపించడంవల్ల ఈనాటి విద్యా విధానం వెర్రితలలు వేస్తోంది. ఈనాడే కాదు, అనాడు కూడా ఇలాంటి పరిస్థితికి చోటు లేక

10. మను. 1-54.
11. అదే. 3-129.

పోలేదు. ఆముక్తమాల్యదలో బ్రహ్మరాక్షసుడు పూర్వజన్మలో 'సోమేశ్వరుడు' అనే ఒక బ్రాహ్మణుడు. అతను సమగ్రమైన, సంపూర్ణమైన విద్యను పొందలేదు. కాని తాను ఒక గొప్ప పండితునిగా నటించి చిల్లరప్రభువుల దగ్గర అర్థదారులు తొక్కి, ధనాన్ని సంపాదిస్తాడు. సక్రమ ప్రవర్తనతో గురువుల దగ్గర చక్కని జ్ఞానాన్ని పొందగలిగి ఉంటే, బందిపోట్ల చేతిలో అతనలా అర్థదారులు తొక్కి ఉండేవాడు కాదు. దాని పర్యవసానమే ఘోరమైన చావు చచ్చాడు. మరుజన్మలో బ్రహ్మరాక్షసుడుగా పుడతాడు. వేదాంతాన్ని, భగవద్భక్తిని బోధించిన మాలదాసరి మాటలు లెక్క పెట్టడు. పైగా అతని మాటల్ని ఎద్దేవా చేస్తాడు. "ఈ చదువులతో నన్నుఁ చంపకు (విసిగించకు). నేను చదువని శాస్త్రాలా? ఇవి! నేను పఠించని శ్రుతులా? ఇవి! ఇవంటే నాకు ఇష్టముండదు" అని తృణీకరిస్తాడు. 'నిద్ర, కూడు లేకుండా కష్టపడి చదివితే నేను పొందిన లాభమేమీ లేదు. ఈ చదువుకు సంబంధించిన అర్థం లేని మాటల్ని విని ఎవడు మోసపోతాడు? ఈ చదువుకు సంబంధించిన ఉపన్యాసాలు దంచి నా నుంచి మెప్పు పొందలేవు సుమా! కాకపోతే నిన్ను చంపి వండిన తర్వాత, ఈ చదువుకున్న వాడి మాంసంకూర చాలా బాగుంది. ఇంకా కొంచెం తెమ్మని నా భార్యతో అంటాను. నీవు ఆ మెప్పును మాత్రం పొందగలవు" అని ఎగతాళి చేస్తాడు నాస్తికునిలాగా.12 బ్రహ్మరాక్షసుడి నోటి నుంచి వెలువడిన ఆ మాటలు అచ్చం నేటి ఒక నిరుద్యోగి యువకుడి మాటల్లాగా ఉన్నాయి. ఎప్పుడైతే చదువులోని గొప్పతనం గ్రహించనందువల్ల ఎవడైతే ఫలితం పొందలేడో వాడు తిరగబడి ఆ చదువు నిష్ప్రయోజనమైందిగా పేర్కొంటాడు. అది ఆనాటికీ, ఈ నాటికీ ఒకటే. బ్రహ్మరాక్షసుడి ఆకారం, వాడి మనస్తత్వం వర్ణించబడిన తీరు చూస్తుంటే, ప్రస్తుత సమాజంలో తెలివితేటలు ఉండి కూడా, ఉన్నత కుటుంబంలో పుట్టి నిజమైన విద్యలేనందువల్ల యుక్తాయుక్త విచక్షణా

12. ఆము. 6-32, 35.

జ్ఞానం కోల్పోయి, అదుపుతప్పి సంఘ విద్రోహశక్తిగా మారిన ఒక బడా పెద్దమనిషి లాగా కనబడతాడు. 'రాక్షసుడు-బ్రహ్మరాక్షసుడు,' చదువూ సంధ్య లేని రౌడీ, చదువుకున్నరౌడీల వంటివాళ్లు'. చదువులేని దుర్మార్గుల కంటే, చదువుకున్న దుర్మార్గుల వల్లే ఎక్కువ అపాయం. నేటి సంఘ దుస్థితికి ఈ రెండో వర్గీయులే కారణం. పాండురంగ మహాత్మ్యంలోని నిగమశర్మ (3-16), అకృత్య సత్రిక్కయుడు (4-196) ఈ కోవకు చెందిన వాళ్లే.

మొత్తానికి అక్షరాస్యులు అతి తక్కువగా ఉండే ఆ రోజుల్లో చదువన్నా, చదువు నేర్పించే గురువులన్నా, గౌరవ మర్యాదలు ఉండడంలో ఆశ్చర్యం లేదు. కాని నిజమైన విద్యావంతుల కంటే, మిడి మిడి జ్ఞానంతో మిడిసిపడే నకిలీ పండితులవల్ల ఆ నాటి రాజులు, చక్రవర్తులకు తలనొప్పిగా ఉండేదని తెలుస్తోంది (ఆము. 4-61). చదువుకున్న వాడంటేనే గొప్ప. ప్రజలతనికి బ్రహ్మరథం పట్టేవాళ్లు. ప్రభువులు అలాంటి వారికి ధన కనక వస్తు వాహనాలేమి? ఊళ్లకు ఊళ్లే దానం చేసేవాళ్లు. అర్హులైన వాళ్లైతే పరవాలేదు. అనర్హులైన వాళ్లకి దశ లభించిందంటే వాళ్లు భోగలాలసులైపోయి తమ కర్తవ్యాన్నే మరచిపోతారు. దాంతో ఎన్నో అనర్థాలేర్పడేవి. అప్పుడు రాజు వాళ్లకి శిక్ష విధించడానికి కూడా వీలయ్యేది కాదు. 'బ్రాహ్మణోన హంతవ్యమ్' లాంటి నిషేధాలు ఉండనే ఉన్నాయి. అందుకే రాజు మొదట్లోనే జాగ్రత్తపడాలని, పండితుల విద్యా విశేషాలకు పొంగిపోయి కీర్తికాంక్షలతో వాళ్ల పట్ల పక్షపాతంతో మితిమీరిన మర్యాదలు చేయవద్దంటాడు రాయలవారు.

"అక్షర పక్ష పాతమున నర్థము నూళ్ళ నొసంగ, నుబ్బునన్.
భిక్షు జటాధరాదికులు భిన్న నిజవ్రతులౌదు,రైన దు
ర్భిక్షరుజా శిశు చ్యుతులు పెక్కగు ఖత్తియ వాలు, గాన,ద
త్రక్షుభితత్వమే యఘము దార్పదు, శంకదలంతు మయ్యెడన్

(ఆము. 4-242)

*వేట* :- రాజు ప్రధాన విధుల్లో వేట ఒకటి. క్రూరమృగాల సంఖ్య ఎక్కువగాను, జనసంఖ్య తక్కువగాను ఉన్న ఆ రోజుల్లో అది అవసరమైంది. వేటాడే విధానం, క్రూరమృగాల స్వరూపస్వభావాలు, మాంసం వండే విధానం, వేటగాళ్ళ లక్షణాలు వివరంగా మనుచరిత్రలో తెలియజేయబడ్డాయి.

వేటగాళ్లు బయలుదేరేటప్పుడు చూపే ఉత్సాహం, వాళ్ల సన్నాహాలు, అడవిలో ప్రవేశించడం మొదలుకుని ప్రతి చిన్న విషయాన్ని చక్కగా తెలియజేయడమైంది. వేటకుక్కల సాయంతో చేసే అడవి ఎలుకలు, ఉడుములు మొదలైన వాటి వేట, డేగ వేట, అడవి పంది వేట, ఏదు పంది వేట, కారెమముల వేట, కడితి, లేడి, దుప్పి మొదలైన వాటి వేట, పులివేట ఆయా జంతువుల స్వరూప స్వభావాలతో వేటలో ఉత్తమ, మధ్యమ, అధమాధికారులైన వేటగాళ్ల నేర్పుల తారతమ్యాలు చక్కగా వర్ణించబడ్డాయి. పెద్దన తరుచుగా రాయలతో పాటు వేటకు వెళ్ళి ప్రత్యక్షంగా చూడకపోతే అలా వర్ణించడానికి వీలుకాదని విమర్శకులు తెలియజేశారు. అది నిజమేననిపిస్తోంది.

మనుచరిత్రలోని 'పులియదు, బూచిగాడు అనే కుక్కల పేర్లు, పులిమల్లుడు, అడవిపోతుల రాజు, గరుడుడు, గాలివేగం, కుందేళ్ళ వసిడి, అనే పినవీరన శాకుంతలంలోని కుక్కల పేర్లను పెద్దన అనుకరించినట్లు చెబుతారు. కాని పెద్దన కాలంలోను వేటకుక్కలకు అలాంటి పేర్లుండడం అసహజం కాదు. కొన్ని పేర్లు రెండింటిలోను సమంగా ఉన్నా, కొన్ని వేరుగా ఉన్నాయి. పెద్దన రచనలో ఇతరత్రా అనుకరణముంటే ఉంటుంది. కాని వేట వర్ణనలో మాత్రం ప్రత్యేకత కనబడుతోంది. వేటగాళ్లు అడవిలో ప్రవేశించేటప్పటికి అక్కడి జంతువుల లక్షణాలు చక్కగా చెప్పబడ్డాయి.

'లేళ్లు మందలుగా వచ్చిక బీళ్లలో మొగాలు అటూ, ఇటూ పెట్టుకుని, పడుకుని, నెమరు వేసుకుంటూ, ఒకదాన్నొకటి నాకుతున్నాయి.

క్రూరమృగాలు ఏవైపు నుంచి వచ్చినా కనబడేటట్లు పారిపోడానికి వీలుగా పడుకోడం లేళ్ల స్వభావం.

పుట్టతేనెను, చీమల్ని, చెదల్ని తినడానికి ఎలుగుబంట్లకు పుట్టను పెకలించడం అలవాటు. అవి అలా పెకలిస్తుంటే దుప్పులు కాచుకుని చూస్తూ, ఆ పుట్టల్లోనుంచి పాములు బయటకు వస్తే, వాటిని చొప్పదంటుల్లాగా నమలి వేస్తాయి. దుప్పులు పాముల్ని తింటాయనే రహస్యం పెద్దనకే తెలుస్తుందనిపిస్తోంది.

పందులు గుంపులుగా గుంపులుగా వచ్చేటప్పుడు అందులో నాయకుని వంటిది వెనుక భాగాన వస్తూ ఉంటుంది. ఎందుకంటే తోడేళ్లు, సివంగులు తమ గుంపులోని చిన్నచిన్న పందుల మీద పొంచి ఉండి, వెనుక వైపు నుంచి వచ్చి వాటి మీద పడతాయి. అలా అవి పడకుండా, ఒకవేళ పడినా, వాటిపైన పడి కోర్లతో కొట్టి చంపడానికి అది అలా చేయడం దాని స్వభావం.

మనుష్యుల్ని తినమరగిన పెద్దపులి ఇక వేరే జంతువుల్ని తినదు. దారి కాచి మనుష్యుల మీద పడి చంపుతుంది. అలాంటి వాటిని కనిపెట్టి దొడ్లను కాచేవాళ్లు, మంత్రాలతో వాటి నోరు కట్టేసేవాళ్లు. అంటే ఇక నోటితో పనిచేయలేవు. ఆకలి, దప్పులతో చస్తుంటే, అప్పుడప్పుడు కట్టు విప్పేవాళ్లు. అంటే మంత్రం పనిచేయకుండా చేసేవాళ్లు. అప్పుడవి నీటికోసం సెలయేళ్లవైపు వెళ్తాయి. ఆటవికులు ఆ దారిలో వరుసగా పారవాతి బాణాలు (పారల్లాంటి కొనలున్న బాణాలు) పాతి ఉంచిగాని, లేదా వాటిని గురిచూసి కొట్టిగాని, వాటి రొమ్ములకు గాయాలు చేస్తారు. ఆ నొప్పికి తట్టుకోలేక గాండ్రుమని అరుస్తూ పైకెగిరి తన్నుకుంటూ, నెత్తురు కారిపోతుండగా, గురగురమని అరుస్తూ నేలకొరుగుతాయి. ఆ భయంకర శబ్దానికి సమీపంలోని నీటి పక్షులు పటపటమని రెక్కలు కొట్టుకుంటూ పైకి ఎగురుతాయి. పులిని చంపిన వెంటనే దాని మీసాల్ని కాల్చివేస్తారు. లేకపోతే ఆ మీసాల్ని

ముక్కలు చేసి పరమాన్నంలో కలిపి పండిపెడితే, తిన్నవాళ్లు చనిపోతారట. చిరుతపులులు కొండగొర్రెలు మొదలైన వాటిని చంపి, వాటి రక్తం మాత్రం తాగి వెళ్ళిపోతాయి. ఆ తర్వాత వచ్చిన జంతువుల కళేబరాలు కొంత మాగిన తర్వాత (కుళ్లుకంపు వచ్చిన తర్వాత) వచ్చి తినిపోతాయి. పెద్దపులి కూడా ఇలాగే చేస్తుందట. పగటిపూట రాబందులు, గద్దలు మొదలైన పక్షులు ఆ కళేబరాల్ని తినేస్తాయట.

అడవి దున్నలు నల్లరాళ్ళ లాగా ఉంటాయి. ఇనుపగుదెల లాంటి గట్టి కొమ్ములుంటాయి. ఒకదాన్నొకటి పొడుచుకునేటప్పుడు 'పెటిల్లు కటిల్లు'మని శబ్దం వస్తూ ఉంటుంది. ఆ శబ్దం ఆ కొండకోనల్లో ప్రతిధ్వనిస్తుంది. మనుబోతులనే దుప్పులు (ఋష్యమృగాలు) మొదలైన మృగజాతి ఒకచోట పెంట వేసి, మరునటి రోజు మళ్లీ అక్కడికే వచ్చి పెంట వేయడం వాటి స్వభావం. ఇది తెలునుకుని వేటగాళ్లు ఆ పెంట ఉండేచోట్ల కాలిబోనులు అమరుస్తారు. ఆ జంతువులు వచ్చి అందులో చిక్కుకుంటాయి. అయినా భయపడకుండా ఆ బోనుల్ని ఈడ్చుకుంటూ పొదల్లోకి వెళతాయి. ఆ పొదల్లో చిక్కుకుని బయటికి రాలేక భూమి మీద పడి తన్నుకుంటూ దీనంగా అరుస్తుంటాయి.

మగరేచులు కణతుల మూపు మీదకు ఎగిరి, కొరికి, అక్కడ నుంచి మాంసపు ముక్కల్ని కిందికి పడేస్తాయి. కింద ఆడరేచులు ఆ కణుతులు ముందుకు పోకుండా కాళ్లకు అడ్డంగా నిలబడి ఆ మాంసపు ముక్కల్ని తింటాయి. ఆ బాధకు తట్టుకోలేక ఆ కణుతులు పొదల్లో దూరి వేగంగా పరుగెత్తుకుంటూ పోతాయి. వాటి కొమ్ములకు తగిలి చెట్ల కొమ్మలు విరిగి పడుతుంటాయి.

ఆడ, మగ ఏనుగులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. వెదురు బియ్యం కోసం వెదురు పొదల్ని తొండాలతో పట్టి వంచగానే, వాటి వెన్నులతో పాటు, అవి విరిగిపోయి, అస్తవ్యస్తంగా పడి దారులు నడవడానికి వీలులేకుండా ఉంటాయి.

అడవిజంతువులు నరవాసన గ్రహిస్తాయి. వాటి వాసనను బట్టి వేటగాళ్లకు దొరకకుండా తప్పించుకుంటాయి. అందువల్ల గాలి వాటాన్ని గుర్తించి వాటికి కింది భాగంలోనే ఉండాలి. దుమ్మెత్తిపోసి, అది ఎటువైపు పోతుందో, గాలి అటువైపు వీస్తుందని కనిపెట్టేవాళ్లు. వలను దాటుకుని జంతువులు అటువైపు పారిపోకుండా జలాశయానికిగానీ, కొండకుగానీ ఆనుకుని దొడ్డివలను పన్నేవారు. దూరం నుంచి ఎగువకు దారి ఉండేటట్లు రెండు వైపులా తాళ్లు కట్టించి పైనుంచి దొడ్డివల దాకా ఆ తాళ్లకు తెరలు కట్టించేవాళ్లు. దొడ్డివలను తెంచుకుని ఏవైనా జంతువులు ఇవతలికి వస్తే, చంపడానికి చుట్టూ బలమైన మనుషులు ఉండేవాళ్లు. వాళ్లు ఏదో ఒక వృక్షాన్ని ఆనరాగా చేసుకుని ఉంటారు. అవసరమైతే ఆ చెట్లను ఎక్కి క్రూరమృగాల నుంచి ప్రాణాలు కాపాడుకుంటారు.

చుట్టూ ఉండే వాళ్లకు సహాయంగా వేటకుక్కలతో ఉరివేటగాళ్లు ఉండేవాళ్లు. ఏదైనా జంతువు ఇవతలికి వస్తే, ఉర్లలో పడేసిగాని, కుక్కలతో కరిపించిగాని చంపేవాళ్లు. దొడ్డివలలోనికి రాకుండానే ఎత్తిన తెరలోనే చిక్కుకున్నట్లయితే, వాటిని అక్కడే చచ్చేటట్లు పడగొట్టించేవాళ్లు. వేటగాళ్ళను చూసి అటువైపు రాకుండా పక్క కొండల వైపు పారిపోయే జంతువుల్ని అడ్డుకోవడానికి అక్కడ కొంతమందిని కావలా పెట్టారు.

ఆ తర్వాత కొంచెం నేర్పు కలిగిన విలుకాండ్రను అడవిలోకి పంపారు. వాళ్లు అడవి అంతా తిరిగి దాగిన జంతువులన్నిటినీ బయటికి వచ్చేటట్లు బెదరగొట్టారు. వేటాడేవాళ్లకి జంతువుల జాడను తెలియజేసే వాడుంటాడు. వాణ్ణి 'కొట్టికాడు' అంటారు. వాళ్లు మృగాలకు కనబడకుండా తలమీద, మొలమీద, వింటి కొప్పుమీద పచ్చి ఆకులు కప్పుకుంటారు. వాళ్లని కనిపెట్టుకుని వేటగాళ్లు జంతువులు పక్కకు పారిపోకుండా జాగ్రత్తపడుతూ, నడుముకు వేలాడదీసుకున్న మోటకత్తులతో వంగలు గలిగిన ముళ్లకొమ్మల్ని

నరికి ముందుకు దారి ఏర్పాటు చేసుకున్నారు. అన్ని వైపుల ఉండే జంతువులు బయటికి వచ్చేటట్లు (పణవ) ఉడుక, (మృదంగ)మద్దెల, (దుందుభి) భేరీ మొదలైన వాయిద్యాలు వాయించారు. కాహళి (తూతు బూరలు) ఊదారు. అగ్నియంత్రాలు (తుపాకులు) కాల్చారు.

ఆ శబ్దాలకు బెదరి జింకలు పరుగెత్తి కార్చిచ్చులో పడుతున్నాయి. తోకలు ముడుచుకుని చిరుత పులులు, సివంగులు, మెల్లగా పరుగెత్తుతున్నాయి. ఎల ు ు కొండలకు పాకుతున్నాయి. చిన్న పిల్లల్ని గుండెలకు హత్తుకొని ఆడుకోతులు ఒక కొమ్మ నుంచి మరో కొమ్మకు దూకుతున్నాయి. మడుగులో దిగిన అడవి పందులు ఉవ్వెత్తుగా లేస్తున్నాయి. పెద్దపులులు నోళ్లు తెరచుకుని గాండ్రిస్తూ ఉన్నాయి.

కుక్కలవేట :- ఆ శబ్దాలకు భయపడిపోయి పులి, పంది, ఏనుగు మన్ను (మనుబోతు) కారుతున్న మొదలైన జంతువులన్నీ పరస్పరం ద్వేషాలు మాని, తమ తమ స్థావరాలు వీడి నలువైపుల గుంపులు గుంపులుగా పరుగెత్తుతున్నాయి. అప్పుడు కుక్కల వేటగాళ్లు అలా పరుగెత్తి వస్తున్న పందుల గుంపును చూశారు. వాటిని మాటుపెట్టుకుని వేటాడే వాళ్లు బాణాలతో కొట్టకుండా, ముందే రాజు మెచ్చుకునేటట్లు తామే ముందు చంపివేయాలనుకుని కుక్కల మెడ బంధాల్ని విప్పారు. అవి భయంకరంగా మొరగుతూ వేగంగా వెళ్లాయి. అందులో 'జాగిలా'లనబడే పెద్దకుక్కలు పందుల మీదకు ఉరికాయి. 'మరనడా'లనబడే చిన్నకుక్కలు 'ఉడుము'లు మొదలైన వాటిని పట్టడానికి పుట్టలవైపు పరుగెత్తాయి.

ఒక అడవి పంది వేటగాళ్ళను కనిపెట్టి తన మందకు రక్షణగా ముందు భాగాన నిలబడి కొమ్ముతో పట్టి నేలనే కొడుతూ కుక్కల్ని ఎదిరించింది. దగ్గరకు వచ్చిన ఒకటి, రెండు కుక్కల్ని వాటి మాంసం ఊడిపడేటట్లు కోరతో కొట్టింది. ఆ కుక్కలు ఆ పంది పొలచేరుల్ని (పిక్కనాడుల్ని) పట్టుకోగా, వాటినట్లే డొంకల్లోకీడ్చుకుని వెళ్ళింది.

అంతలో వేటగాడు వచ్చి 'ఈటె'తో పొడిచాడు. కడుపులోని పేగులు బయటికి వచ్చి వేలాడుతున్నాయి. అలాగే కొంచెం దూరం ముందుకు పోయింది. ఇక పోలేక దప్పిక ఎక్కువై ఒక చెట్టు మొదలుకు ముందు కాళ్లను వంచి చతికిలబడి భయంకరమైన చూపుతో వేటగాళ్లను చూస్తూ ఉండిపోయింది.

అప్పుడే ఇంకో పంది తనపైన పడిన కుక్కను కోరతో కొట్టేటప్పటికి దాని పొట్టలోని పేగులు బయటికి వచ్చి ఆ పందికోరకు చుట్టుకున్నాయి. అవి ఋరద (అసులు) కలిపేటప్పుడు ఎర్రలు (వానపాములు) తగులుకున్నట్లు ఉన్నాయి. చీకట్లో పెద్దపులి కళ్లు జ్యోతుల్లాగా మెరుస్తాయి. కారుపోతుల్ని కనిపెట్టడానికి వేటగాళ్లు అవి అరచినట్లే అరచుకుంటూ పోతారు. అప్పుడవి నిలబడి చూస్తాయి. వేటగాళ్లు వలలో చిక్కుకున్న పెద్దపులి, కారుపోతు, వరాహం మొదలైన క్రూరమృగాల్ని కొన్నిటిని చంపకుండా అలాగే రాజుకు కానుకగా సమర్పించుకునేవాళ్లు.

'ఉదవ కుక్కలు' (చిన్నకుక్కలు) కుందేళ్లను, ఎలుకల్ని, ఉడుముల్ని పట్టడానికి పుట్టల దగ్గర, కొండ చరియల్లోను వానన పడతాయి. అలా తిరిగే ఒక ఉడువ కుక్క వానన పట్టడంలో పొరపాటు పడి, గుహలో దూరి, ఉడుమనుకుని ఒక పెద్ద పెంజరం (పెంజర) పామును నోటితో కరచుకుని వచ్చి, భయపడకుండా దాన్ని ముక్కలు ముక్కలుగా కొరికివేసింది. ఒక గండు కుక్క ఒక కన్నం దగ్గర పొంచుకుని దేహం పొంగేటట్లు పెంచి, ముందరి కాళ్లు కదలకుండా నేల మీద నొక్కిపట్టి, ముందరికి వంగి చుట్టుపక్కల శబ్దాల్ని లెక్కచేయకుండా దృష్టి కేంద్రీకరించి, అందులో నుంచి బయటపడిన ఒక కొమ్ముల ఉడుమును తటాలున పట్టి పైకి లాగింది.

ఏదుపందికి ఒంటినిండా దబ్బణాల్లాంటి పొడుగాటి ముళ్లుంటాయి. అది వెళ్ళేటప్పుడు వాటి కొనలు తాకి భూమి మీద జాడ లేర్పడతాయి. అది కనిపెట్టి దాన్ని వేటగాడు వెంబడిస్తే, అది ఒక మూల దాక్కున్నా,

గాలికి దాని ముళ్లు రెపరెపలాడుతూ ఉండడం వల్ల వాడికి తెలిసిపోయింది. దాన్ని వంత్రకోల (త్రిశూలం వంటి ఆయుధం) తో పొడిచి చంపాడు.

**డేగలవేట** :- ఇంకో పక్క డేగల వేటగాళ్లు చోవుదు కోలలతో పొదల్లోను, కొమ్మల్లోను దాక్కున్న పక్షుల్ని లేపుతున్నారు. ఒక నల్ల బోయవాడు అతని భుజం మీద ఉండే 'సాలువ' మనే వేట డేగను చెవుల పోతుమీదికి వదిలాడు. మరో నేర్పరి అయిన వేటగాడు డేగ సహాయం లేకుండానే తన గోచి పంచెను పైకి దోపుకుని చిన్న సెలను చెట్టు కర్రతో చెమరుకాకి (సాంబారుకాకి)ని కొట్టి చంపాడు. ఈ వేటలో అనుజు, ఓరణం, తోచిగాడు, జావె, వేపడం అనే ఐదు జాతుల డేగల వేట వివరించబడింది. 'లగుడ'నే ఒక జాతి డేగ, ఆకాశానికెగిరి కింద చెట్టుకొన కొమ్మల మీద వాలి ఉన్న కొంగల్ని చూసి, తోక మీదికెత్తి, రివ్వున చెట్టు వైపుగా దిగి, రివ్వుమని శబ్దం చేస్తూ వేటగాడు 'కో' అని అరిచేలోపు కొంగలన్నింటినీ భూమి మీద పడేటట్లు చేసింది. డేగల్ని పెంచేవాళ్లు వాటి వాడైన గోళ్లు తమకు గుచ్చుకోకుండా 'అత్తే'లనబడే తోలుతొడుగుల్ని చేతికి తొడుక్కునేవాళ్లు. ఆకలి బాగా వేసి, వేటలో చొరవ కల్గడానికి మందు నిచ్చి వాటికి 'వాంతి' చేయించేవాళ్లు. దీనికి 'పరిపెనం' అని పేరు. తమను చేతపట్టుకున్న వాణ్ణి డేగలు పొడుస్తాయనే భయంతో వాటిని పెంచేవాళ్లు. కళ్ళు కనబడకుండా, వాటి ముఖాలకు తోలుతిత్తిని దిగేసేవాళ్లు. ఇలాంటి మూతుల్ని 'కనుగుట్టు'లనేవాళ్లు. వేటకుక్కలకు కూడా ఇలాగే పసుపు కలిపిన నీటితో స్నానం చేయించేవాళ్లు.13

ఇలా ఎన్నో మృగాల్ని, పక్షుల్ని చంపి ఆ వేటగాళ్లు వాటి మాంసం తీసి, ముక్కలుగా చేసి, ఆకుల్లో కట్టి, చిక్కాల్లో పెట్టుకుని, కావళ్లు కట్టుకుని ప్రయాణానికి సిద్ధమయ్యారు. చిదుగులతో మంటలు వేసి, చంపిన పులుల ముఖాల్ని ఆ మంటలకు అడ్డం పెట్టి, వాటి మీసాల్ని పూర్తిగా

---

13. వేట వర్ణన. ప్రబంధ వాఙ్మయ వికాసం. పు.

కాల్చివేశారు. వాటి చర్మాల్ని, తెల్లనిగోళ్లను తీసుకుని, వాటి భారీ కాయాల్ని అక్కడే పోగులుగా వదిలారు. అక్కడక్కడా పడిఉన్న ఏనుగుదంతాల్ని తీసుకున్నారు. వాటి కుంభస్థలాల నుంచి రాలిపడిన ముత్యాల్ని ఏరుకున్నారు. ఎన్నో మృగాల పొట్టల్లో దొరికే 'గోరోచనా'న్ని, చమరీమృగాల తోకకుచ్చుల్ని, నెమలి ఈకల్ని సేకరించుకున్నారు.

అంతలో మధ్యాహ్నమైంది. వేటకుక్కల ఒళ్ళంతా గాయాలు. ఉబికి వస్తున్న రక్తం. ఏదు (ముళ్లపంది)ను కరవడానికి వెళ్ళినప్పుడు దాని ముళ్ల దంతాల్లో దిగడంతో ఏకధారాగా కారే రక్తాన్ని అవి నాలుకలతో నాకుతున్నాయి. అడవి పందుల మీద పడినప్పుడు అవి కోరలతో కొట్టగా శరీరానికి, మెడకు, తొడలకు గాయాలై రక్తం కారి కారి బడలికతో తూలిపోతున్నాయి. ఎండ తీక్ష్ణతకు దప్పిక పుట్టి వగర్చుతూ నాలుకలు బయటికి వేలాడదీసుకున్నాయి. వాటి అవస్థ గమనించిన వేటగాళ్లు వాటి ఒంటి మీద తడిబట్టలు కప్పుతున్నారు. వాళ్లు కూడా సెలయేళ్ల దగ్గర దట్టమైన చెట్ల నీడలో విశ్రాంతి తీసుకున్నారు".14

ఇక ఆముక్తమాల్యదలో వేటకు సంబంధించి అక్కడక్కడా తెలియజేయబడింది. వేసవిలో పిట్లలు వేటాడే ఎరుకలవాళ్లు గుంటల్లో నీళ్లు ఇంకిపోవడంతో అక్కడక్కడ నీళ్లుపోసి, దగ్గర్లో ఉర్లు పన్నుతారు. ఆ నీళ్లు తాగడానికి వచ్చే పక్షులు అందులో తగులుకుంటాయి (ఆము. 2-46). పిట్టల్ని వేటాడేటప్పుడు అదేజాతి ఆడపిట్టను ఒకదాన్ని బోనులో పెట్టుకుని మేపుతుంటారు. అది అరచినప్పుడు ఆజాతి పిట్టలు దాని దగ్గరకు చేరుతాయి. అక్కడ ముందే ఉర్లను పన్ని దూరంగా దాక్కొని ఉంటారు. వచ్చిన పిట్టలు అందులో తగులుకుంటాయి. ఇలాంటి పిట్టల్ని 'దీము' పిట్టలంటారు.

---

14. మను. 4-37 నుంచి 60 వరకు.

ఈ విషయాన్ని ఆముక్తమాల్యదలో చమత్కారంగా చెప్పబడింది (ఆము. 2-66).

*పులి ఆవుమీద పడడం* :- పులి నోటి దుర్వాసనకు ఈగలు ముసురుకుంటూ ఉంటాయి. అది ఒక్కసారిగా లంఘించి ఆవుమీద పడి దాని కంఠాన్ని పట్టుకోగానే, పులి మీదున్న ఈగలన్నీ ఆవుమీద ముసురుకుంటాయి. అప్పుడు ఆ ఆవుకు రోతకలిగి ఊపిరాడకుండా అవుతుంది. పులి దాన్ని పడదోయగానే, చెట్ల బోదెలమీద పడి ఆకులన్నీ రాలతాయి. 'ఉరుము'లాంటి దాని గాండ్రింపుకు గొల్లవారు మూర్ఛిల్లారు. పులి దాని మెడ కొరికి, ఆ మెడను వెనక్కి తిరిగిపడేటట్లు చేసింది. ఆవు కొమ్ములుగానీ, గిట్టలుగానీ తనకు తగులకుండా ఉపాయంగా తిప్పుతూ, శబ్దమయ్యేటట్లు తోకను నేలకు కొడుతుంది. రక్తం పీల్చుకుంటూనే నేర్పుతో గవిలోకి ఈడ్చుకునిపోతుంది.15

పిట్టల వేటగాళ్లు నోట్లో కొన్ని ఉండల్ని పెట్టుకుని ఒక గొట్టం ద్వారా ఊపిరి బిగబట్టుకుని గురిచూసి పిట్టల మీద గట్టిగా వదలేవాళ్లు. అవి పిట్టల మీద పడేవి.16

*తెరవేట*:- వేటకు వెళ్ళిన రాజు ఒకచోట ఆయుధం పట్టుకుని ఉంటాడు. మిగతా వేటగాళ్లు నలువైపులా శబ్దం చేస్తూ, బెదరగొడుతూ, అడవిలోని జంతువులన్నిటినీ రాజు పొంచుకుని ఉన్న చోటుకు తరుముకుని వస్తారు. అప్పుడు రాజు వాటిని చంపుతాడు. దీన్నే 'తెరవేట' అని అంటారు (ఆము. 4-117).

జింక రక్తం తాగేటప్పుడు సివంగిని తరిమితే, అప్పుడది దాన్ని ఈడ్చుకుని వెళ్తుంది. అలాకాకుండా రక్తం తాగిన తర్వాత అదలిస్తే వెళ్ళిపోతుంది. ఆ తర్వాత మందులు ఉపయోగించి జింకను బతికించుకోవచ్చు.

---

15. ఆము. 3-20, 21.
16. అదే. 4-90.

"నల్లగ్రోలనిచ్చి మెల్లనె చివ్వంగి
నోటి జింక దివియు నేరు పొదవు
వేటకాడు వోలె విషయాళివలన, ద
త్తృష్ణదీఱనిచ్చి త్రిప్పుఁబొప్పు"
(ఆము. 4-193).

అడవిలో ఏనుగులు తిరిగేదారిలో ఒక పెద్దగుంటను తీసి, దానిపై అడ్డ-కర్రలుంచి, వాటిపై పల్చగా ఆకులు పరచి, మట్టి కప్పి మామూలు నేలలాగా కనబడేటట్లు చేస్తారు. దాని మీదుగా వెళ్ళినపుడు ఏనుగులు ఆ గుంటలో పడిపోతాయి. ఇలాంటి 'గుంట'ల్ని 'ఓదము'లనేవాళ్ళ (వను. 4-19).

జనశ్రుతి :- ఆనెగొంది పరిసరప్రాంతాల్లో నేటికీ అప్పుడప్పుడు వేటకు వెళ్ళే అలవాటుంది. సంస్థాన విలీకరణ జరుగక ముందు దీనికెంతో ప్రాధాన్యమున్నట్లు చెబుతారు. వేటాడడానికి తగిన తుపాకుల్ని, తూటాల్ని సంస్థానాధిపతులే ఏర్పాటు చేసేవాళ్ళు. వీటికి సంబంధించిన విషయాలెన్నో వివరించారు శ్రీ కడపరాజ వెంకటరామరాజుగారు. ఆనెగొంది వాస్తవ్యులైన వీరి వయస్సు 75 సంవత్సరాలు. వేటలో పెద్దపులిని వేటాడమనేది ఎంతో సాహసవంతమైందిగాను, గౌరవప్రదమైందిగాను భావించబడేది. ఆ తర్వాత చిరుతపులి వేట చెప్పుకోదగింది. పెద్దపులి అమాంతంగా జంతువుల మీద పడి, దాని మెడ కొరుకుతుంది. కాని చిరుత (ఆకారంలో పులి కంటే చిన్నది) గొంతుభాగాన్ని కొరికి జంతువును చంపుతుంది. మనుచరిత్రలో వేట వర్ణనలో చెప్పిన విషయాలకు, వీళ్ళు చెప్పిన విషయాలకు కొన్ని తేడాలున్నా, అవి ఎంతో సహజంగాను, కాల ప్రవాహంలో వచ్చిన మార్పులుగాను అనుకోవచ్చు. ఉదాహరణకు వేటగాళ్ళు ఆనాడు గాలివాటాన్ని తెలుసుకోవడానికి దుమ్మెత్తి పోస్తే, వీళ్ళు బీడీ తాగిన పొగ వదలి, అది వెళ్ళే దిశను బట్టి గాలివాటం తెలుసుకునేవాళ్ళు. అలాగే చంపిన పులిమీసాల్ని కత్తిరించి, ముక్కలు ముక్కలు చేసి, ఆనాడు కాల్చివేసే పద్ధతి

ఉండగా, వీళ్లు దాని మూతి మీద ఇంత చెత్తవేసి కాల్చివేసేవాళ్లట. వెంటనే తమతో ఉండే సేవకునితో దాని గోళ్లు, చర్మం, గోరోచనం తీయించుకునేవాళ్లు. కళేబరాన్ని అక్కడే వదలేసేవాళ్లు. అన్ని జంతువులు మనుషుల (వేటగాళ్ళ) వాసన పట్టలేవు. చిరుత, పెద్దపులి అలాంటివి. ముఖ్యంగా కరిడి (ఎలుగు), పంది, ఏదు, జింకలు వాసన పసిగట్టగలవు. దానికి ఆయన చెప్పిన ఒక సంఘటన ఒళ్లు గగుర్పొడిచేటట్లుగా ఉంది. అదేమిటంటే పెద్దపులి వచ్చేదారిలో కరిడి బోను అమర్చి, అందులో తాను తుపాకి పట్టుకుని, పొంచుకుని కూర్చున్నాడట. బోనుమీద ఆకులు, కొమ్మలు, కప్పివేశాడట. అర్ధరాత్రి దాటిన తర్వాత పెద్దపులి అటుగా వచ్చిందట. వచ్చి బోను పక్కనే కూర్చున్నదట. అంత దగ్గరగా ఉంటే పులిని కాల్చడానికి వీలుపడదు. కాసేపటికి అది వెనుక వైపుకు వెళ్ళిపోయిందట. ముందు వైపుకు అది వెళ్ళి ఉంటే కాల్చడానికి వీలుండేది. అంత పక్కనే ఉన్నా ఆయన్ను అది పసిగట్టలేక పోయిందంటే, దానికి వాసన పట్టే శక్తి లేనట్లే గదా! ఒకవేళ ఉంటే ఆ బోనుమీద పడి ఉండేది. మనుచరిత్రలో వేటకుక్కలకు పేర్లున్నట్లు, వేటగాళ్లు వాడే తుపాకులకు కూడా పేర్లుండేవి. వాళ్ల హయాంలో 'నరసింహాస్త్రం' అనే తుపాకికి చాలా పేరుండేదట. ప్రస్తుతం ఆ తుపాకి, దానితోపాటు మరికొన్ని తుపాకులు, 'గర్దన్' అనబడే వీళ్లు వాడిన వ్యాయామ సాధనం, కమలాపురం (హంపి) 'మ్యూజియమ్'లో ఉన్నట్లు, వాటిని వీళ్లే అక్కడి నిర్వాహకులకు ఇచ్చినట్లు తెలిపారు. వాళ్ల ఇంట్లో పెద్ద పులిని చంపినప్పుడు తీసిన ఫోటోలున్నాయి. ఆయన రెండు పెద్ద పులుల్ని, 32 చిరుతల్ని, ఎన్నో ఎలుగుల్ని, పందుల్ని ఆ రోజుల్లో చంపినట్లు' చెప్పారు. ఇలాంటివే ఎన్నో సంఘటనల్ని ఆయన చెప్పాడు. ఆముక్తమాల్యద, మనుచరిత్రలలో తెలియజేసిన 'తెరవేట'ను గురించి ప్రస్తావించగా, అలాంటి విధానాన్నే ' పగలేట' (పగటి వేట) అనేవాళ్లమన్నాడు. సాధారణంగా అరటి, చెరకు తోటల్ని

పాడుచేసే అడవి పందుల్ని పట్టడానికి సామూహికంగా ఆ పద్ధతిని పాటించేవాళ్లట.

వైద్యం :- ఒక జాతి నాగరికతను సూచించే ప్రధానాంగాలలో వైద్యం చాలా ముఖ్యమైంది. మనుచరిత్రలో దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆయుర్వేద వైద్యంలో ఎనిమిది భాగాలున్నాయి. అవి:

1) కాయచికిత్స : దేహంలో కలిగే జ్వరం, రక్త పిత్తం, అతిసారం మొదలైన (దేహసంబంధి) రోగాల చికిత్స' అని కొంతమంది, కాయమన 'జఠరాగ్ని' అని, ఆ అగ్ని దోషాన కలిగే రోగాలకు జ్వరం, అతిసారాది రోగాల చికిత్స 'కాయచికిత్స' అని అంటారు.

2) బాలచికిత్స : పసిబిడ్డలకు వచ్చే వ్యాధులకు చేసే చికిత్స. పసివాళ్లకి తగిన మందులు తల్లి పాలలో గాని, దాదుల పాలలో గాని దోషాలుంటే వాటి నుంచి కలిగే వ్యాధులకు చికిత్స. తల్లులకు, దాదులకు చేసే చికిత్సల్ని చెప్పబడే ప్రకరణమన్నమాట. దీనికే 'కౌమారభృత్యమ'ని చరక వ్యాఖ్య.

3) గ్రహ చికిత్స : బాలగ్రహాది క్షుద్ర దేవతల వల్ల పీడ నివారించడం అని పూర్వ వ్యాఖ్యలు. బ్రహ్మరాక్షసాది భూతాలవల్ల పీడ తెలుసుకోవడం, శాంతింపజేయడానికి ప్రయోజనకారిగా ఉన్న విద్య భూతవిద్య అని ఈ గ్రహచికిత్సకు బదులు చరకవ్యాఖ్య.

4) ఊర్ధ్వాంగక చికిత్స : మెడకు పై భాగాన ఉండే కన్ను, ముక్కు, నోరు, చెవి, తల మొదలైన వాటిలో కలిగే రోగాలకు అశ్చ్యోతన, శలాకా, ప్రభృతి కర్మలతో చేసే చికిత్స. అంటే తెరచిన కంటికి నడుమ రెండు అగుళాల లోపలికి దిగేటట్లు ఔషధపు బొట్లు వేయడం. అశ్చ్యోతనం, శలాక అంటే సన్నని లోహపు కడ్డీని కన్ను, చెవి మొదలైన శిరోగతావయవాల్లో ప్రవేశింపజేసి శుద్ధిచేయడం.

5) శల్య చికిత్స : శరీరంలో గుచ్చుకున్న బాణపుములికి మొదలైన వాటిని, పుండ్లల్లో పేరుకున్న చీము మొదలైన వాటిని బయటికి తీయడానికి చేసే శస్త్రాది చికిత్స.

6) దంష్ట్రా చికిత్స : పాము మొదలైన విష జంతువుల కోరలవల్ల కలిగే విషాన్ని తొలగించే చికిత్స.

7) జరా చికిత్స : విష ప్రయోగం మొదలైన వాటితో అకాల వార్ధక్యం వచ్చి మరణించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు చేసే రసాయన చికిత్స. వార్ధక్యం విషప్రయోగంవల్ల కలిగినా, వయసుమీరి సహజంగా కలిగినా, శుక్రాంత ధాతువులకు పుష్టిని కలిగించి, దాన్ని తొలగించే చికిత్స జరాచికిత్స.

8) వృష చికిత్స : రేతో ధాతువు చెడిపోయినపుడు, సంభోగంలో తృప్తి, స్వస్థత అభివృద్ధి కోసం చేసే చికిత్స. చరకసంహితలో ఇది 'వాజీకరణచికిత్స' అని పేర్కొబడింది.

ఉప్పు, పులుపు, కారం, చేదు, వగరు, తీపు మొదలైన షడ్రుచుల హెచ్చుతగ్గువల్ల ఏర్పడ్డ రసహీనత(అరుచి)ని కనిపెట్టి, దాన్ని తొలగించడానికి జ్వరాది అష్టవిధ చికిత్సలు ప్రయోగించాల్సి ఉంటుంది.17 రససిద్ధి తెలిసినవాళ్లు స్త్రీ, పురుషుల కామోద్దీపనానికి 'రసగుళికలనే సిద్ధౌషధాల్ని తయారుచేసేవాళ్లు.

వనమూలికల రసాన్ని పాదరసంలో 'స్తంభనక్రియ' అనే విధానంతో మింగడానికి అనువుగా గుళికలు చేసి పాలకుండలో ఉంచేవాళ్లు.18 ప్రవరుని ఇంటికి అతిథిగా వచ్చింది ఔషధ సిద్ధుడే. అతని ఆకారం ఎంతో గొప్పగా వర్ణించబడింది.19

---

17. మను. 5-15, 16; పద్యాల వ్యాఖ్యలు. వెం.సూ.శా.
18. అదే. 3-25.
19. అదే. 1-59.

కత్తిదెబ్బకు రెండుగా చీలిన కండరాల్ని లేదా గాయాల్ని వేళ్ళతో దగ్గరకు లాగి, సూదితో కుట్లు వేసేవాళ్లు. పెద్ద దెబ్బలకు తల వగిలితే, ఆ వగిలిన గాయాలకు గుడ్డ కాల్చి, ఆ మసిని కుక్కి కట్టు కట్టేవాళ్లు.20

ఆరోగ్యపుటలవాట్లు :- వరద (వండు) నీటిని తాగాల్సి వస్తే దానికి కొంచెం చిల్లగింజ లేదా ఇందువగింజల్ని అరగదీసిన చూర్ణాన్ని కలిపితే, ఆ నీళ్లు చక్కగా తేరి, పానయోగ్యం అవుతాయి. ఈ వద్ధతి ఆనాటి ప్రజలకు బాగా వరిచయమైనట్లు తెలుస్తోంది.21

'కాలాన్ని బట్టి తీసుకోవాల్సిన ఆహారం గురించి ఆముక్తమాల్యదలో బాగా వివరించబడి ఉంది(చూ. ఆరో ప్రకరణం ఆహారవుటలవాట్లు). నోటి దుర్వాసన రాకుండా స్త్రీలు రాత్రి వడుకోబోయే ముందు వుక్కిట్లో కమ్మకస్తూరి గుళికలు పెట్టుకునేవాళ్లు.22

'ప్రసవానంతరం చిన్నబిడ్డలకు పాలవండ్లు మొలిచే వరకూ స్త్రీలకు సంభోగం నిషేధంగా ఉండేది.23

*ప్రజా వినోదాలు* :- విజయనగర సామ్రాజ్య స్థావన ప్రధానోద్దేశం 'హిందూమత వునరుద్ధరణ' అనే అంశం విస్మరించరానిది. వరస్పర అంతఃకలహాలున్నా, ఈ ప్రధాన సూత్రం ప్రాతివదికగానే అనేక రాజవంశీయులు, అనేక ప్రాంతీయులు ఒకే తాటి మీదికి రాగలిగారు. ఇలాంటి ఐక్యతకు వండుగలు, జాతరలు మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు కోలాటం, భజనలు, నాటకాలు గారడీ (ఇంద్రజాలం), ఏరువాక మొదలైన ప్రజా వినోద కార్యక్రమాలు కూడా ఉవబలకంగా ఉండగలవనే రహస్యాన్ని నాటి ప్రభువులు గుర్తించినట్లున్నారు. అందుకే కాబోలు ఏదో ఒక సందర్భం పేరుతో, ఏదో ఒక ఆచారం పేరుతో ప్రజా వినోదాలకు ప్రోత్సాహాన్నిచ్చారు.

---

20. ఆము. 7-21.
21. అదే. 4-138, 146.
22. పారి. 2-16.
23. ఆము. 5-116.

"విజయనగర రాజ్యమున ప్రజా వినోదాలకంతులేకుండెను. ప్రజలు పండుగలు, పర్వములు వేడుకలనతి సంబరముగా జరుపుకొను చుండిరి. వ్యవసాయం ముఖ్యవృత్తిగాగలవారు ప్రతిసంవత్సరం ఏరువాక పున్నమి పండుగ నతివైభవముగా నిర్వహించుచుండిరి. సాధారణంగా వైశాఖ శుద్ధపౌర్ణమిని ఏరువాక పున్నమిగా భావించు చుండిరి. కొన్ని ప్రాంతాలలో జేష్ఠమాసంలో ఏరువాక పున్నమి పండుగ చేయుట ఆచారముగా వుండేది. కాని సంవత్సరారంభ వ్యవసాయము వైశాఖ పూర్ణిమతో మొదలగును. ఆ పండుగదినమున ఎద్దులను శుభ్రముగా కడిగి, వాటి కొమ్ములకు రంగులు వేసి వ్యవసాయపు పనిముట్లు సమర్చుకొని, వాటికలంకరణమొనర్చి సాగుబాటు ప్రారంభిస్తారు.

"దసరాపండుగ విజయనగర రాజ్యమంతట నిర్వహింప బడుచుండెను. విదేశీయులు దసరా, హోళిపండుగలను వర్ణించారు. దసరా ఉత్సవాలు రాజధానిలో నిర్వహింపబడుచుండెను. ఆ ఉత్సవంలందు విందులు, వినోదాలు జరిగేవి. సామంత మాండలికులు రాజధానికి వచ్చి మహారాజును దర్శించి, కప్పములు, కానుకలు చెల్లించి, బిరుదులను, బహుమతులను స్వీకరించు చుండిరి. వేడుకలతో కుస్తీ పోటీలు, గారడీవారి ప్రదర్శనలు, వేశ్యల ఆటపాటలు, సాహిత్య గోష్ఠులు, కవి పండిత సన్మానాలు ముఖ్యంగా వుండేవి. దసరా తరువాత అశ్వీజ బహుళ అమావాస్యనాడు దీపావళి పండుగ నతి వైభవముగా జరుపుకొనుచుండిరి. కోలాటము, వుంజీతము, చదరంగము, ఓమనగుంటలాట, గుజ్జనగూళ్ళు, కోతికొమ్మచ్చి, వంటి ఆటలానాడు వ్యాప్తిలో నుండెను.

గ్రామసీమలందున్న ప్రజలు సంగీత, నాట్య, నాటక కళలను అభిమానించుచుండిరి. కళాకురులు ఒక గ్రామం నుండి మరియొక గ్రామమునకు, ఒక పట్టణమునుండి రెండవ పట్టణమునకు వెళ్ళి ప్రదర్శనలిచ్చుచు ప్రజలిచ్చుకానుకలను, ద్రవ్యమును స్వీకరించి

జీవనము వెళ్ళబుచ్చుచుండిరి. ఆనాడు రసికులకు విటులకు కొదవలేదు. వారు వివిధములైన వినోదములతోను, క్రీడలతోను ప్రొద్దుపుచ్చుచుండిరి".24

*ఇంద్రజాలం* :- రాయలు గ్రీష్మ ఋతువర్ణనలో 'ఇంద్రజాలవిద్య'ను గురించి తెలియజేశాడు. ఇంద్రజాల ప్రదర్శన చేసేవాడు నెమలి ఈకల కట్టను గాలిలో అటూ, ఇటూ తిప్పుతాడు. అప్పుడు అక్కడ లేని వస్తువులు ప్రత్యక్షం కావడం, ఉన్న వస్తువులు మాయం కావడం జరుగుతోంది. ఆ మండువేసవిలో మధురాపురిలో ఎక్కడ చూసినా ఉక్క పోస్తోంది. మచ్చుకు కూడా గాలి లేదు. ఆ వేడికి తట్టుకోలేక వినన కర్రతో వినురుకుంటున్నారు. ఆ వినన కర్రలకు అందంగా కొనలకు నెమలి ఈకలు అమర్చబడి ఉన్నాయి. అంతకుముందు మచ్చుకు కూడా లేని గాలి వాటితో వినురుకోగానే రావడం చూస్తే, ఇంద్రజాలం లాగా అనిపిస్తోంది.

> "నమసి కథావశిష్టమగు చందనశైల సమీరణంబు, గృ
> త్రిమగతి నింద్రజాలమున తేదొడగెన్, భువి తాళవృంత, జా
> లము, లది మాయయొటకు దలంప తదీయ మయూర పింఛికా
> భ్రమణమె సాక్షికాదె, నగరంబున నట్టి కడింది వేనవిన్"
>
> (ఆము. 2-64)

వర్షర్తు వర్ణనలోను దీని ప్రసక్తి ఉంది. అది వర్షాకాలం. కొండలు, కోనలు పచ్చని చెట్లు, పచ్చని గరిక, మొగలి, కొండమల్లి పూల పుప్పొడి రాలుతోంది. పైన నెమళ్ళు తమ పురుల్ని విశాలంగా విప్పి ఆడుతున్నాయి. ఆకాశమంతా మేఘావృతమైంది. ఉన్నట్టుండి కుండపోత వాన. ఆ వానలో వట్టవగలైనా ఏమీ కనబడడం లేదు. అంతలోనే మేఘాలు విచ్చుకుని చెదిరిపోతాయి. సూర్యుడు కనిపిస్తాడు. ఇలా కాసేపు, అన్నీ కనబడడం, కాసేపు మాయమవడం, నెమళ్ళు పురివిప్పి ఆడడం చూస్తుంటే అంతా ఇంద్రజాలం లాగా కనిపిస్తోందట.

---

24. భారతదేశ చరిత్ర-సంస్కృతి,9వ సం. పుటలు : 295-96.

> "గ్రావాలం గేతకీ కోరక కుటజ రజోరాజి దుర్వాంకుర శ్రీ
> తో వీక్షింపన్ దినాను ద్రుతి మరువడుచుండొచు, చిటా శిరోభా
> వావిర్భావంబులంబాయక పొరయ, నభసాశ్యభ్రముల్గప్పి, పైసెం
> తవిప్రై పింఛికల్ బర్హిణులు దిరగ, బెల్లింద్రజాలంబు చూపెన్"
>
> (ఆము. 4-112)

'పారిజాతాపహరణం' పీఠికలో కూడా దీనికి సంబంధించిన ప్రస్తావన ఉంది. కత్తి, శత్రురాజుల్ని అప్సరసలతో చేర్చే యుద్ధమనే ఇంద్రజాలంలో వాడే నెమలిపింఛపు కుంచెలాగా ఉందట. అప్సరసలు స్వర్గంలో ఉంటారు. భూమి మీద ఉండే శత్రురాజుల్ని అక్కడికి వెళ్ళేలాగా చేయటం ఇంద్రజాలంగాను, నల్లగా ఉండే కత్తిని నెమలి కుంచెగాను నిరూపించడమైంది.

> "శత్రురాజులకు నచ్చరల నాకర్షించు
> నమరేంద్రజాల పింఛంపు గుంచె"
>
> (పారి. 1-23)

*క్రీడలు* :- అనేక రకాలైన గ్రామీణ క్రీడలు పంచకావ్యాల్లో పేర్కొంబడ్డాయి. చాలావరకు నేడవి నామమాత్రాన విశిష్టాలైనందు వల్ల, వాటిని ఆడే విధానానికి సంబంధించిన విషయాలు సమగ్రంగా దొరకడంలేదు. అవి కూడా ఒక ప్రాంతంలో ఉన్నట్లు మరో ప్రాంతంలో ఆచరణలో లేవు. బహుశా ఇవి ఆ నాడు కేవలం కాలక్షేపం కోసమే ఏర్పడినందువల్ల నిర్దిష్ట లక్షణాలు ఏర్పడి ఉండకపోవచ్చు.

*జీరుకు బందలాట* :- పారిజాతాపహరణంలో దీని ప్రసక్తి ఉంది.

> "ఐతనంబున హస్తంబులూది జీర్కుబందల దిగజారిరి".

*బొమ్మరిల్లు* :- వసుచరిత్రలో గిరికాదేవి బాల్యక్రీడల సందర్భంలో ఈ ఆట గురించి ఉంది.

'గురునవవిధ ప్రదేశమున గోమల కల్పకపుష్ప ధూళిచే
ధరనుత కొమ్మరిల్లి లిపి తప్పక్రుదుపల్లవపాత్ర పంక్తిగే
పరములు ఖాద్యముల్మధుర్రసంబు ఘృతంబుక్రమాన వుంజమో
గిరమని పెట్టవప్పి యునతీతతికట్టివయొబ్రియంబువన్
(వసు. 3-30)

పాండురంగమహాత్మ్యంలో దాగుడుమూతలు, బంతి ఆట, నాలుగు కంబాల ఆట, కుబేరాక్షకేళి, తన్ను బిల్లాట, జలవిహారా (ఈదులాట)ల ప్రసక్తి ఉంది.

"కనుగట్టి గాంగేయ గర్భుడాగురుమూతలాడించె వస్త్రావహారణవేళ
అలమందుల క్రోవశైలమెత్తెదివ్యూహ్వి గేలిమై కందుకక్రీడ నర్పా
బాటించె కంబాలయాట రాసక్రీడ నాభీర, భీరుమధ్యాంకపాళి
వెలయించె యక్షాక్ష విహారణంబులకాధి రాజకింకర శిరోరత్నరాజి,
దన్ను చిల్లాడె నంగుష్టదళిత నర్ప (పాండు. 3-178)

"మువ్వంక మురువుతో మురళి యొక్కొకవేళ మ్రోయించు భువనైక
మోహనముగ;
క్రీడించునొకవేళ తోడి బాలుర గూడియక్షిణగతి కుబేరాక్షకేళి
నవరించునొకవేళ జలవిహారము చాల -ప్రేమ భీమరథీగభీర వారి,

ఇవన్నీ అనాటి ప్రజా వినోదాలే!

తర్వాతి ప్రకరణంలో కులాలు, వృత్తుల గురించి వివరించబడుతుంది.

ఐదో ప్రకరణం

# పంచకావ్యాలు - కులాలు, వృత్తులు

అతిప్రాచీనకాలంలోనే ఆర్యులు గంగానది, సింధూనది ప్రాంతాల్లో నివాసమేర్పరచుకుని, వేదాలు నిర్మించి, వైదికమతాన్ని స్థాపించి, ప్రపంచంలోనే మొట్టమొదటి సంస్కృతికి కారణభూతులయ్యారు. ఆ వైదికమతం రాజుల్ని శిష్యులుగా చేసుకుని, తిరుగులేని జవసత్వాల్ని సంతరించుకుని, ఆనాటి సంఘాన్ని శాసించింది. రాజుల్ని మాత్రమే దృష్టిలో పెట్టుకుని, సామాన్య ప్రజలకు ఆచరణయోగ్యంకాని యజ్ఞయాగాదుల్ని, అర్థంలేని పూజావిధానాల్ని ప్రవేశపెట్టి, సామాన్య ప్రజల్ని విస్మరించింది. బుద్ధభగవానుడి ఆవిర్భావంతో వైదికం తన అస్తిత్వాన్ని కోల్పోయింది. ఆ తర్వాత కొన్ని శతాబ్దాలు బౌద్ధ, జైన మతాలు నీవా? నేనా? అన్నట్లు విజృంభించాయి. బౌద్ధం చక్రవర్తులతోపాటు సామాన్య మానవుల మన్నన కూడా పొంది, విదేశాలకు సైతం విస్తరించింది. 7వ శతాబ్దంలో శంకర భగవత్పాదుల ఆగమనంతో జైన, బౌద్ధాలు తమ వెలుగును కోల్పోయాయి. వైదికం తిరిగి పుంజుకుంది. అందులో మళ్ళీ శైవ, వైష్ణవాలు, వాటి మధ్య సంఘర్షణలు బయలుదేరాయి. శైవంలో వీరశైవులు, కాలాముఖులు, శాక్తేయులు, పాశుపతులు. అలాగే వైష్ణవంలో ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం, వడహాల, తెంగల మొదలైన శాఖలు బయలుదేరాయి. వీటి మధ్య చిరకాలం పోరాటం, వాదోపవాదాలు కొనసాగాయి.

"సంగమ వంశీయుల పాలనలో స్మార్త మతానికి ఆదరణ లభించింది. స్మార్తులు వేద మార్గాన్ని అనుసరించే శివభక్తులు. (అద్వైతులు) వారికి కేంద్రంగా విరూపాక్షాలయం విలసిల్లింది. అంతకుముందు అది

శంకరులచేత స్థాపించబడిన శృంగేరి మొదలైన శైవ క్షేత్రాలకు, శైవ మతగ్రంథాలకు విలువ పెరిగింది".1

ఈ విషయానికి సంబంధించి ప్రసిద్ధ కవి, విమర్శకులైన శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులగారి అభిప్రాయం ఇది. "విజయనగర సామ్రాజ్యములో ఒక్కొక్కసారి ఒక్కొక్క మతము పుంజుకొన్నది. అధికారము చెలాయించినది. సామ్రాజ్య ప్రారంభమున అద్వైతులు, వారు వీరశైవులతో పోటీపడిరి. ప్రౌఢదేవరాయలు వీరశైవుడో, అద్వైతియో నిర్ణయింప సాధ్యముకాదు. కాని అతని చుట్టూనున్న దంతయూ వీరశైవ బలగమే! వైష్ణవులు విద్యానగర ప్రారంభ కాలమునుండి యున్నను అది ఈకతొడిగి రెక్క వేసినది సాళ్వ, తుళువ వంశముల కాలమందే! అరవీటివారు వీరవైష్ణవులే యైరి. కృష్ణదేవరాయలు విశిష్టాద్వైతమును చక్కగా జీర్ణించుకొన్నవాడు. అందుకే తన కాలంలో లింగాయతుల చేష్టలను ధ్వని మార్గమున వెక్కిరించుచున్నాడా! యనిపించును....అందుకే ఆ వీరశైవము రాయల పాలిట వెర్రిశైవంగా నుండెనని నా యూహ. రాణి వాసంలో మత స్వాతంత్ర్యముండెడిది".2

విజయనగర రాజ్యమున భిన్నభిన్న మతములనవలంబించు ప్రజలుండిరి. శైవ, వైష్ణవ, స్మార్త, అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత మతాచార్యులు తమ మతమే ప్రధానమైనదను భావమున ప్రవర్తించుచూ, అన్య మతాచార్యులతో వాదవివాదములకు దిగుచూ, చర్చలను సాగించుచూ, ఒకరిపైనొకరు నిందారోపణలు చేయుచూ, దూషణభూషణములు గావించుచుండిరి. మతాచార్యుల ఆధిక్యమును సహింపని ప్రజలు, భక్తులు ఏ మతము నవలంబించిన మోక్షసాధనకు వీలగునో తేల్చుకొనలేని స్థితియందుండిరి.

---

1. విజయనగర సాంఘిక చరిత్ర ఖా.దే.చ.సం. సం.7, పు. 252.
2. చైతన్యలహరి, ఉపన్యాసమంజరి. పు. 17.

సంఘమున వర్ణవ్యవస్థ ప్రబలమైన స్థానము నేర్పరచుకొని యుండెను. వివిధ మతములభిమానించి, అనుసరించు ప్రజలొండొరులతో తగవులాడుచుండిరి. ఈ మత వైషమ్యముల వలన హిందూ సంఘమనైక్యతకు లోనైనది".3

ఇలాంటి పరిస్థితిలోనే తక్కువ కులం వాడైనా, తన గుణసంపదతో రాయలంతటి వాని ఆత్మీయునిగా ఎదిగిన కనకదాసు (ఈ విషయం ఈ ప్రకరణాంతంలో వివరించబడింది) తన 'మోహన తరంగిణి'లో నాటి మతాన్ని గురించి తన అభిప్రాయాల్ని ఇలా వెలిబుచ్చారు. "శూద్రులు ఈ దేశానికి నిజమైన వెన్నెముకలాంటివారు. దేశ సంపదకు వీరే మూలాధారం. అలాంటి వీరిని ఉపేక్షిస్తే, దేశానికి ఇహపరాలు రెండూ లేనట్లే! శూద్రులు, బ్రాహ్మణుల ఐక్యతవల్లే దేశాభ్యుదయమూ, లోక కల్యాణమూ కూడా సాధ్యమవుతాయి".

ఒక వ్యక్తి వేదోపనిషత్తుల్లో ఆరితేరి ఉండొచ్చు. బుద్ధుడు, బసవేశ్వరుడు మొదలైనవారి అనుయాయిగా తనను పేర్కోవచ్చు. మఠాల్లోనూ, ఆశ్రమాల్లోను జీవితాన్ని గడిపి ఉండొచ్చు. అంతమాత్రాన తన నీచబుద్ధిని (శ్వాన బుద్ధిని) విడనాడాడని గట్టిగా చెప్పలేం. కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చోబెట్టినా, ముందర ఎముకను చూడగానే, దూకి దానికోసం పరుగెత్తుతుంది.

జాతి కలహామే భరతఖండ ఇతిహాసం అంటే అతిశయోక్తి కానేరదు. జాతి పద్ధతి అసహజమని కనకదాసు నిశ్చితాభిప్రాయం. అతను విజయనగర ప్రభువుల దగ్గర 'మాండలీకుడు'గా ఉన్నప్పుడు (తాను తక్కువ కులంవాడు కాబట్టి) నానావిధాలుగా కష్టాలనుభవించి ఉండొచ్చని తెలుస్తోంది. అలాంటి కఠోరమైన అనుభవాలతో మనసు కుంగిపోయి, స్వాభిమాని అయిన అతను మాండలిక పదవిని వదిలిపెట్టి 'దాసు'డిగా మారి ఉండొచ్చు. అతని అభిప్రాయాలివి.

---

3. విజయనగర సాంఘిక చరిత్ర. ఖా.దే.చ. సం.9. పు. 260.

"అధికారమున్నదని అనకు చెడుమాటలను
సంపదలు కలవని జంబము చూపకు,
రాజ్యాన్నియేలి ధనరాశులను పడయుము
కాని, పాపంబును కాసింత పొందకు;
ముక్కును మూసుకొని మునుగుచు నీళ్ళలో
జపతపాలు చేసి శాస్త్రాలు పఠియించి
కోరి పరసతులను కొంటెచూపులు చూచు
నీతిమాలినవారు నేల వేలుపులె?
పట్టె నామాలెట్టి పాత్ర చేతను బట్టి
గుట్టుగా జపియించు గురిలేక గట్టిగా
గొంతెత్తి పాడుచు కూటికోసరము
పోరాడు వారెల్ల పరమ వైష్ణవులె?
అంగాంగ స్థానంబులన్నింటినెరుగక,
జంగమ స్థావర చర్చలు సలుపక,
తరమగునే? లింగధారులనంగ
అల్లా, ఖుదాలనే, అర్థాలనెరుగక
ముల్లాల శాస్త్రంబు మూల మెరుంగక
కళ్ళను మూసుకొని గట్టిగా అరచిన
వృథగాక దొరకునే? వీర స్వర్గంబు

వీటిని బట్టి కనకదాసు లోకానుభవం, ఆనాటి మతపరమైన వైపరీత్యాలు, ఆయా మతానుయాయుల బూటకపు చేష్టలు వ్యక్తమవుతున్నాయి.[4]

శ్రీకృష్ణదేవరాయలు విశిష్టాద్వైతి. అసలు ఆముక్తమాల్యద రచనా ప్రధానోద్దేశం 'విశిష్టాద్వైత ప్రతిపాదనే' అంటే తప్పు కాదు. విష్ణుచిత్తుని వృత్తాంతం, ఖాండిక్య, కేశిధ్వజ సంవాదం, యమునాచార్య వృత్తాంతంలోను ప్రత్యక్షంగా ఈ విషయాన్నే చాటుతున్నాయి. ఈ సందర్భాలలో కేవలం మతపరమైన శాస్త్రీయ చర్చలతో పాఠకులకు విసుగు కలిగించకుండా, దానికి సమానమైన సాహిత్య పరిమళాన్ని జతగూర్చి రాయలు అద్భుతంగా వర్ణించాడు.

---

4. దే.జ.గౌ. ఉదయవాణి (కన్నడ) దీపావళి విశేష సంచిక, 1991, (స్వేచ్ఛానువాదం).

"ఆముక్తమాల్యదలో పలుచోట్ల రాయలకు వేద వాఙ్మయముతోడను, ఉపనిషత్తులతోను, జ్యోతిరాది శాస్త్రములతోడను, పురాణముల తోడను గల గాఢ పరిచయము వ్యక్తమగుచున్నది. విష్ణుచిత్తుడును, యామునాచార్యుడును అన్యమతము ఖండిచుచు విష్ణు మాహాత్మ్యమును ప్రదర్శించునపుడు రాయలు బ్రహ్మ సూత్రముల నుండియు, నుపనిషత్తుల నుండియు పెక్కు వాక్యముల నుద్ధరించి యుండెను. వైష్ణవ మత రహస్యముల నెరుంగుటకై అతడు ప్రస్థాన త్రయమునే గాక, దివ్య ప్రబంధములను గూడ క్షుణ్ణముగా పఠించినట్లు తోచును. ఆ సమయములందు అతడు ప్రదర్శించిన కవి సమయ పురాణ కథా పరిజ్ఞానమచ్చెరువు కలిగించును".5

ఆ కాలంలో ఆయా మతాభిమానులు, మతగురువులు రాజాస్థానాల్లో ప్రవేశించి, తమతమ మతమే గొప్పదని శాస్త్ర చర్చలు, సిద్ధాంతాలు జరిపేవాళ్లు. ఓడిపోయినవాళ్లు తమ మతాన్ని మార్చుకునేటట్లు ఒప్పందం చేసుకునేవాళ్లు. మధ్యవర్తిగా ఉండే పండితుడు ఇరువర్గాల వాదనలు విని, న్యాయనిర్ణయం చేసేవాడు. సాక్షులుగా కొంతమంది ఉండేవాళ్లు. ఈ విషయం ఆముక్తమాల్యదలో యామునాచార్య ఘట్టంలో చక్కగా వర్ణించబడింది. అది ఒక నాటకం లాగా సాగుతుంది. పాండ్యరాజు శైవుడు. అతను శైవుల పట్ల చాలా పక్షపాతం కలిగి ఉంటాడు. ఆయనకు భయపడి సామాన్య పండితులంతా ఊరు విడిచి వెళ్ళలేక, ఆయన మెప్పుకోసం ఇష్టమున్నా, లేకున్నా శైవదీక్ష తీసుకుని, నొసట విభూది గర్దం తాకేటట్లు చిక్కగా రాసుకుంటారు. రుద్రాక్షకాయల దండ వేలాడుతుండగా, చంకలో పెద్దపెద్ద 'సూతసంహిత'ల్ని (శైవ గ్రంథాల్ని) ఇరికించుకుని రాజాస్థానంలోకి చకచకా వెళ్తారట.

5. డా. దివాకర్ల వెంకటావధాని. ఆంధ్రవాఙ్మయ చరిత్ర పు. 57.

"అప్పుడిచ్చుతులగుచు బ్రాహ్మణులు కొంద
రాత్మజవి భూమి విడువలేకలిక భూతి
గర్తముల నావ రుదురాక లిత్తసంధి
సూత సంహితలిరికించి చొరదొడగిరి"
(ఆము. 4-46)

ఆ రాజుగారి భార్య వైష్ణవమతావలంబి. ఆమెకు వర్తమానం పంపుతాడు యామునుడు. రాజాస్థానంలో తాను విష్ణు పారమ్యాన్ని సిద్ధాంతీకరించగలనని, అవకాశమిప్పించమని. ఆమె సంతోషించి ఏకాంతంలో భర్తతో ఈ విషయాన్ని విన్నవిస్తుంది. కాదనలేక రాజు సరేలెమ్మంటాడు.

మరునటిరోజు యామునుడు రాజసభ ప్రవేశిస్తాడు. రాజు అతన్ని తిరస్కార భావంతో చూస్తూ "ఏమిటోయ్! నీ సంగతి? చూడడానికి ఇంతలేవు. తత్వనిర్ణయం చేయడం నీ తరమా? ఓడిపోయావనుకో! ఊరకే వదలేదిలేదు సుమా! 'కుయ్యో మొర్రో' అని మొత్తుకున్నా నిన్ను పట్టుకొని మెడకు లింగం కట్టకుండా విడిచేది లేదు. జాగ్రత్తగా ఆలోచించుకుని చెప్పు.

"సంగతియె, యోయి! యినుమంత లింగజావు
తత్త్వనిర్ణయ వాదంబు తరమె నీకు?
ఓడి తేనియు పట్టి మొర్రోయనంగ,
లింగమును కట్టకుడుగ, మెరింగి నొడవు"
(ఆము. 4-60)

గొప్ప శాస్త్రవాదులమని సిపారస్సులతో వస్తారు. చివరకు, ఓడిపోతే కూడా అంతో, ఇంతో ఇచ్చే ఆచారముంది కదా! అని సిగ్గువిడిచి చొరవతో సభలకెక్కుతారు. ఈ బాపనవాళ్ళ సంగతి నాకు చెప్పాల్సిన అవసరం లేదు (4-61) అని పలికి ఇదంతా వింటున్న తన భార్య మనసు నొచ్చుకుంటుందేమోనని ఆమె వైపు చూసి చిరునవ్వుతో దేవీ! నా పక్షాన వాదించే పండితుడు ఓడిపోతే, నేను విభూది, రుద్రాక్షలు తీసివేసి నీవు ఆశ్చర్యపడేటట్లు, నా అభిమానులతో పాటు నీ పక్షాన

వాదించే ఇతని ద్వారా వైష్ణవ దీక్ష పుచ్చుకుంటాను. అలాగే ఇతనే గనుక ఓడిపోతే, నీకూ, నీవు తెచ్చిన ఈ పండితునికి శైవ దీక్ష తప్పదు సుమా! అన్నాడు.

అందుకామె ఎంతో ధీమాతో "అలాగేకానివ్వండి. దీనికి పంచభూతాలే సాక్షి" అని అంది. ఆ ఇద్దరి మాటలు వింటున్న యామునా చార్యులవారు తన ఆసనం నుంచి కొంచెం లేచి నమస్కరిస్తూ, వినయంతో "ప్రభూ! దబ్బుకోసం వాదినని డంబాలాడి వచ్చానని అనకండి. నేను సంసారిని కాను. బ్రహ్మచారిని. మోసం చెయ్యాల్సిన పని నాకు లేదు. ఎవరి కోసం నేను డంబాలాడాలి? భగవంతుని ప్రేరణతో ఇక్కడికి వచ్చాను. ఆయన దయతో నాకు తెలిసిన నాలుగు మాటలాడతాను. ఆ పరమాత్ముడు పలికించిన మాటలు అబద్ధాలైతే నేనేమి చేయగలను? ఇదంతా కల్పించి, నేనే వాదానికి వచ్చానంటే మంచిది. అలాగే కానివ్వండి. ఒకవేళ ఓడిపోతే, అమ్మగారు తెచ్చిన విద్వాంసుడు పోనీలే! పాపమని విడిచిపెట్టకండి. మీ ఇష్టప్రకారమే కానివ్వండి". ఇలా సాగుతుంది వాళ్ల సంభాషణ.

1. అన్నన్నతన్నుఁడోడిన
భస్మము రుద్రాక్షములును బాసి యితనిచే
విస్మయముగ సాత్తము మురః
ఘస్మర చంక్రాంకితుండ గా గలవాడన్.

2. ఉవిద, యీనీదు విద్వాంసు డోడెనేని
నీకు నితని కేనన్న పూనికయ యన్న
నొప్పితిమి దేవరానతి దప్పకున్న
జాలు' మరి పంచభూతము సాక్షిగాగ

3. అని పలుకు నయ్యిరువుర ప్రతిజ్ఞలాకర్ణించి.

4. దేవా! యిటని యానతి
యీవలదే గడువుగూటి కిటరా, నాడం
బేవారి త్రోవ? భిక్షా
జీవిక వర్ణికివి విధి నృజించెనె గాదే?

5. ఎవ్వడే నర్వభూతను డిత్తెఱంగు,
నకును బ్రేరేచె, నతనీ యానతియ తెచ్చె,
నెఱిగినవి నాలు నొడువ నేమయిన లెన్న,
యతడ టొంకిన నేమి సేయంగ వచ్చు?

6. వంతమైనను గానిమ్ము పార్థివేంద్ర!
యుక్తులను నిగ్రహస్థాన మొదవెనేని,
యమ్మదెచ్చిన విద్వాంనుడనగ వలవ
దెట్లు గావింపవలయు నట్లట్లచేయు.

(అము. 4-63, 64, 65, 67, 68, 69)

చివరకు వాదంలో యామునుడే గెలుస్తాడు. రాజు అతనికి సాష్టాంగ నమస్కారం చేసి మాట నిలువుకుంటాడు.

మహారాష్ట్రలోని పండరీక్షేత్రం విఠలదేవునికి ఆవాస స్థానం. ఆ దేవుని భక్తులు వివిధ ప్రాంతాల్లో నంచరించి భక్తి ప్రచారం చేశారు. వాళ్ళ ఆంధ్రదేశంలో కూడా అడుగు పెట్టారు. ఆ ప్రభావంతో ఎంతోమంది భక్తులు కాలినడకన పండరీక్షేత్రానికి వెళ్ళేవాళ్ళు. అందుకే పండరి భజనలు రాయలసీమలో ప్రసిద్ధిగాంచాయి. కన్నడంలో పురందర దాను కీర్తనలన్నీ ఈ దేవుని పేరు మీదగానే వెలిశాయి. రాయలు స్వయంగా విఠలాలయం నిర్మించారు. ఆ ఒరవడిలోనే రామకృష్ణుడు పాండురంగమహాత్మ్యం అనే గ్రంథాన్ని రచించారు. రాయల పాలనలో విశాల సామ్రాజ్య మేర్పడడంతో, రాజధాని అయిన విజయనగరం అనేక మతాలకు ఆలవాలమైంది. దేశీయాలైన శైవ, వైష్ణవాది మతాలే కాకుండా, విదేశీయులకు అవకాశం ఇవ్వబడింది. పోర్చుగీసు వాళ్ళతో గుర్రాల దిగుమతి తదితర వ్యాపార సంబంధాలు ఉండేవి. అందుకే ఆనాడు మసీదులు, చర్చిలు నిర్మించుకోవడానికి కూడా అనుమతినిచ్చినట్లు తెలుస్తోంది. మతాలు కలకాలం ఒకే రకంగాను, స్థిరంగాను ఉండకపోవచ్చు. కాని కులవృత్తులు మాత్రం అన్నివేళలా ఉంటాయి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు ఇలా ఏర్పడ్డవే.

బ్రాహ్మణులు - ఆ కాలంలో బ్రాహ్మణుల స్థానం చాలా ఉన్నతంగా ఉండేది. అన్ని విషయాల్లోను వాళ్లదే పైచేయి. రాజులకు సైతం వాళ్ల మాట శిరోధార్యంగా ఉండేది. యజ్ఞ, యాగ, వ్రత పూజాదికాల్ని చేయించడం, శిష్యులకు పాఠాలు చెప్పడం వాళ్ల ప్రధాన వృత్తి. ఈ నాటికీ ఉపాధ్యాయులు కాకున్నా, 'పంతులుగారు' అని సంబోధించడం కోస్తా ప్రాంతాల్లో ఉంది. అంతేకాకుండా రాజ్య ఆదాయ, వ్యయ వ్యవహారాలు చూసే కరణాలు, గణకులు నియోగులైన బ్రాహ్మణులు అధికారం చెలాయించేవారు. నియోగులు అధికారవర్గం (Bureaucrats) వాళ్లుగా సంఘంలో తిరుగులేని పెత్తనం చూపెట్టారు.

"అరుణాస్పదపురంలో బ్రాహ్మణులు అన్ని విద్యల్లోను ప్రవీణులై బ్రహ్మను సైతం మించిపోయారు. ఆ పురంలో ప్రవరుడు నివసించేవాడు. అతను మన్మథ, చంద్రుల వంటి అందగాడు మంచి మాటకారి. వైదిక కర్మలు ఆచరించడంలోను, శిష్యులకు వేదపాఠాలు చెప్పడంలోను శ్రద్ధ ఉన్నవాడు. బ్రాహ్మణ వంశానికి అలంకారం వంటివాడు. చిత్రించడానికి వీలుకానట్టి శరీర సౌష్ఠవం ఉన్నవాడు.

అతను ప్రతినిత్యం ఉదయమే లేచి, వామనమూర్తిని స్తుతించి, శిష్యులతో కూడా వరుణానదికి వెళ్ళి, స్నానం చేస్తాడు. సంధ్యవార్చుకుని, గాయత్రీ మంత్రాన్ని జపించి, ఇసుక తిన్నెల్లో నిలబడి సూర్యునికి నమస్కరిస్తాడు. అగ్నిహోత్రానికి, దేవతా పూజకు కావాల్సిన పండ్లు, సమిధలు, దర్భలు, పూలు మొదలైన వస్తువుల్ని, ఉతికిన మడిబట్టల్ని తీసుకుని శిష్యులు వెంటరాగా, ఇంటికి వచ్చేటప్పుడు అతన్ని చూసి ప్రజలు మెచ్చుకునేవారు. అతని సుగుణాల్ని చూసి ఏ రాజైనా మెచ్చుకుని దానం చేయడానికి వస్తే, కనీసం దేవతా విగ్రహం (సాలగ్రామం) లాంటి వాటిని కూడా పుచ్చుకోడు. అతని భార్య అన్నపూర్ణాదేవితో సమానమైంది. అర్థరాత్రి వేయిమంది అతిథులు వచ్చినా, వండటానికి అలసిపోదు.

వాళ్లకి కావాల్సిన మంచి భోజనాల్ని చేసి వడ్డిస్తుంది. ప్రవరుడు ప్రతినిత్యం తీర్థయాత్రికులు వస్తున్నారని తెలిస్తే, ఎంత దూరమైనా సరే ఎదురు వెళ్ళి, వాళ్ల పాదాలకు నమస్కరించి, ఇంటికి పిల్చుకుని వచ్చి, అతిథి మర్యాదలు చేసి, వాళ్ల యాత్రా విశేషాల్ని అడిగి, తాను కూడా వెళ్ళాలని ఆశిస్తుంటాడు".6

"తనను కామించి వచ్చిన వరూధినితో ప్రవరుడు వ్రతనిష్ఠాగరిష్ఠులైన బ్రాహ్మణుల్ని కామించడం ధర్మమా? అని తాను నిత్యం చేసే హోమం, దైవపూజ, బ్రాహ్మణపూజ మొదలైన కార్యక్రమాలన్నీ నిలిచి పోయాయని తాను ఆహితాగ్ని అనీ, త్రేతాగ్నుల్ని విడిచి ఉండజాలడని అంటాడు".7

బ్రాహ్మణుడు స్త్రీ లోలుడైతే పరబ్రహ్మానంద మహారాజ్యం నుంచి భ్రష్టుడవుతాడని అంటాడు.

తనని మార్చాలని వరూధిని చేసిన ప్రసంగామంతా విని అయిష్టపడుతూ అసహ్యించుకుంటాడు. "ఈ పాండిత్యం నీ ఒక్కదానికే తప్ప, మరెక్కడా చూడలేదు. నీవు కామశాస్త్రో పాధ్యాయినిలాగా మాట్లాడుతున్నావు. వేద ప్రతిపాదితాలైన ధర్మాలు పాపాలనీ, సంభోగం పుణ్యమనీ చెబుతున్నావు. బాగు!బాగు! వేదాంత సూత్రాలకు మీ వంటివాళ్లు చెప్పే అర్థాలు ఇలాంటివే కాబోలు. నాకు అరణులు (అగ్నిని పుట్టించడానికి మథించే దారువులు), దర్భలు, అగ్నులు ఇష్టమైనట్లు తక్కినవి కావు. ఈ శరీరం శాశ్వతమా? మీసాలకు అంటిన తేనెబొట్టు వంటి తుచ్ఛమైన సుఖాల గురించి చెప్పకు"8 అని అంటాడు. దీనివల్ల ప్రవరుని నైష్ఠికత తెలుస్తోంది.

6. మను. 1-50 నుంచి 57 వరకు.
7. అదే. 2-52, 53,
8. అదే. 2-63, 64, 65.

"విల్లిపుత్తూరులో (భక్తులైన) బ్రాహ్మణులు తమ నిత్యకృత్యంలో అతిథిసేవ ప్రధానంగా భావిస్తారు. అతిథుల్ని ఇంటికి పిల్చుకుని వచ్చి, కాళ్ళకు నీళ్ళిచ్చి, కొబ్బరాకుల చావమీద కూర్చోబెట్టి, పోక దొప్పల్లో పులుసు, పెరుగు, నేయి, పచ్చడి మొదలైన వాటిని అరిటాకుల్లో నుంచి రాజనపు అన్నం వడ్డిస్తారు. భోజనం అయిన తర్వాత వాళ్ల పాదాల్ని స్పృశించి, తాంబూలమిచ్చి, వాళ్ల క్షేమమడిగి, తగిన దక్షిణలతో వాళ్లని సాగనంపుతారు. ఆ పట్టణంలో విష్ణుచిత్తుడనే బ్రాహ్మణుడున్నాడు. అతను గొప్ప భక్తుడు. శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వాల్ని జయించినవాడు. మంచి ముఖ వర్చస్సు ఉన్నవాడు. సదా ధ్యానంతో శ్రీహరిని వశం చేసుకున్నవాడు వేదవేదాంతాల్ని చదవకుండానే పూర్వజన్మ సుకృతంతో జీవాత్మ, పరమాత్మ తత్వం తెలిసినవాడు".9 "ఈ తత్త్వం తెలుసుకోలేని చదువులతో పని ఏమిటి? ఈ చదువుల్ని పూర్తిగా చదవాలంటే సమయం సరిపోదు. ఆటంకాలా? అనేకం. అల్పమైన చదువుతో పొగరు ఎక్కువ. పూర్తిగా చదివినా మూడు గుణాల్ని (సత్వ, రజో, తమో) వదిలిపెట్టాల్సి వస్తుంది. కాబట్టి విరక్తుణ్ణి అయిన నాకు వీటిని (శాస్త్రాల్ని, వేదాల్ని) మొదట నేర్చుకోవడంగాని, చివరకు వదలడంగాని ఎందుకు? శాస్త్ర చర్చలో ప్రతివాదిని జయించడం, రాజు మనస్సును రంజింపజేయడం అంటే పునర్జన్మాలంటే విసుగులేని వాళ్లకి ఇష్టం ఉంటుందేమోగాని, మాలాంటివాళ్లకి ఉండదు. అలాంటి కీర్తి ప్రతిష్ఠలు మాకు మోయలేని బరువులాంటివి" అని తలచి విష్ణుచిత్తుడు మన్నారుదాన కోవెల్లో స్వామికి మాలలు కట్టడం, గుడిని శుభ్రం చేయడం మొదలైన పనుల్లో నిమగ్నమై ఉంటాడు. తాను న్యాయమార్గాన సంపాదించిన సొమ్ముతో దారిన వెళ్ళే విష్ణుభక్తులకు అన్నదానం చేస్తుంటాడు.

వర్షాకాలంలో జడి పట్టుకున్నప్పుడు ఎండిన కొబ్బరిబొండాలతో పొయ్యి మండించి, అన్నం వండి, దానికి పప్పు నాలుగైదు రకాల

9. అము. 1-76, 77.

తాళింపులు చేర్చి, వడియాలు, పెరుగు, నేయిలతో అతిథులకు వడ్డిస్తాడు.

వేసవిలో అయితే తెల్లని గోరువెచ్చని అన్నం, తియ్యని చారు, మజ్జిగ పులును, పలుచని అంబళ్ళు, చెరకుపాలు, ఎళనీరు, భక్ష్యాలు (రసావళులు) పండ్లు, సుగంధ ద్రవ్యాలు చేర్చిన చల్లని పానీయాలు, వడ పిందెలు (వడను పోగొట్టేటటువంటి ఊరవేసిన మామిడి పిందెలు), నీరు మజ్జిగతో అతిథులకు భోజనం పెడతాడు".10

శీతకాలంలో రాజనపుబియ్యపుటన్నం, మిరియాలపొడితో (తాళింపు వేయగానే) చట్టి చుద్రుమనే శబ్దం ఆగిపోని కూరలు, ఆ చలిలో ముక్కుకు మందుగా పనిచేసే పచ్చళ్ళు, పాయసాన్నాలు, ఊరగాయలు చేయి చురుక్కుమను వేడినేయి, ఇవురగాచిన పాలతో అతిథులకు వడ్డిస్తాడు.

అతనింటికి వచ్చిన వైష్ణవులు శనివారంనాడు తలంటి స్నానం చేస్తారు. అందుకుగాను చేతిలో ఇప్పపిండి ముద్ద, దాన్ని కుదురుగా చేసి, దానిమీద అరటి పూదొప్పలలో ఇంటిలోని గూనల్లో (బానల్లో)ని నూనెను కావాల్సినంత పోసుకుని, టాటికొనలో స్నానం తర్వాత ధరించడానికి ఉతికిన దోవతి వేలాడదీసుకుని పోయి, ఏటిలో ఒక్కసారిగా స్నానం చేసి భోజనానికి వస్తారు.

నిష్ఠాగరిష్ఠుడైన ఆ విష్ణుచిత్తుని ఇంట్లో అర్ధరాత్రి పూటయినా సరే ఆలకిస్తే అతిథులతో సంస్కృత భాషలో అతడనేటటువంటి "అయ్యా! కూరలు చాలా లేవు. వేడిగా లేవు. పిండివంటలు లేవు. భోజనం కూడా సౌష్ఠవంగా లేదు. దయచేసి భోంచేయండి!" అనే మాటలు వినబడతాయి.11

10. ఆము.1-78 నుంచి 80. వరకు.
11. అదే. 1-82, 83, 84

దేవతార్చన, వైదిక కర్మలు, వివాహాది శుభాశుభ కార్యనిర్వహణ, విద్యార్థులకు పాఠప్రవచనాది కృత్యాదులు వాళ్ల వృత్తులుగా ఉండేవి. రాజులు, సంపన్న గృహస్థులు తమ ఇళ్ళల్లో ఆయా కార్యాలు జరిపించి సంభావనలిచ్చేవాళ్లు.

రాజుల కొలువులలో పండిత సభలు ఏర్పాటు చేసి, శాస్త్ర వాదాలో, కవిసమ్మేళనాలో, మత చర్చలో జరిపించి, పాల్గొన్న పండితులందరికీ భూరి దక్షిణాలు, అగ్రహార దానాలు, గజ, అశ్వ, చతురంతయాన (రథ) బహూకరణాలు, వస్త్రమాల్యాను లేపనాదుల్ని వాళ్లకి ఇచ్చేవాళ్లు. అలాంటి అవకాశాల కోసం ఎదురుచూసేవాళ్లు. తమ కుటుంబ భార నిర్వహణకు, రాజుల అనుగ్రహం పొందడానికి తగిన పాండితీ ప్రకర్షలేని బ్రాహ్మణులు అవసరమనిపిస్తే ఇతరుల గ్రంథాలలోని విషయాల్ని తమవిగా చెప్పుకుని బతికేవాళ్లు. ఈ విషయాన్నే పెద్దన,

> "భరమైతోచు కుటుంబ రక్షణకుగా ప్రాల్మాలి చింతన్ నిరం
> తర తాళీదళ సంపుట ప్రకర కాంతారంబు సందర్భపున్
> తెరు వాటుల్ తెగగొట్టి తజ్జ పరిష ద్విజ్ఞాత చౌర్యక్రియా
> విరసుండై కొఱతంబుడున్"
>
> (మను. 1-9)

అని చెప్పాడు. అంటే చేతకాని కవి, మహాకవుల తాళపత్ర గ్రంథాల్లోని శబ్దార్థాల్ని గ్రహించి, తన రచనగా వ్యవహరించగా, ఆ గ్రంథచౌర్య మెరిగిన సహృదయులచేత రాజసభలో తిరస్కృతుడై అవమర్యాదల పాలవుతాడని అర్థం. ప్రతి కవీ ఇదే విషయాన్ని తన గ్రంథంలో ఏదో ఒక విధంగా 'కుకవినింద' అనే శీర్షికతో విధిగా చెప్పాడంటే ఈ 'జబ్బు' ఆనాడు ఎంత అధికంగా ఉండేదో తెలుస్తోంది.

***వాదంలో ఓడినవాళ్లు*** :- వాదంలో ఓడిపోయిన బ్రాహ్మణులు (పండితులు) కంపంతో తడి ఆరిపోగా, నాలుకతో పెదాల్ని మాటమాటికీ తడుపుకుంటూ, కొలువు బయట తమ పాద వాహాలాల్ని (చెప్పుల్ని పట్టుకుని ఉండేవాళ్లని) గమనించకుండా

ముందుకు వెళ్ళి వాళ్ల కోసం కేక వేస్తున్నారు. సభలో తబ్బిబ్బైనందు వల్ల బయటికి వచ్చి, ముందరే ఉన్న తమ పల్లకిని చూడకుండా దాటిపోయి, బోయీల కోసం కొంతమంది అరుస్తున్నారు. రాచనగరు వెలువడే వరకు విడిపోయి, అక్కడ నిలిచి, తమతోటి పండితుల్ని కలుసుకునేవాళ్లు మరికొంతమంది. కొందరు తమ ఇంటి విశేషాల్ని అడిగి, అతను చెప్పేది సరిగా వినుపించుకోకుండా వాడొకటి చెబితే, తామొకటి అంటున్నారు. ఎవరైనా "వాదమేమైనదయ్యా!" అని అడిగితే, 'ఆ దానరివాడు తనమీద రాజుకు పక్షపాతం ఉండబట్టి బతికిపోయాడుగాని, లేకుంటేనా? వాణ్ణి నోరెత్తనిచ్చేవాడినా?' అని, కొంతమంది, ఏం చేస్తాంలెండి, మంచేదో, చెడేదో తెలునుకోలేని ఈ రాజు ఆస్థానానికి ఇక ఎవడు వెళ్తాడు? అని కొందరు అంటూ, నాలుగు బాటలు కలిసేచోటు (శృంగాటం) వరకూ రాచనగరు వైపు చూసుకుంటూ వెళ్తారు.12

కళింగ దేశంలోని పీఠికాపురంలో నభాపతి అనే పేరు కలిగిన బ్రాహ్మణుడు ఆహితాగ్ని. అతను వేదాల రాశివంటివాడు. సకల శాస్త్రాలకు పుట్టినిల్లు వంటివాడు. వివిధ కళలకు చర్చా వేదిక వంటి వాడు.13

అతని కుమారుడైన నిగమశర్మ తండ్రికి చెడబుట్టినవాడు. బ్రాహ్మణ బ్రువుడు. భోగలాలసుడై, ధూర్తులైన స్నేహితులతో చెడు తిరుగుళ్ళు తిరిగేవాడు. బ్రాహ్మణ కులోచితమైన హోమాగ్నిని ఊదడం, సంధ్యవార్చడం, వేదాలకు సంబంధించిన వాదాలు చేయడం, భగవదార్చనకు సంబంధించిన తీర్థప్రసాదాలు స్వీకరించడం లాంటి సదాచారాన్ని చేయడు. విరహవేదన, ఈర్ష్య, విటవాదం, యువతీ అధరామృతం, దంత, నఖక్షతాదులు మొదలైన వాటికి వశమైపోతాడు.14

---

12. ఆము. 4-84.
13. పాండు. 3-03.
14. అదే. 3-12.

నిగమశర్మను అతని అక్క ఏరా! తమ్ముడా! నీవు ప్రారంభించిన శాస్త్ర పాఠాలకు భంగమవుతుందనా? నన్ను చూడ గానిక ఎన్నాళ్ళ నుంచో రాలేదు" అని అంటుంది.15

సుశీల భర్త బ్రాహ్మణుడైనా అన్ని దుర్గుణాలు ఉన్నవాడు. ఆనాటి బ్రాహ్మణుల్లో కనబడే సంపాదనేచ్ఛను కవి ఈ పాత్రలో చిత్రించాడు. అతను రాజుల దగ్గర తన ఇంట్లో ఏదో కార్యముందని అబద్ధం చెప్పి, వివిధ వస్తువుల్ని తెప్పించి, కోమటిండ్లలో అమ్మించేవాడు. సంపాదించిన ధాన్యాలను పాత్రలో భద్రపరచి మెత్తు వేస్తాడు. వస్తు అయినా పడుకుంటాడు కాని, వాటి మెత్తులు తీయడు. ఎవరైనా బంధువులు ఇంటికి వస్తే, ఇంట్లో ఆడవాళ్లు బయటున్నారని చెప్పి పంపేస్తాడు. ఎవరైనా ఏదైనా ఇస్తామని పొరపాటున ఒక్కమాట అంటే, ఇక అది ఇచ్చేవరకూ వదలడు.16

ఇక ఆకృత సత్రియుడు డబ్బున్నవాడైనా పెళ్ళి చేసుకోవాలంటే, కన్యాశుల్కం ఇచ్చుకోవాలని, పెళ్ళే లేకుండా ఎవరో ఒక వితంతువును తగులుకుంటాడు. పెద్ద కులంవాడైనా నాస్తికులతో కలసి తిరుగుతాడు. మేధావిగా ఉండి కూడా, వేదాల్ని చెవిన పెట్టకుండా చెడు తిరుగుళ్ళు తిరుగుతాడు. ఉన్నవాడైనా ఏమీ లేనివాడిలాగా ధనవంతుల్ని పొగడి నానాగడ్డి తింటాడు. దేవాలయ ఆస్తులకు, బ్రాహ్మణ ఆస్తికి కన్నువేస్తాడు. పేలాల కోసం కుప్పకే మంటబెట్టే లాగా తనకు కలిగే చిన్న లాభానికి ఎంత ఘాతుకానికైనా పాల్పడతాడు.17

ఇలా ఆనాటి బ్రాహ్మణులలో ప్రవరుడు, విష్ణుచిత్తుడు, యామునాచార్యుని లాంటి నిష్ఠాగరిష్ఠులు ఉన్నారు. నిగమశర్మ, అక్కృత సత్రియుడులాంటి ధూర్తులు ఉన్నారు. ఒకనాటి పవిత్ర బ్రాహ్మణత్వం

15. పాండు. 3-33.
16. అదే. 4-149.
17. అదే. 4-196.

క్రమేపీ అన్య సంస్కృతీ ప్రభావాలవల్ల దిగజారడానికి ప్రారంభమైన సూచనలు కనబడతాయి. "....యిక్కాలంబునందలి భూసురులకు నక్కాలంబు నందలి భూమి దివిజులకు గల శక్తి యున్నదె?...." (అము. 4-285) అనే మాటలు వినబడతాయి. బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో పూర్వజన్మలో తన దుశ్చేష్టల్ని ఇలా వివరిస్తాడు. "పద్నాలుగు కళలు నేర్చి, వాదంలో తార్కికుల్ని ఓడించేవాణ్ణి. యాగాలు చేసేవాళ్ళని ఎగతాళి చేసేవాణ్ణి. విద్వాంసుల్ని అధిక ప్రసంగంతో అవమాన పరచేవాణ్ణి. ఇలా పొగరుతో పెద్దల్ని ఎదిరించి వాళ్లతో ఓడిపోయి కూడా గెలిచానని అబద్ధాలాడి చిల్లర ప్రభువుల్ని మోసగించేవాణ్ణి. కులంలో నుంచి వెలివేసిన వాడితోపాటు భోంచేశాను. వర్తకులు, పురోహితులతో కలసి పుణ్యాహం బియ్యం కోసం వాళ్లతో దెబ్బలాడాను. సూర్య, చంద్రగ్రహణ సమయాల్లో సంపాదించిన పుణ్యమంతా పెద్దపెద్ద దొరల ఇండ్లకు మాత్రమే ధారాదత్తం చేశాను. పచ్చి జింకచర్మం, గేదె, మేక, ఆవుల తోళ్లు పాదరక్షల్ని దానంగా గ్రహించడానికి ఊరు మొత్తాన్నే గుత్తకు తీసుకున్నాను. శ్రాద్ధ భోజనం, అదీ లేనినాడు శ్రాద్ధ కర్తలతో స్నేహం చేసి, మిగిలిన అన్నం తిన్నాను. అది కూడా దొరక్కపోతే, అక్కవాడలకు వెళ్ళి అర్థించి సగం కడుపుకు తిన్నాను. అంతకంటే దిగజారి తులాభార దానాలు కూడా గ్రహించాను".18

ఇలా సంపాదించిన దాన్ని కోమటికి వడ్డీకిచ్చాను. తర్వాత అతని దగ్గరకు వెళ్ళి సొమ్ములు తిరిగి తీసుకుని రావలసిన వడ్డీ తక్కువ అయిందని ఆ కోమటిని రచ్చకీడ్చాను.19

ఎన్ని అపరాధాలు చేసినా "బ్రాహ్మణోన హంతవ్యమ్" అను ధర్మానుసారంగా అతనికి ఉరిశిక్ష మాత్రం ఉండేది కాదు. కులం నుంచి వెలివేయడమో, సరిహద్దులు దాటించడమో, చివరకు ఆ జన్మాంత కారాగారశిక్షలో ఉండేవి.

18. అము. 7-04, 05.
19. అదే. 7-07.

*క్షత్రియులు* - క్షాత్రగుణం కలిగినవాడు క్షత్రియుడు. రజోగుణ ప్రధానుడు రాజు. రాజ్య పరిపాలనలో ప్రజలకు సమర్థవంతంగా న్యాయాన్ని, ధర్మాన్ని చేకూర్చగలవాడు. నాయకత్వ లక్షణాలతో పాటు చక్కని శరీర సౌష్ఠవం, అచంచలమైన మేధా సంపత్తి, యుక్తాయుక్త విచక్షణా పరిజ్ఞానం, రాజుకు అత్యావశ్యకాలు. శరీర సౌష్ఠవానికి యుద్ధవిద్యల్లో తగిన పరిశ్రమ, మేధా సంపద కోసం కావ్యశాస్త్ర, పురాణేతిహాసాలతో పాటు, వేదాలు, స్మృతులు అధ్యయనం కలిగుండేవాళ్లు. ఈ సర్వగుణాలు ఉంటేనే అతను ప్రజల్ని రంజింపగలడు. 'రంజయతీతిరాజః' అని కదా! ధర్మశాస్త్రం. కులంవల్ల క్షత్రియులు కాకున్నా, గుణగణాలు కలిగి, రాజ్య పరిపాలనా దక్షుడైనవాడు కూడా క్షత్రియుడే

స్వరోచి తల్లి వరూధిని అప్సరస తండ్రి మాయాప్రవరుడైన గంధర్వుడు. అయినా అతను క్షత్రియ గుణాలతో పెరుగుతాడు మునులతనికి జాత కర్మాది సంస్కారాల్ని చేస్తారు. వివిధ ఆయుధ విద్యల్లో అతను నేర్పరి అవుతాడు. రణరంగంలో అచంచలుడై శత్రు భంజనం చేస్తాడు. వేదార్థాల్ని గ్రహిస్తాడు. అన్నిటా ప్రజ్ఞ కలిగి, తేజస్సుతో ప్రకాశిస్తాడు.

మల్లురు సాధన చేసేటప్పుడు రాళ్ళు నింపిన గోతాల్ని (జనపనార సంచి) పిడికిలితో గుద్దుతారని ప్రసిద్ధి. అలా స్వరోచి కుల పర్వతాలనే గుద్దుతాడు. కౌగిలికి లొంగని పెద్ద వృక్షాల్ని ఒకేదెబ్బతో తెగవేస్తాడు. భూమి జవజవలాడేటట్లు వాయువేగంతో పరుగెత్తుతాడు. యవ్వన ఆరంభంలో అతని లాగా చేసేవాడు. ఇందులో మల్లవిద్య, పత్తిసాము, మాచితాలు.20

వర్షాకాలంలో రాజుల దినచర్య ఇలా సాగేది. అంతఃపురంలో మణులతో కూర్చిన దండెం మీద పెంపుడు నెమలి షడ్జస్వరంతో అరచినప్పుడు, దాన్ని ఆనందంగా వింటూ పొద్దెక్కి లేస్తారు ఘమ

20. మను. 4-08.

ఘుమా పరిమళించే 'గంధరాజ'మనే తైలంతో అంగమర్దనం చేయించుకుని, వేణ్ణీళ్ళతో నిదానంగా స్నానం చేస్తారు.21

కాంతి కలిగిన దోవతి రకరకాల మణులున్న హారాలు, మొగలిరేకులు దాల్చి, జాము పొద్దుపోయిన తర్వాత కొలువుకూటానికి వేంచేస్తాడు. వరి అన్నం, కౌజు, పూరేడు, అడవిపంది మొదలైన మాంసాలతో అంతకుముందు రోజు తీసిన వెన్నతో చేసిన నేయిని అధికంగా ఆరగిస్తారు. కస్తూరి ఎక్కువైన తాంబూలం, పెదవిని నల్లగా చేస్తుండగా, అగరు చెక్కలతోటి బండి కుంపటి వెలుగుతుండగా, మేడల కిటికీలగుండా వచ్చిన మెరుపు కిరణాలకు బెదురుచూపులు కలిగిన అంతఃపుర స్త్రీలతో సంతోషంగా కాలం గడుపుతారు.22

**రాజు దినచర్య** :- 'రాత్రి సుఖంగా నిద్ర పట్టిందా?' అని అడగడానికి రాజుకు ప్రత్యక్షంగా పండితులు ఉండేవాళ్ళు. వాళ్ళని 'సౌఖ శాయనికులు' అనేవాళ్ళు. వాళ్ళతోపాటు వైద్యులు, జ్యోతిష్కులు ఉదయాన్నే రాజును దర్శనం చేసుకోవాలి. రాజు వాళ్ళతో ఆరోగ్యానికి, గ్రహానుకుల్యానికి చెందిన విషయాల్ని ముచ్చటిస్తాడు. జాము పొద్దెక్కిన తర్వాత మంత్రి, సామంతులతోను, కరణాలతోను, కాసేపు కొలువుతీరి మంత్రాలోచనం చేసి, ఆదాయ - వ్యయ సంగతుల్ని తెలుసుకుంటాడు. అంగమర్దనం, మల్లురతో వ్యాయామం, వంటవాళ్ళతోను, వేటగాళ్ళతోను తెచ్చిన మాంసాల్ని, తేవాల్సిన వాటిని విచారించి, తెచ్చిన వాటిని వండాల్సిన విధానాన్ని ఆజ్ఞాపించాలి. మధ్యాహ్నం దేవతార్చన సమయంలో పెద్దలతోను, ధర్మాధికారులతోను, సన్యాసులతోను సల్లాపం చేయాలి. భోజనం అయిన తర్వాత విదూషకుడి వినోదం, పౌరాణికులతో గోష్ఠి, నాలుగో జామున చారులకు దర్శనం, పాటకచేరి, రాత్రి సుఖ నిద్ర, ప్రేయసి సల్లాపాలు.23

21. మను. 4-7, 8, 9.
22. ఆము. 4-135.
23. అదే. 4-271.

***అధిష్ఠానపురంలోని రాజులు*** :- వీరు విరోధం ప్రసక్తమైనపుడు కూడా వెలవెల పోరు. ధనం కోసం చేయి చాచరు. యుద్ధంలో వెనుక ముందు చూడరు. శత్రువు మెచ్చుకునేటట్లు కప్పం ఇవ్వరు. యుద్ధంలో అయుధం మరువరు. ఎప్పుడూ నడవడిక తప్పరు. సిదరం (రోత) లేని భోగపరాయణులు. వీరులు, సౌజన్యపరులు.24

***కాశీనగరంలో రాజకుమారులు*** :- పుట్టినప్పటి నుంచి పుణ్యకార్యాలు చేస్తారు.ఆ పరమేశ్వరుడు అడ్డమైనా సరే అనుకున్నది సాధించేదాకా వదలరు. ఎలాంటి పరిస్థితిలోనూ ధర్మాన్ని వదలరు. పెద్దల పాలిట దేవతా జట్టులు. యుద్ధంలో గొప్ప శూరులు.25

వైశ్యులు :- చాతుర్వర్ణ విభాగంలో బ్రాహ్మణ, క్షత్రియ కులాల తర్వాతి స్థానం వైశ్యులది. దీన్నిబట్టే సంఘంలో వాళ్ల ప్రాధాన్యం ఎంత గొప్పదో తెలుస్తోంది. ధన సంపాదనే వీళ్ల ప్రధాన ధ్యేయమైనట్లు కనబడుతోంది. శిక్షలు కఠినంగా అమలుపరిచే ఆ రోజుల్లో రాజుల అండదండలతో నిరాఘాటంగా తమ వ్యాపారాన్ని సాగించుకున్నారీ వైశ్యులు. "వణిక్కులు, వణిజులు, వర్తకులు, వ్యాపారులు, కోమట్లు, కిరాటులు, టచ్చులు, బేహారి, బేరి"లని వీళ్లకి పేర్లు. నిత్యావసర వస్తువులతో పాటు అత్తరు, పన్నీరు, పునుగు, జవ్వాది, కస్తూరి మొదలైన సుగంధ ద్రవ్యాలు, వెండీ, బంగారు ముత్యాలు, వజ్రాలు, రత్నాలు కూడా వీళ్ల వ్యాపార వస్తువులు. వీళ్లలో చిల్లర వ్యాపారులు పెద్దపెద్ద దళారులు, విదేశీ (ఓడ) వ్యాపారులు ఉండేవాళ్లు. చిల్లర వ్యాపారులు వస్తువుల నాణ్యతలోను, కొలతలోను, ధరలోను, మోసాలు చేస్తుండేవాళ్లు. అందుకే సంఘంలో వీళ్లపట్ల ఉదాసీనత వ్యక్తమైన మాటలు వినబడతాయి. "కోమటి కొక్కటిచ్చి పదిగొన్నను ధర్మమనీ, కోమటి కొక్కటీక పదిగొన్నను ధర్మము ధర్మపద్ధతిన్" అనీ, కర్రాట, కిరాట, కీచకులనీ నాటి మాటలు ఉన్నాయి. దీనికి తోడు

24. వసు. 1-98.
25. పాండు. 1-110.

వడ్డీ వ్యాపారం, మితిమీరిన వడ్డీలతో అప్పు తీర్చలేని వాళ్లకి, న్యాయ స్థానాల్లో శిక్షలు, ఫలితంగా వీళ్ల వైపు చిన్న చూపు ప్రదర్శించబడింది. కాని పెద్దపెద్ద వ్యాపారులు విశేషమైన ధనం సంపాదించి, దానధర్మాలు, కృతిస్వీకారం లాంటి సత్కార్యాలు చేసి, రాజమన్నన పొందినవాళ్లు లేకపోలేదు. శ్రీనాథకవిసార్వభౌముని హరవిలాస కృతిపతిత్వ గౌరవం పొందిన అవచి తిప్పయ్య శెట్టిని ఇక్కడ గుర్తుచేసుకోడం అసందర్భం కాదనిపిస్తోంది. ఇతను సుగంధ ద్రవ్యాలతో విదేశ వ్యాపారం చేసేవాడు.

అరుణాస్పద పురంలోని వర్తకశ్రేష్టులు కుబేరునికి కూడా సంచుకారం (మూల ద్రవ్యం) ఇచ్చి పోషించగలరట. అంటే వాళ్లు విశేష ధనం కలవారనడం (మను. 1-50). అప్పు తీసుకున్నవాడు ఆ మొత్తాన్ని సద్వినియోగపరచుకుని, వడ్డీతోపాటు తిరిగి చెల్లించాలి. లేకపోతే వడ్డీకి వడ్డీ చాలా అవుతుంది. అది తీర్చలేదని రాజుగారికి ఫిర్యాదు చేస్తే, అయన పిలిపించి, విచారించి తగిన శిక్ష విధిస్తాడు. ఈ రోజుల్లో లాగా న్యాయస్థానాల్లో చెల్లించడానికి కంతులు సౌకర్యంగాని, మినహాయింపులుగాని ఉండేవి కావు. అప్పు ఇచ్చిన వాడికే తీర్పు అనుకూలంగా ఉండేది. వాడి వైపే ప్రభుత్వం పనిచేసేది. వాటిని తలచుకుని అప్పు పుచ్చుకున్నవాళ్లు మనశ్శాంతి లేకుండా అవుతారు. అందువల్ల ఎప్పుడైతే అప్పు తీరుతుందో, అప్పుడు ఎంతో హాయి, ప్రశాంతత చేకూరుతాయి. ఈ విషయం గురించి రాయలు ఆముక్తమాల్యదలో శరదృతువర్ణన చేస్తూ, "మేఘాలు ఆకాశంలో తెల్లగా చంద్రుణ్ణి కప్పేస్తున్నాయి. అవి అప్పు తీర్చిన వాడి హృదయం లాగా ఉన్నాయి. నీళ్లే ప్రాణంగా పెట్టుకున్న మేఘాలు సముద్రుని దగ్గర అప్పుతీసుకుని (సంస్కృతంలో 'అప్' అంటే నీళ్లు) దూరంగా ఆకాశమనే దేశాంతరాలకు వెళ్ళి, అక్కడ ఉష్ణాన్ని తగ్గించి చాతక, బలాకాదులకు (నీటి పక్షులకు) మేలు చేసి, ఆ తర్వాత వడ్డీతో కూడా ఆ సముద్రుడి అప్పును తీర్చి మనశ్శాంతితో, దేహ కాంతితో, గౌరవంగా

తలెత్తుకుని తిరుగుతున్నాయో అనేటట్లు చంద్రబింబాన్ని కప్పి, తెల్లని మేఘాలు ఆకాశంలో తిరుగుతున్నాయి".26

అన్యాయంగా సంపాదించినవాళ్లు, సొమ్ముగ్ని దొంగలించినవాళ్లు, ధనంగాని, ధాన్యంగాని, సొమ్ములు లాంటివిగాని కోమటి ఇళ్లకు తీసుకుని వెళ్ళి, అమ్మివేయడమో, లేక వాటికి లెక్కగట్టి, ఆ మొత్తాన్ని వాళ్ళ దగ్గరే వడ్డీకిచ్చి, పెంచమనిగానీ చేసేవాళ్లు. అలాంటి సందర్భాల్లో మూడోవ్యక్తి ప్రమేయంగాని, సాక్ష్యాధారాలుగాని ఉండవు. కాబట్టి కోమట్లు వీలైనంత మోసం చేసేవాళ్లు. ఇచ్చినవాడు మెతక స్వభావం కలవాడైతే వాళ్ల ఆటసాగేది. లేకపోతే రచ్చబండ (రచ్చచావడి) దగ్గరికి ఆ వ్యవహారం వెళ్ళేది.

బ్రహ్మరాక్షసుడు పూర్వజన్మలో అన్యాయంగా సంపాదించిన సొమ్మును ఒక కోమటి దగ్గర వడ్డీకిచ్చాడు. కొన్నాళ్ళయిన తర్వాత వెళ్ళి లెక్కచేసి, తన మొత్తమిమ్మన్నాడు. ఇచ్చిన మొత్తాన్ని లెక్కచేయడం కోసం నాలుగేసి వరహాలు ఒక కుప్ప చొప్పున కుప్పలు కుప్పలుగా పెట్టాడు. లెక్క తక్కువగా వచ్చింది. ఇద్దరూ తర్జన భర్జనలు పడ్డారు. బియ్యం మొదలైన వాటికి శెట్టి మోసం చేసినట్లు గ్రహించాడు. శెట్టిని గద్దించాడు. అప్పుడు ఇస్తాననిగానీ, ఇవ్వననీ గానీ చెప్పలేదు. అందువల్ల ఆ బాపడు ఆ శెట్టిని రచ్చచావడి కీడ్చించాడు.27

అవసరానికి డబ్బు కావాల్సి వస్తే, ఇంట్లోవాళ్లకి తెలియకుండా ఏదో ఒక వస్తువుగానీ, ఒంటిమీది నగలుగానీ తీసుకువెళ్ళి, కోమటిళ్లలో 'కుదువ'కు పెట్టేవాళ్లు.

> "దినవెచ్చమునకునై తనమీన గలసొమ్ము
> కొదుకక బచ్చింట గుదువవైచు....
> (పాండు. 3-16).

26. అము. 4-158.
27. అదే. 7-06.

అలాగే తేరగా వచ్చిన వస్తువులు తమకు అవసరం లేనప్పుడు వాటిని కూడా అంగళ్లకే తోచిన ధరకు విక్రయించేవాళ్లు.

పాండురంగ మహాత్మ్యంలో సుశీల భర్త ఏదో ఒక నెపం పెట్టి రాజుల్ని అడిగి వాళ్ల నుంచి దానంగా అనేక వస్తువుల్ని సంపాదించి, వాటిని అంగడికి అమ్మకానికి పంపేవాడు.

> ప్రస్తుతంబని పదార్థములు రాజులవేడి,
> కొని తెచ్చి యమ్మించు గోమటిండ్ల....
> (పాండు. 4-149).

ఇలా వైశ్యులకు కొన్నవాళ్ల నుంచీ లాభమే, అమ్మిన వారి నుంచీ లాభమే. ఇరువర్గాలకు వారధిగా నిలచి వీళ్లు విశేష లాభాల్ని గడించేవాళ్లు. అప్పు తీర్చలేని వారికి కొన్ని రకాల శిక్షలు ఉండేవి. బురదలో తొక్కడం, నీటిలో ముంచడం, ఎండలో నిలబెట్టడం అందులో కొన్ని రకాలని తెలుస్తోంది.

రాధ ముఖ కాంతులనబడే నాణేల్ని పద్మం అప్పుగా తీసుకుంది. అందుకు చంద్రుణ్ణి, అద్దాన్ని సాక్షులుగా నుదురు (లలాటం) అనే పత్రాన్ని రాసి ఇచ్చింది. ఎన్నాళ్ళయినా ఆ పద్మం తాను చేసిన అప్పును తీర్చలేకపోయింది. అందుకేనేమో బురదలో తొక్కినా, నీళ్ళలో ముంచినా, ఎండలో నిలబెట్టినా సహిస్తుంది.28

పెద్దపెద్ద వ్యాపారులు ఓడల్లో సరుకులు నింపుకుని విదేశాల్లోను, దీవుల్లోను, వ్యాపారం చేసేవాళ్లు. ఆ వ్యాపారం 'వస్తుమార్పిడి' రూపంలో సాగేది. అంటే వీళ్లు తీసుకెళ్ళిన సరుకులు ఇచ్చి, తత్సమానంగా అక్కడి సరుకుల్ని తీసుకుని వచ్చేవాళ్లు. ఈ విషయాన్ని పరోక్షంగా సూచిస్తున్నాడు వసుచరిత్రకారుడు. "బేరగాళ్లు సముద్రంలో ఓడనెక్కి (జోకెక్కి) ఒక దీవికి వెళ్ళి తాము తీసుకువెళ్ళిన ముత్యాల్ని ఇచ్చి, వాళ్ల నుంచి వస్త్రాలు గ్రహించారట.29

28. పాండు. 3-199.
29. వసు. 3-142.

రాయలు ఆముక్తమాల్యదలో ఈ ఓడ వ్యాపారుల విధానాన్ని ఇలా సూచించారు. 'వస్తుమార్పిడి' విధానంతో సాగే ఈ ఓడ వ్యాపారంలో ఒక ఓడలోని వర్తకులు తమ సరుకుల నాణ్యతను, ఇంకో ఓడలోని వర్తకులకు మచ్చుకు చూపడానికిగాను వాటిని ఒక వస్త్రుబట్టలో ఒక కొనకు మూటకట్టి, దానినొక కర్రకు బిగించి, రెండో కొనను పక్క ఓడపైకి వాల్చేవాళ్లు. అలాగే ఆ ఓడలోని వర్తకులు కూడా వాళ్ల సరకుల మచ్చును ఈ ఓడ మీదకు చేర్చి, బేరం కుదిరితే తమతమ సరుకుల్ని మార్చుకునేవాళ్లు. ఈ విషయం మధురాపుర మీదల వర్ణనలో తెలియజేయబడింది.30

కాపులు :- సామాజిక వ్యవస్థలో అన్ని జాతులకు ఆధారమైన జాతి కాపు జాతి. వ్యవసాయానికి తగిన అనుకూలం ఏ రాజ్యంలో ఉంటుందో, ఆ రాజ్యంలో ప్రజలు సుభిక్షంగా ఉంటారు. ఎక్కడ లేదో అక్కడ అన్ని అరిష్టాలూ ఉంటాయి. విజయనగర సామ్రాజ్యంలో తగినన్ని చెరువులు, కుంటలు, కాల్వలు ఉండి, వ్యవసాయం చక్కగా అభివృద్ధిచెందింది. కృషీవలులకు సమాజంలో తగిన గుర్తింపు ఉన్నట్లు కావ్యాలలో ఆధారాలు ఉన్నాయి.

అరుణాస్పద పురంలోని రైతులు నాగలి దున్నినందువల్ల పొందిన సంపదతో ఆదిభిక్షువైన ఈశ్వరుడి భిక్షాటనాన్ని కూడా మాన్పించ గలరట.31 కుబేరుడంతటివాడు స్నేహితుడుగా ఉండి చేయలేని పని, ఈ రైతులు చేయగలరని వాళ్ల అపార సంపదను తెలియజేయడమైంది. వ్యవసాయానికి తగిన పర్యవేక్షణ అవసరం. లేకుంటే బాగా పండే పొలాలు ఎండిపోతాయి. పశువులు పాడు చేస్తాయి. అలా పొలాల్లో పడిన పశువుల్ని బందుల దొడ్డిలో తోలేవాళ్లు. వాటి యజమానులు విధించిన అపరాధరుసుం చెల్లించి విడిపించుకుని పోయేవాళ్లు.32

30. అము. 2-12.
31. మను. 1-50.
32. అదే. 1-129.

పొలాలకు ఎన్నో రకాల తెగుళ్ళు వచ్చేవి. అందులో 'మల్లె' అనేది ఒక రకం. అది చేనుకు పడితే పచ్చని ఏ మొక్క కూడా పెరగకుండా మొత్తం పాడవుతుంది.33 రైతులు ఇలా బాధపడేవాళ్లు.

శ్రీవిల్లిపుత్తూరులోని రైతులు వరి ఎక్కువగా పండిస్తారు. అనేక రకాల వరి వంగడాలు నాటుతారు. తీగమల్లెలు, ఖర్జూరాలు, పుష్ప మంజరులు, మామిడి గుత్తులు, కుసుమాలు, పచ్చ గన్నేరులు, పాళలు మొదలైన పేర్లతోటి వరి వంగడాలు వాడేవాళ్లు.34

కోతకు వచ్చిన వరిచేలకు రైతులు నీళ్లు పారకుండా ఆరగట్టారు. ఆ రాజనపు వడ్లగింజల చివర నన్నని ముల్లులాంటివి ఉంటాయి. ఆ పైర్లు బాగా పండినందువల్ల బరువుకు వంగి, ఆ పక్క కాలువ వైపు తూలాయి. ఆ కాలువలో ఎర్రకలువలు ఉన్నాయి. అది చూడడానికి దప్పికగొన్న వరిచేలు తమ వేళ్లకు నీళ్లందక కొనముళ్లతో ఆ కలువల మకరందాన్ని పిలుస్తున్నాయేమో అనేలాగుంది.35

వరిచేలు కోతకు వచ్చి, వెన్నుల నిండా గింజలు ఆర పండాయి. మొక్కంతా పండిపోయినా, ఇంకా ప్రతి వెన్నుకూ ఒక్కో పసరుటాకు కనబడుతోంది. అలాంటి వాటిని చిలుకలు వాటి చుంచువుల్లో వేలాడే పసురుటాకులున్న వరి వెన్నులు చూడడానికి వరిచేలే రైతులు తమనిక కోసేస్తారనే భయంతో వేరేచోటకు ఎగిరిపోతున్నాయేమో! అనేటట్లు ఉన్నాయి.36

చేలుకోసి ధాన్యం తీసుకున్న తర్వాత ఆ వరి గడ్డిని పెద్దపెద్ద వాములు (మేటులు)గా వేస్తారు. ఆ పెద్ద గడ్డివాములు చాలా ఎత్తుగా నీలాకాశాన్ని తాకేటట్లు ఉంటాయి. ఇలా కొండల్లాంటి ధాన్యరాశుల్ని

33. మను. 5-26.
34. అదే. 1-65.
35. ఆము. 1-67.
36. అదే. 4-162.

పండించే ఆ రైతులు రాజుల మనుగడకు 'మా భుజాలపైని నాగేళ్ళే మూలాధారం అనేటట్లున్నారు.37

వర్షం వచ్చిందంటే పెద్దరైతులు అదీ, ఇదీ అనకుండా అన్ని ఎద్దుల్నీ, దున్నల్నీ అరకలకు కట్టి బురదమళ్ళు, గడ్డిగంటలు కట్టిన బీడు భూములు దున్నుతారు. బురదమళ్లలో దున్నడానికి దున్నల్నీ ఎక్కువగా వాడుతారు. మెట్టదుక్కి (వెలిపొలాలు) దున్నడానికి ఎద్దును ఉపయోగిస్తారు. ఒక్కదాన్ని కూడా వదలకుండా అన్ని ఎద్దుల్నీ అరకలకు కట్టడం చూసి యమధర్మరాజు వాహనమైన దున్నపోతు 'తాను ఎద్దుగా పుట్టకపోవడం వల్లే బతికిపోయానని, లేకుంటే ఈ రైతులు తనతో కూడా గడ్డిగంటలు దున్నించేవాళ్లని అనుకుంటుందట. అలాగే ఈశ్వరుడి వాహనమైన ఎద్దు తాను దున్నపోతుగా పుట్టకపోవడం వల్లే బతికిపోయాననీ, లేకుంటే ఈ రైతులు తనను కూడా బురదలో దించి, అరకను లాగించేవాళ్లని అనుకుంటుందట.

> "కాలునిదున్న నంది నయి గంటలు దున్నక మంటినా, మహా
> కాలునినంది దున్న నయి కర్దమ మగ్నత లేక మంటినా,
> హాలికు లెన్నుదుం దెగనియోరుల చేలును జౌకుమట్టునుం
> గాలలి నీరు సాగి రిల గల్గువసిం గొని పేదమున్నుగన్"
>
> (ఆము. 4-124)

బురద మళ్లలో దున్నేటప్పుడు రైతుల కాలి కిందపడి బురద పాములు (నీరుకట్లు) కాలికి చుట్టుకుంటాయి. వాటి తల మీద సరిగ్గా పాదం మోపినప్పుడు, అవి తమ పొట్ట భాగం పైకి వచ్చేటట్లు తిరిగిపోయి గుండ్రంగా చుట్టుకుంటాయి. అప్పుడవి బంగారుకాంతితో మెరిసిపోతాయి. ఆ రైతులు దున్నడంలో తాము నేర్పరులమని తెలియజేయడానికి ధరించిన గండపెండేరాలో! అనేటట్లు అవి అమరాయి.38

37. ఆము. 4-163, 164.
38. అదే. 4-125.

రైతులు విత్తనాల్ని శుద్ధిచేసి, నానబెట్టి ఆ తర్వాత విత్తేవాళ్లు. ఈ విత్తడం రెండు పద్ధతులుగా ఉంటుంది. సిద్ధమైన దుక్కిలో ఈ విత్తనాల్ని చేతితో అందాజుగా అన్ని వైపులా సమానంగా పడేటట్లు చల్లడం. లేదా గొర్తితో (గొర్రుతో) విత్తడం. 'డమరుక' వంటి చెక్క సాధనం. దీనికి నాలుగు రంధ్రాలు ఉంటాయి. దీన్ని 'జడిగం' అంటారు. నాలుగు రంధ్రాలకు సరిగా నాలుగు వెదురుబొంగుల్ని అమర్చి, దీన్ని 'గుంటకకు' బిగిస్తారు. ఒడి కట్టుకుని, అందులో విత్తనాల్ని పోసుకుని, మగవాళ్లు గుంటక తోలుతుంటే, స్త్రీలు రెండు చేతులతోను ఒకటి మార్చి ఒకటి ఆగకుండా ఆ జడిగంలో విత్తనాలు వదులుతారు. అవి సరిగ్గా చాళ్ళలో పడతాయి. దాని వెనుకే దిండు లేక అర్థ అనబడే కొయ్యలు లేని దిమ్మను తోలుతారు. అప్పుడా చాళ్ళలోని విత్తనాలు కప్పబడతాయి. ఈ విధానాన్ని 'గొర్తివెద' అని, చేత్తో చల్లే విధానాన్ని 'చల్లువెద' అని అంటారు.

'దక్షిణానిలుడు' అనే తోటమాలి తామ్రపర్ణీనదిలోని ముత్యాల్ని తెచ్చి వాటిని ఆ సమీప చందన శైలంలోని శ్రీగంధం వాసనలో నానబెట్టి, నేర్పుతో చేతితో (చల్లువెదగా) చల్లితే, పరిమళయుక్తమైన గుంద్రని మొగ్గలు కాసినవి' అని ఉత్ప్రేక్షింప బడింది39. కళ్లంలో ధాన్యాన్ని శుభ్రం చేయడానికి తూర్పెత్తుతారు. ధాన్యంలో దుమ్ము పొల్లుకట్టు (తాలు), చెత్తచెదరాన్ని గాలి బాగా వీచినప్పుడు చేటలతో ఆ ధాన్యాన్ని గాలికి ఎదురు ఎత్తునుంచి కిందకు మెల్లమెల్లగా వదులుతారు. అప్పుడు గట్టి ధాన్యం మాత్రం కింద పడుతుంది. మిగిలినదంతా దూరంగా ఎగిరిపోతుంది. ఇలా ధాన్యాన్ని శుద్ధి చేసే విధానాన్ని 'తూర్పార బట్టడం, తూర్పెత్తడం, తూర్పుపోయడం' అని అంటారు. ఆ సమయంలో గాలి తూర్పు నుంచి పడమరకు (నిజానికి ఈశాన్యం నుంచి నైఋతికి) వీస్తుంది. చేటలతో ధాన్యాన్ని తూర్పువైపుకు ఎత్తుతారు. కాబట్టి 'తూర్పెత్తుట' అని వాడుకయ్యింది.

39. ఆము. 5-114.

విష్ణుచిత్తునికి శ్రీమన్నారాయణుడు దర్శనమిస్తాడు. అప్పుడతన్ని దేవతలతో పాటు ఆకాశంలో రాక్షసులు, పిశాచాదులు కూడా చూడసాగారు. ఆ సమయంలో గరుత్మంతుడు తన బలమైన రెక్కలు వీచడంతో ఆ గాలికి రాక్షస పిశాచాదులు తూర్పెత్తుగా పొల్లు కట్టులాగా ఎగిరి పడ్డారట.40

వసుచరిత్రలో ఒకచోట (సూర్యోదయ వర్ణన సందర్భంలో) మాత్రం వరిధాన్యం తూర్పెత్తటం ప్రస్తావించబడింది. "ఆకాశమనే వరిమడిలో 'నక్షత్రరాశి' అనే వరిపంట కోతకు రాగా, వెన్నెల అనే నీళ్లిండిపోగా, కోతకోసి ఆ పంటను 'ప్రాతఃకాల'మనే పెద్దరైతు తూర్పెత్తుతున్నాడో! అనేటట్లు తూర్పు దిశలో తెలుపు కనిపించింది. తూర్పెత్తిన ధాన్యరాశికి దూరంగా ఎగరగొట్టబడ్డ పొల్లు కట్టో! అనేటట్లు పడమటి దిక్కులో కాంతిని కోల్పోయిన చంద్రుడు కన్పిస్తున్నాడు.41

పాండురంగమహాత్మ్యంలో నిగమశర్మ, పెద్దలు సంపాదించిన వరిమళ్లు చాలా సారవంతమైనవి. అందులో 'కాశ్మీరఖండాలనే' వరి పంగడాలు సంవత్సరానికి మూడుకార్లు పండేవట (పాండు. 3-40). చేను బాగా లోతుగా గరుగుమన్ను బయటికి వచ్చేటట్లు దున్నేవాళ్లు. (పాండు. 3-195). విత్తనాల్ని నానబెట్టి, మొలక కట్టి, నారు పోసేవాళ్లు. (పాండు. 3-191).

ఊరికి పెద్ద అయిన రైతు (పెదకాపు) దినచర్య :- పసువులకొట్టం మంచి పాలు ఇంటికి రాగా, రకరకాల ధాన్యాలు బాగా పండగా, అప్పుడప్పుడు వివాహాది శుభకార్యాలు జరుగుతుండగా, అడిగిన వాళ్లకి లేదనకుండా దానధర్మాలు సాగుతుండగా, పనివాళ్ళు సక్రమంగా పనులకు హాజరవుతుండగా, బంధువుల సందడి నిండుగాను, ఊళ్లో తన పలుకుబడి చెల్లుతుండగా, సత్యనిష్ఠకు తనను

40. ఆము. 4-13.
41. వసు. 4-130.

సాక్షిగా తీసుకోగా, హరిపూజలతో, అనుకూలవతి అయిన భార్యతో చక్కని భోజనం చేస్తాడు.42

వీటినిబట్టి చూడగా విజయనగర రాజుల కాలంలో వ్యవసాయానికి మంచి ప్రాధాన్యం ఉన్నట్లు కనిపిస్తోంది. రైతులకు అవసరమైన చెరువులు, కుంటలు, కాల్వలు తవ్వించడంలో వీళ్లు చాలా ఆసక్తి కనబరచారు. రాయలు పోర్చుగీసు ఇంజనీర్ల సలహాలు స్వీకరించాడు. ఆనాడు వాళ్ల పర్యవేక్షణలో తవ్వించిన కాలువలు, కట్టబడిన తుంగభద్ర ఆనకట్ట నేటికీ సజీవంగా ఉండడం గమనార్హం. ఇలా ఆనాడు వ్యవసాయం సమృద్ధిగా ఉన్నా, వ్యవసాయదారుల పరిస్థితి మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. రాజుకు తెలియకుండా కింది అధికారులు తమ స్వార్థానికి రైతులకు లేనిపోని పన్నుల్ని విధించి, వాళ్లని వేధించినట్లు తెలుస్తోంది. విలాసజీవితం, వేశ్యా సంపర్కానికి అలవాటుపడి, అడ్డదారుల్లో రాజుకు తెలియకుండా వివిధ పన్నులు వేసి, చెల్లించనివాళ్లని చిత్రహింసలకు గురిచేసినట్లు నిదర్శనాలున్నాయి. ఇలాంటివి అన్నిచోట్ల కాకుండా, రాజధానికి చాలా దూరంగా మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడా మాత్రమే జరిగేవి. అందువల్ల స్థానిక అధికారులకు భయపడి రాజుకు ఫిర్యాదు చేయకుండా ఉండేవాళ్లు.

వీరనరసింహరాయల కాలంలో సిద్ధవటం పాలకుడైన సమ్మెట గురవరాజు పన్నులు చల్లించనివాళ్లని అమానుషంగా హింసించేవాడని, స్త్రీలను కనికరించకుండా వేదించేవాడని కైఫీయతులవల్ల బోధపడుతోంది. దీనికి సంబంధించి ఆరో ప్రకరణంలో 'పన్నులు-శిక్షలు' అనే శీర్షిక కింద వివరించడం జరిగింది.

మిగిలిన కులాలవాళ్ళు :- కమ్మరులు, కుమ్మరులు, సాలెవాళ్లు, గంధకారులు, చాకలి, మంగలి, మాదిగ, ఎరుకలు మొదలైన వాళ్ళు

42. పాండు. 5-216.

రాజును ఏదో రకంగా సేవించేవాళ్లు. సంఘానికి వీళ్ల అవసరం ఎంతో ఉండేది.

**ఎరుకలవాళ్ళు** :- రాజ దర్శనానికి వచ్చినప్పుడు ఉత్త చేతులతో రాకూడదు. అడవిలో అపురూప వస్తువులైన నక్కకొమ్ము, గోరోజనం, జున్ను, చారపప్పు, బాణాలు మొదలైన కానుకలు తెచ్చేవాళ్లు. నక్కలకు సాధారణంగా కొమ్ముండదు. కాని ఒకజాతి నక్కలకు 'మినుబోతు' అనే అడవి జంతువుకు లాగా నడినెత్తి మీద కొమ్ము ఉంటుందట. గోరోజనం పశువుల పిత్తాశయం నుంచి తీసే పదార్థం. 'జున్ను' అనేది మామూలు జున్ను కాదు. వాతాన్ని హరించే ఒక చేదు మందు. ఇవన్నీ వైద్యానికి పనికి వచ్చేవి. సాధారణంగా పట్టణాల్లో లభించనివి.

రాజుకు వేట విషయంలో వీళ్ల పాత్ర ప్రధానమైంది. (వీళ్లని గురించి వేట ప్రకరణలో వివరించబడుతుంది) వేటలో వాళ్లకి నైపుణ్యం ఎక్కువ. ఎండాకాలంలో బండలమీద నీళ్లుపోసి వాటిని తాగడానికి వచ్చే పిట్టల్ని ఉరులు వేసి పట్టేవాళ్లు.43.

వీళ్ల మనస్తత్వాలు చాలా విచిత్రంగా ఉంటాయి. అల్పులు, అమాయకులు కావడంతో కొంచెం మేలు చేస్తేనే వాళ్లు పొంగిపోయి ప్రాణాలైనా ఇస్తారు. అలాగే కొంచెం పొరపాటు జరిగితేనే ప్రాణాలు తీయడానికైనా వెనుకాడేవాళ్లు కాదు.44

"అటవికులలో కనబడే తప్పుల్ని చూసీ చూడనట్లుగా పోవాలి. ఎందుకంటే వాళ్ళను సంస్కరించాలనుకోవడం మట్టిగోడను నీళ్లతో కడగటం లాంటిది"45 అని ఆముక్తమాల్యదలో యామున రాజనీతిలో చెప్పబడింది.

43. ఆము. 2-46.
44. అదే. 4-222, 223, 224.
45. అదే. 4-257.

**ఎరుకల భోజనం** :- మెరుగు వచ్చేటట్లు బాగా దంచిన వెదురు బియ్యాన్ని చిన్నకుండల్లో ఉడికించి, గంజి వంచి, దించిన వేడి అన్నంలో బాగా తోమిన మూకుళ్లలో రకరకాల అడవి జంతువుల మాంసపు కూరల్ని చుట్టూ ఉంచుకుని, గవయ మృగం (ఆవులాంటి అడవి జంతువు) నెయ్యి చేయి పట్టేటంత పోసుకుని, దాని మజ్జిగను సొరకాయబుర్రలో నింపుకుని, ఆ అటవికస్త్రీ భర్తతో కలసి భోజనానికి కూర్చుంది.46

ఒక భిల్లుడు (ఆటవికుడు) తన మిత్రుడైన మరొక భిల్లునింటికి అతిథిగా వెళ్ళాడు. పొయ్యి మీద నార ఉడుకుతోంది. అది మాంసంలా ఎర్రగా కనిపించింది. పాలు, అన్నం పెట్టి అతిథిని సాగనంపాడు. వాడికి కోపం ముంచుకు వచ్చింది. తనకు మాంసం పెట్టకుండా పాలబువ్వ పెట్టి అవమర్యాద చేశాడు. కాబట్టి దారిలో వాణ్ణి చంపాలని అనుకుంటాడు. ఇంతలో రెండోవాడు 'తనకు సెలవు ఇప్పించమని, పొయ్యి మీద నార ఉడుకుతోంది. తొందరగా వెళ్ళి దించాలి' అని అడిగాడు. అప్పుడు మొదటివాడు వాస్తవాన్ని తెలుసుకున్నాడు.47 ఇలా వాళ్ల మనస్తత్వాలు ఉంటాయి.

మంగలి :- తలవెంట్రుకలు స్త్రీలకు, పురుషులకు సమానంగాను, అలంకార ప్రాయంగాను భావించబడేవి. అదొక సంపదగా జాగ్రత్తపడేవాళ్లు. పురుషులకు నేటి 'క్రాఫుల' విధానం పాశ్చాత్యుల మూలాన సంక్రమించింది. అటువంటప్పుడు ఆ రోజుల్లో మంగలితో పనేమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కాని గడ్డాలు, మీసాలు తీయించు కోవడానికి, గుండు చేయించుకోవడానికి, బ్రాహ్మణుల విషయంలో పిలకజుట్లు, గోష్పదాలు (తల ముందు నొసటి పైభాగాన ఆవుగిట్ట ఆకారంలో జుట్టు కత్తిరించుకోవడం) గొరిగించుకోవడానికి, శుభ, అశుభ కార్యాలలో మేళతాళాలు వాయించడానికి మంగలివాళ్ల అవసరం ఉండేది. ఆముక్తమాల్యదలో బ్రహ్మరాక్షసుడు తన పూర్వ

46. పాండు. 3-87.
47. ఆము. 4-123.

జన్మ వృత్తాంతం వివరిస్తూ 'కూర్చుంబు గొరిగించుకొని, యుష్ణతో యంపుటంగడి తలగడుగాడు తడవు' (ఆము. 7-7) అని చెప్పబడింది. పెరిగిన మీస, గడ్డాల్ని గొరిగించుకుని, డబ్బు తీసుకుని వేడినీళ్ల స్నానం చేయించే అంగడిలో స్నానం చేశాడట. అష్టవిధ భోగాలలో తలస్నానం కూడా ఒకటిగా గుర్తించిన రోజులవి. మంగలివాళ్లు గొరిగిన వెంట్రుకలన్నీ ఒకచోట పెంటకుప్పలాగా వేసేవాళ్లు. వాటిని మంగలి తిప్పలనేవాళ్లు. అవి ధూళి నుంచి అప్పుడప్పుడు గాలికి ఎగిరేవి. బ్రహ్మరాక్షసుడు తిని పారేసిన శవాల వెంట్రుకలు మంగలి తిప్పల్లాగా గాలికి లేచాయట (ఆము. 6-17).

కమ్మరులు :- కొడవలి, గొడ్డలి, గునపం, నాగేటికారు మొదలైన వ్యవసాయపు పనిముట్లు, కత్తులు, కటార్లు, బల్లేలు, బాకులు మొదలైన ఆయుధాల్ని తయారుచేయడం కమ్మరుల పని. హొనపేట పరిసరాలన్నీ ఇనుపరాయి లభించే కొండలే. అక్కడ ఆయుధాలు తయారుచేసే పరిశ్రమ ఉన్నట్లు చెబుతారు.

గృహోపకరణాలైన పాత్రల తయారీ వీళ్ల పనిలో అంతర్భాగమే. పాత్రలకు చిల్లులు పడినప్పుడు అతుకులు వేసేవాళ్లు. పాత్రల అడుగు భాగం (తుప్పు) పట్టకుండా పూత పూసేవాళ్లు. ఈ విధానాన్ని 'కళాయి పని' అంటారు. చిల్లులు పడిన పాత్రనుగాని, చిలుం పట్టిన పాత్రనుగాని కొలిమిలో ఎర్రగా కాచి, దానిమీద అయస్కాంత సహాయంతో ఇనుపపొడిని వచ్చేటట్లు చేసి, మైలుతుత్తం, తుత్తునాగం మొదలైనవాటి మిశ్రమంతో చిల్లులు పూడ్చేవాళ్లు. తర్వాత పూత పూసేవాళ్లు.

సూర్యుడు అనే కొలిమిలో చిల్లులు పట్టిన అకాశమనే కొప్పెరను బాగా కాచి, పిడుగుకు సంబంధించిన ఉక్కుముక్క ఆ కొప్పెరలో చూపగానే, భూమి మీద నుంచి కార్చిచ్చుకు సంబంధించిన మాడిన తునకలు అనే ఇనుపరేణువులు లేచాయట.[48]

48. ఆము. 4-80.

**కంసాలి** :- బంగారు, వెండి లోహాలతో సున్నితమైన ఆభరణాల్ని తయారుచేసేవాళ్లు కంసాలివాళ్లు. వీళ్లనే 'అగసాలివాళ్లు' అని కూడా అంటారు. లోహాల్ని కుంపటిలో బాగా వేడిచేసి లోహపు శలాకతో పట్టుకుని సన్నని తీగలుగా లాగేవాళ్లు. ఈ విధానానికి వసుచరిత్రలో ఆధారం చూపబడింది. 'మన్మథుడు' అనే కంసాలివాడు గిరిక 'హృదయం' అనే కుంపటిలో ఆమె స్తనాలు అనే బంగారు కలశాల్ని, ఆమె నూగారు అనే పట్టుకారుతో పట్టుకుని సానబెట్టినప్పుడు వాటి చివర్లో రాలిపడిన రజమే ఆమె బాహువుల మొదట్లో మెరుస్తోంది. అలా కాని పక్షంలో అక్కడ బాహువులనే బంగారు తీగలు ఎలా పుడతాయి?.49

ఈ కంసాలివాళ్లు విలువైన ఆభరణాదులు చేసేటప్పుడు ఎంతో కొంత లోహాన్ని ఎలాగైనా గిల్లుకొంటారని ప్రతీతి. చివరకు తమ ఆత్మీయుల విషయంలోనైనా ఇలాగే వ్యవహరిస్తారని వదంతి. ఈ విషయం కూడా వసుచరిత్రలో చెప్పబడింది. విరహ వేదన పడుతున్న గిరిక చంద్రునితో 'ఓ చంద్రా! నీవు నీటిలో పుట్టావు. అలాగే నేను కూడా నీళ్లలో (శుక్తిమతీ నదికి) పుట్టాను. ఇలా నీతో వావి (వరుస) కలువుకోవడానికి నాకు సిగ్గేస్తుంది. ఎందుకంటే నీతోడబుట్టిన లక్ష్మీదేవి ఇంట్లోని (కమలంలోని) సంపదల్ని హరించటానికి కూడా వెనుకాడని నీకు నేనో లెక్కా! లోకంలో ఎక్కడైనా కంసాలివాడు తోబుట్టువు సొమ్మునైనా దొంగిలించడానికి వెనుకాడుతాడా?50 (లక్ష్మి, చంద్రుడు ఇద్దరూ పాలసముద్రంలో పుట్టారు. చంద్రుణ్ణి చూడగానే కమలం కుంచించుకుపోతుంది. కమలం లక్ష్మి నివాసం). రాగి, వెండి ఆభరణాలకు బంగారుపూత కూడా వేసేవాళ్లు. ఈ విషయం మనుచరిత్రలో "పూత వసిండి వంటి వలపున్ బచరించు కులంబు"(మను. 3-33) అనే పద్యంలో చెప్పబడింది.

49. వసు. 2-43.
50. అదే. 4-34.

అలాగే వెండిపూత కూడా వేసేవాళ్లు. ఇందుకు పారిజాతాపహరణం (2-53) వచనంలో వెన్నెల గురించి వర్ణిస్తూ "అజాండ కరండంబు వెండి జలపూతగావించిన తెఱంగున" అని చెప్పబడింది. బ్రహ్మాండమనే బరిణెకు వెండి కరిగించిన నీళ్లను పూతగా వేసినట్లు ఆ వెన్నెల లోకమంతా పరచుకుంది అని అర్థం.

వెన్నెల పూత లాగా వెన్నెల తీగల్ని కూడా తీసేవాళ్లు. ఆకాశంలో నక్షత్రాలు చూడడానికి స్వచ్ఛమైన వెన్నెల అనే వెండితీగల్ని సాగదీయడానికి ఆకాశమనే కమ్మచ్చు రంధ్రాల్లా ఉన్నాయట (పారి. 2-37). కంసాలి లోహపు తీగెల్ని తీయడానికి ఉపయోగించే పనిముట్టును 'కమ్మచ్చు' అని అంటారు.

కుమ్మరులు :- మట్టితో పాత్రలు చేసేవాళ్లు కుమ్మరులు. ఇది చాలా నైపుణ్యంతో కూడిన పని. వర్ణసంకరంతోపాటు వృత్తి సంకరం కూడా అయిన ఈ రోజుల్లో కూడా కుమ్మర వృత్తిని ఈ కులంవాళ్ళు తప్ప వేరేకులం వాళ్లు చేయలేకున్నారు. కాలం ఎంతగా మారి పోయినా, ఎన్ని రకాలైన పాత్రలు వాడుకలోకి వచ్చినా వీటి వైశిష్ట్యం నేటికీ ఏ మాత్రం తగ్గలేదు. ఆరోగ్య రీత్యా అన్ని లోహపు పాత్రల కంటే కూడా ఇవే మంచివని వైద్యులు అంటారు. నేటికీ భగవత్కైంకర్యాల్లోను, వివాహాది శుభకార్యాల్లోను వీటి ప్రత్యేకత తగ్గలేదు. ఇక ఆనాడు ఈ మట్టి పాత్రలు లేనిదే సామాజిక జీవితమే లేదనిపిస్తోంది. కుండలు, కాగులు, కడవలు, ముంతలు, గరిగలు, బానలు, చట్టి , మూకుడు, పిడతలు, వాడలు మొదలైన పేర్లు ఈ నాటికీ వ్యవహారంలో ఉన్నాయి.

"గ్రీష్మకాలంలో మండుటెండలకు భయపడిన జలదేవతలు ప్రపాళికల రూపంలో రాబోయే కాలానికి జలాన్ని సృష్టించడానికి విత్తనంగా చలిపందిళ్ళలోని కడవలలో నీళ్లను నింపుకున్నారేమో" అనేటట్లు ఉన్నారు.51

51. ఆము. 2-57.

వేసవిలో చలివేంద్రాల్లో నీళ్లుపోసే అమ్మాయిలు ముంతల్ని (గరిగ) నీటికాగుల్లో ముంచి నీళ్ళు పోస్తున్నారు (ఆము. 2-58). కడిగ, గరిగ, కాగు మొదలైనవే కాకుండా, మట్టితో మూసల్ని (అచ్చు) కూడా తయారుచేసేవాళ్లు.

"భయంకరమైన ఎండలకు జీవరాశులన్నీ చచ్చిపోతాయని మళ్ళీ వాటిని సృష్టించడానికి బ్రహ్మ ఆయా జంతువుల 'మూస'ల్ని తయారుచేసుకున్నాడేమో అనేటట్లు ఎండకు తాళలేక బురదలో దొర్లి దట్టమైన బురదతో ఆరిపోయిన ఒళ్ళు కలిగిన ఏనుగులు, తండులు, దున్నలు కనబడుతున్నాయి".52

చాకలి :- చాకలి ప్రసక్తి రామాయణం కాలం నుంచే ఉంది. నూలు వస్త్రాలు కాబట్టి ప్రతినిత్యం బట్టల్ని ఉతకాల్సి వచ్చేది. గ్రామంలోని మిగిలిన కులాలవాళ్ల బట్టలన్నీ చాకలివాళ్లే ఉతకాలి. అందుకు ఒక వాగు దగ్గరగాని, చెరువులు, మడుగుల దగ్గరగాని ఏర్పాట్లుండేవి. వాటిని 'చాకిరేవుల'నే వాళ్లు. సాధారణంగా దొరికే చౌడు, సున్నాలతో ఆ మాసిన బట్టల్ని బాగా నానబెట్టి, వాటిని పెద్దపెద్ద బానలలో ఉడకబెట్టి ఉతికేవాళ్లు. అలా ఉతికిన బట్టలను అక్కడే విశాలంగా ఆరబెట్టేవారు. ఎండలో అవి దూరానికి చూడటానికి ఆ ప్రాంతమంతా తెల్లగా నీటితో నిండినట్లు కనిపించేది. ఈ విషయం ఆముక్తమాల్యదలో గ్రీష్మ ఋతు వర్ణనలో

> క్షేత్రపాలునకుతికిన చీరలాఋ
> చాకిరేవుల గములయ్యె నకల దిశలు
> దెలువులుగ దోచు నెండమావుల బయళ్ల
> గందెనివియెండనన దిఙ్ముఖములు రాజె
> (ఆము. 2-46)

"ఆ మండుటెండలో దిక్కులన్నీ ఎండమావులతో నిండి తెల్లగా ఉన్నాయి. భైరవుడు దిగంబరుడు. అంటే దిక్కులే అతనికి అంబరాలు

---

52. ఆము. 2-47.

(బట్టలు). అందువల్ల ఆ భైరవుడి కోసం ఉతికి ఆరవేసిన బట్టలున్న చాకిరేవుల్లాగా దిక్కులన్నీ ఉన్నాయట". ఈ విధంగా ఉతికిన బట్టల్ని ఎవరెవరివో గుర్తుపెట్టుకుని వాళ్లవి వాళ్లకి చేర్చేవాళ్లు. చిన్న బట్ట కూడా పొరపాటు లేకుండా చేర్చేవాళ్లు. 'అందుకే చదువుకున్న వాడికంటే చాకలే మేలు' అనే సామెత పుట్టింది.

నూలు వస్త్రాల్ని ప్రతినిత్యం ఉతికితే అవి తెలుపుని కోల్పోయి, ఎరుపుకు తిరుగుతాయి. అలాంటి వాటిని నీరుకావి (నీర్కావి) బట్టలంటారు. 'బెడగారు నీర్కావి పింజతోఁద' (మను. 3-71). అటువంటి వర్ణం ఉతికిన బట్టల్ని నీలి కలిపిన నీళ్ళలో తడిపి ఆరవేస్తే, నీలిరంగుతో తళతళ మెరిసిపోతాయి. 'ఇంగిలికంబునన్ దడిపి యెత్తు కసీనపు రెంటెమోయనన్' (మను. 5-45). 'కసీనం' అంటే నీలివర్ణం+ 'రెంటెం' అంటే రెండు పొరల దుప్పటి[1].

ఇలాగే మేదరి, వడ్రంగి, గాజులమ్మే వాళ్లు, కలంకారీ అద్దపు పనివాళ్లు, ఆయుర్వేద వైద్యులు మొదలైన వృత్తుల వాళ్ల గురించి పంచకావ్యాల్లో అక్కడక్కడ చెప్పబడింది. ఆయా విషయాల్ని చాలామంది పరిశోధకులు ప్రకటించి ఉన్నారు. కాబట్టి వాటిని ఇక్కడ తడవడం చర్విత చర్వణ మవుతుంది. ఇంతవరకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలవాళ్లని, పుష్పలావికులు, వేశ్యలు, శాలిగోపికలు, కంసాలి, మంగలి, కమ్మరి, చాకలి గురించి వివరించడం జరిగింది.

పంచములు :- పంచములనబడే మాల, మాదిగ కులాలవాళ్ల స్థితి ఆనాడు నేటి కంటే ఎంతో హీనంగా ఉండేది. అగ్రకులానికి సేవ చేయడమే వాళ్ల పరమావధిగా ఉండేది. చనిపోయిన జంతువుల్ని దూరంగా ఎత్తుకెళ్ళి, వాటి మాంసాన్ని తీసుకుని, చర్మాల్ని శుభ్రపరచి, వాటితో అగ్రకులాల వాళ్లకి చెప్పులు, తదితర వ్యవసాయ ఉపకరణాలు కుట్టేవాళ్లు. అలా కుట్టబడిన వాటిలో మొదటిదాన్ని ఒక

వెంపరాల సూర్యనారాయణగారి వ్యాఖ్య, ఆము. 4.10.
సు.ప్ర.రె ఆంధ్రుల సాంఘిక చరిత్ర.

దానంగా ఇవ్వాలి. గుడి లోపలికి వెళ్ళకూడదు. గుడి బయట నుంచే దేవుణ్ణి ప్రార్థించుకోవాలి (ఆము. 7.5). తీర్థంగాని, ప్రసాదంగాని పూజారి అతనికివ్వడు. అగ్రకులాల వాళ్లని చూడగానే దూరంగా వైదొలగాలి. ఎండకు, గాలికి ఓర్చుకుని ఎంతసేపైనా సరే ప్రసాదం ఇచ్చేవరకూ బయట కాచుకుని ఉండాలి. వాడి భక్తికి మెచ్చుకుని శూద్ర కులస్థులు ప్రసాదంలో కొంచెం పెడితే, దూరం నుంచి తన కిన్నెరను సాచి అందుకోవాలి. అలాగే గర్భగుడి కడిగినప్పుడు బయటికి వెలువడిన నీళ్లు రాతితొట్టి కాలువగా పారగానే, ఆ నీళ్లను శూద్రుడెవరైనా ఇస్తే, దాన్ని భక్తితో గ్రహించి తాగాలి.53

ఇది ఆనాటి పంచముల పరిస్థితి. జీతభత్యాలు లేకుండా అగ్రవర్ణాల వాళ్లకి చెప్పులు కుట్టడం, సేవలు చేయడం వాళ్లకి సంఘం విధించిన పని. దయతలచి ఏదైనా ఇస్తే, దూరం నుంచి తీసుకోవాలేగాని, ఒత్తిడి చేసే హక్కు వాళ్లకి లేదు. దీన్నే 'వెట్టిచాకిరి' అంటారు. తర్వాతి కాలంలో గ్రామ పంచాయితీలో మునసబు, కరణం, తలారి (తలవరి) లతోపాటు వెట్టి (ఎట్టి) కూడా ఒకడు. ఈ నాటికీ రాయలసీమలో ఈ వ్యవహారం ఉంది. కావ్యాల్లో మొదట్లోనే ఆ పట్టణంలోని నాలుగు వర్ణాల గురించి స్తుతించడం ఆనవాయితీగా కనిపిస్తోంది.

కాని పంచముల గురించి ప్రస్తావన ఎక్కడా రాదు. ధర్మశాస్త్రాల్లో కూడా విరాట్పురుషుని నోటినుంచి బ్రాహ్మణులు, బాహువులనుంచి క్షత్రియులు, తొడలనుంచి వైశ్యులు, పాదాలనుంచి శూద్రులు జన్మించారని* చెప్పారే తప్ప, ఈ పంచములు ఎలా వచ్చారో అన్న ప్రస్తావన లేదు. వీరి పట్ల నిర్లక్ష్య భావం ఉండేది. కాని ఆము 'మాలదాసరి' పాత్ర ఎంతో కళాత్మకంగా చిత్రించబడింది+.

తర్వాతి ప్రకరణంలో పరిపాలనా వ్యవస్థ గురించి వివరించ బడుతుంది.

---

53. ఆము.

* ఆము. 4-217: వ్యాఖ్య, వే.వెం.శా. నంజీవనీ వ్యాఖ్య. పు. 440.

\+ చూడు. అనుబంధం. II.

## ఆరో ప్రకరణం

# పంచకావ్యాలు - పరిపాలనా విధానాలు

పరిపాలనా విధానం ఏ జాతీయులలో సువ్యవస్థితమై ఉంటుందో, ఆ జాతీయుల్ని మంచి సంస్కృతి, నాగరికతలున్నవాళ్లగా పరిగణిస్తాం. విజయనగర సామ్రాజ్య పరిపాలనకు చెందిన సమగ్ర విషయాలు తెలుసుకోవడానికి ఆధారాలు నాటి కన్నడ, ఆంధ్ర, తమిళ శాసనాలు, పరాశరమాధవీయం, సాళువాభ్యుదయం, మధురావిజయం, మొదలైన సంస్కృత గ్రంథాలు, వరాహపురాణం, జైమినీభారతం, మనుచరిత్ర, పారిజాతాపహరణం, ఆముక్తమాల్యద, వసుచరిత్ర, రాయవాచకం మొదలైన తెలుగు గ్రంథాలు; 'Forgotten empire, sources of Vijayanagar Histroy, khyphiyats (Local records)' మొదలైనవి.

పోర్చుగీసువాళ్ల రాకతో దక్షిణాపథ రాజకీయాల్లో పెద్ద మార్పు వచ్చింది. బలమైన సైన్య సమీకరణం, మేలుజాతి గుర్రాల్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోడం, దీని కోసం భాండాగారాన్ని సమృద్ధిపరచుకోవడం. అందుకు రాజు లేదా చక్రవర్తి నిర్దాక్షిణ్యంగా శత్రు రాజ్యాల్ని వశపరచుకోవడం, బలవంతుడైన, సమర్థుడైన రాజు, దైవాంశ సంభూతుడిగా కీర్తింపబడటం, రాజ్యాధికారం వంశ పారంపర్యంగా సంక్రమించడం, రాజు అసమర్థుడో లేక దుర్మార్గుడో అయినప్పుడు అతను తొలగించబడటం వంటివి సాధారణ విషయాలుగా భావించబడేవి. "వంశపారంపర్య వ్యవస్థ అమలులో ఉన్న ఆ కాలంలో రాజు సర్వస్వతంత్రుడిగా వ్యవహరించినాడు. .....రాజులు ఉన్నత వంశ సంజాతులుగను, విష్ణ్వంశ సంభూతులుగను భావింపబడిరి. విజయనగరాధీశులు రాజాధిరాజ, రాజపరమేశ్వరాది బిరుదములను వహించినారు.....పరిపాలనా

విషయమున శ్రద్ధవహించి, రాజ్యమందల్లరులు, అలజడులు, తిరుగుబాట్లు జరగకుండ చూచినారు. తలయెత్తిన తిరుగుబాటు నాయకులను, సామంతాధిపులను శిక్షించినారు"1.

మనుచరిత్ర, పారిజాతాపహరణం, ఆముక్తమాల్యదలలో శ్రీకృష్ణ దేవరాయలు విష్ణ్వంశ సంభూతుడిగాను, అతి పరాక్రమ వంతుడిగాను, ధర్మ సంస్థాపన కోసం అవతరించినవాడుగాను స్తుతింపబడ్డాడు.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు యాదవ వంశంలో పుట్టడంతో సింహాసనం మీద కూర్చోవడానికి అర్హత పొందలేదు. అందుకే ఈ యుగంలో కృష్ణదేవరాయలుగా అవతరించి సింహాసనం అధిరోహించి, ఆ లోటును తీర్చుకున్నాడు. ఆనాడు గొల్లభామలతో విహరించిన దోషాన్ని పోగొట్టుకోవడానికి ఈనాడు పర స్త్రీలను సోదరీమణులుగా చూశాడు. ఆనాడు జరాసంధుడితో ఓడిపోయి మధురను కోల్పోయాడు. ఆ అపకీర్తిని పోగొట్టుకోవడానికి నేడు శత్రు దుర్గాల్ని వశపరచుకున్నాడు. ఆనాడు పారిజాత వృక్షాన్ని స్వర్గం నుంచి బలవంతంగా తెచ్చుకున్నాడు. ఆ నిందను పోగొట్టుకోవడానికి ఈ జన్మలో ఔదార్యాన్ని చూపాడు. ఇలా శ్రీకృష్ణుడే తన లోపాల్ని సరిదిద్దుకోవడానికి ఈ జన్మలో కృష్ణదేవరాయలుగా జన్మించాడు.

> "యాదవత్వమున సింహాసనస్థుడుగామి సింహాసనస్థుడై చెన్ను మెఱయ
> గొల్లయిల్లాండ్రతో గోడిగించుటఁజేసి పరకామినీ సహోదరత జూప,
> మఱి జరాసుతునకై మధుర డించుటఁజేసి పరవర్గ దుర్గముల్ పలిమి గొనగ
> బారిజాతము నానవడి పట్టి తెచ్చుట నౌదార్యమున దాని నడుగు వఱువ
>
> గోరి తొలుమేన దనకైనకొదువ లెల్ల!
> మాన్చుకొన వచ్చి భువనైక మాన్యలీల
> నవతరించిన కృష్ణుడౌ ననగమించె
> నరస విభు కృష్ణరాయ భూనాయకుండు.
>
> (పారి.1-17)

---

1. భా.దే.చ. సంస్కృతి. 9సం. 240వ పు.

అలాగే కళింగ రాజ్యలక్ష్మి శ్రీమహావిష్ణ్వంశతో పుట్టిన కృష్ణదేవరాయల్నే పొందిందిగాని, కళింగ రాజైన వీరరుద్రుణ్ణి పొందలేదు. లక్ష్మీదేవి రుద్రుడికి (శివునికి) చెల్లెలి వరస అవుతుందని కవి చమత్కారాన్ని కలగలిపి రాయలు విష్ణ్వంశ సంభూతుడని నిరూపించాడు.

> "కూరిమి కృష్ణరాయ నృపకుంజర! చేరె కళింగ రాజ్యల
> క్ష్మీ రమణీలలామ, నిను మిన్నులు ముట్టిన మోహనాలతో,
> కారణమట్లు లక్ష్మి కనుగందని వేడుక కృష్ణరాయనిన్
> జేరున కాక, వావి సెడజెందునె? సోదరుడైన రుద్రునిన్"
> (ఆము.1-38)

'రాజ్యం వీర భోజ్యం' అన్నట్లు ఎంతో వీరుడైతేగాని రాజు కాలేడు. కృష్ణరాయల పరాక్రమానికి సంబంధించిన ఎన్నో ఉదాహరణల్ని ఇవ్వొచ్చు. కవులు తమ కావ్యాలలో కృతి భర్తలైన రాజుల్ని అతిశయోక్తులతో ముంచెత్తడం సాధారణమైనా, రాయల విషయం అందుకు అపవాదమనవచ్చు. తెలుగు కావ్యాలలో అతని గురించి వర్ణనలలాగానే, ఆయన్ని దర్శించిన విదేశీయులు తమ రాతల్లో రాయల పరాక్రమ గుణగణాల్ని ఇలా వర్ణించారు.

"He is the most feared and perfect king that could possibly be cheerful of disposition, and very merry....He is a great ruler and a man of much justice".2

రాజు ప్రధాన విధులలో మత సంరక్షణ ముఖ్యమైంది. ధర్మశాస్త్రాల ప్రకారం రాజు నడచుకునేవాడు. 'హిందూరాజ్య రమా ధురంధర' (మను-3-142) అని, 'భూభృదుద్ధరణ విస్ఫూర్తి నాడును నేడు గోరక్షణఖ్యాతి కుదురుపరచె' (పారి.1-19) వంటి పద్యాల్లో రాయల ధర్మరక్షణ గురించి తెలియజేయబడింది. "విజయనగర రాజ్యములో ప్రధానామాత్యుడు, అమాత్యులు, భాండాగారికుడు, మహాసామంత

2. F.E. Narratives of paes. P. 241.

అధిపతులు, రాష్ట్రికులు, సైన్యాధ్యక్షుడు, తదితర ప్రముఖులతో కూడిన మంత్రిమండలి యుండెడిది. సప్తాంగ సమన్వితమైన విజయనగర ప్రభుత్వ మంత్రిపరిషత్తు పరిపాలనా విషయములందు రాజుకు సలహాలను యిచ్చుచుండెను. ఈ మంత్రిమండలి సమావేశములకు ప్రధానామాత్యుడధ్యక్షత వహించుచుండెను. ప్రధానమంత్రి సభా నాయకునిగా, తంత్రనాయకునిగా, కార్యకర్తగా వ్యవహరింపబడుచుండెను. ఉపప్రధాని భాండారికాదులు మహామాత్యునితో .సమాలోచనలు జరిపి, రాజ్య సమస్యల పరిష్కారమునకు తోడ్పడుచుండిరి. ముఖ్యమైన సమావేశములకు రాజు అధ్యక్షత వహించి, నిర్ణయములు గైకొనుచుండెను. మంత్రిమండలి నిర్ణయములమలుపరచడంలో రాష్ట్రికులు, రాజ ప్రతినిధులు, సామంత మాండలికులు, ప్రభుత్వ ఉద్యోగులు, శ్రద్ధ వహించుచుండిరి.

కేంద్ర ప్రభుత్వమున ప్రజాపరిపాలనకు సంబంధించిన వివిధ శాఖలేర్పరుపబడియుండెను. ప్రతిశాఖ ప్రత్యేక బాధ్యతను వహించుచుండెను. భాండాగార, సుంక వ్యవహార, ప్రజాసంక్షేమ పాలనాపర, ధర్మసనాది శాఖలు ప్రభుత్వమందుండెను. ఈ శాఖాధిపతులుగా, ప్రధాని, దళనాయకులు, ధర్మాసనాధికారులు, భాండాగారాధికులు, అమాత్యులు నియమింపబడుచుండిరి. ప్రతిశాఖలోను సంప్రతులు, కరణాలు, ఉండెడివారు. తొమ్మిది ప్రభుత్వశాఖలు, తొమ్మిదిమంది సంప్రతుల యధీనమందుండెడివి. భాండాగార శాఖలో స్వర్ణ, రజత విభాగము, రత్నాభరణ విభాగములుండెను".3

*మంత్రులు* :- ప్రధానమంత్రి, తక్కిన మంత్రిమండలికి ఉండాల్సిన లక్షణాల్ని గురించి రాయలిలా అంటాడు. "బాగా చదువుకున్నవాడై ఉండాలి. అధర్మమంటే భయపడేవాడుగా ఉండాలి. రాజకీయశాస్త్రం

3. భా.దే.చ.సం. పే. 242.

(నృపశాస్త్రం)లో ఆరితేరినవాడు కావాలి. ఏభై సంవత్సరాల వయసు మించినవాడు, డెబ్భై సంవత్సరాలు దాటని వాడై ఉండాలి. ఆరోగ్యవంతమైన వంశం నుంచి వచ్చిన వాడై ఉండాలి. అహంకారం ఉండకూడదు. అమాత్య పదవికి తనంతటతాను రాకుండా, రాజే తనను ఆహ్వానించి ఉండాలి. అలాంటి మంత్రులేగాని దొరికితే, ఇంకేముంది? రాజ్యాంగాలు బలపడడానికి ఒక పూటయినా చాలు గదా!".4

అలాంటి మంత్రివర్గం దొరక్కపోతే రాజు తానే స్వయంగా రాజనీతిని అనుసరించి పాలనా వ్యవహారాల్ని నిర్వహించాలి. అలాంటప్పుడు అనుకున్న పనులు అయినా, కాకపోయినా పరవాలేదు. అంతేగానీ అసమర్థుడు, అవివేకి అయిన మంత్రిని పోషించి, అతని మీద ఆధారపడితే, అతను త్వరలోనే తన ఆజ్ఞకు లోబడక స్వతంత్రుడవుతాడు. అప్పుడు రాజు అతని చెప్పుచేతుల్లో నడచుకోవాల్సిన వాడవుతాడు. అలాంటి మంత్రి రాజుకు 'గుమ్మడి కాయంత ముత్యమై భరింప శక్యంగాకుండా అయిపోతాడు.

> "నీతిం దానదలంచి చేయ, పనికానీ, కాకపోనీ, బల,
> ప్రాతార్థ్యత ..మ్మినుండ కొరు బోవన్మంత్రి యంచుంగుణా
> తీతుం గుమ్మడికాయ యంతయగు ముత్యంబై మనంబేర్చు, న
> ట్టై తానాతని చేతిలో బ్రతుకువాడే యౌ జమీ'మీదటన్."
>
> (ఆము. 4-213).

"ఒక కార్యం నిర్వహించటానికి ఒకణ్ణి మాత్రమే కాకుండా, చాలా మంది అధికారుల్ని నియమించడం మంచిది. అందులో ఒక్కొక్కరికి మళ్లీ వాళ్ల అప్పులు తోడుకావడం మూలాన పనులు సులభంగాను, త్వరగాను జరిగిపోతాయి. వాళ్లు కూడా తమను అధికారంలో ఉంచినందుకు సంతోషిస్తారు".5

4. ఆము. 4-211.
5. అదే. 4-214

పనులు సక్రమంగా జరగడానికి ధనమొక్కటే ముఖ్యం కాదు. చక్కని అధికారులు లభించాలి. వారిని వశపరచుకోవడానికి దండిగా డబ్బు ఇవ్వాలి. వారి పట్ల పిసినిగొట్టుగా వ్యవహరించకూడదు. చెప్పిన మాట మీద రాజు నిలబడగలగాలి.

"ధనముఖ్యము కేవలమే
పనియుంగాదాన్త కలిగి పలువురు ప్రభువుల్,
పనిసేయక, తద్వశ్యం
బునకు నలో భానృశంస్యముల్, ఋతము చెలుల్"
(అము. 4-215).

"పూర్వం కొన్ని రాజ్యాలు తగినంత ధనం, సైన్యం అన్నీ ఉండి కూడా తగిన మనుషులు లేకపోవడంతో పాడైపోయిన సంఘటనలు విన్నాం కదా!.6 "కొందరు దుష్ట సచివులుంటారు. రాజును తమ చేతిలోని కీలుబొమ్మలాగా చేసుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటారు. అందుకు బయటి నుంచి శత్రువుల్ని రాజ్యం మీదికి ఆహ్వానిస్తారు. రాజ్యంలో బందిపోటు దొంగలు పడి, దోచుకునేటట్లు ఏర్పాట్లు చేస్తారు. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్ని సృష్టించి రాజుకు తమకంటే ఇక వేరే దిక్కులేనట్లు పరిస్థితుల్ని ఏర్పరుస్తారు".7

"రాజుతో తమ ఆప్తుల పనులు మాత్రమే చేయిస్తారు. ఇతరులకు రాజుతో ముందుగా మాటిప్పించి, ఆ తర్వాత వాళ్ల పని కాకుండా చేసి ఆ దోషం రాజుకు అంటగట్టుతారు. తాము మంచివాళ్లమని, రాజే పనికిమాలిన వాడని బొంకి సజ్జనుల్ని రాజుకు దూరం చేస్తారు".8

"రాజు అలాంటి దుష్ట సచివుల ఆట కట్టించడానికి వాళ్ల స్థానంలో సమర్థుడైనవాణ్ణి ఒకణ్ణి నియమించాలి. భాండాగారాన్ని, అశ్వ, గజ, సైన్యాల్ని తన ఆధీనంలో ఉంచగలిగితే, సమర్థుడైన రాజు అలాంటి దుష్టుల్ని బంధించి అదుపులో ఉంచుకోవచ్చు".9

---

6. అము. 4-216.
7. అదే.4-288.
8. అదే. 4-229.
9. అదే. 4-232.

రాజోద్యోగులుగాని, మంత్రులుగాని, రాజు నుంచి తమకు విశేష సంపద లభిస్తున్నంతవరకే తమ సేవలందిస్తారు. కొంచెం తగ్గినా రాజు చెడిపోవాలని కోరతారు. అతనికి నిజమైన స్నేహితులు ఉండరు. అలాగని వాళ్లని విడువకూడదు. కనికరించి వాళ్లతో ఎలాగైనా పనులు చేయించుకోవాలి. వాళ్లని నమ్మకూడదు.

"కడువునవొక కడి తరిగిన
చెడ చూచుటె కాక, పతికి చెలియుంగలరే?
ఒడిదండవిడువ చెల్లునె?
నడపవలయు నేర్చినట్లు, నమ్మకయెక్కువన్"
(ఆము. 4-233).

అలాంటివాళ్లని ఎలా కనిపెట్టాలంటే అన్నం ఉడికిందో, లేదో తెలుసుకోడానికి ఒక మెతుకు మాత్రమే ఎలా చాలునో, వాళ్లు చేసే పనుల్లో ఒకదాన్ని గమనిస్తే చాలు! ఇక మిగతా విషయాల్లో అతడెలా ప్రవర్తిస్తాడో ఊహించుకోవచ్చు. అలాంటివాళ్ల పన్నాగాల్ని పసిగట్టి, వాటి నుంచి బయటపడిన తర్వాత వాళ్లని హింసించకుండా, వాళ్లతో వైరాన్ని పెంచుకోకుండా, వాళ్ల సంపదనంతా వశం చేసుకుని, ప్రాణాలతో వదలేస్తే సరి, కోరలు పీకిన పాములాగా ఇక వాళ్లేమీ చేయలేరు".10

**రాజు విధులు-వ్యక్తిత్వం** :- "ఎలాగైతే ఒక రైతు తన పొలానికి చుట్టూ సరిహద్దులు ఏర్పరచుకుని, ముళ్ల కంచెవేసుకుని, పంట విత్తనాలు వేయడానికి అనువుగా దాన్ని మెత్తగా దున్ని, మట్టిగడ్డల్ని, వేళ్లను, గుద్దలితో నిర్మూలిస్తాడో! అలాగేరాజు కూడా మొదట రాజ్యాన్ని తన స్వాధీనం చేసుకుని, ఎల్లలు ఏర్పరచుకుని, బయటి రాజులు రాకుండా శత్రువులతో స్నేహం చేసుకుని, దుర్గాన్ని బలపరచుకుని, బయటి భయం లేకుండా చేసుకుని, రాజ్యం లోపలి క్షుద్ర శత్రువుల్ని నిర్మూలించాలి".11

10. ఆము. 4-234, 235.
11. అదే. 4-219.

భూభాగాన్ని పేదరైతులకు కోరుకిస్తే రాజ్యానికి ఆదాయం వస్తుంది. పేదలకు సాయం చేసినట్లూ అవుతుంది.

"దేశవైశాల్యమర్థసిద్ధికిని మూల,
మిలయెంకింతైన, కుంట కాల్వలు రచించి,
నయము పేదకు నరిగోరునను నొనంగి
ప్రబలజేసిన యర్ధధర్మములు పెరుగు"
(ఆము. 4-236)

"రాజు తన మొత్తం ఆదాయంలో నాల్గింట ఒక భాగాన్ని దాన ధర్మాలకు; సైన్యానికి, రక్షణ శాఖకు రెండు భాగాలు; మిగిలిన ఒక భాగాన్ని ధనాగారంలో నిల్వ చేయడానికి వినియోగించుకోవాలి (4-238)". రాబడి ఎక్కువగాను, వ్యయం తక్కువగాను ఉండేలాగా నడచుకోవాలి. ప్రజలకు భారం లేకుండా బొక్కసాన్ని నింపాలి. పొరుగురాజు ఇక్కట్లలో ఉన్న సమయాన్ని పసికట్టి అతని మీద దండెత్తి, తద్వారా విశేష ధనాన్ని సంపాదించాలి. అలాగని ధనాశతో కళ్ళు మూసుకుని దాడి చేయకూడదు. వెళ్ళేముందు ఆ రాజ్యంలోని రక్షణాంగ స్థితిగతుల్ని సంపూర్ణంగా గ్రహించాలి. కొన్ని రాజ్యాలు కొండలు, దట్టమైన అరణ్యాలతో చుట్టుముట్టి ఉంటాయి. అక్కడ క్రూరులైన మ్లేచ్ఛులు (కిరాతులు) ఉంటారు. విపరీతమైన రోగాలు ఉంటాయి. నీళ్లలో విషం కలుపుతుంటారు. హోమాదులతో మారణ క్రియలు చేపడుతుంటారు. అలాంటి రాజ్యాలమీద మేరుపర్వత మంత సంపద లభిస్తుందన్నా, ఆశతో దాడి చేయకూడదు.

ప్రధానమైన నగరాలకు, పట్టణాలకు అమర నాయకులు ఉండేవాళ్లు. వీళ్లు తమ అధికారంలో కొంత సైన్యాన్ని పోషిస్తూ, ఆ ప్రాంతంలో పన్నుల రూపేణా వచ్చే ఆదాయాన్నంతా వినియోగిస్తూ, ప్రతి దసరా పండుగకు రాజుకు కొంత కప్పం కట్టేవాళ్లు. ఈ విషయం పయస్ ఇలా వివరంచాడు. "These captains whom he has over these troops of his are the nobles of his kingdom. They are lords and they hold the

పాతిక భాగం ఆత్మీయులవల్ల తెలుసుకోవాలి. తాను చెప్పిందే జరగాలనేదురభిమానం ఉండకూడదు. కష్టం వచ్చినప్పుడు ఇతరుల మీద ఆధారపడకూడదు. శిక్షలు విధించడంలో మితిమీరకూడదు. అలాగైతేనే చిరకాలం పాలించగలుగుతాడు. రాజభోగాల్ని అనుభవిస్తూనే, ఆప్తమిత్రుడిగా ఉండాలి. లోపల, బయట శత్రువుల చర్యల మీద ఒక కన్నువేసి ఉంచాలి".15

"ఆయా సందర్భాల్లో వీరులే తన ముందు తమ పరాక్రమం గురించి ఆవేశంగా చెప్పుకుపోతారు. వాళ్లకంటే తాను వీరుడై ఉండి కూడా రాజు వినుగులేకుండా వినాలి. అలా వింటే వాళ్లు పొంగిపోయి, సమయం వచ్చినపుడు ఇంకా విజృంభిస్తారు. అలా తన పరాక్రమమే వాళ్లలో ప్రతిబింబిస్తుందనుకోవాలి.16

*శత్రువుల్ని లొంగదీసుకోవడం* :- "విలుకాడు బాణాల్ని గురి చిక్కే వరకూ చూసి, ఎక్కుపెట్టి ఎలా వదలుతాడో అలాగే రాజు సరైన సమయం వచ్చే వరకూ ఆగి, శత్రువుల మీద పడాలి. శత్రువుమీద నేరుగా దండెత్తకూడదు. అక్కడక్కడ సైన్యాల్ని మజిలీవేయాలి. ఈలోపు తన సైన్యాలు ఒకటొకటి వచ్చి చేరుతుంటాయి. వెనుక నుంచి నీళ్లు వచ్చి తాకే కొద్దీ ముందుకు సాగే వరద నీళ్లలా అవి చేరుకోగానే మొదటి సైన్యం బయలుదేరాలి. గూఢచారుల ద్వారా శత్రువు బలాబలాలు తెలుసుకోవాలి. అతను బలవంతుడని తెలిస్తే, అతను చేసే సత్కారాలకు సంతోషించి వెనక్కు మళ్లాలి. లేదంటే వెళ్ళి అతన్ని వశపరచుకోవాలి".17

తన పొరుగురాజు (సామంతుల) నుంచి బలవంతంగా ధనాన్ని లాక్కోవడం, నీచులతో ఆలోచన చేయడం, తన రాజ్య భాగాన్ని అవతలి రాజుకు ఇచ్చి సంధి చేసుకోవడం, చేసిన మేలు మరచి, కీడు

15. ఆము. 4-240, 241.
16. అదే. 4.244.
17. అదే. 4-247.

తలపెట్టడం లాంటి అకార్యాలు చేస్తూ ఉండడంతో, అతని సామంతరాజులు అతనిమీద లోలోన మండిపడుతుంటారు. అలాంటి సమయాన్ని పసికట్టి, వాళ్లకి అభయపూర్వకంగా రత్నాభరణాలు పంపి, భేదోపాయంతో వాళ్లని శత్రురాజు నుంచి వేరుచేయాలి. అలాగే అవే దోషాలు తనలో లేకుండా జాగ్రత్తపడాలి. బయటి శత్రువు తన కంటే బలాఢ్యుడైన పక్షంలో, అతను కోరితే తన రాజ్యంలో సగభాగం ఇచ్చి అయినా సరే, అతనితో స్నేహం పెంచుకోవాలి. అతని సహాయంతో లోపలి శత్రువుల్ని మట్టి కరిపించాలి".18 వేయి మాటలెందుకు? ఎన్ని ఉపాయాలతోనైనా సరే లోపలి శత్రువుల్ని కనిపెట్టి, అణచి, వాళ్ల భయం లేకుండా చేసుకుని అందగత్తెల మధ్యలో 'మగాడిలా' నిశ్చింతగా ఉండగలగాలి. అలా లేకుంటే ఆ రాజ్యమెందుకు? దుఃఖం కోసమా?

"పలుకులు వేయునేమిటికి? పార్థివుడాత్మ భుజావృత క్షమా
తలమున గుట్టు కీడు బహుధా యరయించి, యడంచి, చంచలా
క్షుల గమిలో మెలంగు పురుమండునుబోలె నశంక నించుచున్
మెలగడయేనిరాజ్యఫలమేయద?రాజ్యము దుఃఖ లబ్ధికే?"
(ఆము. 4-250).

"గాలానికి చిక్కిన చేప, మరీ పెద్దదై, వెనక్కి గుంజుకుంటూ బయటికి లాగడానికి అనువుగా లేనప్పుడు వేటగాడు దాన్ని అలాగే పోనిచ్చి, అది కొంచెం కుదురుకుని మళ్లీ ఎప్పుడు ముందుకు వస్తుందో, అప్పుడు టక్కున బయటికి లాగేస్తాడు. అలాగే రాజు బలవంతుడైన పొరుగురాజు తనతో చేరడానికి బెదరినప్పుడు అతన్ని అలాగే కొంతకాలం వదలిపెట్టి, అతనే వచ్చేటట్లు చేసి, తన పక్షానికి లాక్కోవడం మంచిది".19

**రాజు చేయకూడని పనులు** :- "తప్పుకు మించిన శిక్ష వేయకూడదు. చాడీలను గుడ్డిగా నమ్మకూడదు. శత్రురాజు సంధి చేసుకోవడానికి

18. ఆము. 4-248, 249.
19. అదే. 4-251.

ముందుకు వస్తే, అవకాశమివ్వకుండా ఉండకూడదు. పొరుగురాజు చేసే అన్యాయాల్ని చూసివచ్చి, తనకు తెలిసిన ఆ దేశీయుణ్ణి ఇబ్బందుల్లో ఇరికించకూడదు. తన పట్ల విముఖుడైన మంత్రికి తెలిసేటట్లు ఏ పనీ చేయకూడదు. తనమీద మంచి అభిప్రాయం లేనివాడితో కలవకూడదు. తన అభిమానిని దూరం చేసుకో కూడదు. మంత్రులు చెప్పినమాట తనకు నచ్చనప్పుడు వాళ్ళ ఏమనుకుంటారో అని మొగమాటంతో అంగీకరించ కూడదు. రహస్యాల్ని బయటపెట్టినివాణ్ణి శిక్షించకుండా వదలకూడదు. ఏవైనా అరిష్టాలు కలిగినప్పుడు వాటికి తగిన శాంతి చేయకుండా ఉండకూడదు. పెద్దవాళ్లని గౌరవించకుండా, నీచులతో మంతనాలు జరుపుతూ దుర్వ్యసనాలకు లోబడి, కక్షతో వ్యవహరించకూడదు".20

*రాజు చూపాల్సిన మెలకువలు* :- "అధికారులలోను, వీరులలోను పరస్పర పోటీ ఉండేలాగా చూడాలి. అందువల్ల వాళ్ళ రాజుకు చేసే మంచిచెడ్డలు తెలిసిపోతాయి. మంచిపనులు చేసి రాజు మెప్పు పొందడానికి వాళ్ళు ఒకర్ని మించి మరొకరు పోటీపడతారు. ప్రతి యుద్ధానికి రాజే స్వయంగా వెళ్ళకూడదు. తన తరపున ఒక సమర్థుడైన ద్విజుణ్ణి (బ్రాహ్మణుడు లేదా క్షత్రియుడు) ఎక్కువ సైన్యంతో పంపాలి. అంత అపారమైన సైన్యాన్ని ద్విజుడు కాకుండా, వేరేవాడికి ఇచ్చి పంపితే దురాశతో వాడే తిరగబడే ప్రమాదం ఉండొచ్చు. ఆ వేరే వాడి అవసరం కూడా ఉంటుంది. రాజ్యానికి మధ్యలో ఉండే అడవుల్ని నరికించివేయాలి. గడి ప్రాంతాల్లో దట్టమైన అడవులు పెంచాలి. రాజ్యం మధ్యలో అడవులు ఉంటే, దొంగలు చేరుకుని ప్రజా కంటకులవుతారు. గడి ప్రాంతాల్లోని అడవుల్లో దొంగలుంటే, సరిహద్దు ప్రాంతాల మీద పడతారు".21

"పొరుగు రాజ్యాల నుంచి వచ్చిన రాయబారుల్ని మర్యాదగా చూసి, కొలువులో వాళ్ళతో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. సందర్భానికి

20. ఆము. 4-248 నుంచి 252 వరకు.
21. అదే. 4-254 నుంచి 256 వరకు.

తగినట్లు, వాళ్ళ మనసుల్ని ఆకర్షించేటట్లు వాళ్ళ రాజుతో చెప్పాల్సిన మాటలు చెప్పాలి".22

ఇదే విషయాన్ని రాయల్ని ప్రత్యక్షంగా దర్శించిన పోర్చుగీస్ దేశీయుడైన పయస్ ఇలా చెప్పాడు. "....We came to the city of Bisnaga which is a league from this new city (Hospet) and here he commanded us to be lodged in some very good houses and Fegueredo was visited by many lord and captains and other persons who came on the behalf of the king. And the king sent him many sheep and fowls and many vessels full of butter and honey and many other things to eat. The king said many kind and pleasant things to him and asked him concerning the kind of state which the king of portugal kept up. And having been told about it all. He seemed much pleasant".23

కొత్తగా అధికారంలోకి తీసుకున్న వ్యక్తిని ముఖ్యమైన రహస్య విషయాల్ని చర్చించడానికి అనుమతించ కూడదు. అలా చేస్తే అంత తొందరగా లభించిన రాజు మన్ననకు వాడు పొంగిపోయి ఇతరులతో ఆ విషయాన్ని ముచ్చటిస్తాడు. అప్పుడు కార్యం చెడిపోతుంది.

"తానవంబుగ దొరజేయు వాని మంత్ర
మునకు వేగమెలో జేయజనదు; వాడు
క్రొత్తమన్నన రహినునుగులకు జెప్ప
నయిన నది చెడు, మఱి వాడు నడగుగాన"
(ఆము. 4-260).

"సమర్థుడైన బ్రాహ్మణ, క్షత్రియుల్ని (ద్విజుల్ని) దుర్గాధిపతులుగా చేసి, ఆ దుర్గాల్ని ధన ధాన్యాలతోను, పులిజున్ను మొదలైన అపూర్వ వస్తువులతోను నూరేళ్ళకు సరిపడేటట్లు సమృద్ధం చేయాలి.

22. ఆము. 4.259.
23. F.E. Narratives of paes. P. 252-53.

సామంతులకు లోటు లేకుండా చేయాలి. ప్రజల్ని పీడించకుండా బొక్కసాన్ని నింపాలి. ఆదాయం ఎక్కువగాను, వ్యయం తక్కువగాను ఉండేటట్లు చూడాలి. శత్రురాజు ఇబ్బందుల్లో ఉండడాన్ని చారుల ద్వారా గ్రహించాలి. కొంగ చేపను 'లటుక్కున' పట్టుకునేటట్లు తానుగానీ, తన ప్రజలుగానీ బాధపడకుండా ఆకస్మికంగా దండెత్తి, ఆ రాజ్యాన్ని వశపరచుకోవాలి".24

"రాజు వైరిమీద ప్రతిజ్ఞ చేయకూడదు. దండెత్తాల్సిన అవసరం ఉండొచ్చు, ఉండకపోవచ్చు. పని కావచ్చు, లేదా ఆ తర్వాత కావచ్చు. అసలు కాకపోవచ్చు. రాజు కార్యసాధకునిగా ఉండాలే తప్ప, కలహ ప్రియుడుగా ఉండకూడదు. యుద్ధరంగంలో పారిపోతున్న శత్రువుల్ని తప్పించుకోవడానికి దారిలేని మూలలకే తరిమికొట్టాలి. గెలుపో లేకఓటమో తేలిపోతుంది. నానారకాలైన మారణ యంత్రాల్ని అమర్చిన కోటలోకి సైన్యాన్ని మాత్రమే పంపాలి. రాజు వెళ్ళకూడదు.

ఏ మంత్రి అయినా రెండు, మూడుసార్లు గనుక చక్కని సలహాల్ని ఇచ్చినట్లయితే, రాజు అతన్ని మంత్రాలోచనకు మాటిమాటికీ పిలుస్తాడు. అది గమనించిన వ్యక్తులు అతనికి లంచమిచ్చి, రాజుతో చెప్పి, తమ పని చేయించమని ప్రాధేయపడతారు. లంచం తీసుకుని ఆ మంత్రి రాజును పెడతోవ పట్టిస్తాడు. అందువల్ల అలాంటి ప్రధాన వ్యక్తుల చర్యల్ని చారుల ద్వారా గమనిస్తూ ఉండాలి.

శత్రు రాజ్యాన్ని కల్లోలపరచి స్వాధీనపరచుకోవాలి. ఆ దుర్గాధిపతుల రాణులు దొరికితే వాళ్లని తమ ఆడపడచుల్లా ఆదరించాలి. ఒకవేళ ఆ రాజుతో సంధి చేసుకోవాల్సిన పరిస్థితి రావచ్చు. అతని రాయబారుల్ని మర్యాదగా చూడాలి".25

24. అము. 4-261.

25. అదే. 4-263 నుంచి 267 వరకు.

"చక్కని పరిపాలనకుగాను రాజు విజ్ఞులవల్ల తన దేశంలో స్వర్ణాది లోహపుగనులు ఎక్కడెక్కడ ఉన్నాయో కనిపెట్టాలి. ప్రజల్ని నొప్పించకుండా పన్నులు వసూలుచేయాలి. పొగరెక్కిన దుర్మార్గుల్ని అణచివేయాలి. అందర్నీ సమానంగా వర్ణాశ్రమ ధర్మాల్ని కాపాడాలి. చోటు చాలని ప్రదేశంలోని జనుల్ని, జనులులేని ప్రదేశాలకు పంపించాలి. క్షుద్ర శత్రువుల్ని నాశనంచేయాలి. రాజ్యాన్ని తన దేహంతో సమానంగా కాపాడుకోవాలి".26

తనకు కలిగిన కోపాన్ని లేదా బాధల్ని మరచిపోయి, తృప్తిగాను, శాంతిగాను జీవించడం మంచిది. కాని ఈ జగన్నాటకంలో 'రాజు' పాత్ర ధరించిన వాడికి అలా చేయడం తగదు.

"వగయు వగయును లేక యేపాటి గన్న
నలరు సామాన్య సంసారి యగుట మేలు
మఱి తగిలెనేని శాంతిచే మఱవ తగదు
రాజ్య భూమిక దాల్చిన రాజునకును"
(ఆము. 4-342).

(రాజు దినచర్య గురించి ఐదో ప్రకరణం (కులాలు-వృత్తులు) 'క్షత్రియులు' అనే శీర్షికలో చెప్పబడింది. అది ఇక్కడే కూడా వర్తిస్తుంది.

***అనుచరులతో రాజు*** :- రాజు అనుచరులు మూడు రకాలుగా ఉంటారు.

1) ***కేవలం హితులు*** :- వైద్యులు, జ్యోతిష్కులు, కవులు, పండితులు. వీళ్లు ఎల్లప్పుడూ రాజు క్షేమాన్నే కోరుతారు. కీడు తలపెట్టరు.

2) ***హితాహితులు*** :- ధనార్జన చేసే అధికారులు. వీళ్లు రాజుకు మేలు చేసే వాళ్లయినా, ప్రభుత్వ ధనాన్ని హరిస్తే, రాజు కనిపెట్టి దండిస్తాడనే భయంతో కీడు తలపెట్టేవాళ్లుగానూ మారొచ్చు.

26. ఆము. 4-270.

3) ***కేవలం అహితులు*** :- విధిలేని పరిస్థితిలో తమ సంపదను అంతా రాజుకర్పించి, దాన్ని తిరిగి ఎలాగైనా పొందాలని అనునిత్యం ప్రయత్నించే అడ్డదారిలో ధన సంపాదన చేసేవాళ్లు. కాబట్టి ఈ మూడు రకాల అనుచరులతో రాజు ఆయా వ్యక్తులకు తగినట్లు నడుచుకోవాలి".27

"రాజుకు గూఢచారిగా పనిచేసేవాడు అదే ఊరివాడై ఉండాలి. అనేక భాషలు తెలిసినవాడై ఉండాలి. రాజు మిగిలిన అనుచరులు లేదా చారులు అతనికి తెలిసి ఉండకూడదు. ఎటువంటి వేషమైనా ధరించగలగాలి. అటువంటివాడు ఎక్కువ జీతమిస్తేగానీ దొరకడు. కాబట్టి అలాంటివాడి విషయంలో డబ్బు ఎంతైనా ఆలోచించ కూడదు".28

*రాజుహృదయం* :- పుణ్యం కోసం రాజు శరీరాన్ని కష్టపెట్టే ఉపవాసాదులు, పూజలు, తపస్సు మొదలైనవి చేయనక్కరలేదు. ఆ పుణ్యాన్ని దాన, ధర్మాల మూలంగా సంపాదించుకోవచ్చు. దేశ రక్షణ, ధర్మ రక్షణలతో అలసిపోయిన రాజు సకల రాజభోగాల్ని అనుభవించాలి.

రాజభోజనం వివిధ పదార్థాలతో విలువైందిగా ఉంటుంది. కాబట్టి బాగా ఆకలివేసే వరకు, మధ్యాహ్నం తర్వాతగాని భోజనం తీసుకో కూడదు. 'ధర్మార్థకామా'లనే మూడు పురుషార్థాల్ని రాజు సమానంగా ఆచరించాలి. అందులో ధర్మాన్ని కొంచెం ఎక్కువగా ఆచరించినా, ఇంకా మంచిదే. మెట్టపైరు అంటే మిరప, వేరుశెనగ మొదలైన పంటల కోసం ఏతంతో పారించిన నీళ్లు గట్టు తెగి పల్లంలో ఉండే వరిచేనుకు పారితే ఇంకా మంచిదే కదా! రాజు మంగళ ప్రదమైన ఒక దివ్యమణిని ఎల్లప్పుడూ ధరించి ఉండాలి. అంతేకాకుండా, రాచ

27. అము. 4-273.

28. అదే. 4-279.

కీవితో వెలుగొందాలి. ఒక్కొక్క రోజు ఒక్కొక్క రకమైన వస్త్రాభరణాల్ని ధరించాలి. 'రాజ్యంతే నరకం ధృవమ్' అన్నట్లు రాజ్యాన్ని పాలించేరాజుకు పాపం తప్పదు. అందువల్ల శాశ్వత నరకం అనుభవించాల్సిందే కదా! అని భయపడాల్సిన పనిలేదు. "శక్త్యానుసారం ధర్మాన్ని ఆచరించాలి. శక్తికి మించినపని చేయమని వేదంలో కూడా చెప్పలేదు. మూర్ధాభిషిక్తుడైన రాజు దైవాంశ సంభూతుడని, వేదంలో చెప్పబడ్డ విరాట్, సామ్రాట్ మొదలైన పదాలతో పిలువబడుతున్నాడు. దానికి తగినట్లు రాజు ఎంత కష్టానికైనా ఓర్చుకుని, ప్రజల భయాందోళనల్ని పోగొట్టగలగాలి. అప్పుడుగాని అతని జన్మ ధన్యం కాదు. కేవలం ఇంద్రియ సుఖాన్ని కోరి రాజు కానక్కరలేదు. ఆ సుఖం దొంగల నాయకులకు కూడా దొరకుతుంది కదా! రాజై కూడా ఇన్ని కష్టాలు ఎదుర్కోవాల్సిన పని ఎందుకు? అని రాజ్యాధికారం పట్ల విముఖత చూపకూడదు. కృతయుగంలో కార్తవీర్యార్జునుడు చండ పరాక్రమంతో చక్కగా పాలించాడు. ఈ కలియుగంలో రాజులకు ఉంతటి పరాక్రమం లేదు కాబట్టి ఆయన లాగా పాలించటం సాధారణ రాజులకు సాధ్యం కాదు. ఒక్క రాజులకేకాదు, ఈ కాలంలో బ్రాహ్మణులకు కూడా ఆ కాలంలో వాళ్ల లాగా శక్తి ఉందా? అలాగని వీళ్లు తమ విధుల్ని మరచారా? వీళ్లకి గౌరవం లభించడం లేదా? అలాగే రాజులు కూడా తమకు తెలిసి తప్పులు చేయకుండా, చేతనైనంత వరకు ధర్మాన్ని కాపాడి, చేతకాని దాన్ని దేవునికి వదలిపెట్టాలి".29

ఇలా రాజ్య పాలనకు సంబంధించి, మంత్రులు-రాజుల మనస్తత్వాల గురించి, వాళ్ల బాధ్యతల గురించి ఆముక్తమాల్యదలో వివరంగా చెప్పబడింది. ఎంతో మంది కవులు తమ కావ్యాల్లో రాజనీతి గురించి సందర్భోచితంగా చెప్పి ఉన్నా, రాయల లాగా అనుభవ పూర్వకంగా చెప్పినవాళ్లు లేరు. మిగలిన పంచకావ్యాల్లో ఈ విషయాల ప్రసక్తే లేక

---

29. ఆము. 4-280 నుంచి 285 వరకు.

పోవటంవల్ల ఈ ప్రకరణం కోసం ఆముక్తమాల్యద మీదనే పూర్తిగా ఆధారపడాల్సి వచ్చింది.

*ఆదాయం* :- రాజ్యానికి ఆదాయాన్ని కూర్చే అధికారిని 'ఆయతికాడు' అనేవాళ్లు. అతను అనేక రకాలుగా ప్రభుత్వ ఖజానాను నింపేవాడు. "పన్నులు, కప్పములు, భాండాగారముల ఆదాయము, అమరనాయకులు లేదా సామంతులిచ్చు నజరానాలు (కానుకలు) అధికారవర్తని, సాంప్ర... ...క వసూళ్లు, అనేక విధములైన సుంకములు, పుత్రోదయ వివాహాదులందు సామంతప్రభువులు మహారాజునకు కానుకగానిచ్చు ధన, కనక, వస్త్ర, వాహనములు, ఆభరణములు, రాజ భాండాగారము చేరుచుండెను".30

దేవాలయాల మీద అధికారం ప్రత్యేకాధికారికి ఇవ్వాలి. అంతేగాని ఆయతికాడికే ఇవ్వకూడదు. ఇస్తే అతను ధనాశతో రాజ్యాదాయాన్ని కబళించి, ఆ లోటును పూడ్చడానికి దేవుడి సొమ్ము ఉపయోగిస్తాడు. ఆ పాపం రాజుకు తగులుతుంది. కాబట్టి ప్రత్యేకాధికారిని నియమిస్తే ఒకవేళ అతను కూడా దేవుడి సొమ్ము తింటే, ఆ పాపం అతనికే తగులుతుంది. రాజుకు అంటదు. సాధారణంగా అధికారులు ప్రజాధనాన్ని స్వాహా చేస్తారే తప్ప, దేవుడిసొమ్ము తాకడానికి సాహసించరు.

> "ఆయతికాని కీకు మమరాలయ ముఖ్యము, లాతదర్థ, తృ
> ష్ణాయతుడై, నిజోర్విన... నష్టికి, తద్ధన ముండొరల్చ, రా
> జాయతనం... జెర్చు, మరియట్టిదపథ్యము, కాననొంటిగా,
> దేయధికారి గావలయు;నించుక తిన్నను, వాడెరూపరున్"
>
> (ఆము. 4-218)

దేశం ఎంత విశాలంగా ఉంటే, అంత ఆదాయాన్ని పొందవచ్చు. చిన్న ప్రదేశమైనా సరే, అనుకూలాన్ని బట్టి కుంటలు, కాలువలు తవ్వించి, ఆ

30. భా.దే.చ.సం. 9వ సం. పు 243.

"ఎవరైనా వచ్చి ఇతరుల మీద చాడీలు చెప్పినప్పుడు, అది నీకు నచ్చనప్పుడు, వెంటనే వాణ్ణి మందలించకుండా, వాడు చెప్పింది పదేపదే ఆలోచించాలి. అసత్యమని నిర్ధారణ అయినప్పుడే ఒక నిర్ణయానికి రావాలి. వాడి మానాన వాణ్ణి వదలేయాలి".12

**అటవికులతో మెలగే తీరు** :- "ఎరుకలు, కిరాతులు మొదలైనవారు, అడవుల్లో నివాసమంటూ, తరచూ ఊళ్లమీద పడి, దోచుకుంటూ ఉంటారు. వాళ్లని వశపరచుకోవడం అసాధ్యం. ఒకచోట స్థిరంగా ఉండకుండా, అన్య ప్రాంతాల నుంచి వచ్చి, అర్థించిన శూరుల జీవనార్థం, అలాంటి ప్రాంతాల్ని తాత్కాలికంగా ఇవ్వాలి. అప్పుడా శూరులు వాళ్లని అణచడానికి గట్టిగా ప్రయత్నిస్తారు. వాళ్లిరువురూ పరస్పరం పోరాడుతున్నప్పుడు ఏమైనా ఫరవాలేదు. అలా చేయడం వల్ల ఆ ప్రాంతంలోని వాళ్లకి ప్రశాంతంగా ఉంటుంది".13

"చెప్పిన మాట తప్పకుంటే ఆటవికులు వశమైపోతారు. శత్రురాజుల దగ్గర నుంచి వచ్చిన దూతల్ని మర్యాదగా చూస్తే, వాళ్లు వెళ్లి వాళ్ల రాజుతో ఈ రాజు గురించి మంచిగా చెబుతారు. దానివల్ల ఇద్దరికీ స్నేహమేర్పడుతుంది. సైనికులకు సకాలంలో జీతాలివ్వడం వల్ల, గుర్రపురౌతులు జీతాలతో పాటు బహుమానాలివ్వడం వల్ల, రాజు మీద అభిమానం చూపుతారు. మేలుజాతి గుర్రాల్ని, ఏనుగుల్ని పోషించే బాధ్యతను అధికారులకప్పగించి, రాజు ఊరకుండకూడదు. వాటిని తన ఆప్తులకే అప్పగించాలి. అశ్వ, గజశాలల్ని జాగ్రత్తగా చూసుకోవాలి. పై అధికారుల సరైన పర్యవేక్షణ లేనిదే కింది ఉద్యోగులు తమ విధుల్ని సరిగా నిర్వర్తించలేరు.14

"రాజనీతిశాస్త్రంలో నిపుణుడై ఉండాలి. రాజ్యానికి సంబంధించిన విషయాల్లో నాల్గింట మూడు వంతులు స్వయంగా పరిశీలించి, తక్కిన

12. ఆము. 4-220.
13. అదే. 4-221.
14. అదే. 4-225, 226.

city and the towns and villages of the kingdom: There are captains amongest them who have a revenue of a million and a million a half of pardaos, others a hundred thousand pardaos, others two hundred, three hundred or five hundred thousand pardoas, and as each one has revenue, so the king fixes for him the number of troops, he must maintain, in foot, horses and elephants. The troops are always ready for duty".31

"ఈ అమరనాయకులు నిర్ణయించిన మొత్తాలు చెల్లించిన తర్వాత కూడా విపరీతమైన సంపదను పొందేవాళ్లు. అందువల్ల రాజధానిలో ఏవైనా ఉత్సవాలుగాని, ముఖ్యంగా చక్రవర్తికి కొడుకో, కూతురో పుట్టినప్పుడు ఆ జన్మదిన వేడుకలకని, అపారమైన నగదు, రత్నాలు, వజ్రాలు, కానుకల రూపంలో చెల్లించేవాళ్లు. అలాగే చక్రవర్తి జన్మదిన వేడుకలకు కూడా ప్రతి సంవత్సరం ఇలాగే కానుకలిచ్చేవాళ్లు" 32

వ్యయం :- ఇంతకు ముందే చెప్పినట్లు (4-238లో) రాజు తన ఆదాయంలో 1/4 భాగం దానధర్మాలకు, 1/2 భాగం సైన్యం, రక్షణాదులకు, మిగిలిన 1/4 భాగం కోశాగారంలో నిల్వచేసుకోవాలి. "శ్రీకృష్ణదేవరాయల సొంత ఖర్చు 25లక్షలు. 40 లక్షలు వెచ్చించి మేలు జాతి గుర్రాల్ని, ఏనుగుల్ని కొనేవాళ్లు. ఆదాయంలో 1/5 భాగం దేవాలయ పునరుద్ధరణ, నూతన దేవాలయ నిర్మాణాలకు ఖర్చు పెట్టేవాళ్లు. మిగిలిన కోటి 'ఫణాల్ని' కోశాగారంలో నిల్వ చేసేవాళ్లు".+

"ఏనుగులు, గుర్రాలు, భటుల జీతాలకు, బ్రాహ్మణ సత్కారాలకు, దేవ పూజలకు, రాజభోగాలకు అయ్యే ఖర్చు ఒక లెక్కకాదు. వీటికి ధారాళంగా ఖర్చు పెట్టాల్సిందే" అని రాయల అభిమతం.

---

31. F.E. P. 280.

32. F.E. P. 281.

\+ భా.దే.చ.సం. 9వ సం. పు. 250.

"ఎచ్చో గజ్ఞఘోటక క్రయ
తచ్చర్వణ సుభట జీవిత ద్విజసురవృ
జోచ్చ నిజ భోగములకగు
వెచ్చము వెచ్చంబు గాదు విత్తం బునకున్ ఆ
(ఆము. 4-262).

"యోగ్యుడు, సమర్థుడు, సజ్జనుడు అని తెలిసినప్పుడు ఒక ఉద్యోగికి ఇతను యాచించకుండానే, ఇంకొకరు చెప్పకుండానే, వేరు పనసపళ్ల వక్కానికి వచ్చినప్పుడు భూమిని చీల్చుకుని ఎలా అన్నీ బయటికి వస్తాయో అలా సమృద్ధిగా దానం చేయాలి. అతను 'ఇది కలా! లేక నిజమా! అని ఆశ్చర్యపడాలి. 'కోకట గ్రామాద్యనే కాగ్రహారంబు లడిగిన సీమల యందు నిచ్చె' అనే పెద్దన చాటువు ఈ విషయాన్ని రూఢి చేస్తుంది.

ప్రతి గ్రామానికీ ఒక చెరువు, ఒక దేవాలయం ఉండేటట్లు విజయనగర రాజులు చర్యలు తీసుకున్నారు. అవి నేటికీ ప్రజోపయోగాలుగా ఉండడం రాయలసీమ వానులకు తెలుసు. అందుకు ఎన్నైనా ఉదాహరణల్ని ఇవ్వొచ్చు. ప్రసిద్ధాలైన తిరుపతి, శ్రీశైలం, చిదంబరం, సింహాచలం మొదలైన పుణ్యక్షేత్రాల్లో రాయలు ఎన్నో గోపురాలు కట్టించినట్లు చరిత్ర చెబుతోంది. దేవపూజ కంటే పితృదేవ పూజలే ముఖ్యమైనవి. కాబట్టి లోటు లేకుండా బ్రాహ్మణులతో శ్రాద్ధ కర్మల్ని జరిపించాలి".33

రాజు బ్రాహ్మణ రక్షణార్థం దానధర్మాలు చేయాలి. ఆత్మ రక్షణకు, పరలోక సౌఖ్యసాధనకు ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. రాజ్యాన్ని పాలించిన రాజు తెలిసో, తెలియకో చేసిన పాపాలకు చివరిలో నరకాన్ని అనుభవించాల్సి ఉంటుంది. అందుకు శ్రీమన్నారాయణుడి శరణు వేడటం మినహా, చేసేదేమీ లేదు. రాజు

---

33. ఆము. 4-274, 275.

బొక్కసం నిండా ధనాన్ని నిల్వచేసినంత మాత్రాన ధనవంతుడు అనిపించుకోజాలడు. సత్కార్యాలకు ధారాళంగా దానం చేసినప్పుడు మాత్రమే ధనవంతుడని కీర్తింపబడతాడు. రాజు దానధర్మాలు చేసి, పుణ్యం సంపాదించుకోవాలే తప్ప, శరీరాన్ని కృశింపజేసే జప, తపాలవల్ల కాదు".34

అలాగని భిక్షువులు మొదలైన వాళ్ల పాండిత్యాన్ని మెచ్చుకుని, వాళ్లకి విశేషమైన సంపద, అగ్రహారాల్ని దానం చేయకూడదు. అలా చేస్తే ధనమదంతో వాళ్లు తమ వృత్తికి న్యాయం చేయలేరు. దాంతో కరువుకాటకాలు, రోగాలు, శిశుమరణాలు సంభవిస్తాయి. కాబట్టి అలాంటి వాళ్లపట్ల భక్తి మాత్రమే చాలు. వాళ్లొకవేళ ఏమీ ఇవ్వలేదని నీ మీద కోపించినా ఏమీ జరుగదు. అపాత్రదానం చేయరాదని భావం.

"అక్షర పక్షపాతమున నర్థము నూళ్ల నొసంగ నుబ్బునన్
భిక్షుజటాధరాధికులు భిన్న నిజవ్రతులౌదు, రైన, దు
ర్భిక్ష రుజా శిశుచ్యుతులు పెక్కగు; భక్తియ చాలు; దాన, త
త్పక్షుభి తత్వమే యఘము దార్పదు శంకదలంకు మయ్యెడన్"
(అము. 4-242).

పన్నులు-శిక్షలు :- "భూమి పన్ను, జాతర, జూదం, వృత్తి పన్ను, వినోదాలపైన పన్ను, పెళ్ళిళ్లు చేయడానికి పన్ను (కల్యాణకానిగె). పశువులు, గొర్రెలు, మేకలు, అడవిలో మేపుకోడానికి పన్ను మొదలైన పన్నుల భారంతో ప్రజలు సతమతమైనట్లు తెలుస్తోంది. పన్నులు వసూలు చేసుకోడానికి ఆయాప్రాంతాల్ని వేలంపాట ద్వారా గుత్తకు ఇచ్చేవాళ్లు. నిర్ణయించిన మొత్తాన్ని ముందుగానే రాజుకు చెల్లించి, వాళ్లు అంతకంటే ఎన్నోరెట్లు ఎక్కువ మొత్తం వసూలు చేసుకునేవాళ్లు. కట్టలేనివాళ్లకి కఠిన శిక్షలు అమలుపరచేవాళ్లు"

34. అము. 4-276, 278, 290.

వరి, రాగి, జొన్న, అరిగె మొదలైన పంటలు, అరటి, చెరకు, పోక, తమలపాకు, మామిడి, కొబ్బరి మొదలైన తోటలు సమృద్ధిగా పండేవి. *వీటివల్ల రాజ్యానికి ధన రూపంలోను, ధాన్య రూపంలోను విశేష అధాయం వచ్చేది. "ధనరూపమైన పన్నును 'అరి' అని, ధాన్య రూపమైన పన్నును 'కోరు' అని అనేవాళ్లు"+.

ఆ కాలంలో వేశ్యలు కూడా వృత్తి పన్ను చెల్లించేవాళ్లు. నగరం ఏడు కోటల్లోను ఇలాంటి వేశ్యావాటికలు ఉండేవి. ఈ పన్ను ద్వారా వచ్చే ఆదాయంలో 12,000 మంది సైనికుల జీతాని సరిపోయేది"35

వివిధ ప్రాంతాల నుంచి సరుకుల్ని అమ్మడానికి సంతలకు తెచ్చేటప్పుడు ప్రవేశ రుసుం చెల్లించి వచ్చేది. నాగలాపురం (హొసపేట) ప్రవేశ వస్తువుల మీద ..00 వగోడాల ఆదాయం వచ్చేదని 'న్యూనిజ్' రాతలవల్ల తెలుస్తోంది.

కేంద్రం విధించే ఈ పన్నులకు తోడు స్థానికాధికారులు కూడా తమ ఖర్చులకు గాను పన్నులు (Local Taxes) విధించేవాళ్లు. విజయనగర రాజ్యాదాయం గురించి పంచకావ్యాల్లో ఎక్కడా ప్రత్యేకించి చెప్పలేదు. విదేశీయులు ఒక్కొక్కరు ఒక్కోవిధంగా రాశారు. 'లూయిర్రైస్' అనే విదేశీయుడు అనాటి రాజ్యాదాయం 81 కోట్లు అని రాశాడు. 'వార్తమా' అనే పాశ్చాత్య వర్తకుడు రాయల ఆదాయం 12,000 అని చెప్పాడు".36

రాయలు ఆముక్తమాల్యదలో రాజనీతి గురించి చెబుతూ "ప్రజలకు నొప్పిలేకుండా పన్నులు వసూలు చేయాల"ని పదేపదే చెప్పాడు. (ఆము. 4-261; 248; 245; 236; 237).

---

* వీటికి సంబంధించి, ఐదో ప్రకరణం 'కులాలు-వృత్తులు' లో 'కాపులు' శీర్షికలో వివరంగా ఉంది.

\+ చూడు. ఆముక్తమాల్యద సంజీవనీ వ్యాఖ్య. వే.వెం.శా. పు. 448. (4-236).

35. అను ప్రవాసి కండ ఇండియా (కన్నడ)సం. 2. పు. 160.

36. భా.ధే.చ. సం. 9 సం. పు. 250.

పన్నులు కట్టలేనివాళ్లని కఠినంగా శిక్షించి, నిర్దాక్షిణ్యంగా మానవత్వం లేకుండా ప్రజల్ని వేదించే అధికారుల్ని, దుర్గాధిపతుల్ని, రాయలు ఎంత తీవ్రంగా గర్హించే వాడో కింది ఆధారం వల్ల బోధపడుతోంది.

"పన్నులు కట్టలేక, శిక్షలు అనుభవించలేక, వేరే దిక్కులేక, తమ పశువులు, ఇళ్లు, ధాన్యం వదలి కట్టుబట్టలతో అన్య ప్రాంతాలకు వలస వెళ్లేవాళ్లని వెనక్కి పిలిపించి, ఓదార్చి, తగిన జీవనోపాధిని కల్పించకుండా 'పోతే పోయారులే!' అని వాళ్ళ పశువుల్ని, ధాన్యాన్ని అమ్మించి, ఇళ్లు(సాధారణంగాపూరిళ్లు) పడగొట్టిస్తే, ఆ కర్రసామాను వంట కొట్టెలుగా పనికివస్తుందిలే అనుకునే పన్నుల అధికారులు, యుద్ధరంగంలో శవాలకోసం పొంచుకుని ఉండే గుంటనక్కల వంటివాళ్లు. అలాంటి నీచులైన అధికారులు ఉంటే రాజుకు ఏడు దీవుల మీద ఆధిపత్యం సిద్ధించినా దరిద్రం తప్పదు".

> "ప్రజనవసి చన్న బిలువ, కప్పనుల గొలుచు
> నమ్మి, యుండ్లింధనంబుల కాయె, ననెడి
> కలని నక్కైన యధికారిగల నృపతికి
> ఏడు దీవుల గొన్న సమృద్ధిలేదు"
>
> (ఆము. 4-237).

రేవుల నిండా గుర్రాలు, ఏనుగులు, రత్న చందన మౌక్తికాదులు దిగుమతి అయ్యేటట్లు వాణిజ్యం పెంచాలి. తద్వారా ప్రవేశరుసుం, అమ్మకపు పన్నుల ద్వారా ఆదాయం సేకరించాలి. కరువులు, రోగాలు మొదలైన ఉపద్రవాలు వచ్చినప్పుడు వలసవచ్చిన అన్య ప్రాంతీయుల్ని ఆయా జాతులవాళ్లని తగినట్లు ఆదరించాలి. రాజు తన తోటల్ని, పశువుల మందల్ని స్వర్ణ, రత్నాది గనుల్ని పర్య వేక్షించడానికి ఆప్తుల్నే పంపాలి.

"రేవుల్ మావు మతంగ జంబును, మణిశ్రీఖండ ముక్తాదియున్,
రా, వాణిజ్యము పెంచియేలగనగున్ వర్షంబు లెవ్వన్‌రుజన్
హోవళ్లన్ దిగు నన్య భూప్రజల రాజాయాయి జాత్యోచితిన్
బ్రోవంగాదగు;కోట దొడ్డి గనుఇలా ప్తుల్యూడ పంపందగున్"
(ఆము. 4-245).

"ఉరిశిక్ష విధించే ముందు దోషిని మూడుసార్లు క్షమించి వదలాలి. వదలితే అపాయం కలిగించేటటువంటి వాడైతే వాడి విషయంలో అలాంటి అవకాశం ఇవ్వకూడదు. దొరికీ దొరకక ముందే వాణ్ణి ఆయుధానికి అప్పగించాలి. అంటే పరివర్తన చెందే లక్షణాలున్న దోషులకు మాత్రమే ఒక అవకాశం ఇచ్చి చూడాలి. జాలి చూపాలి. కాని అపాయకారుల విషయంలో తగదని భావం. తప్పు చేస్తే రాజు దండిస్తాడనే భయం ఉండబట్టే లోకంలో భార్యలు, భర్తలకు లొంగి(పతివ్రతలుగా) ఉంటున్నారు. స్త్రీ, పురుషులు వావి వరుసలు పాటిస్తున్నారు. సన్యాసులు ఇంద్రియ నిగ్రహంతో వ్యవహరిస్తూ ఉన్నారు. కింది కులాలవాళ్లు అణుకువతో అగ్రకులాల వాళ్లని సేవిస్తున్నారు. సేవకుడు యజమానికి క్షేమం జరిగేటట్లు నడచుకుంటున్నాడు. ఇవన్నీ సక్రమంగా జరగాలంటే రాజు దండనార్హుల్ని నిర్దాక్షిణ్యంగా దండించాలి. విచిత్రమనిపించ వచ్చుగానీ, నిజానికి చంపించడంవల్లనే ధర్మాత్ముడు అని అనిపించుకుంటాడు".37

"కేవలం చిన్నచిన్న పాళెగాళ్లైన అడవి గొల్లలు, బోయలు మొదలైన వాళ్ల ఆజ్ఞకు అడవిలో తిరుగే ఉండదు. వాళ్లు అభయమిచ్చిన వ్యక్తికి ఒక బాణం పుల్లగాని, నూలు పోగుగాని (తన ఆనవాలుగా) ఇస్తే చాలు! ఇక వాళ్ల ప్రాంతంలో సంచరించే దొంగలుగానీ, బందిపోట్లు గానీ, వాణ్ణి తాకరు. ఆ పాళెగాళ్లు ఆజ్ఞకు శిరసా వహిస్తారు. అలాంటి

37. ఆము. 4-277, 278.

• సామాన్యుల ఆజ్ఞకే అంత శక్తి ఉన్నప్పుడు ఇక విశాల భూభాగాన్ని పాలించే సార్వభౌముడి ఆజ్ఞకు తల్లడిల్లిపోవాలిగదా!".38

ధర్మానుసారంగా నిజమైన నేరగాళ్లను కఠినంగా శిక్షించాల్సిందే. కాని, వ్యక్తిగత కక్షలతో, అవసరాలతో అధికారులు నిర్దోషుల్ని శిక్షిస్తే మహాపాపం కదా! ఈ విషయాన్నే రాయలు ఇలా హెచ్చరించాడు.

"తలవరుల్ని (రక్షకభటుల్ని) సంతోషపరచి వాళ్లవల్ల దొంగల్ని బంధించాలి. వెంటనే విచారించి నిజనిజాలు తెలుసుకుని అసలు దోషిని శిక్షించాలి. అలా కాకుండా వాణ్ణి చెరసాలలో బంధించి త్వరగా విచారంచకపోతే వాడు ఎలాగో తప్పించుకుని పారిపోతాడు. అది తెలిస్తే రాజు తమను దండిస్తాడని అధికారులు వాడి స్థానంలో ఎవరినో ఒకర్ని దారినపోయే వాణ్ణి తెచ్చి పడేస్తారు. అది తగదు".39

దీన్నిబట్టి చూస్తే ధర్మానుసారంగా శిక్షలు కఠినంగా ఉండేవని అన్యాయపు అధికారుల దుర్వర్తన వల్ల మంచివాళ్లకి అన్యాయం జరిగేదని, లంచాలు, దొంగ సాక్ష్యాలు వాడుకలో ఉండేవని తెలుస్తోంది. ఇంతకుమించి కావ్యాల్లో వీటికి సంబంధించిన వివరాలు ఆశించటం సాధ్యంకాదు. శాసనాల్లోను, మెకంజీదొర సేకరించిన కైఫీయతులలోను మరింత వివరంగా ఈ విషయాలు లభిస్తున్నాయి.

పన్నులు వసూలు చేసే అధికారుల్ని శాసనాలలో 'సుంకరులు, సుంకరవాళ్లు, మన్యగాళ్లు, మణిహాగాళ్లు, హసానిద్యగాళ్లు' అని పేర్కోవడం జరిగింది. (South Indian Inscriptions volume - సౌ. ఇం. ఇ. వాల్యూమ్. XVI నెం. 79, 142, 245, 212,304, 334, 210, 213.

"విజయనగర రాజులు అనుసరించిన విపరీతమైన పన్నుల విధానం, పన్నులు వసూలు చేసే అధికారులలోని అవినీతి పద్ధతులు కారణంగా

---

38. ఆము. 4-206.

39. అదే. 4-209.

చాలామంది గ్రామస్థులు, వ్యవసాయదారులు, ఆయా అగ్రహార గ్రామాల్ని విడిచి పెట్టి వెళ్ళినట్లుగా ఆ కాలం నాటి స్థానిక చరిత్రల వల్ల తెలుస్తోంది".40

శ్రీకృష్ణదేవరాయల కాలంలో కొప్పోలు, తిప్పలూరు గ్రామాల్లో సుంకరవాళ్లు ప్రభుత్వానికి తెలియకుండానే సుంకరస్థావరం, కట్నం మొదలైన పన్నులు వసూలు చేసినట్లుగా మనకు శాసనాల వల్ల తెలుస్తోంది. లోకల్ రికార్డు (కొప్పోలు) పు. 418-19.

"సదాశివరాయల కాలంలో అంటే క్రీ.శ. 1556లో బళ్లారి జిల్లాలో ఉన్న భూపతి సముద్రం గ్రామంలోని ఒక శాసనంలో, ఆ గ్రామ ప్రజలందరు రాజును కలిసి మణిహాగాళ్లు తమ నుంచి అన్యాయంగా పన్నులు వసూలు చేస్తున్నారని, ఈ అన్యాయం నిరోధించమని రాజుకు విజ్ఞప్తి చేసినట్లు ఉంది. ఆ విషయాన్ని రాజు విచారించి వాళ్లకి (మణిహాగాళ్లకు) అపరాధం విధించి, ఆ ధనాన్ని తటాకాలు, కాలువల అభివృద్ధికి, దేవాలయాలకు దానమిచ్చినట్లు తెలుస్తోంది".41

"అధికారుల అవినీతి, లంచగొండితనం మూలంగా ప్రజల్లో ప్రభుత్వంమీద పూర్తిగా విశ్వాసం పోయింది. దాన్ని ఉద్ధరించడానికి వాళ్లకి కొన్ని పన్నుల్లో రాయితీలు, దానాలు మొదనైనవి ఏర్పాటు చేయడంవల్ల ప్రభుత్వం ఆర్థికంగా కొంతభారం మోయాల్సి వచ్చింది. రెవిన్యూ అధికారులు ఇలాంటి అక్రమ లాభార్జనానికి లోనైన సందర్భాల్లో వాళ్లకి విధించిన శిక్ష అపరాధం పన్ను చెల్లించడం మాత్రమే. ఇలాంటి నేరాలకు విధించిన శిక్షలు ఎక్కువ తీవ్రమైనవి కానందువల్ల వాళ్లు తిరిగి అదే నేరాలకు, లేదా ఇతరులకు ప్రోత్సాహం ఇవ్వడానికి పాల్పడేవాళ్లు".42

---

40. డా. మైనేని కృష్ణకుమారి, తెలుగు మానవత్రిక, ఆగష్టు, 94 సంచిక. యన్. వెంకటరమణయ్య, History of third dynestyof Vijayanagar.
41. డా. మైనేని కృష్ణకుమారి, తెలుగు మానవత్రిక, ఆగష్టు, 94,సంచిక.
42. అము. సై. ఇం. ఇ. వాల్యూమ్. XVi, నెం. 333.

"అధికారులకు ప్రజలకు మధ్య చాలా అంతరం ఉండేది. జాతి ఏదైనా కృషి, సాహసాల్ని బట్టి వ్యక్తి గౌరవం ఉండేది. సమాజంలో వ్యక్తి గౌరవానికి అతని ఆర్థిక స్థోమత ముఖ్యపాత్ర వహించేదని ఆ కాల శాసనాల అధ్యయనం వల్ల తెలుస్తోంది. అంతేకాకుండా కొన్ని వర్గాల ప్రజల్లో దానధర్మాల విషయంలో అంత గౌరవం ఉన్నట్లు లేదనిపిస్తోంది. శాసనాల్లో కనబడే అశ్లీల వాక్యాలవల్ల సాటి జీవన విలువలు అట్టడుగు స్థాయికి చేరినట్లు వ్యక్తమవుతోంది. విజయనగర రాజుల కాలంలో కర్ణాటక ఆర్థికపరిస్థితి ఉచ్ఛస్థితిలో ఉండేదని ఆ కాలంలో వచ్చిన విదేశీ యాత్రికుల రాతల వల్ల తెలుస్తోంది. కాని ఈ యాత్రికులు చూసింది కేవలం నగరాలు మాత్రమే. ఆ నగరాల్లో అధికారులు, శ్రీమంత వర్తకులు, రాజోద్యోగులు నివసించేవాళ్ళు. వీళ్లని మాత్రమే చూసి వర్ణించిన విదేశీయులు విజయనగరం సంపద్భరితంగా ఉండేదని వర్ణించడంలో ఆశ్చర్యం లేదు. విజయనగర కాలంలో వర్తకుల వాణిజ్యం అభివృద్ధి చెందింది అనేది తిరుగులేని సత్యం. కాని ఈ ప్రగతికి ప్రధాన కారకులు తెలుగువాళ్ళు, అరబ్బీయులు. వీళ్ల ప్రభావానికి లోనైన మాపిళ్లైలు (ఒకజాతివాళ్ళు). పోర్చుగీసులు వ్యాపారులకు రక్షణ కల్పిస్తామనేనెపంతో విపరీతమైన పన్నులు వసూలు చేసేవాళ్లని కొన్ని శాసనాల ద్వారా వెల్లడి అవుతోంది. విజయనగర రాజులు వ్యవసాయాభివృద్ధికి నీటి వసతులు కల్పించి కొత్త సాగుదలకు ప్రోత్సాహమిచ్చారు. 'పంట దిగుబడి సమృద్ధిగా ఉన్నా, పండించేరైతుల స్థితిగతులు సరిగా లేవు' అని శాసనాల అధ్యయనంవల్ల బోధపడుతోంది. వెట్టిచాకిరీ, జీత పద్ధతి మొదలైన అణచివేత చర్యలకు వాళ్లు బలయ్యారు. వీటి నివారణకు ప్రభుత్వం ప్రయత్నించినట్లు తెలియడంలేదు. ఇంతేకాకుండా ఈరైతులు అలవిగాని పన్ను ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చేది. చేతిపనివాళ్ల విషయంలోను ఇదే పరిస్థితి నెలకుని ఉండేది. ....మొత్తానికి విజయనగర రాజుల ఆర్థిక ధోరణి దేశాన్ని ప్రగతి పథంలో ఎంతో దూరం ముందుకు తీసుకెళ్ళడంలో సఫలం కాలేక

పోయింది. విజయనగరానికి శిల్పకళాఖండాలే వాటిలోనూ మూల భూతమైన అంశం (అంటే ఒరిజినాలిటీ) లేదనే చెప్పాలి".43

"స్థానికాధికారుల దౌర్జన్యాలకు భయపడి తమ గోడును నేరుగా ప్రభువుతో విన్నవించుకోలేక నిస్సహాయులై, తమ ఇళ్లను, గొడ్డు గోదల్ని విడిచిపెట్టి, పొట్ట చేతపట్టుకుని అన్య ప్రాంతాలకు వలసవెళ్లే మారుమూల గ్రామీణుల దీనపరిస్థితులు కృష్ణరాయల హృదయాన్ని కలచివేసినట్లు(అము. 4-237) తెల్పుస్తోంది. అలాగే పాండురంగ మహాత్మ్యంలో అన్నానికి మొగంవాచిపోయిన వ్యక్తులు మనకు కనిపిస్తారు. ఆకలికి తట్టుకోలేక తన బ్రాహ్మణత్వాన్ని లెక్కచేయక, తోటి తీర్థయాత్రికుల నుంచి తప్పించుకుని, కూటికోసం పాట్లుపడే వటుడి పాత్ర, సాక్షాత్తూ నాటి ఒకానొక క్షుధార్తుడే అని అనుకోవడంలో తప్పులేదు. అతని పాట్లివి. "అమ్మా! అయిదు రోజుల నుంచి ముద్దలేదు. చద్దిదో, మాడిందో, పులిసిందో, ఏదో యింత కడివేసి నా ప్రాణాన్ని నిలబెట్టు. అశుచి అయినదాన్ని తిన్నందుకు పాపం గనుక వస్తే, ఆ తర్వాత తపస్సు చేసి పోగొట్టుకుంటాన్లే అని అంటాడు.

> "ఏనాళ్ళ నుండియు, కుడువ కూడొదవకునికి
> మాడు కలిగె, పులిసినది కల్గె. నన్నంబు పోకయంత,
> యొనగి క్షుత్తార్పువెన, చల్ది మెనవనైన,
> పావ ముడిపించు కొందు తపంబుకల్మి"
>
> (పాండు. 4.153)

దారి వెంబడి వెళ్ళేటప్పుడు శూద్రుల ఇంట్లో తింటే కూడా బ్రాహ్మణత్వానికి దోషం రాదని శాస్త్రంలో ఉన్నట్లు తనకు అనుకూలంగా ఆచారాన్ని ఏకరువు పెట్టి, ఇన్ని మెతుకులు, ఇన్ని నీళ్లు

43. (అను) విజయనగరకాలద ఇతిహాస. డా. కె.జి. వసంత మాధవ. అవలోకన కర్ణాటకద పరంపరెయ సమీక్ష. (కన్నడ).

పోసి తన ప్రాణాన్ని నిలబెట్టమని బతిమాలుతాడు. ఆకలికి తానొక్కడేకాదు. ఎవ్వరైనా ఇంతేనని, ఆకలి బాధకు తట్టుకోలేక, 'కూటి బీదతోడు తప్పుతా'దనే సామెత అందుకే వచ్చిందని 'క్షుదాతురాణామ్ నరుచిర్నచకాల' ఆకలి గొన్నవాడికి రుచి, శుచి వేళాపాళా ఇవేవీ లేవనీ, చద్దిదైనా పురోడాశనంతో సమానమనీ, విశ్వామిత్రుడంతటివాడు కూడా తన ప్రాణం నిలుపుకోడానికి తినరాని తిండి తిన్నాడనీ, ప్రాణం నిలుపుకోడం కన్నా మించిన ధర్మం లేదనీ (శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్) ధర్మశాస్త్రాలు చెప్పిస్తాడు.

'త్రోవ గమియించు చోట నోపూవుబోడి'
యవర వర్ణ సమాచారమైన జెరదు,
బ్రాహ్మణ్య, మీతదవేటికి? ప్రాణరక్ష
నెరపు మొకయింత మెదుకిన్ని నీళ్లు నొనగి.

.... జఠర
వహ్ని ఒక యేనకా దెట్టివాడు నెరయు

నేను గూటిబీద తోడుదప్పిన తెరంగున, నిచ్చటందడసితి..

....చలిది కూడు చిక్కునెడ పురోడాశనమునకునో
యమ్మ! సాటి వచ్చు నదియుగాక'

అనుచిత శతము లొనర్చియు,
దనువులు రక్షించు కొనరె? దమ దమ తేజో
ధనులగు గాధి సుతాదులు
తన ప్రాణము విలుపుకున్న ధర్మము కలదో?
(పాండు.4-155-161).

ఆ వటుడు ఆకులో పెట్టిన అన్నం తిరిగి చూసే లోపల గబగబా మింగేసి, నసుగుతూ ఆమెతో 'కుండలో ఇంకా ఏమైనా మిగిలిందేమో! ఇంకోసారి సరిగ్గా చూడు తల్లి! చేతికి దొరక్క తప్పిపోయిందో, మాడో ఉండక పోదు. ఊడ్చుకుని తీసుకరామ్మా! నకనకలాడే నా పొట్టలోకి ఈ నాలుగు మెతుకులు పడేసరికి ఆకలి ఇంకా రెచ్చిపోతోంది. అంటాడు.

"తిరిగి చూచిన యంత నా ద్రిమ్మ రీడు
సిక్థ మొక్కటి యేనియు చిక్క నీక
మ్రింగి మీదుల చూచుచు, మృదుల ఫణితి
పిలిచి యిట్లను శరదిందు బింబము"

"చూడు మీ సారి భాండమో! శోభనాంగి!
భిన్నటం బొండె, దారి తప్పినది యొండె,
కలుగవే కుండ నూడ్చి తెమ్మలఘు జఠర
జాతవేదంబు హెచ్చె, నీ స్వల్ప భుక్తి"
(అము. 4.171,172.).

అంతకు ముందు రోజున వండిన అన్నం కూడా పారవేయకుండా జాగ్రత్తగా తీసి ఉంచి మరునటి రోజు తినేవాళ్లు. దీన్ని బట్టి అన్నానికి కొంత విలువ ఉండేదని తెలుస్తోంది(4-173).

ఆనాటి బ్రాహ్మణులలో పేదవాళ్లు తిండికోసం ఎంత పాటు బడేవాళ్లో తమ ఇంట్లో ఏదో కార్యముందని రాజుల దగ్గర అబద్ధాలాడి, వాళ్ళిచ్చిన వస్తువులు తెచ్చుకుని వాటిని అంగట్లో అమ్మేసేవాళ్లు. సేకరించిన ధాన్యాన్ని భద్రం చేసి మెత్తులు వేసే వాళ్లు (పెద్ద పెద్ద కాగులు (బానలు) లేదా గాదెలలో ధాన్యాన్ని నింపి, గడ్డి కప్పి, దాని మీద మట్టితో కలిపిన పేడను పూసి మూయడాన్ని మెత్తులు వేయడమంటారు).

"తింటే అయిపోతాయని పస్తైనా పడుకునే వాళ్లట! కాని మెత్తులు ఊడదీసి ధాన్యాన్ని వాడేవాళ్లు కాదు. ఎంత దగ్గరి చుట్టాలైనా సరే, ఇంటికి వస్తే ఆడవాళ్లు ఇంట్లోకి రాకూడదని అబద్ధం చెప్పి, వాళ్ళకు ఆతిథ్యమివ్వకుండా తప్పించుకునేవాళ్లు. ఎవరైనా దాతలు నోరు జారి ఏదైనా ఇస్తామన్నారనుకో, ఇక అది ఇచ్చేదాకా కదలేవాళ్లు కాదు. ఏలాంటి వస్తువైనా సరే, అది ఉప్పుకో లేక పప్పుకో వస్తుందని. వద్దనేవాళ్లు కాదు. పరుల ఇంటి నుంచి దుమ్ము లేదా ధూళి అయినా సరే, వస్తుందంటే వద్దనేవాళ్లు కాదు" (4-269). వాళ్ల ఆర్థిక పరిస్థితి అలాంటిదని ఊహించుకోవచ్చు".

న్యాయవ్యవస్థ - "విజయనగర సామ్రాజ్యమున ప్రత్యేకముగా న్యాయస్థానములు నెలకొనియుండలేదు. మాధవాచార్య విరచిత 'పరాశర మాధవీయము' వలన ఆనాడు నాలుగు విధములైన న్యాయస్థానములుండెనని తెలియుచున్నది. న్యాయవ్యవస్థలో రాజ్యాధీశుడు ఉన్నత న్యాయాధీశుడుగా వ్యవహరించు చుండెను. నేరములను విచారించి శిక్షించు అధికారమతని యధీనమై యుండెను. ....న్యాయస్థానములందు ముఖ్యముగా రాజాస్థానములందు న్యాయ విచారణలు నిర్వహింపబడుచుండెను. ప్రాడ్వివాకులు, సభా సభ్యులు, అమాత్యులు, న్యాయ నిర్ణయమున మహారాజుకు సహకరించ ుండిరి. సామ్రాజ్య పర్యటన చేయునపుడు ప్రజలు రాజుకు తమ కష్ట నష్టములను, కోరికలను, వ్యాజ్యములను విన్నవించుకొనెడివారు. రాజుగారా సమస్యలను పరిష్కరించి, వాది ప్రతివాదుల అభియోగములను విని తీర్పునిచ్చుచుండెను. సామంత మాండలికులు, అమర నాయకులు తమ పాలనా పరిధిలోని అభియోగములను పరిష్కరించుచుండిరి. వారిచ్చు తీర్పులు తమకు సమ్మతము కాని యెడల వాది ప్రతివాదులు రాజుకు విన్నవించుకొని న్యాయమైన తీర్పును పొందుచుండిరి. భూ సంబంధమైన వివాదములను చర, స్థిరాస్థులకు చెందిన తగాదాలను పరిష్కరించుటకు తాత్కాలిక న్యాయస్థానములుండెను. జ

ధర్మాసనములనబడినవి. ఈ ధర్మాసనముల కార్యాలయములుగా దేవాలయ మండపములుపయోగపడెడివి".44

న్యాయసమ్మతంగా కొన్నియుద్ధ ధర్మాలు ఉండేవి. వాటికి విరుద్ధంగా శత్రువు మీద పడకూడదు. అయినా విధిలేని పరిస్థితుల్లో అలా చేయాల్సి వస్తే, ఆ పాపానికిగాను రాజు ప్రజల్ని న్యాయంగాను, ధర్మబద్ధంగాను పరిపాలిస్తే, పరిష్కారం జరిగినట్లవుతుందని ఆనాటి నమ్మకం. ఇలా చేయమని ఖాండిక్యుడి మంత్రి ప్రధానులు అతనికి సలహా ఇస్తారు.

"అన్యాయంబున దున్సహా
మన్యుండగు ప్రబల రిపుని మడియించిన, ధ
ర్మన్యక్కృతి కగు నిష్కృతి
నన్యాయంబుగ ప్రజాళి సంరక్షింపన్"
(ఆము. 3-36).

అడ్డదారుల్లో శత్రువధ చేసి ఆ పాపపరిహారార్థం క్రతువులు, యాగాలు చేస్తే, సరిపోతుందని కూడా వాళ్లే సలహా ఇచ్చారు (3-38).

ఏ విధంగానైనా సరే ప్రజల్ని రక్షించడమే రాజకు న్యాయమైన మార్గమని వాళ్లు భావించారు. బాంధవాప్త జన పోషణ కన్నను (రాజుకు) పుణ్యమున్నదే? (3-56) ప్రజల క్షేమం కోసం రాజు యుద్ధం చేయడం తప్పు కాదని, ఆ యుద్ధంలో ఆప్తులు, బంధువులు మరణించినా, రాజు ఆ దుఃఖంభరించక తప్పదన్నారు. అలా కాకుండా సంపదలు ఊరకే ఎలా వస్తాయని వాళ్ల ప్రశ్న. "....బంధు నుహృత్తతి కొక్కకీడు రాకున్నటు లుండగానె, సిరులూరక చావక నోవ కబ్బునే?" (ఆము. 3-57). న్యాయ పరిషత్తులు, నీతికోవిదుల సలహాల ప్రకారమే

44. భా.దే.చ.సం. 9వనం.పు. 273.

తీర్పులు జరగాల్సి ఉన్నా, రాజు అభీష్టానుసారమే జరిగేవి. రాజు శైవుడైతే శైవులకొక న్యాయం, కానివాళ్లకొక న్యాయం జరిగేది. దాన్ని కాదనే ధైర్యం ఎవరికీ ఉండేది కాదు. పాండ్యరాజు శైవుడు కాబట్టి ఆయన కాలంలో శైవులు ఎలాంటి తప్పు చేసినా, ఎత్తిచూపేవారు కాదట. తాను 'అది తప్పు' అనిగాని, 'తప్పు కాదు' అని గాని అనేవాడు కాదట. అది 'తప్పు కాదని' ఎవడైతే వాదిస్తాడో, వాడికి కోరిన అగ్రహారాలిచ్చేవాడట

"శివలింగము దాల్చిన జన
నివహం బేమైన జేయ నిది పాపము, తా
నవు కాదన డా నమయము
నవునను విప్రులక, యగ్రహారము లిచ్చున్"
(ఆము. 4-44).

ఆ లింగధారులు దొంగ చాటుగా గంజాయి, సారాయి సేవించినా వాళ్ల తప్పుల్ని రాజు బయటపెట్టేవాడు కాదు. బ్రాహ్మణులు చేసినదేమైనా చిన్న తప్పు దొరికితే చాలు! దాన్ని బహిరంగ పరచి వాళ్లని అవమానంపాలు చేయమని శైవులకు కనుసైగ చేసేవాడట.

"శీలము బట్టియు గంజా
హాలలు పాంథున భుజించు నధముల బైటం
జాలడు వైవన్ విప్ర
స్థాలిత్యము బైలు సేసి కనుగిఱపు నధన్"
(ఆము. 4-47)

వీటినిబట్టి చూస్తే న్యాయవ్యవస్థ ఎంత సక్రమంగా ఉన్నా, అది రాజునుబట్టి ఆచరణలో ఉండేదని తెలుస్తోంది. న్యాయ విచారణ సాక్షులమీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల సాక్షులకు లంచాలు

ఇచ్చి తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పేటట్లు సిద్ధం చేసుకునే తీరు ఆనాడూ ఉండేది*.

సత్యభామ తన చెలకత్తెతో శ్రీకృష్ణుడికి తన పట్ల ఉన్న విధేయతను గురించి చెబుతూ, ఆయన మీద తన చెలికత్తెలు తనతో చాడీలు చెప్పకుండా ఉండడానికి వాళ్లకాయన లంచాలిచ్చేవాడట.

"చెలులు నాతోయేమి చెప్పుదురోయని,
లంచంబు లిచ్చునో చంచలాక్షి"
(పారి.1-94.).

అలాగే ఆముక్తమాల్యదలో గ్రీష్మఋతు వర్ణనలో ఈ లంచం ప్రసక్తి వస్తుంది. నదులు సముద్రునికి భార్యలు. వర్షాకాలంలో ఎక్కువగా వర్షం కురవడంతో వాళ్లకి సముద్రునితో సంగమం సాధ్యమైంది. మేఘుడు వాళ్లకి కుంటెన కాడు (కూర్చేవాడు). వేసవికాలంలో ఆ నదులకు తమ భర్త అయిన సముద్రునితో సమాగమం దుర్లభమైంది. అందువల్ల అవి మేఘాలకు లంచం ఇచ్చి, తమకు భర్తతో సమాగమం చేయమని కోరుతున్నాయేమో! అనేటట్లు ఎండిపోయిన నదుల్లో రేకులు వెనక్కి రాలిపోగా దుద్దులగపడుతున్న తామరలు బంగారు నాణేల్లాగా కనబడుతున్నాయట (ఆము. 2-52).

ఇలా పరిపాలనా వ్యవస్థకు సంబంధించిన విషయాలు పంచకావ్యాలలో కేవలం 'ఆముక్తమాల్యద'లోనే విశేషంగా కనిపిస్తున్నాయి.

చూడు -> అనుబంధం.III. హనుమాని గుండం-పేరు సోముల, భూమి పంపిణీకి సంబంధించిన కైఫియత్.

# పంచకావ్యాలు - అభిరుచులు, అలవాట్లు, మనస్తత్వాలు

ఒక సంఘానికి చెందిన వ్యక్తుల్ని గుర్తుపట్టడానికి ఉపకరించే అనేకాంశాలలో ఆయా ప్రజల 'అలవాట్లు' ముఖ్యంగా చెప్పుకో దగ్గవి. ఒక సంఘపు అలవాట్లు ఆ సంఘం ఆర్థిక పరిస్థితి మీద ఆధారపడి ఉంటాయి. అలవాట్లను బట్టి ఆయా ప్రజల మానసిక పరిపక్వత రూపుదిద్దుకుంటుంది. మానసిక పరిపక్వత ఆధారంగా వాళ్లలో విశ్వాసాలు చోటు చేసుకుంటాయి. ఇలా ఇవి పరస్పరం సంబంధం కలిగి ఉంటాయి.

***అలవాట్లు*** :- అలవాట్లు ఎన్నో రకాలుగా ఉండొచ్చు. ప్రస్తుతం ఈ ప్రకరణంలో తాంబూలం, పరిమళ ద్రవ్యాలు, సురాపానం, ఆహారపుటలవాట్లను పేర్కొవడం జరుగుతుంది. వీటిని 'అలవాట్లు' అనడం కంటే 'అభిరుచులు' అనడమే సమంజసంగా ఉంటుంది.

*మనస్తత్వాలు* :- 'నాగరికత' అనే ముసుగును గనుక పటాపంచలు చేయగలిగితే, అందరి మనస్తత్వాలు విప్పి చూడగలిగితే, సృష్ట్యాది నుంచి నేటి వరకూ 'ఒకటే' సత్యం గోచరిస్తుంది. ఆహారనిద్రా మైథునాలు, వాటికోసం సంపాదనేచ్ఛ. ఇది సర్వ సామాన్యం. శృంగారం కోసం తహతహ, అది అనుకూల పరిస్థితుల్లో, శిఖరాగ్రం చేరుకున్న తర్వాత మళ్ళీ విరక్తి, వైరాగ్యం, ఐహికజీవనం మీద నిరాసక్తత, ఆముష్మికానికి అర్రులు చాచడం, అందుకు భవబంధనాలు అడ్డుతగలడం, జ్ఞానం ఉచ్ఛదశను చేరుకున్నప్పుడు ఆ బంధనాలు విచ్ఛేదనం కావడం ఈ అంశాలన్నీ 'పంచకావ్యాలలో దర్శనమిస్తాయి.

స్త్రీల మనస్సు ప్రకృతి సిద్ధంగా 'సుకుమార'మైంది. ఘర్షణలకు, ప్రతికూలాలకు తట్టుకోలేదు/దుఃఖం కలిగితే పొంగిపొర్లాలే తప్ప అడ్డుకట్టలు ఆపలేవు. వరూధిని, సత్యభామ, నిగమశర్మ అక్క, వైకుంఠపురస్త్రీలు వాళ్ల స్వభావాల్ని ఇందులో తరచి చూడడమైంది.

*విశ్వాసాలు* :- 'అలవాట్లు' అనేవి శరీరానికి 'బంధువు'లనుకుంటే, విశ్వాసాలు మనస్సుకు 'స్నేహితు'లనుకోవచ్చు. మనస్సు బీజమైతే, అలవాట్లు దోహదక్రియలు. ఆ చెట్టు నుంచి పండిన పళ్ల లాంటివి విశ్వాసాలు.

'విశ్వాసాలు' ఏయే సందర్భాల్లో ఎలా ఏర్పడతాయో, ఎన్ని రకాలుగా ఉంటాయో చర్చించడమైంది. జ్యోతిషం, కలలు, ప్రమాణాలు అంజనం, శ్రాద్ధకర్మలు లాంటి ఎన్నో విశ్వాసాల్ని పరిశీలించడమైంది.

*తాంబూలం* :- భోగపరాయణులైన ఆనాటి ప్రజలకు తాంబూల సేవనం తప్పనిసరిగా ఉండింది. అదొక హుందాగా భావించేవాళ్లు. ఈ విషయంలో స్త్రీ, పురుషులిద్దరూ ఎవరికీ తీసిపోరు. తాంబూలానికి సంబంధించిన వస్తువులైన తమలపాకులు, వక్కలు, సున్నం, జాజికాయ, జాపత్రి, కాచు, పచ్చకర్పూరం, కస్తూరి, ఏలకులు, లవంగాలు మొదలైన వాటిని ఉంచుకోడానికి అందమైన పెట్టెలు ఉండేవి. వాటిని 'వీటికాకరండా'లనేవాళ్లు (పారి. 3-41). వీటిని వెండి, బంగారాలతో చేసేవాళ్లు. సన్నని తీగెలతో కళాత్మకంగా చేయబడడంతో వీటిని 'జాలవల్లికలు' అనేవాళ్లు.

> "అప్పుడు తాంబూలంబులు
> కప్పురమును జాలవల్లికల వరతులచే
> నిప్పించె బంధుకోటికి
> నప్పద్మదళాయతాక్షుడంతట వతికిన్
> (పారి. 2-21).

వీటిని 'పాన్‌దాన్'లని అనేవాళ్లని సురవరం ప్రతాపరెడ్డిగారు తమ ఆంధ్రుల 'చరిత్ర-సంస్కృతి' గ్రంథంలో చెప్పారు. ఈ తాంబూలాన్ని

అన్ని వర్గాలవారూ సేవించేవాళ్లని, ఇది ఉత్తేజకరమైందని, అందువల్లనే అనాటి రాజులు 200 మంది భార్యల్ని, పైగా ఉంపుడుగత్తెల్ని భోగించగలిగారేమో! అని విదేశీయాత్రికుడైన అబ్దుల్ రజాక్ ఆశ్చర్యపడ్డాడట.[1]

స్త్రీలు తాంబూలంలో ఒక పాలు కస్తూరి, రెండు పాళ్లు పచ్చకర్పూరాన్ని చేర్చేవాళ్లు. పురుషులైతే రెండు పాళ్లు కస్తూరి, ఒక పాలు పచ్చకర్పూరం వేసుకునేవాళ్లు.

"మృగమద సౌరభ విభవ
ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీ గంధ
నగితేతర పరిమళమై
మీగుడ పొలుపు దెలుపు మందమారుత మొలసెన్"
(మను. 2-24).

తాంబూలపు వాసన ఎంతో దూరం వచ్చేది. ఆ వాసననుబట్టి, అది నమలుతున్నది స్త్రీయా? లేక పురుషుడా? అని గుర్తించడానికి వీలయ్యేది. దారి తప్పిన ప్రవరుడికి హిమాలయాల్లో వరూధిని జాడ పట్టి ఇచ్చింది ఆమె తాంబూలపువాసనే.

మత్తు పదార్థాల్ని సేవించినప్పుడు ఆ వాసన రాకుండా తాంబూలంలో పచ్చకర్పూరం ఎక్కువగా వేసుకునేవాళ్లు. సంభోగ సమయంలో ఏర్పడ్డ రదక్షతాలు (పంటినొక్కులు) కనబడకుండా ఎపుడూ తాంబూలం నమలుతూ ఉండేవాళ్లు.

".....కాదంబరీ గంధ గర్భంబులై పల్కు
ఘనసార మిళదాన్య గంధములును
దరహాసముల దోచు తాంబూల సేవాంధ
కారితాధర రదక్షతుల యొజవు"....
(మను. 6-44).

---

1. సు.ప్ర.రె. ఆం.చ.సం.

ఇది తనకు కన్యనిమ్మని 'పారర్షి' అనే ఋషిని అడగడానికి వచ్చిన దేవాపి అనే గంధర్వుడి వేషం. అలాగే నేగమశర్మ కూడా మనకు సాక్షాత్కరిస్తాడు.

"కడలేని వీడ్యంపు గప్పు చందురు కావి
మోవివల్గొత్తుల మునుగుదన్ను"
(పాండు. 3-10).

రాజులు వర్షాకాలంలో భోజనానంతరం కస్తూరి ఎక్కువగా కలిపిన తాంబూలం వేసుకునేవాళ్లట. అందువల్ల పెదాలు నల్లబడేవి.

"మృగమదము మించు తమలంపుటిరుల మోవి, దళముగా" (ఆము. 4-135) భోగపరాయణులైన ఆనాటి వేశ్యలు తక్కిన పరిమళద్రవ్యాల్ని వాడకంతోపాటు, ఎప్పుడూ తాంబూలం నములుతుండేవాళ్లు. దాంతో ఎరుపెక్కిన పళ్లను ఒకవరిగింజతో తోముకునేవాళ్లట.

"వీడెంపు బలుకెంపు విరిసీ వెన్నెలగాయ
వరిగింజ నొకట వల్వరున తోమ"
(ఆము. 1-60).

శుభకార్యాల్లో తాంబూలం పంచడం సాంప్రదాయం. కొత్తవాళ్లతో పరిచయాన్ని పెంచుకోడానికి తాంబూలం. ఎక్కడ చూసినా తాంబూలమే. ధనికుల ఇళ్లలో తాంబూల కరండాలున్నట్లే, సామాన్యులైన స్త్రీ, పురుషులు కూడా తమ దగ్గర ఎప్పుడూ తాంబూలపు తిత్తుల్ని ఉంచుకునేవాళ్లు. పల్లెప్రజలకు రాయలసీమలో 'వక్కాకు సంచులు' లేందే పొద్దు గడవదు.

ఒక చాటువులో భట్టుమూర్తి తిమ్మరుసు మీద కోపంతో ఆయన రాజకీయాల్లోకి రాకపూర్వం, పెనుగొండలో 'హత్తిన్' సత్రంలో బసచేసిన పెద్దపెద్ద ఉద్యోగస్థుల తాంబూలపు తిత్తుల్ని మోసేవాడని అధిక్షేపిస్తాడు.

"గుత్తిన్ పుల్లెలు గుత్తి చంద్రగిరిలో కూడెత్తి, పెన్గొండలో
హత్తిన్ సత్రమునందు వేడి, వలు దుర్గాధీశ తాంబూలవున్
తిత్తుల్ మోసి".2

అంటే రాచకార్యం మీద ముఖ్యపట్టణానికి వచ్చిన దుర్గాధీశులు తమ వెంట తాంబూలవు తిత్తుల్ని మోయడానికి కొందరిని వినియోగించుకునేవాళ్లని తెలుస్తోంది. ఆ రాచరిక వ్యవస్థలో అది ఘనంగా భావించబడేది.

ఆనాడు తాంబూలానికున్న ప్రాచుర్యాన్ని బట్టి, ఏదో ఒకరకంగా దీని ప్రస్తావన తేవాలనే ఉబలాటంలో రాయలు విల్లిపుత్తూరు చెరకు తోటల గురించి వర్ణిస్తూ ఇలా అంటారు. "చెరకు తోటల్లో పోకచెట్లు, వాటికల్లుకొని తమలపాకుల తీగెలు ఉన్నాయి. పోకచెట్టు నాయకుడిగాను, తమలపాకు తీగె నాయికగాను పోల్చాడు. నాయిక నాయకునితో 'మనకు అనురాగం (ఎరువు) పెరగడానికి తగిన మందు ఈ చెరకు గడల్లోని ముత్యాలే సుమా!' అని చెప్పినట్లు అది విని ఆ పోకచెట్టు బరువైన తన మట్టను రాల్చింది". అది చెరకు రసం కాచే (బెల్లం వండే) పొయ్యిలో పడి సున్నంగా అవుతున్నాయట3 (చెరకుగడల్లో ముత్యాలు ఉంటాయనేది కవి సమయం). ఇలా తమలపాకు, వక్క, సున్నం కలిస్తే ఎరువు అయ్యే విషయం ఏ మాత్రం సంబంధం లేనిచోట చెప్పడం చూస్తే, దానికి అనాడున్న ప్రాధాన్యం తెలుస్తోంది.

*తాంబూలం వేసుకునే విధానం* :- సన్నగా కత్తిరించిన వక్కల్ని (భాగాల్ని) మొదట నోట్లో వేసుకుని, సున్నం పల్చగా రాసిన తమలపాకుల్ని మడిచి వక్కలతోపాటు నమిలి, ఊరిన ఊటను ఒకటి, రెండు సార్లు మాత్రం బయటికి ఊస్తారు. ఆ తర్వాత పచ్చకర్పూరం, కస్తూరి మొదలైన సుగంధ ద్రవ్యాలు వేసుకుని దానితోపాటు మెల్లగా

2. చాటువు.
3. ఆము. 1-70.

నములుతారు. నేటి కిళ్లీలలో అన్నీ వేసి, ఆకులో మడిచి చుడతారు. కాని సాధారణంగా ముందు చెప్పిన విధానాన్నే నేటికీ పాటిస్తారు. కాకపోతే అప్పటిలాగా సుగంధ ద్రవ్యాలు ఉండవు. ఈ విషయమే విరహంతో బాధపడే వరూధిని గురించి ఇలా చెప్పారు.

> ".....బాగాలు వెననొక్క వద్మాక్షియొనగిన
> వెగ్గలంబని కొన్ని వెదలనుమిసి,
> నగము గొఱికిన యాకులు....."
>
> (మను. 3-66).

తాంబూలపు తిత్తిని, వక్కాకు నంచి అనీ, అడపమనీ, నంబెళఅనీ అనేవాళ్లు. పొరుగూరికి ప్రయాణమై వెళ్ళేటప్పుడు నంబెళని శుభ్రపరిచి, దాన్నిండా తాంబూలానికి కావాల్సిన ఆకులు, వక్కలు మొదలైనవి నింపుకునేవాళ్లు.

> ".....నంబెళ విదలించి తాంబూల దళ పూగ
> నివహంబు జాలగ నించు నుబజా....."
>
> (అము. 7-7).

మాయా ప్రవరుణ్ణి వరూధిని చురచుర చూసింది. ఆ చూపు కోపంగా (ఎర్రగా) మన్మథ బాణంలాగా ఉంది. మామూలు బాణంలాగా కాకుండా, మన్మథుడు తాంబూలం నములుతూ అలాగే పంటితో ఆ బాణాన్ని కొరికి ప్రయోగించిన తీరుగా ఉందట.

> "ఆ కమలాక్షి యింపున దృగంచల మించుక మూసి వార్షణా,
> ష్ట్రాకుల కోణకోణరుచులగ్రమునం జన జూచు చూపు, తీ
> రై కనువట్టె, తిమ్మరన మంటుకొనన్ వెద వింటి వాడు, క్రో
> ధైక ధురీణతం గఱచి యేసిన పింగిళి కోలయో యనన్"
>
> (మను. 3-90).

మన్మథుడు శృంగార పురుషుడు. అంటే శృంగార పురుషులకు తాంబూల సేవనం తప్పనిసరి అన్న మాట.

రాజులు తమ అంతఃపురాల్లో 'వీటి కాకరండాల్ని' (తాంబూలపు పెట్టెల్ని) పట్టుకోడానికి అనేక దేశాలకు చెందిన అమ్మాయిల్ని నియమించుకునేవాళ్లు. అది రాజలాంఛనమట.

"కుకుర కాశ కురు కరూశ కోసలాంధ్ర సింధు బా
హ్లిక శకాంగ వంగ సింహళేశ కన్యకామణీ
ప్రకర పాణిఘటిత రత్నపాదుకా కలాచికా
ముకుర పీటికా కరండముఖ్యరాజలాంఛనా!"
(మను. 1-83).

రాజ వేశ్య ఇంటికి బయలుదేరేటప్పుడు ముందు తలవరులు నడుస్తుండగా వెనుక 'అడపం' మోసుకుని ఒక అమ్మాయి వచ్చేదట.

"మెలత యడపముదే, బరస్మెరువనగ...."
(ఆము. 2-75).

కృతజ్ఞతా సూచకంగాను, ఎదుటివ్యక్తి పైన ప్రీతిని సూచించడానికి తాంబూలాన్ని ఇచ్చే ఆచారం ఉండేది. వేసవిలో తమకు తాగేనీళ్లు పోసి, దప్పిక తీర్చిన చలివేంద్రాల్లోని పడచులకు బాటసారులు ప్రీతితో విడెం ఇచ్చేవాళ్లు.4

అతిథులకు షడ్రసోపేత భోజనంతోపాటు, రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పుర విడెం కావాలని పెద్దన రాయలనడిగారట.5

*పూలుపరిమళ ద్రవ్యాలు* :- ఆ రోజుల్లో స్త్రీ, పురుషులు సమానంగా జుట్టును పెంచి, పువ్వులు పెట్టుకొనేవారు. పునుగు, జవ్వాది, చందనం మొదలైన సుగంధ ద్రవ్యాల్ని ఒంటికి రాసుకునేవాళ్లు. సాధారణ వ్యక్తులు కనీసం చందనం అయినా రాసుకునేవాళ్లు. ఎప్పుడూ తలలో పూవులు వాడకుండా చూసుకోగలగడమనేది ధనవంతుల లక్షణంగా భావించబడింది.

4. ఆము. 2-58.
5. నిరుపహతి స్థలంబు....పూరక కృతుల్ రచియింపుమనుచున్న శక్యమే (చాటువు).

"భూరి సంపద తలపువ్వు వాడని భోగి" ( వసు. 3-04) అని దేవేంద్రుణ్ణి కొనియాడడమైంది. 'రాత్రికి బొండుమల్లెలు ఉన్నవిగదా! అని గుర్తుచేయడం, నాటి గృహస్థుల ఆనవాయితీ అయినట్లుగా ఈ ప్రాంతవాసులు (హంపీ ప్రాంతీయులు) చెబుతారు. అతిథులకు భోజనంతోపాటు చందనతాంబూల పుష్పాదుల్ని కూడా సమర్పించుకునేవాళ్లు.

"పానకం బతిథులకిడ్డ, దాను గ్రోలి
యర్చనా దత్త చందన చర్చదేలి;
విరులు సిగ దాల్చి కర్పూరవీటి జౌరు
కొట్టుచు ద్విజుండు వెన్నెల బిట్టుగాయ"
(ఆము. 2-73).

వేశ్య ఇంటికి వెళ్తూ అన్ని అలంకారాలతో పాటు మత్స్యధ్వజుడు తలలో పాటల (కలిగొట్టు) పుష్పాల్ని పన్నీటితో కలిపి కస్తూరిని పూసుకున్నాడు.

"పన్నీటితో గదంబము సేసి పూసిన మృగనాభివన రాచనగరు దెలుప....
(ఆము. 1-75).

మాయా ప్రవరుని జుట్టు "యానితంబ విలంబి కాలాహి కల్ప ఘనకచ గ్రంథి" (మను. 3-88) చక్కగా ముస్తాబై పరిమళద్రవ్యాలతో ఘమఘమలాడే నిగమశర్మ తలలో పూలు లేనిదే గడపదాటే వాడు కాదు.

"తలగడు గంగ....చందన చర్చ ప్రసూన దామకంబులు"
(పాం. 3-09).

అలాగే ఆనాడు శృంగారపురుషులకు, విలాసవంతులకు పూలు లేందే పొద్దే పొడవదు. ఇన్ని శతాబ్దాలు గడచినా, ఈ నాటికీ 'పూలరంగడు' అనే మాట వింటుంటాం. ఈ మాట వెనుక ఎంత చరిత్ర దాగి ఉందో, పురుషులు పూలకెంత ప్రాధాన్యం ఇచ్చేవాళ్లో తెలుస్తోంది. అంతటి

ప్రాధాన్యం ఎలా కాలగర్భంలో కలిసిపోయిందో పాశ్చాత్య నాగరికత దానికెంత దోహదపడిందో తెలియకపోదు. పురుషుల విషయంలోనే వీటికింత ప్రాధాన్యత ఉన్నప్పుడు ఇక స్త్రీల విషయంలో చెప్ప పనిలేదు. వేసవిలో స్త్రీలు తలలో మల్లెలు కలిగొట్టు (పాటలాలు) పూలు పెట్టుకునేవాళ్లు. మల్లెలు తలవెంట్రుకలు చివర్లు చిట్లేలాగా చేస్తే, పాటలాలు వాటిని అతుక్కునేటట్లు చేస్తాయట.

"స్వనిదానోగ్ర నిదాఘ వైఖరి నెయూష్మన్మల్లికల్కామినీ,
కనదానీలక చాగ్ర పంక్తి నెఱియల్గా బావగా బాటల
ల్పనతం దేనియసోవగూర్చి; నది యోగా నాభియు న్నిర్ఝవం
టిమ తోలుట్టువులయ్యి వేర్పడ గుణంబు ల్భావగా జాదమే?"
(ఆము. 2-67).

వేసవిలో తడి బాగా ఆరిపోని కొప్పుల్లో స్త్రీలు విరజాజి మొగ్గల దండలు ధరించారు.

"ప్రాల్మాలి మిగుల నార్పవి కమ్మ క్రొమ్ముడి,
దని మొగ్గ విరవాది దంత విరియ"
(ఆము. 2-61).

చలివందిళ్లలో నీళ్లుపోసే యువతులు జడ నిండా మల్లెపూలు పెట్టుకునేవాళ్లు.

"....సెగకుల్కి మఱుగు దొచ్చిన జవ్వాదివిజం
నరజమల్లెంతోడి జడలు మెరయ...."
(ఆము. 2-58).

వర్షాకాలంలో కేదగి (మొగలి) పూరేకుల్ని ముడుచుకునేవాళ్లు (ఆము. 4-94). పూలకు సంబంధించి ప్రత్యేక అధ్యయనం చేసినవాళ్ల తీరున ఆకాలంవాళ్ల ఆలోచనలు ఉంటాయి. ఏఏ కాలంలో ఏఏ పూలు పూస్తాయో, ఏఏ పుష్పాలకు ఎలాంటి దోహదం (పోషణ) చేయాలో వాళ్లకి తెలును. తుమ్మెదలు సంపంగి పూలపైన వాలవని వాళ్లకి

తెలుసు. సంపంగిని తోట మధ్యలోను, మొగలిని కంచెల అంచున నాటాలని వాళ్ల అనవాయితీ.

మన్మథుడికి ఐదు పూలు ఆయుధాలు (బాణాలు). అవి అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలం. ఇవి వసంత కాలంలో మాత్రమే లభ్యమవుతాయి. వర్షాకాలంలో వీటి స్థానంలో వరుసగా కడిమి, కొండమల్లె, నీప (విప్ప) మద్ది, యూధిక (అడవి మల్లె) పూలు చోటు చేసుకుంటాయి. వీటికి తోడు మొగలి పూవు కూడా చేరుతుంది.

"సురభి బడిజన్న నవ్వలా శోక కమల
కువల యామ్రమాళికి కదంబ కుటజ, నీప
కకుభ యాధికలను సాయకములు, మరున
కేసుగల్గి గేదగి సురె యెక్కుడయ్యె"
(ఆము. 4-14).

ఇక పరిమళ ద్రవ్యాలైన చందనం, అత్తరు, పన్నీరు, పునుగు, జవ్వాది మొదలైన వాటికి స్త్రీలకు ఉన్న సంబంధం ఇంతింత అనరానిది. చందనగంధులని, సువాసినులని, ముత్తైదువలని స్త్రీలను అనడానికి కారణం. చివరకు విధవల్ని కూడా 'పూర్వసువాసిని' అని వ్యవహరించేవాళ్లంటే, ఆ మాటలో ఎంత అర్థం ఇమిడి ఉందో తెలుస్తోంది. ఈ సుగంధ ద్రవ్యాలకు ఆనాడు ఎంతో ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. విదేశీయులైన మహమ్మదీయుల్ని ఎంతగానో ఆకర్షించాయనీ, వాళ్లు మనదేశం మీదకి దండెత్తి రావడానికి గల ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటనీ అందరికీ తెలిసిన సత్యమే! ఈ పరిమళ ద్రవ్యాల్ని తయారుచేసి, అమ్మి, జీవించే తెగవాళ్లనే బుక్కావాళ్లనీ, గంధోడివాళ్లనీ అంటారు. 'గంధకారు'లనబడే ఈ కులంవాళ్లు హంపికి సమీపంలోని 'అంచెనగుడి' (అనంతశయన గుడి) పరిసరాల్లో నేటికీ ఉన్నారు. వీళ్లు తెలుగు మాట్లాడతారు. వీళ్ల ప్రసక్తి ఆముక్తమాల్యదలో ఉంది.

'గంధకలనా కుసుమ స్రగ్గ్రథనాదుల సాంధ్యంబు లేకలరు, సాంధ్రదేశీయులగు గంధకారులు' (ఆము. 4-35). రసికులైన ప్రజలు వీళ్లని బాగా ఆదరించి, బంధువుల్లాగా చూసుకునేవాళ్లు. అందువల్లనే వాళ్లు తమ మాతృదేశానికి ఎంతో దూరంగా ఉన్నా, తమ బంధువులకు దూరమైనా పట్టించుకోకుండా, వాళ్లను ఆశ్రయించి ఉండగలిగారు. 'రసిక జన బాంధవంబున బంధువియోగంబు మరచి' (అదే)అని పేర్కొబడింది. వాళ్ల స్త్రీలు కూడా ఇదే పని చేసేవాళ్లు. మధురాపురంలోని పెద్దబజారులో చంద్రకాంతపు దిన్నె మీద వీళ్లు కర్పూరపు ముక్కలు పోగులుగా పోసుకుని, దంతపు బరిణెల్లో 'జవ్వాదిని' పెట్టుకుని అమ్మేవారట. వాళ్ల చీరెలకు అంతా ఎర్రని కుంకుమ అంటుకుందట. జవ్వాది విలువైంది కాబట్టి అతి పొందికగా దంతపు బరిణెల్లోను, విశేషంగా లభించేది కాబట్టి కర్పూరాన్ని పోగులుగాను పెట్టుకునేవాళ్లు. ఇదంతా ప్రతినిత్యం విజయనగర ప్రధానవీధుల్లోని దృశ్యమే!

> "దలమగు చంద్రఖండములు దారలు, సొంకవ మెప్పు పొటిపా
> టల మగు దంతపుం గరవటంబు శశాంకుడు; కుంకుమైన, చీ
> రల జిగి కెంపుగా బయటి రథ్యల నొప్పుదురిందు కాంత, వే
> దుల వణి సంధ్యయై బహుత దోచె ననన్పురి గట్టి వాల్పతుల్"
> (ఆము. 2-23).

విల్లిపుత్తూరులో వేశ్యలు స్నానాలకు అంతా ఒకేచోట కాకుండా, పలుచగా అంతా కలిసేటట్లు పరిమళద్రవ్యాల్ని కలిపి చందన పూతను పూసుకుంటారట.6

జవ్వాది జిడ్డుగా ఉంటుందని ఒంటికి దాన్ని పూసుకోకుండా కస్తూరిని పూసుకుంటారట. ఆనాటి వాళ్లకిష్టమైన పరిమళద్రవ్యాలివి. కస్తూరి మృగాల నాభి నుంచి అప్పుడప్పుడే బయటికి వచ్చి పరిమళిస్తున్న కస్తూరి; మలినమంతా పోయేలాగా ఎండలో బాగా

---

6. ఆము. 2-60.

కరిగి పుల్లలకు అంటుకుని, ఘమఘమలాడుతున్న స్వచ్ఛమైన జవ్వాది; పై మట్టులు ఊడిపోగా పచ్చకర్పూరపుటరటి చెట్టు నుంచి తమంతకు తామే రాలిపడిన పచ్చకర్పూరం, గులాబీ పొదల నుంచి స్రవించి, స్ఫటికపు రాతిదిన్నెలో నిండిన పన్నీరు, అనేక పూలరాశులు.

"సద్యోవినిర్భిన్న సారంగనాభికావ్యాప్తమై పిసాళించు మృగమదంబు
కనటువో బీరెండ కరిగి కర్రలనంటి గమగమ వలచు చొక్కపు జవాజి;
పొరలెత్తి ఘనసార తరువుల దనుదాన దొరగిన పచ్చకప్పురపు సిరము;
గొజ్జంగి పూఁబొదల్ గురియంగ బటికంపు దొనలనిండినయట్టి తుహినజలము;

వివిధ కుసుమ కదంబంబు దివిజ తరుజ
మృదుల వసన ఫలాన వామీయరత్న
భూషణంబులు గలవిందు భోగవరుడ
వైరవింపుము ననుగూడి యనుదినంబు"
(మను. 2-56).

ఋతువును బట్టి ఆయా పరిమళ ద్రవ్యాల్ని పూసుకునేవాళ్లు. వసంత ఋతువు రాగానే అగరుచందనం పూత పూసుకునేవాళ్లు. అంతకుముందు కస్తూరి పూత పూసుకునేవాళ్లు. కొప్పుల్లో పూలతో పాటు నన్నని 'కురుగంటి' వేరును పెట్టుకునేవాళ్లు.

"మృగమదాలేప మును మాని రగరుకలన
చన్ను గవ మీది కొప్పిరి జవ్వనమ్ము,
నొంటి కురువేరు పోచకు గంటగింప
రైరి తురిమెదు నరపువ్వులందరి వలు"
(ఆము. 5-106).

చలికాలంలో స్త్రీలు పెదాలు పగలకుండా మైనం పూసుకునేవాళ్లు.

"ఇంతులు తన్మధూచ్ఛిష్టము గొన్న"....(ఆము. 5-100).

పడుకునేముందు రాత్రిపూట పుక్కిటిలో కమ్మకస్తూరి గుళికలు పెట్టుకునేవాళ్లు.

"కమ్మకస్తూరి గుళికలు తమ్మిలీమ
నిదుర మంపున బుక్కిట నించి మీలు
కాంచి వేకువ నుమిసెనా, గమల ముకుళ
కోటరంబుల నేలదేలి కొదమురెగసె"
(పారి. 2-611).

కస్తూరి కమ్మని వాసన వచ్చినా, ఒంటికి రాసుకున్నప్పుడు అది నల్లని కర (మచ్చ) ఏర్పడుతుందట. కుంకుమపువ్వు ఆ మచ్చను కప్పి వేస్తుందట. కాని అది చాలా వేడి చేస్తుందట. ఆ వేడిని (వచ్చ) కర్పూరం తగ్గిస్తుందట. అది మరీ శీతం చేసే స్వభావం కలదట. దాని శీతలాన్ని మంచి జవ్వాది పోగొట్టగలదట. గిరికాదేవిని చెలికత్తెలు పెళ్ళి కూతురుగా అలంకరించేటప్పుడు ఆమె ఒంటికి పరిమళ యుక్తమైన కస్తూరిని పూశారట. అందువల్ల ఏర్పడిన కరను మంచి కుంకుమ పువ్వుతో కప్పివేశారట. దాని వల్ల ఆమెకు వేడి చేసిందట. అప్పుడు కర్పూరపు పూత పూసి వేడిని తగ్గించారట. కర్పూరం వల్ల శీతలమైందట. దాన్ని పోగొట్టడానికి జవ్వాదిని పూశారట.

"సురభికురంగ నాభి కళ, చొక్కపు కుంకుమ కప్పె, కుంకుమ
స్ఫురిత మహోష్మ కప్పురపు సోకుల మానిపి, కప్పురంపు, చ
ల్మిరి మెఱుగం జవాది నెరలించి కదంబము గూర్చి, నెచ్చెలు
ల్దరుణి కలంది రచ్చియుమ, తత్తను వానన పూపుగట్టుచున్"
(వసు. 5-121).

కస్తూరి అనే పరిమళ ద్రవ్యం ఒక జాతి జంతువు నాభి నుంచి ఉత్పత్తి అవుతుందట. దీన్నే 'మృగమద'మని అంటారు. ఆ మృగాన్ని కస్తూరి మృగమని అంటారు. 'జవ్వాది' అనేది ఒక జాతి పిల్లుల నుంచి కలుగుతుందట.

కర్పూరం ఒక జాతి అరటిచెట్ల నుంచి రాలుతుందట. చందనం శ్రీగంధం చెట్టు నుంచి వస్తుంది. ఇలాంటి పరిమళ ద్రవ్యాల్ని కోలాహలాచలుడు తన అల్లుడైన వసురాజుకు వివాహ సందర్భంలో ఇచ్చాడట.

"కస్తూరి మెకములు కమ్మ జవ్వాది, పి
ల్లులు సమ్మివి మదంక విలసితములు
ఘనసార కదళిక లంధ ద్రుములు సుమ్మి
విమదీయ జీవన సమధికములు"
(వసు. 6-37).

సురాపానం :- 'స్వర్ణయుగ మనిపించుకున్న ఆ ప్రబంధకాలంలో ప్రజలు ఎన్ని రకాలుగా భోగాలనుభవించువచ్చో, తరచి తరచి అన్వేషించారు. మనస్సు, ఇంద్రియాలు ఏకాగ్రతతో దేని మీదనైతే లగ్నమై సుఖాన్ని పొందుతాయో, ఆ సుఖమే పరబ్రహ్మ. వేదాలు కూడా ఈ విషయాన్నే 'ఆనందో బ్రహ్మ' అని సమర్థిస్తున్నాయి. ఈ మాటను వరూధిని ప్రవరుడితో అంటుంది (మను. 2-62).

ఇందుకుగాను తాంబూలం, పరిమళ ద్రవ్యాలు మొదలైన విలాసవస్తువులతో పాటు సురాపానం అత్యంత అభిమానంగా చేసేవాళ్లు. అనేక రకాలైన పిండివంటలతో పాటు ఎన్నోరకాల మాంసాన్ని ఆరిగించేవాళ్లు. అది జీర్ణం కావడానికి కూడా ఇది ఎంతో ఉపయోగపడుతుంది. వేదకాలం నుంచి దీని ప్రసక్తి కనబడుతోంది. పవిత్రమైన యజ్ఞయాగాదుల్లోను, పితృ దేవతాదిక వైదిక కర్మలలోను (శ్రాద్ధవిధులు) దీని వాడకం ఉన్నట్లు మన పురాణాలవల్ల తెలుస్తోంది. ఈ సురాపానాన్ని ఆనాటి ప్రజల్లో అధికశాతం ఆమోదించినట్లుంది. ప్రేయసీ ప్రియులు కలిసి సురాపానం చేసేవాళ్లు. మధువు, మద్యం, సారాయి, ఆసవం మొదలైనవి ఇందులోని రకాలు.

"సరస మధుపాన విధువసోత్సవ విలీన
యువతి యువకోటి కోరికల్ చివురులొత్త"
(మను. 6-29).

ప్రియురాండ్రు పుక్కిళ్లనిండా మద్యాన్ని తీసుకుని, తమ ప్రియుల నోటికి అందించేవాళట.

"పొదలు మదోన్మాదంబునకుం బ్రోదిగా మోదనంబునం గాదంబరి
గుండూషించి విలకదంబంబునకు నొనంగు నంబురుహ ముఖల"
(మను. 4-23).

ఇదే అభిప్రాయం వసుచరిత్రలో కూడా ఉంది.

"నిజాననంబో జ భోజనంబులంబట్టిన మైరేయంబు మగలకు ద్రావించునెడ"
(వసు. 4-23).

దేవాపి అనే గంధర్వుడు పారుదనే బ్రహ్మర్షి దగ్గరకు వస్తాడు. వచ్చి అతని కూతురైన 'కళావతి'ని తనకిచ్చి పెళ్ళిచేయమని అడుగుతాడు. అప్పుడతని నోరు కల్లు వాసన కొడుతుంది.

"కాదంబరీ గంధ గర్భంబులై వల్లు
ఘవసార మిళదాన్య గంధములను"
(మను. 6-42).

వేసవికాలంలో రాత్రి పడుకొన బోయే ముందు విలాసినులు 'నారికేళాసవం' (కొబ్బరికాయ సారాయి)త్రాగేవారు. పొద్దున్నే వాళ్ల నోళ్ళు దానికి సంబంధించిన తీయని వాసనొవస్తుందట.

"నారికేళా సవపు దీవుటూరు పొలయ.
వలిపె యొంటొల్లితో సురసలుల గూర్కు
ప్రియల వేకువ దొడ నెచ్చరించి కలిసి
చెలిమి ధన్యులు దఱపి వెన్నెల బయళ్ల"
(ఆము. 2-61).

యాదవ స్త్రీలు మదిరాన్ని(కల్లును) ఎక్కువగా తాగడంతో వాళ్ల కళ్లు బాగా ఎరుపెక్కి సంధ్యారుణ కాంతిని పోలి ఉన్నాయట.

"యాదవీజన మదిరా రసారుణ విశాల దృగంచల వంచకచ్ఛవిన్"
(పారి. 2-29).

కర్రకు గుచ్చి నిప్పుల మీద కాల్చిన మాంసపు ముక్కల్ని 'కరకుట్లు' అంటారు. వాటిని తింటూ మద్యాన్ని సేవించడం పానప్రియులకు

మహదానందం. బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో నీ మాంసాన్ని కఱకుట్లుగా వండి, నా భార్య అయిన పిశాచి అందిస్తుండగా, ఈ సమీపంలోని తాటితోపులో మనిషి పుర్రెలో పట్టిన కల్లును తాగుతానంటాడు.

"....పిశాచి నీదు కఱకుట్లిండీ సదస్త్రాలకాం,
తాలాంతర్మృ కపాల కుండ విగళ త్సైరేయముప్ ద్రాగెదన్...."
(ఆము. 6-24).

మధువును విలువైన అందమైన పాత్రలలో నింపుకుని తాగేవాళ్లు. అలా తాగుతూ మధ్యలో పైన పేర్కొన్న కఱకుట్లు వంటి మాంసపు ముక్కల్నిగాని, ఇతరత్ర రుచికరాలైన పదార్థాల్నిగాని, తీనుకుంటారు. వీటికే 'నంజుళ్లు' అంటారు.

"రేవెలుంగు రాచిప్పలం గప్పురంపు గుప్పెలం గొప్పరించిన సరస మధురసంబులు నించి యుంచిన వేడ్కల నొండొరువుల కెంజిగురాకు మోవినంజులం జవిగొనుచు గ్రోలి...."(పారి. 2-53).

మద్యం తాగిన వాడికి కైపెక్కడం, ఆ కైపులో ఇతరుల్ని ముఖ్యంగా భార్యను బాధపెట్టడం, అప్పుడామె తోబుట్టువులు ఓదార్చడం పరిపాటి. చంద్రుణ్ణి మత్తెక్కిన బలరాముడితో పోల్చి, అతను యమునా నదిని క్షోభపెట్టినట్లు, ఇతను రాత్రిని కలచివేసినట్లు, అక్కడ యమునా నదిని గంగ ఓదార్చినట్లు, ఇక్కడ రాత్రిని చంద్రకిరణాలు సమాశ్వాసించినట్లు శ్లేషించడమైంది.

"అమృతం బానవ మంగరాగ ముదయో ద్యత్కాంచి చేలంబు, చి
హ్నముసుంగా శశిరేవతీరమణు దున్మాదంబు మీరం, తమో
యమునం భంగమునొంది పార, కరసీరాలోడితం జేయ, వ
చ్చె మరుద్వాహిని దానిదేర్పనన మించెం చంద్రికా పూరముల్"
(పారి. 2-47).

***ఆహారపుటలవాట్లు*** :- మనుషులు తినే తిండికి వాళ్ల స్వరూప స్వభావాలకు అవినాభావ సంబంధం ఉంటుంది. విజయనగర రాజ్య

కాలంలో ప్రజలు వరి, గోధుమ, ఆరిగె, జొన్నలు, సజ్జలు, రాగులు మొదలైన ధాన్యాన్ని వాడేవాళ్లు. వరిలో అనేక రకాలు పండించేవాళ్ల (ఈ విషయం నాలుగో ప్రకరణంలో 'రైతులు' అనే శీర్షిక కింద వివరించబడింది). బ్రాహ్మణులు, వైశ్యులు తప్ప తక్కిన కులాలవాళ్లు శాకాహారం, మాంసాహారాల్ని సమానంగా వాడినట్లు తెలుస్తోంది. బ్రాహ్మణులు మాత్రం కేవలం శాకాహారాన్ని వాడేవాళ్లు. ఆకుకూరలు అందులోను అలర్కశాకం (ముండ్లముస్తెకూర) అంటే చాలా ప్రీతిగా భుజించేవాళ్లు..

"ముల్లు దలకొనని నవకపు
పల్లవములు కోర ముక్కి భామ చెవులకున్
వల్లేరు పువ్వులగు పువు
లుల్లసిలు నలర్క శాక మొదుగగ కొనుచున్"
(ఆము. 4-195).

ఈ ముళ్లముస్తెకూర ముదిరితే ముళ్లు మొలుస్తాయట. లేతగా ఉన్నప్పుడైతే ముళ్లు ఉండవు. దీని పూలు వల్లేరు పూవుల్లా ఉంటాయట. ఈ ఆకుకూర గురించి విచారించగా, దీన్ని పప్పులో పెట్టి వండుకుంటారని, నీటిగట్ల మీద ఈ ఆకు సాధారణంగా ఉంటుందని, దీన్ని వైద్యానికి కూడా వాడతారని, దగ్గు పోవాలంటే ఆ ఆకుకు మిరియాలు, ఉప్పు కలిపి తినేవాళ్లని తెలిసింది.

గ్రామాధికారులైన రెడ్లు తదితర సామాన్య ప్రజలు సహజంగా మెట్ట పొలాల్లో పెరిగే రకరకాల ఆకుకూరల వేపుళ్ళతో ఆరిగెల అన్నాన్ని వర్షాకాలంలో భుజించేవారట.

"గురుగుం చెంచలి తుమ్మి లేత గిరిసాకుం తింత్రిణీ పల్లవో
త్కరమున్ గూర పొరంటి నూనియలతో, కటావి, కుట్టారుగో
గిరముల్ మెక్కి తమిన్ పసుల్ పొలమువోన్ క్రేపుల్ మెయున్నాక, మీ
కెరువున్ కుంపటి మంచమెక్కిరి ప్రభుత్వైకాప్తి రెడ్లజ్జడిన్"
(ఆము. 4-134).

గురుగు, చెంచలి, తుమ్మి ఈ మూడు మొక్కలు వర్షాకాలంలో మెట్ట పొలాల్లో కలుపు మొక్కల్లాగా పెరుగుతాయి. చింతచెట్లు సాధారణంగా వసంత ఋతువులోనే చిగురించినా, వర్షాకాలంలో కూడా చిగురు మొదళ్ళలో దొరుకుతుంది. లేదా 'ఎండిన చిగురును' నిల్వ చేసుకుని వాడే అలవాటు కూడా ఉండేది. 'గిరిసె' చాలా పెళుసు చెట్టు. మునగ ఆకుతో చేసినట్లు దీని చిగురుతో 'పొడికూర' చేసుకుంటారు. కాని 'తుమ్మి' వాసన వెగటుగా ఉంటుంది (ఈ మొక్క సన్నని రేకులు కలిగిన తెల్లపూలు పూస్తుంది. (ఈ పూలను ముఖ్యంగా శివపూజకు వాడతారు). సాధారణంగా నేడు దీన్ని ఉపయోగించరు. కాని పచ్చకామెర్ల వ్యాధి (Jaundies) ఉన్నవాళ్లకి ఈ ఆకులతో పప్పు చేసి పెడతారని తెలిసింది*.

రాజులు మొదలైన ఉన్నత వర్గాల భోగులు మాత్రమే వరి అన్నం తినేవాళ్లు. కౌజు, పూరేడు మొదలైన అడవిపిట్టలు, అడవి పంది, దుప్పి, ఏదు, కుందేలు, జింక మొదలైనవాటిని వేటాడి, ఆ మాంసాన్ని వండుకునేవాళ్లు. ఆ కూరల్లో నెయ్యిని ఎక్కువగా వేసుకునేవాళ్లు. ఇవన్నీ జడివానలో ఉష్ణాన్ని కలిగిస్తాయి.

"జాంగలా మిషముతో శాల్యన్న మధిక హై
య్యంగవీనంబుగా నారగించి"
(ఆము. 4-135).

రాజులు తినే ఆహారం చాలా విలువైందిగా ఉంటుంది. అనేక రకాల రుచులతో ఉంటుంది. 'నానా విధ షాడబములు, నాను నృపాహారమెపుడు' (ఆము. 4-281). రాజు దినచర్యలో వంట గురించి విచారించడం కూడా ఒకటి. వంటవాళ్ళతోను, వేటగాళ్లతోను తెచ్చిన మాంసం, తేవాల్సిన వాటిని, వండాల్సిన విధానాన్ని గురించి ఆజ్ఞాపించాలట.

---

* అనెగొంది వాస్తవ్యులు శ్రీ కె. రాఘవేంద్రవర్మ గారు (వయస్సు. 70నం.) తెలిపారు.

"దిన మధ్యమమున మర్దనమల్ల పూర్వకం,
బగు నూద నూవకృన్మృగయు గోష్టి"
(ఆము. 4-271).

విజయనగర రాజులు ఆవులు, ఎద్దుల్ని పూజిస్తారు. కాబట్టి వాటి మాంసాల్ని తప్ప, అన్ని రకాల మాంసాల్ని తినేవాళ్ళని, ఆయా జంతువుల్ని, పక్షుల్ని సజీవంగా సంతల్లో అమ్మేవాళ్ళని, అతి తక్కువ ధరకే దొరికేవని న్యూనిజ్ రాతల వల్ల తెలుస్తోంది. "These kings of Bisanga eat all sorts of things, but not the flesh of oxen or cows, which they never kill in all the country of the heathen (Hindu), because they worship them. They eat mutton, port, Venison, Partridges, hares, doves, quil & all kinds of birds; even sparrows and rats and cats and lizards, all of these are sold in the market of the city of Bisanga - Every thing has to be sold alive so that each one may know what he buys....and there are fish from the rivers in large quantities." అలాగే రకరకాల వళ్ళతో సంతలన్నీ నిండిపోయేవని, అతి చౌకగా అన్నీ లభించేవని చెప్పాడు. 'The markets are always overflowing with abundance of fruits, Grapes, Oranges, Limes, Pomegranates, Jackfruit and Mangoes and all very cheep'*.

కాలాన్ని బట్టి ఆహారాన్ని తీసుకునేవాళ్లు శీతాకాలంలో ఉష్ణ పదార్థాల్ని, వేసవికాలంలో చలువ పదార్థాల్ని తీసుకునేవాళ్లు. ఆరోగ్యరీత్యా ఇది చాలా మంచిది.

*వర్షాకాలంలో భోజనం* :- విష్ణుచిత్తుడు వర్షాకాలంలో జడివానలో కూడా తన ఇంటికి వచ్చే అతిథులకు, టెంకాయచిప్ప గరిటెతో వరి అన్నాన్ని, ఒల్చిన పప్పును, నాలుగైదు తాలింపులు (వేపుళ్ళు) సమృద్ధిగా నేయి, వడ్డించి మర్యాదచేసేవాడట.

F.E. Page - 375.

" గగనము నీటి బుగ్గకెనగా జడిపట్టిన నాళ్ళ భార్య, క
న్నొగ సొరకుండ నారికెడపుం బొరియల్లగిలించి, వండన
య్యగ వల ముంచి పెట్టు కలమాన్నము నొల్చిన పప్పు నాలుగే
న్నొగసిన కూరలు న్వడియముల్వరుగుల్పెరుగు న్ఘృతప్లుతిన్
(ఆము. 1-80).

*వేసవిలో భోజనం* :- చలువనిచ్చే ఆహార పదార్థాలను వేసవిలో సేవించడం ఆనవాయితీ. విష్ణుచిత్తుడు వేసవికాలంలో తన ఇంటికి వచ్చే అతిథులకు గోరువెచ్చని తెల్లని వరిఅన్నం, తియ్యని చారులు, మజ్జిగపులుసు, వల్చని అంబళి, చెఱకు పాలు, కొబ్బరి నీళ్ళు, రసావలులనే ఒక రకం భక్ష్యాలు, పండ్లు, సువాసనగల చల్లని నీరు, వూరవేసిన మామిడిపిందెలు, తేట మజ్జిగలను వడ్డించి సత్కరించేవాడట.

"తెలి సులివెచ్చయోగిరము తియ్యని చారులు తిమ్మనంబులున్
వలుచని యంబళుల్చెరకు పాలెడ నీళ్ళు రసావళుల్ఫలం
బులును సుగంధి శీతజలము ల్వడ పిందెలు నీరు చల్లయున్
వెలయగ బెట్టు భోజనము వేసవి చందన చర్చమున్నుగన్"
(ఆము. 1-81).

వేసవిలో భోజనానంతరం రకరకాల పండ్లు తినేవారు. బాగా పండిన సుగంధాలు, రసదాడిగలనే (రసబాళె అని కన్నడంలో) అరటిపండ్లు, పెద్ద పెద్ద పనసతొనలు, గడ్డకట్టిన (పేరిన) నెయ్యిలా కనబడే తెల్లని చెరకు ముక్కలు, అనేక రకాల మామిడి పళ్ళు, మెత్తని ద్రాక్ష గుత్తులు. శుభ్రం చేసిన పెసరపప్పు, బాగా తీపి ఉన్న లావైన దానిమ్మ గింజలు, పానకం సేవించేవాళ్లు. ఆ తర్వాత కమ్మని వాసన వెదజల్లే పచ్చ కర్పూరపు తాంబూలం నమలేవాళ్లు.

"పరిపక్వ సురభి రంభా ఫలంబుల తోడ, దళమెక్కు పనస పెందొలల తోడ;
ఘృతపిండ నిభకర్కరీ ఖండముల తోడ, పలుతెరంగుల మావివండ్ల తోడ,
గోస్తనీమృదు గుళుచ్ఛ స్తోమముల తోడ, కప్పు లేరిన పడపప్పు తోడ,
సమధుర స్థూల దాడిమ బీజముల తోడ, తనుపారు రసదాడి గనెలతోడ,

> పానకంబతిథుల కిడ్డ, తానుగ్రోలి
> అర్చనా దత్త తాంబూల చర్చ తేలి
> విరులు సిగదాల్చి, కర్పూర వీటి చౌరు
> కొట్టుచు ద్విజుండు వెన్నెల బిట్టుగాయ"
>
> (ఆము. 2-73).

**శీత కాల భోజనం** ఎముకలు కొరికే చలిలో వేడి నిచ్చే పదార్థాలంటే ఇష్టపడతారు. వేడి వేడి పునుగువాసన వచ్చే వరి అన్నం, అందులో మిరియాలపొడి వేసి చేసిన రకరకాల కూరలు. ఆ కూరల్ని చట్టి (మట్టి కుండ)లో చేస్తారు. దించేముందు దానికి 'తిరుగుమోత' పెడతారు. ఆ తిరుగమోతను ప్రత్యేకమైన ఇనుప గరిటెలో వేసి బాగా కాగిన తర్వాత దాన్ని కూరచట్టిలో ముంచి మూతపెడతారు. అప్పుడది 'చుయ్'మనే శబ్దం చాలా సేపు వస్తుంది. అలాంటి కూరలట. శీతకాలం కాబట్టి జలుబు చేసి ముక్కు దిమ్మ వేసుకుని ఊపిరాడదు. అది పోయేటట్లు ముక్కునుంచి నీళ్లు కారేలాగా ఘాటైన పచ్చళ్ళు, పాలుబువ్వ (మజ్జిగయితే శీతం చేస్తుంది కాబట్టి దానికి బదులు) ఊరగాయలు వాడుతారు. చలికి నేయి పేరుకుపోతుంది. దాన్ని చేయి తగిలితే 'చురుక్కు'మనే లాగా వేడి చేస్తారు. ఇరగ కాచిన పాలు సమృద్ధిగా వాడుతారు.

> "పునుగుం తావి నవోదనంబు మిరియంపు బొళ్ళతో, చట్టిచు
> య్యను నాదారని కూరగుంపు, ముకుమందై యేర్పు నావం జిగు
> ర్కొను పచ్చళ్లను, పాయసాన్నములు, నూరుంగాయలున్, చేనురు
> క్కను నేయిం, చిరుపాలు వెల్లువగ నాహారంబిడున్ శీతునన్"
>
> (ఆము. 1-82).

ఆ కాలంలో భోజనాలు అర్థరాత్రయినా అలాగే సాగుతుంటాయట విష్ణుచిత్తుడి ఇంట్లో పరదేశ బ్రాహ్మణులు వస్తూనే ఉంటారట. బాగా పొద్దుపోతే కూరలు కొద్దిగానే మిగిలి ఉంటాయి. అవి కూడా చల్లారి పోయి ఉంటాయి. పప్పు ఖాళీ అయి ఉంటుంది. అన్నం కూడా ఆరిపోయి ఉంటుంది. ఆ సమయంలో ఇక గత్యంతరం లేక

విష్ణుచిత్తుడు అతిథులతో ఎంతో వినయంగా నసుగుతూ ఏమీ అనుకోకుండా దయచేసి భోంచేయండని ప్రార్థిస్తుంటాడట. వాళ్లతో తను సంస్కృతంలోనే మాట్లాడతాడు. అర్ధరాత్రి వేళ ఆయన ఇంటి ముంగిటిలో చెవి పెట్టి ఆలకిస్తే ఇంట్లో నుంచి "నాస్తి శాక బహుతా, నాస్త్యుష్ణతా, నాస్తిసూపః, నాస్తి ఓదన సౌష్ఠవమ్" అనే మాటలు వినిపిస్తాయట.

"అనిష్టానిధి గేహసీమ నడురేయాలించిన న్మ్రోయు నెం
తే నాగేంద్ర శయాను పుణ్య కథలున్ దివ్య ప్రబంధాను, నం
ధాన ధ్యానము నాస్తి శాక బహుతా, నాస్త్యుష్ణతా, నాస్త్యపూ
పోనా స్త్యోదన సౌష్ఠవంచ, కృపయా భోక్తవ్యమన్మాటలున్"
(ఆము. 1-84).

అరటాకుల్లో భోజనంఅంటే చాలా ఇష్టపడేవాళ్లు. పుండరీకుడు భగవంతునికి వివిధ ఆహార పదార్థాల్ని నైవేద్యంగా అరటాకులో పెడతాడట.

"నిడుద చిగురరటియాకున
నిడి వివిధాన్నములు భూసురేశ్వరుడొనగన్"
(పాండు. 2-22).

పాతబియ్యంతో అన్నం ఇప్పటిలాగే చాలా శ్రేష్ఠమైందిగా భావించబడేది. 'ప్రాతరాజనవు దివ్యాన్నంబు' (పాం. 4-168). అతిథులకు చద్ది అన్నం పెట్టకూడదనే నియమాన్ని గట్టిగా పాటించేవాళ్లు. 'అనఘ!నీకు చలిది యేనెట్టు లిడనేర్తు?' అంటుంది సుశీల మాయావటునితో.

చాపట్టు:- 'పెసరట్టు' లాగా 'చాపట్టు' అనేది చాప లాగా ఒక వెడల్పైన దోసె. చిన్నపిల్లలకు ఈ రకమైన 'అట్టు' చాలా ఇష్టం కాబోలు! వేసవిలో భూమి అంతా కాగిన పెనం లాగా అవుతుంది. సాయంకాలం అయిన తర్వాత కాచే వెన్నెల దోసెపిండి లాగా తెల్లగా

ఉంటుంది. చకోరాలకు వెన్నెల ఆహారం. వాటి సంతానానికి ఇష్టంగా చాపట్టు లాగా భూమి అంతటా వెన్నెల వ్యాపించిందట.

"ఎనరు కట్టావి క్రియ నావిరెగయ పగటి
యెండ యుదుకార కుండ భూమండలమున
పొలిచె మావట వండు వెన్నెల చకోర
పోత వితతికి చాపట్టు వోసినట్టు"
(ఆము. 2-60).

పెద్దవాళ్ల దగ్గరకుగాని, రాజు దగ్గరికిగాని వెళ్ళేటప్పుడు ఏదో ఒక ఆహార పదార్థం తీసుకుని వెళ్ళటం సాంప్రదాయం. విష్ణుచిత్తుడు పరతత్వాన్ని వాదించడానికి రాజు దగ్గరకు వెళ్ళేటప్పుడు అద్దె గుర్రాల మీద ఇరువైపులా వేలాడే అసిమి సంచులనబడే సంచులలో అరిసెలు తీసుకుని వెళ్ళాడట.

"లావుగల అద్దె గుర్రపు
జావడముల మీద మాత్ర నంచులు దూలన్
క్రేవల నేకాంగులురా,
వీవథముల నరిసెలవని విభునకు గొనుచున్"
(ఆము 2-96)

***చేపల వేపుడు*** :- దోరమామిడి ముక్కల్ని, చేపల ముక్కల్ని కలిపి నూనె ఎక్కువగా పోసి, (ఉప్పు, కారం వగైరాల మిశ్రమంతో) 'చుయ్'మని శబ్దం వచ్చేలాగా, తడి అంతా ఇగిరి పోయేలాగా వేంచి, ఆ వేపుడుతో భోగులు వేసవికాలంలో భుజించేవారట. చేపలకూర వేడి చేస్తుంది. పైగా అది వేసవి. ఆ సాయంకాలం ఆ చేపలకూర తేపులు వస్తుంటాయట. వాటిని తగ్గించి చలువ కలిగించడానికి అంతకు ముందురోజే ఇసుకలో పూడ్చిపెట్టబడ్డ కొబ్బరిబోండాల నీళ్ల తాగేవారట.

"తారుణ్యాతిగ చూతనూత్న ఫలయుక్తైలాభిఘారస్వన
ద్ధారా ధూపిత శుష్కదంబు హృత మాత్స్యచ్ఛేద పాకోద్గతో
ద్గారంపుంగనరార్పు భోగులకు సంధ్యావేళలం గేళికాం
తారాభ్యంతర వాలుకాస్థిత హిమాంతర్నారికేళాంబువుల్"
(ఆము. 2-68).

*వేటాడిన మాంసాన్ని వండే విధానం* :- అడవిలో సెలయేళ్ళ పక్క గుంటలు తీస్తారు. వాటిలో దట్టంగా నావురాకుల్ని పరుస్తారు. వీటినే 'గొల్లజిడ్డు' ఆకులంటారు. ఈ ఆకులు ఎంత ఉడుకు తగిలినా మెత్తబడకుండా వాటి సహజమైన కమ్మని వాసన ఇస్తుంటాయట. ఆ ఆకులమీద మంచిమంచి మాంసపు ముక్కల్ని పేరుస్తారు. వాటి పైన లేళ్ల నెత్తురు ఎసరుగా పోసి, దోర చింతకాయల్ని పరచి, ఆకుల్ని పెట్టి, సందు లేకుండా మన్నుపోసి కప్పిపెడతారు. దానిపైన మంట వేసి, బాగా ఉడికిన తర్వాత తీసి ఉప్పువేసి, తినడానికి సిద్ధం చేస్తారు. ఇది ఒక రకం. కణకణమండే నిప్పులపైన సలాకులకు గుచ్చిన మాంసపు ముక్కల నుంచి నూనె కారేటట్లు కాల్చి 'కఱకుట్లు' తయారుచేసేవాళ్లు. "సెలయేరుల నూరెలం గారుకొని భూరుహాని కాయంబుల డాయంజని తద్ఘనచ్ఛాయల నిల్చి యచ్చటం గ్రొచ్చి గరువు నేలల గుంటలొనరించి, లోననుమ్మగిలి గబ్బువలక కమ్మతావులుగల నావురాకులు పరచి, యెరచిలో మేలేరి, కారిజముం, గందనకాయ క్రొవ్వు మొదలగు మిగుల మెత్తని పలలభిత్తంబులందు క్రందుకొనం గ్రుక్కి, యెక్కువ తక్కువలు గాకుండ, కండగల తింత్రిణీ శలాటుసంఘాతంబులా మీద నెరయంబచరించి, యెసరుగా తేటలగు లేటినల్లలు గ్రుమ్మరించి లవణ కణసంచయంబు నించి, లావుగా గావు గప్పి యుపరి ప్రదేశంబుల కారెనువ పెంట పట్లనీరారు నేరు పిడకల తాళ్లిడి నెల్లి కొయ్యలు త్రచ్చి, నుచ్చులంటించినం, పెచ్చుపెరుగు, చిచ్చు లాత్రంపులం దవిలించి చిముడ నుడికిన వెలువరించి యుప్పు వెప్పునుంగల యప్పిశిత ఖండంబులు కనకని నిప్పులం చమురు చిప్పిలం కాల్చిన కమ్మ కరకుట్లన్" (మను. 4-60).

రకరకాల అడవిపిట్టల మాంసాన్ని తినేవాళ్లు. మద్యం తాగుతూ కరకుట్లు తినేవాళ్లు. "కఱకుట్లందీ నదస్త్రాలకాంతారాంతర్నృ కపాలకుండ విగళన్మైరేయముం ద్రాగెదన్" (ఆము. 6-25) అని బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో అంటాడు.

*ప్రవాసానికి వెళ్ళేటప్పుడు దారిబత్తెంగా తీసుకెళ్ళే ఆహారపదార్థాలు* :-

వేయించిన బియ్యపు పిండిని, బెల్లపు పాకంతో కలిపి చేసిన ఉండలు. వండుకోవడానికి సిద్ధంగా రాళ్లు ఏరిపెట్టిన పాత వరిబియ్యం, శుద్ధి చేసిన బెల్లం, చింతపండు, జీలకర్ర సమభాగాలలో కలిపిన సాంబారపు చింతపండు, వంటబిందెల కావళ్ళు, వాటి కొనలకు వేలాడుతున్న నన్నని మూతి కలిగిన నేతి గిన్నెలు, పెరుగుతో చేసిన వడియాలు, నూనెలో వేయించిన వచ్చి వడియాలు, బేడలు మొదలైన వాటిని తీసుకెళ్ళేవారట.

"భక్తి ప్రోవకు సాధ్వి పరికరంబులు వెట్టి, కట్టిన పొరివిశంగాయ గమియు,
నెనటి పోతలుగాగ నేర్పరించిన చిరంతనపు శాలిక్షేమ తండులములు,
వడిబెట్టిలో జెఱుకరము సాటాలూన్పబెలగు సాంబారంపు టింతపండు
పెల్లులో హాండి కావళ్ల కొమ్ముల వ్రేలు గిడ్డి మొత్తపు నేతిలద్దిగలును

పెరుగు వడియంబులును, బచ్చివరుగు, బేడ
లురుతరాచ్యుతపూజోపకరణ పేటి
కలును, సాత్తని కులము బలసి
విధి నిషేధము లెఱిగితే మధురకరిగె"

(ఆము. 2-97).

ఆహార దోషం వల్ల మనిషిలో జ్ఞానం లోపిస్తుందని భావించేవాళ్లు. సాత్విక, రాజస, తమోగుణాలు మూడు ఆయా ఆహారసేవనం వల్ల ప్రాప్తిస్తాయట. భక్తుడైన యామునాచార్యుడు భగవదనుగ్రహంతో రాజవుతాడు. సకల రాజభోగాల్ని అనుభవిస్తూ, భగవద్భక్తిని ఉపేక్షిస్తాడు. అది గ్రహించి, అతని తాతగారికి శిష్యుడైన శ్రీరామమిశ్రుడు యామునుని పరిస్థితికి కారణం అతను తినే ఆహారమేనని తెలుసుకుంటాడు. ప్రతిరోజూ అలర్కశాకం (ముండ్ల ముస్తెకూర) తీసుకెళ్ళి, అతని వంటశాలలో ఇచ్చి వస్తుంటాడు. తద్వారా అతని మనసు మార్చి తిరిగి యోగం వైపు దృష్టి మళ్ళింప జేస్తాడు (ఆము. 4-194,95,96).

*బ్రాహ్మణులకు శాకాహారం మీద ప్రీతి* :- అలాగే అడవిజాతివాళ్లకి మాంసమంటే మక్కువ. వాళ్ల ఇంటికి వచ్చిన అతిథులకు మాంసాన్ని వండిపెట్టాలి. శాకాహారం గనుక వడ్డిస్తే అతిథులకు వాళ్లమీద చంపేటంత కోపం వస్తుందట.7

*ఎవరెవరి ఆహారం వాళ్లకిష్టం* :- ఒక్కొక్కరికి ఒక్కోరకమైన తిండి మీద ప్రీతి ఉంటుంది. ఎంత విలువైనదైనా తమ ఆహారం కంటే వేరే రకమైన దానికి ఇష్టపడరు. గరుత్మంతుడు దేవలోకం నుంచి అమృతాన్ని తెచ్చి ఇచ్చి, దానికి బదులు పాముల్ని తనకు ఆహారంగా కోరుకోలేదా? అని బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో మొరపెట్టుకున్నాడు.

> "హరికి నఖుడును రథమును నగు గరుడుడు
> దొరికి నమృతంబు సురలకు మరల నిచ్చి
> యహులు కూడుగ వరమున నడిగి కనడె?
> అమృతమైనను చవుల జాత్యన్న నమమె?"
> (ఆము. 6-34).

*మనస్తత్వాలు* :- మానవ నాగరికత పడుతూ లేస్తూ, క్రొత్త పుంతలు త్రొక్కుతూ అభివృద్ధి దిశగా పయనిస్తోంది. 16వ శతాబ్దానికది పరిపుష్టి చెందినదనే చెప్పాలి. నాటి ప్రజలు శృంగారానికెంతో ప్రాధాన్యత నిచ్చినట్లు తెలుస్తోంది. ఈ దిశగానే లలితకళలభివృద్ధి చెందాయని చెప్పవచ్చు. శృంగార ప్రబంధాలు, దేవాలయాలపై శిల్ప చిత్రాదులు శృంగార రసోద్దీపకాలుగా పని చేశాయి. ఆనాటి సంఘానికవి అవసరం కూడాను (జనాభావృద్ధి కోసం).

*శృంగారం* :- 'ఆనందో బ్రహ్మ' అనే వేద వాక్యాన్ని శృంగారపరంగా అన్వయించి భాష్యం చెబుతోంది వరూధిని. 'మనస్సు, ఇంద్రియాలు, ఏకాగ్రంగాను, నిశ్చలంగాను దేనిమీద నిల్చి, ఆనందాన్ని పొందగలవో, ఆ ఇంపే పరబ్రహ్మమ'ని అంటుంది.

---

7. ఆము. 4-223.

"ఏందేడెందము కందళించు రహిచే నేకాగ్రతన్ నిర్వృతిన్
జెందున్ కుంభగత ప్రదీప కళికా శ్రీదోవ, నెందెందు, బో
కెందే నింద్రియముల్ సుఖంబుగను, నాయింపే పరబ్రహ్మ, 'మా
నందో బ్రహ్మ' యటన్న ప్రాజదువు లంతర్బుద్ధి నూహింపుమా"
(మను. 2-62).

ఆమె ప్రవరుడితో ఇంకా ఇలా అంటుంది. 'ఉపవాసాలతోను, తపస్సులతోను శరీరాన్ని కుంగిపోయేటట్లు చేసుకునే ముని ముచ్చులంతా అందమైన అమ్మాయిల కౌగిలిలో బంధీలే కదా!' అని పురాణాల్ని తిరగేస్తుంది.

"వెలివెట్టిరే బాడబులు పరాశరు బట్టిదాశ కన్యాకేళి తప్పుజేసి?
కులములో వన్నె తక్కువ యయ్యెనే గాధిపట్టికి మేనక చుట్టరికము?
ననుపుకాడైవేల్పు నాగవానముగూడి మహిమ గోల్పడియెనే మాండకర్ణి?
స్వారాజ్య మేలంగ నీరైరె, సురలవాల్యా జారుడైన జంభానురారి?

వారికంటెను నీ మహత్వంబు ఘనమె?
పవన పర్ణాంబు భక్షులై, నవసి యినుప
కచ్చడాల్ కట్టుకొను మునిముచ్చులెల్ల
తామరస నేత్రలిండ్ల బందాలుకారె?"
(మను. 2-73).

యజ్ఞ కోటులం బావను లౌటకున్ ఫలము, మా కౌగిళ్ల సుఖించుటే గదా!"....(2-54) అని కూడా అంటుంది.

కావ్యాల నిండా విటీవిటులు, పుష్పలావికలు, శాలి గోపికలు, (ప్రపాలికలు, వేసవి చలివందిల్లో నీరు పోసే యువతులు) వాళ్ల శృంగార చేష్టలు, వాళ్లతో యువకుల నర్మగర్భోక్తులు మనకు అడుగడుగునా కనిపిస్తాయి. మితిమీరిన పచ్చి శృంగారం సంఘంలో గౌరవప్రదంగా ఉండేది(వసు. 4-23), (ఆము. 2-61).

"ఒక బాటసారి మండుటెండలో కాళ్ళీడ్చుకుంటూ చలివేంద్రాన్ని చేరుకుంటాడు. ఆరిపోయిన నాలుకతో మాట పెగలక అతి దీనంగా దోసిలి పట్టుకొని 'అమ్మా! అక్కా! ఇన్ని నీళ్ళు పోసి పుణ్యం కట్టుకో

తల్లీ! అని దీనంగా బతిమాలుతాడు. దప్పికతీరిన తర్వాత అమ్మాయి అందమైన ముఖాన్ని, శరీర భాగాల్ని, ఎగా దిగా చూస్తూ, నీళ్ళింకా తాగుతున్నట్లు నటిస్తూ, అలాగే దోసలి పట్టుకుని ఉంటాడు. వాడి పిచ్చిని పసిగట్టిన ఆ అమ్మాయి పక్కనున్న స్నేహితురాలికి కనుసైగ చేసి లోలోన నవ్వుకుంటుంది.

"తొడిబడ నమ్మలక్కలని, తూలుచు దీనత దోయిలొగ్గుచున్
వడ మరి తేరదేర నలవాక్యము లెన్నక మోము గుబ్బలున్
కడుగొను కక్షదీప్తులు నెగాదిగ కన్గొను చిట్టకంపు, త్రా
గుడు కని, నన్నలన్నగిరి, కోల్పక పాంథు, ప్రపా ప్రపాలికల్"
(ఆము. 2-59).

ఇప్పటికీ హంపీ పరిసర ప్రాంతాల్లో, బిచ్చగాళ్ళుగాని, అతి దీనస్థితిలో ఉండేవాళ్లుగాని ఆడవాళ్ళను అమ్మా!, అక్కా! అని సంబోధించడం పరిపాటి. అలాగే మరో ప్రయాణికుడు అలాంటి చలివేంద్రాన్ని చేరుకుంటాడు. దోసిలి పట్టి నీళ్ళు తాగుతూ, నీళ్ల పోసే అమ్మాయి ముఖాన్ని చూసి, 'ఎంత బాగున్నది!' అని మెచ్చుకోలుగా కళ్లింత చేసుకుని తలనాడిస్తాడు. 'ఇక చాలు' అనడానికి తలనాడిస్తారు. కానీ, వాడికి ఇంకా నీళ్లు కావాలి. వాడి పరిస్థితి అర్థం చేసుకున్న ఆ యువతి, పోనీలే! పాపం! చూడనీ! అనుకుని నవ్వుకుంటూ నీళ్ళు సన్నగా అలాగే పోసింది.

"....చెలిమోము పసమెచ్చి తలయూచు బెటిగి, మా
నక నవ్వ నేర్పుడెందముల గరవ...."
(ఆము.2-58).

బహు భార్యాత్వం, బహు ప్రేయసీత్వం సంఘంలో గౌరవప్రదంగా భావించబడుతున్నా, దాని పరిణామం మాత్రం రోతపుట్టించక మానదు. పవిత్రమైన ప్రేమకు అక్కడ స్థానం ఉండదు. నలుగురితో పాటు సామాన్యులకు తోచకున్నా సంస్కారవంతులైన మేధావులకు ఇది తోచక మానదు.

"భూరి సంపద తలపువ్వు వ్వాడని భోగి" ( వసు. 3-04) అని దేవేంద్రుణ్ణి కొనియాడడమైంది. 'రాత్రికి బొండుమల్లెలు ఉన్నవిగదా! అని గుర్తుచేయడం, నాటి గృహస్థుల ఆనవాయితీ అయినట్లుగా ఈ ప్రాంతవాసులు (హంపీ ప్రాంతీయులు) చెబుతారు. అతిథులకు భోజనంతోపాటు చందనతాంబూల పుష్పాదుల్ని కూడా సమర్పించుకునేవాళ్ళు.

"పానకం బతిథులకిడ్డ, దాను గ్రోలి
యర్పనా దత్త చందన చర్చదేలి;
విరులు సిగ దాల్చి కర్పూరవీటి జౌరు
కొట్టుచు ద్విజుండు వెన్నెల బిట్టుగాయ"
(అము. 2-73).

వేశ్య ఇంటికి వెళ్తూ అన్ని అలంకారాలతోపాటు మత్స్యధ్వజుడు తలలో పాటల (కలిగొట్టు) పుష్పాల్ని పన్నీటితో కలిపి కస్తూరిని పూసుకున్నాడు.

"పన్నీటితో గదంబము సేసి పూసిన మృగనాభివస రాచనగరు దెలువ....
(అము. 1-75).

మాయా ప్రవరుని జుట్టు "యానితంబ విలంబి కాలాహి కల్ప ఘనకచ గ్రంథి" (మను. 3-88) చక్కగా ముస్తాబై పరిమళద్రవ్యాలతో ఘుమఘుమలాడే నిగమశర్మ తలలో పూలు లేనిదే గడపదాటే వాడు కాదు.

"తలగడు గంగ....చందన చర్చ ప్రసూన దామకంబులు"
(పాం. 3-09).

అలాగే ఆనాడు శృంగారపురుషులకు, విలాసవంతులకు పూలు లేందే పొద్దే పొడవదు. ఇన్ని శతాబ్దాలు గడచినా, ఈ నాటికీ 'పూలరంగడు' అనే మాట వింటుంటాం. ఈ మాట వెనుక ఎంత చరిత్ర దాగి ఉందో, పురుషులు పూలకెంత ప్రాధాన్యం ఇచ్చేవాళ్లో తెలుస్తోంది. అంతటి

రాజులు తమ అంతఃపురాల్లో 'వీటి కాకరండాల్ని (తాంబూలపు పెట్టెల్ని) పట్టుకోడానికి అనేక దేశాలకు చెందిన అమ్మాయిల్ని నియమించుకునేవాళ్లు. అది రాజలాంఛనమట.

"కుకురు కాశ కురు కరూశ కోసలాంధ్ర సింధు బా
హ్లిక శకాంగ వంగ సింహళేశ కన్యకామణి
ప్రకర పాణిఘటిత రత్నపాదుకా కలాచికా
ముకుర వీటికా కరండ ముఖ్యరాజలాంఛనా!"
(మను. 1-83).

రాజు వేశ్య ఇంటికి బయలుదేరేటప్పుడు ముందు తలవరులు నడుస్తుండగా వెనుక 'అడపం' మోసుకుని ఒక అమ్మాయి వచ్చేదట.

"మెలత యడపముదే, జరన్మోరుపనగ...."
(ఆము. 2-75).

కృతజ్ఞతా సూచకంగాను, ఎదుటివ్యక్తి పైన ప్రీతిని సూచించడానికి తాంబూలాన్ని ఇచ్చే ఆచారం ఉండేది. వేసవిలో తమకు తాగేనీళ్లు పోసి, దప్పిక తీర్చిన చలివేంద్రాల్లోని పడచులకు బాటసారులు ప్రీతితో వీడెం ఇచ్చేవాళ్లు.4

అతిథులకు షడ్రసోపేత భోజనంతోపాటు, రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెం కావాలని పెద్దన రాయలనడిగారట.5

*పూలుపరిమళద్రవ్యాలు* :- ఆ రోజుల్లో స్త్రీ, పురుషులు సమానంగా జుట్టును పెంచి, పువ్వులు పెట్టుకొనేవారు. పునుగు, జవ్వాది, చందనం మొదలైన సుగంధ ద్రవ్యాల్ని ఒంటికి రాసుకునేవాళ్లు. సాధారణ వ్యక్తులు కనీనం చందనం అయినా రాసుకునేవాళ్లు. ఎప్పుడూ తలలో పూవులు వాడకుండా చూసుకోగలగడమనేది ధనవంతుల లక్షణంగా భావించబడింది.

---

4. ఆము. 2-58.
5. నిరుపహతి స్థలంబు....పూరక కృతుల్ రచియింపుమలున్న శక్యమే (చాటువు).

కన్నతండ్రి అయినవాడు కూడా తన కడుపున పుట్టినవాడి వ్యసనాల్ని సైతం మాన్పలేడు. అలాంటిది సంబంధంలేని వాడొకడు రాజు వ్యసనాన్ని మాన్పగలడా?

"వసుధం పుత్రాధికదు
ర్వ్యసనము సైతమును తండ్రి వారించుటకున్
వసపదదట, మరి రాజ్య
వ్యసనము వారింప నెంత వాడెవ్వాడున్?"
(ఆము. 4-192).

జింక గొంతు కొరికి నెత్తురు తాగే సమయంలో సివంగినిని తరిమితే, అది తిరగబడి తరిమేవాణ్ణి చంపుతుంది. ఆ జింకను దూరంగా ఈడ్చుకుని పోతుంది. కాబట్టి తెలివైన వేటగాడు అలా చేయకుండా ఆ జింక నెత్తుర్ని దాన్ని తనివితీరా తాగనిచ్చి ఆ తర్వాతనే తరుముతాడు. అప్పుడది జింకను వదలి, తిరగబడకుండా వెళ్తుంది. గాయానికి మందువేసి దాన్ని బతికించుకోవచ్చు.

అలాగే శృంగారాది విషయ వాసనలకు చిక్కిన మనిషిని తనివితీరా వాటిని అనుభవించిన తర్వాతనే వాడికి హితబోధ చేయాలి.

"నల్లగ్రోలనిచ్చి మెల్లనె, చివ్వంగి
నోరిజింక దివియు నేరు పొదుపు
వేటకాడు వోలె విషయాళి వలన త
త్తృష్ణ దీరనిచ్చి త్రిప్పవొప్పు"
(ఆము. 4-193).

*వైరాగ్యం* :- శృంగారం పట్ల ఎంత మోజు కనబరిచేవాళ్లో, వైరాగ్యం పట్లకూడా అంతే మోజు కనబరచేవాళ్లు. భోగిని దగ్గరకు వెళ్ళే రాజు ఆ రాత్రి దారిలో బ్రాహ్మణుడు చెప్పుకుంటున్న పద్య భావాన్ని గ్రహించి ఇట్టే మారిపోతాడు. తనలో తానిలా వాదించుకుంటాడు. "అయ్యో! ఈ రాజ్య వైభవాలెందుకు? ఈ భోగాలు శాశ్వతమా? నీటి బుడగవంటి ఈ శరీరం మీద మోహంతో మోక్షమార్గాన్ని మరచి పోయానే!" అని బాధపడతాడు.

"ఎక్కడ రాజ్య వైభవము?లెక్కడి భోగము?లేటి సంభ్రమం?
బక్కట! బుద్బుద ప్రతిమమైన శరీరము నమ్మి మోక్షవున్
జిక్కి గణింపకుంటె, యుగనంధుల నిల్పుయు, గాలు చేతిబల్
త్రొక్కుల నమ్మను ప్రభృతులున్ తుద రూపఱకుండ నేర్చిరే?"
(అము. 2-78).

ఎంతో విలువైన కాలాన్ని వృథాగా గడిపేశాను. తనలో కూర్చున్న వాళ్లని నావ తాను కదులుతున్నట్లే కనబడకుండా అవతలి ఒడ్డుకు చేరుస్తుంది. అలాగే కాలం కూడా మన వయస్సును ఇట్టే హరించి మనకు తెలియకుండానే వార్ధక్యానికి చేర్చుతుంది.

"ఉన్నట్లుయుండ నద్దరి
కన్నరులను నావ చేర్చుక్రియవెన, దాటో
కున్నట్లు యుండి కాలం
బున్నరులకు వయను బుచ్చి మోనము దెచ్చున్"
(అము. 2-79).

మెరుపులాగా మెరిసి మాయమయ్యే ఈ రాజ్య భోగాలకు మరిగి, మోక్షాన్ని గురించి ఆలోచించడం మరచిపోయాను. ఇక నుంచి దాని కోసం ప్రయత్నిస్తాను" అని అనుకుంటాడు.

"కాన తటిచ్చల మగురా
జ్యానందము మరగి యింద్రియారాముడనై
పోనింతనుండి పరలో
కానందంబునకె, యత్న మాపాదింతున్"
(అము. 2-81).

మరుసటి రోజు కొలువుతీరి పండితుల్ని మీమీ శాస్త్రాలు చూసి మోక్షమివ్వడానికి ఏ దేవుడు సమర్థుడో వాదించమని కోరతాడు. వాదంలో గెలిచిన వాళ్లకి, బీరపూలవంటి పచ్చని బంగారు నాణేల్ని ఒక సంచిలో పెట్టి సభలో వేలాడదీయిస్తాడు8. భగవత్ప్రేరితుడై వచ్చిన విష్ణుచిత్తుడు వాదంలో గెలిచి విష్ణు పారమ్యాన్ని నిలబెడతాడు.

శృంగార, వైరాగ్యాలు పరస్పర విరుద్ధాలు. అవి అనాటి ప్రజల మనస్సుల్లో ఎలా చోటు చేసుకున్నాయో మనుచరిత్రలో 'వరూధినీ ప్రవరాఖ్య' ఘట్టంలో చక్కగా చిత్రీకరించబడ్డాయి. అలాగే పరస్పర విరుద్ధాలైన ఐహిక, అముష్మికాలు అనాటి ప్రజల మనస్సుల్లో ఎలా భావించబడ్డాయో అముక్తమాల్యదలో 'ఖాండిక్య, కేశిధ్వజ' సంవాద ఘట్టంలో వివరంగా చిత్రించబడ్డాయి. అముష్మికానికి సంబంధించిన యోగవిద్య పూర్తిగా శాస్త్రబద్ధం. కాబట్టి అదంతా అనాటి ప్రజల ఆచరణలో ఉండేదనలేం. కాని ఆ ఖాండిక్యుని వాదనను వ్యతిరేకిస్తూ అతని మంత్రులాడిన ఐహికానికి సంబంధించిన మెలకువలు మాత్రం నాటి ప్రజల చిత్త వృత్తుల్ని ప్రతిబింబిస్తున్నాయనవచ్చు.

*ఐహికం* :- ఖాండిక్య, కేశిధ్వజలిద్దరూ అన్నదమ్ములు. రాజులు. కేశిధ్వజుడు ఖాండిక్యుణ్ణి ఓడించి అడవుల్లోకి తరుముతాడు. మోక్షప్రాప్తి కోసం యజ్ఞం చేయడానికి ప్రారంభించే సమయానికి హోమధేనువును పులి చంపేస్తుంది. అలా యజ్ఞం మధ్యలో ఆగిపోవడానికి ఏమి ప్రాయశ్చితం చేయాలో తోచక, మంత్రుల సలహాలమీద సోదరుడైన ఖాండిక్యుణ్ణి అడగడానికి అడవికి వెళ్తాడు. సులభంగా దొరికిన అతన్ని చంపి నీ రాజ్యాన్ని తిరిగి పొందమని ఖాండిక్యునితో అతని మంత్రులు అంటారు. నీ దాయాది ఎటువంటి ప్రయత్నం లేకుండా నీకు ఒంటరిగా దొరికిపోయాడు. అతని మీద దయ చాలించి ఇక లెమ్ము. ఇంకా ఈ అడవిలో ఆకులు మేపి ప్రజల్ని చంపొద్దు.

"పాలు గలవాడు మనకొక
జాలి యిడక తానె తార సానకు వచ్చెన్,
వేళ యిదె లెమ్ము, నృప!కృప
చాలు న్గా రాకు మేపి చంపకు ప్రజలన్"
(అము. 3-32).

8. అము. 2-84 & 85.

ఈ అడవిలో మన భార్యాబిడ్డలు గుంపులు గుంపులుగా అడవిలో దొరికే కూరల కోసం బీళ్ల వెంబడి పడి తిరుగుతున్నారు. పాదాల నిండా వాడి అయిన ముళ్లు గుచ్చుకుని వాళ్ళు తెల్లవార్లు ఏడుస్తుంటే నిద్రరాక అలాగే పొర్లుతూ ఈ కటికనేల మీద అలమటిస్తున్నాం. మేమేకాదు, మీరు పడే బాధ కూడా వర్ణనాతీతం.

"అంటలు గట్టి చెల్కలతు నాంధ్రుమ బిడ్డలు కూరగోయటోన్
కంటకముల్ పదాబ్జముల గాఢ నొదర్చిన నొప్పి గూయిడన్
కంటికి నిద్రగాన కొదుగం బడి వేగద మిందు, నొక్క మా
కంటయ గాదు, నీవు పడువట్టి యవస్థ వచింప శక్యమే"
(ఆము. 3-33)

కాబట్టి అతన్ని చంపితే రెండు రాజ్యాలూ నీకే సంక్రమిస్తాయి. ఎలాగైనా సరే శత్రువుల్ని జయించి, ధనం సంపాదించి ప్రజల్ని కాపాడడం ధర్మం కాదా!

"అతని పని దీర్చ రాజ్య
ద్వితయము నిను జేరు, నెట్టి నెరవున నైనన్
క్షితిపుల కరిజయము ధనో
న్నతియు ప్రజానదయ రక్షణము ధర్మంబుల్"
(ఆము. 3-35).

అలా అన్యాయంగా చంపడం పాపమంటావేమో! ప్రజల్ని న్యాయంగా పాలిస్తే పాపం పోతుంది.

"అన్యాయంబున దుస్సహా
మన్యుండగు ప్రబలరిపుని మడియించిన, ధ
ర్మన్యక్కృతి కగు నిష్కృతి
నన్యాయంబుగ ప్రజాళి సంరక్షింపన్"
(ఆము. 3-36).

"తన రాజ్యానికి అడ్డు తగులుతున్నాడని, బ్రాహ్మణుడు, గురువు అయిన త్రిశీర్షుణ్ణి దేవేంద్రుడు చంపలేదా? ఇతని మీద దయ చూపకు.

నిన్ను నమ్ముకున్న ప్రజలు అవస్థలు పడుతుంటే వాళ్ల మీద నీ ఉత్తుత్తి దయవల్ల ఏమి ప్రయోజనం?

"తన రాష్ట్రము చెఱ వచ్చిన,
ననిమిషపతి విప్రుడనక యాచార్యు, త్రిశీ
ర్షుని దునుమడె? విడువుము దయ
నిను నమ్మిన ప్రజలు నవయ నీ దయ యేలా?"
(ఆము. 3-37).

మంచివాడైన నిన్ను అడవులపాలు జేసిన అతన్ని చంపి, ఆ పాప నిష్కృతికి పుణ్యకార్యాలు చెయ్యొచ్చు.

"శిష్టు నిను నింతజేసిన
దుష్టాత్ముని బిలుకు మార్చి, దురితము పిదపన్
నష్టంబుగ భూవల్లభ!
యిష్టాపూర్తములు సేసియెనగగరాదే?"
(ఆము. 3-38).

ప్రజలు ఇంకా ఎన్నాళ్లు చూస్తారు. నీలో ఏమైనా మార్పువస్తే సరే లేకుంటే వాళ్ళ ఊళ్లకు వెళ్ళిపోతారు. అప్పుడు నీవు ఇక్కడే సన్యాసిగానైనా గడపాలి. లేదా అతనితో సంధి అయినా చేసుకోవాలి. అంతకంటే వేరే మార్గం లేదు.

"ఇంకఱెన్నాళ్లు నూచి, నీ వంక తెగువ
కలుగ కుండిన ప్రజలూళ్లు దలచి పోవ
మౌని వగుటయొ, యుండె, విహీన సంధి
నతని గనుటొండెగా కొండు మతము గలదె?"
(ఆము. 3-39)

రాజా! నీవు సన్యాసివై తపస్సుకు కూర్చున్నావనుకో, కన్నులు గట్టిగా మూసుకోగలవేమో! కాని, నీ మనస్సును మాత్రం కేంద్రీకరించలేవు. ఎందుకంటే, అవమానపు సంకటం ఎదలో రగులుతుంటే ఏకాగ్రత ఎలా సిద్ధిస్తుంది?

"జనపరితపమున కుంటా
చ్చిన కన్నులు మూసుకొంటె, సెలవింతియ, కా
క విధి ధ్యానకు బ్రహ్మం
బినయునె? పరిభవవు శల్య మెదలో మెఱపన్"
(ఆము.3-40)

కేవలం వైభవం కోసం అతన్ని చంపమనడం లేదు. శాంతి కావాలన్నా పగ చల్లారాలి. పరశురాముడంతటివాడు పగదీర్చుకోడానికి తన తండ్రి నవమానపరిచిన రాజుల పిల్లతరం వాళ్లని వెదకివెదకి చంపిన తర్వాత తపస్సుకు వెళ్ళాడు.

"అపమతి పితృఘ్నులగు, భూ
ధపుల వెదకి పిల్ల పిల్ల తరము దునిమి, భా
ర్గవుడు మునిమయ్యె, మఱి, వై
భవము వలదు శాంతికైన పగతెగ కగునే?"
(ఆము. 3-41)

పులి ఈనినప్పుడు కండ్లకలక వచ్చి కళ్లు సరిగా కనబడవు. అప్పుడది కొండ దిగి ఊళ్ల మీద పడితే, ప్రజలంతా దాని మీద పడి సులభంగా చంపేస్తారా?లేక దాన్ని వెళ్ళనిచ్చి దాని జబ్బు నయమైన తర్వాత అదివుండే గవికి వెళ్ళి, దాన్ని చంపగలుగుతారా? లేక దానిచేతనే చస్తారా?

"పులి మలడిగి యూళ్ళకు, న
క్షుల రుజరా, జనము మాన్పుకో జవిచి, గవిన్
నెలకొన, నురియలు గొని చని
పొలియునో?యూరగుయిరేగి పొడుచునో? చెపుమా?"
(ఆము. 3-43).

నీకంటే బలవంతుడైన నీ సోదరుడు సులభంగా దొరికిన ఈ సమయంలో చంపడం ధర్మం కాదని వదలిపెడతావనుకో, మళ్లీ ఎప్పుడు నీకిలాంటి అవకాశం వస్తుంది? ఎప్పుడు తిరిగి నీ రాజ్యాన్ని

చేజిక్కించుకుంటావు? నీవనుకున్న ఆ ఉపాయాలేవో ఒక్కొక్కటిగా వేలు మడిచి చెప్పు.

"ఈ వేళ బలియు నతనిం
బోవిడిచితి పొమ్ము పోడి, పోయిన రాజ్యం
బేవిధి గ్రమ్మరు? నావెర
పీ వెరవని వ్రేలు మడచి యేర్పడ జెపుమా?"
(ఆము. 3-44).

అని ఖాండిక్యునికి అతని మంత్రి ప్రధానులు వరివరి విధాలుగా కర్తవ్యాన్ని ఉపదేశిస్తారు. అంతా విని ఆ రాజు అంతే పట్టుదలతో వాళ్లకి ఆముష్మికాన్ని గురించి ఉపన్యసించి, తాననుకున్నట్లుగా తనసోదరునికి ప్రాయశ్చిత్తాన్ని ఉపదేశిస్తారు.

*పెద్దల దర్శనానికి వెళ్ళేటప్పుడు* :- కులాన్నిబట్టి మర్యాద ఇచ్చినట్లే, వయసునుబట్టి కూడా గౌరవాన్ని ఆ కాలంలో ఇచ్చేవాళ్లని తెలుస్తోంది. మనం ఇప్పుడు వాడే 'పెద్దలు' అనే మాటకు మూలం రూపం వృద్ధులే గదా! ఈనాటికీ పెద్దలపట్ల గౌరవం ఇంకా పూర్తిగా తగ్గలేదనే చెప్పాలి. అలాంటి పెద్దవాళ్ల దగ్గరకు వెళ్ళేటప్పుడు కొన్ని నియమాలు పాటించేవాళ్లు. తన తండ్రి అయిన శివుడి దగ్గరకు కుమారస్వామి మునులతో పాటు వెళ్తారు. అంతకుముందు తాను నములుతూ ఉన్న తాంబూలాన్ని ఉమిసి నోటిని పుక్కిలించి శుభ్రపరుచుకున్నారు. భుజం మీద వేసుకున్న అంగవస్త్రాన్ని తీసి నడుముకు చుట్టుకున్నారు. శివునికి అర్పించాలని మోయించుకుని వస్తున్న కానుకల్ని తానే స్వయంగా చేతికి తీసుకున్నారు. తనకంటే వయసులో పెద్దవాళ్లైన మునుల్ని ముందుగా లోపలికి వెళ్లడానికి సైగ చేశారు. వాళ్ల వెనకనే తాను కూడా వెళ్ళారు. తనను చూసి లేచి నిలబడిన ముసలి ద్వారపాలురను చిరునవ్వుతో గౌరవ సూచకంగా మాట్లాడించి లోపలికి వెళ్ళారట.

"పీడియం విడలించి విధురత్న కనకాలు
కాంచి తాంబువు పుక్కిలించి యుమిసి,
యుదిరి బంగరు పాత్ర హొంబట్టు పలె వాటు
నడలించి వెన కటిస్థలిని జుట్టి.

యనుయాయి పృథుక హస్తాంతరన్యస్తోప
దోచితార్థము తావెయుద్వహించి
యంగుళీ నంఙ్ఞ నంయముల ప్రత్యేకంబు
మును మున్నులోనికి జననొసర్చి.

ద్వార పార్శ్వ వ్రవ్థ వేదికా వలుల జరత
రక్షివర్గంబు టంక్రియారభటి వరల
వలయ మకుటాదికంబుగ నిలిచి మ్రొక్క
నగవు చూపుల జూచుచు నగరు సొచ్చి"
(పాండు. 1-198).

వసుచరిత్రలో భట్టుమూర్తి కవితా ఇంద్రజాలంలో కవి చెప్పినట్లు కిమ్మనకుండా నడచుకోవడం తప్ప, పాత్రలకు సహజ స్వభావ సిద్ధమైన మనస్తత్వం మచ్చుకైనా కనబడదు. అలంకార ప్రాయంగా చెప్పబడ్డ ఉదాహరణలలో ఒకటి, రెండు చోట్ల అలాంటివి కనబడతాయి.

నిష్కలంక హృదయులు, సాధువర్తనులు, అయిన సజ్జనుల్ని కొనియాడడానికి బుధులు (పెద్దవారు) ఎంతో దూరమైనా పోతారట.

"విమలమధుర మనోహర వృత్తి వలయు
వారి కొనియాడ బుధులెంత దూరమైన
పోవుదురుగాన, నేను నీపొందు గోరి
దవ్వనక వచ్చితినశేషతావకమని!"
(వసు. 2-129).

*స్త్రీల మనస్తత్వం* :- బహు భార్యాత్వం సాంఘిక మన్నన పొందిన ఆ రోజుల్లో స్త్రీలకు చాలా అన్యాయం జరిగిందని చెప్పాలి. వాళ్లకి పురుషులతో సమానంగా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ఉండేవి కావు. మనసు విప్పి మాట్లాడుకోడానికి భర్త తనకు అందుబాటులో

ఉండదు. భర్తకు మాత్రం తన భార్యలందరికీ సమానంగా న్యాయం చేయడం సాధ్యమవుతుందా? ఈ పరిస్థితుల్లో స్త్రీలు తన భర్త సవతులందరి కంటే తన మీదనే ఎక్కువ ప్రేమ చూపేటట్లు అన్ని విధాలా ప్రయత్నించేవాళ్లు. భర్తను లొంగదీసుకోడానికి తమ అందచందాలు, సపర్యలతో పాటు ప్రత్యేకించి పూజలు, వ్రతాలు కూడా నిర్వహించేవాళ్లు. సత్యభామతో నారదుడు చేయించిన 'పుణ్యకవ్రతం' అలాంటిదే ఇన్ని చేసినా తన భర్త తన మీద కంటే ఇతర సవతుల పైనే ఎక్కువ ప్రేమ చూపుతున్నారని తెలిస్తే, ఇక ఆ స్త్రీ హృదయం ఎంత విలవిలలాడిపోతుందో, సత్యభామ పాత్రే అందుకు నిదర్శనం.

నారదుడు బహూకరించిన పారిజాతపుష్పాన్ని కృష్ణుడు అప్పటికి తన దగ్గరే ఉన్న రుక్మిణికి ఇస్తాడు. దీనివల్ల కృష్ణుడికి తన భార్యల అందరిలోకి రుక్మిణి పైనే ఎక్కువ ప్రేమ ఉన్నట్లని, ఇంతవరకూ సవతుల అందరిలోను తనే గొప్పదాన్నని గర్వపడే సత్యభామ ఆటలు ఇక సాగవని కలహాభోజనుడు లాకీదు ఇస్తాడు. ఈ విషయం చెలికత్తెల ద్వారా తెలుసుకున్న సత్య హృదయం దైబ్బతిన్న కోడెత్రాచులాగా నెయ్యి పోస్తే భగ్గుమని లేచే మంటలాగా అవుతుంది (పారి.1-82). ఆ సంఘటనను వివిధ దృక్కోణాల నుంచి పరిశీలిస్తుంది. అందుకు కారణం నారదుడా? కృష్ణుడా? రుక్మిణా? అనుకుంటుంది. ఆ పారిజాత పుష్పం ఏదో గొప్ప ప్రభావమున్నదని, ఆ నారదుడు కృష్ణుడికి ఇస్తే ఇచ్చాడు. దాన్ని ఆయనకిష్టమున్న వాళ్లకిస్తే ఇచ్చాడు. కాని అక్కడ నా గురించి ఆడిపోసుకోడం ఎందుకు? అన్నదే సత్య ప్రశ్న.

> "అతుల మహానుభావమని యవ్విరి తానొక పెద్ద సేసి, య
> చ్యుతునకు నిచ్చుకంటొదవ నూడిద యిచ్చిన నిచ్చెగాక, తా
> నతడు ప్రియంబు గలునెద కర్పుణ సేసిన జేసెగాక, యా
> మతకరి వేలువుందవసీ మమ్ము దలంపగ నేల? యచ్చుటన్"
> (పారి. 1-84).

ఇలా తగువులు పెట్టడమే పనిగా లేనిపోని మాటలు చెప్పి లోకాలు తిరిగే ఆ కలహాభోజనుడికి అలా అనడం సహజమే! కాని వింటున్న ఈయనైనా అలా అనవద్దని వారించవచ్చుగదా! అని అనుకుంటుంది.

"పలు తెఱగు మూర్ఖ మాటల
కలహామె, కల్యాణమని జగంబులవెంటన్
మెలగెడు మౌనికి సహజము
వలదని వారింపవలదె? వల్లభుడతనిన్"
(పారి. 1-85).

ఆ మునేం చేస్తాడు? రుక్మిణి మాత్రం ఏమి చేస్తుంది? ఈ గోపాలుడు చేసిన పని ఏమని చెప్పుకోవాలి? ప్రాణంతో సమానమైన వాడిలా మారిపోతే మనస్సు తట్టుకోగలదా.

"మునియేమి సేయు? రుక్మిణి
గౌన కారణమేమి? ధూర్త గోపాలుడు, చే
సిన చెయిదమేమి చెప్పుదు?
మన మెరియదె ప్రాణమైన మగడిట్లయినన్?"
(పారి. 1-86).

ఆడవాళ్ళను నమ్మరాదంటారు ఈ మగవాళ్లు. నిజానికి వీళ్ళనే నమ్మకూడదు. శరత్కాల మేఘాల్లా ఒకసారి ఉన్నట్లు ఇంకోసారి ఉండరు. వీళ్ళను అసలు నమ్మకూడదు.

"పరికింపరు తమ జాడలు
తరుణుల తగులములు నమ్మదగ దండ్రుమదిన్
శరదంబుద చలచిత్తులు
పురుషులె పో, వారి నమ్మబోలునె? చెలియా?"
(పారి. 1-87).

ఇన్నాళ్ళు ఇంత గొప్పగా బతికాను. ఆయన కన్నులకద్దుకునేవాడు. ఆ వైభవమంతా పోయి, అందరూ వేలుపెట్టి చూపుతూ, తలెత్తి నన్ను చూస్తుండగా ఎలా తిరగగలను? (పారి. 1-88).

కృష్ణుడి అసలు స్వరూపం ఇన్నాళ్ళకు బయటపడింది. రుక్మిణి మీద అతనికున్న ఇంతటి ప్రేమ నాకు కనబడకుండా ఇన్నాళ్ళు నా ముందు నాటకమాడాడు. అహో! ఎంత తెలివిగా ప్రవర్తించాడు!

> "నా మొగ మాటకై వలని నాటకముల్ ఘటియించి రుక్మిణీ,
> కామిని మీదటన్ గలుగు గౌరవమున్ గృపయున్ బ్రియంబు, దా
> నేమియు గాననీక యిట నిన్నిదినంబులు నన్నుదేల్చె నో
> తామర సాక్షి!మెచ్చవలదా? మురదానవ భేది కృత్యముల్"
> (పారి. 1-89).

మంచికీ, చెడ్డకు ముందుకు వచ్చి నిలబడే వాళ్ళను లోకం గుర్తించదా? నరకుణ్ణి అంతం చేసిన అతనికి తెలియదా? ఆ రుక్మిణికి తెలియదా? అంటూ నరకునితో పోరాడేటప్పుడు తాను కృష్ణుణ్ణి ప్రమాదం నుంచి కాపాడి, అతని స్థానంలో యుద్ధం చేయడం గుర్తుకు తెచ్చుకుని దుఃఖిస్తుంది.

> "పూనుకొని మేలు గీళ్ళకు
> లోనయి విహరించువారి, లోక మెరుగదో!
> యానరకాసుర దమనుడు
> తానెరుగడొ భోజకన్య తానెఱుగదొకో"
> (పారి. 1-91).

సాధారణంగా ఆత్మీయులతో మనస్పర్ధలుగాని, తెగతెంపులుగాని వచ్చినప్పుడు ఎదుటివాళ్ళకు చేసిన మేలు గుర్తుకు తెచ్చుకోడం కద్దు. మన వైపునుంచే ఎదుటి వాళ్ళను విమర్శిస్తాం. ఈ మానసిక తత్వాన్ని కవి ఈ చిన్న పద్యంలో చక్కగా పదబోశాడు.

ఇంతవరకు నారదుడి మీద, కృష్ణుడి మీద విరుచుకుపడ్డ సత్య, ఇకమీదట సవతుల మీద దండయాత్రకు దిగుతుంది. "అయనేదో ఆ సమయానికి ఆమె ఇంట్లో ఉన్నాడు కాబట్టి ఆమె కివ్వడమే ధర్మమని ఆ పారిజాతాన్ని రుక్మిణికిచ్చి ఉంటాడు. ఇంతలోనే కొంపలు మునిగి పోయినట్టు ఈ సవతులకు ఏమి పోయేకాలం? సిగ్గూ, లజ్జా లేకుండా

ఆ రుక్మిణి ఇంటికి వెళ్ళి అభినందిడమే నాకు ఆశ్చర్యంగా ఉంది అని అనుకుంటుంది.

> "ఆ సరసీరుహాక్షి నిలయంబున బంకజ నాభుడుండుటం
> జేసి, యెనంగెటో తగువు సేకొని, యొక్క లతాంత మింతలో
> వాసియు వన్నెయుం దగవు వైభవమున్ జలమున్ వివేకమున్,
> బో, వవతుల్భజించుటకు బో వెఱుగయ్యెడు నేమి సెప్పుదున్"
> (పారి. 1-92).

'మొగుడు తనని కొడితే కొట్టాడుగాని, తోడి కోడళ్లు చూశారే! అదే నా బాధ' అని అందట వెనుకటికి ఒకావిడ. అలాగుంది సత్యవని!

ఎల్లకాలమూ ఒకేవిధంగా బుద్ధిగా ఉండే భర్తలభించడం పూర్వ జన్మసుకృతమట.

> "కలకాల మొక్కగతి పూ
> నలలో దారంబు మాడ్కి నతిమదిలోనన్
> మెలగెడి పురుషుడు కలుగుట,
> తొలి జన్మము నోము ఫలము తోయజనేత్రా!"
> (పారి. 1-93).

ఓ చెలీ! అయన కలలోనైనా, నవ్వులాటకైనా నా మాట జవదాటి ఎరుగడు. ఏది తెచ్చినా నా ముందు పెట్టకుండా ఎవ్వరికీ ఇచ్చేవాడు కాదు. చెలికత్తెలు నాతో ఏమైనా చాడీలు చెబుతారేమోనని వాళ్లకి లంచాలు ఇచ్చేవాడు. తోటి సవతులు నాతో సమానంగా రావటం సహించేవాడు కాదు. అరమరికలు లేకుండా, కపటం లేకుండా ప్రేమతో మెలిగ్గిన భర్త ఇలా చేస్తాడా?

> "కలలోనైన నవ్వులకైన నామాట జవదాట వెరచునో చంద్రవదన!
> యేవదార్థంబు నాయెదుట బెట్టకమున్న యెవ్వారికొనగడో యిగురుబోడి!
> చెలులు నాతో నేమి చెప్పుదురో యని లంచంబు లిచ్చునో చంచలాక్షి!
> తోడి చేడియలు నాతోడి వంతులకు, రా నయిరింవ జాలడో నన్నుతాంగి!

"యరమరలు లేని కూరిమి ననగి పెనగి
కొదలు తీరని కోర్కుల గూడి మాడి
కపట మెరుగని మమతల కలసి మెలసి
యున్న విభుడిట్లు సేయునే, యోలతాంగి"
(పారి.1-94).

రుక్మిణీ మాయలో పడి నాతో ఆడిన ఆటలన్నీ మరచిపోయాడు. భర్త ప్రాణంతో సమానంవంటివాడు. అతడే దైవం. రక్షకుడు. అలాంటి భర్త తన పరిధులు దాటితే ఇక కులకాంతలకు వేరేగతి ఏముంటుంది?

"పతి ప్రాణ సదృశ బంధువు,
పతి దైవం బిదు గరయు, బతి సతులకు, న
ప్పతియ కడుమీర దప్పిన్
గతి కులకాంతలకు వెలుగలదే? చెపుమా!"
(పారి. 1-96).

తన భర్త తనకు ధనమిచ్చి మళ్లీ వెనక్కి తీసుకున్నా ఓర్చుకోవచ్చు. కాని మనసిచ్చి వెనక్కి తీసుకుంటే ఇక ఎలా బతకాలి?

"ధనమిచ్చి పుచ్చుకొన్నను
మనమున నోర్వంగ వచ్చు, మగడింతులకున్
చనవిచ్చి పుచ్చుకొన్నను
మనవచ్చునె, యింక నేటి మాటలు చెలియా?"
(పారి. 1-97).

అని పొంగివస్తున్న దుఃఖంతో తన కోపగృహానికి వెళ్ళింది. ఆ రోజుల్లో అంతఃపురస్త్రీలు భర్తమీద కోపగించుకున్నప్పుడు ఉండడానికి ప్రత్యేకించి కోపగృహాలు ఉండేవి. అందులో ఉన్నప్పుడు అలంకారాలు లేకుండా, మాసి పోయిన చీరకట్టుకుని, మౌనంగా తలకు బట్టకట్టుకుని, వెడల్పైన కస్తూరి బొట్టు పెట్టుకుని, చీకటింట్లో చివరి మంచం మీద మబ్బుల మాటున దాగిన చంద్రరేఖలాగా బాధతో పొర్లుతుందట (పారి. 1-99).

ఇంకా మాటి మాటికీ కన్నులు మూస్తుంది, తెరుస్తుంది. తనంతట తానే నవ్వుకుంటుంది. ఉస్సురుమని పరుపు మీద పడుతుంది, లేస్తుంది. తడబడుతుంది. ఈర్ష్య, వగ, కోపం పెనవేసుకోగా, విరహావేదనకు లోనై, మదపుటేనుగు తొండానికి చిక్కిన తామరతూడులాగా, మన్మథ బాధతుల్లోనై, అన్ని పనుల్ని వదిలేస్తుంది.

*నిగమశర్మ అక్క* :- నిగమశర్మ అనే బ్రాహ్మణుడు మంచి ఆచారవంతమైన వంశంలో పుట్టికూడా చెడు తిరుగుళ్లకు అలవాటు పడి తన ఇంటిని గుల్ల చేస్తాడు. ఈ విషయం తెలుసుకుని కాపురానికి వెళ్ళిన అతని అక్క బాధపడుతుంది. తమ్ముడి కాపురాన్ని చక్కదిద్దడానికి తన భర్త, పిల్లలతో పాటు పుట్టిల్లు చేరుతుంది. కొడుకు చెడు నడతకు కుంగిపోతున్న ముసలి తల్లిదండ్రుల్ని ఓదార్చి, ధైర్యం చెబుతుంది. తన తల్లి దాచిన డబ్బుతో కుంటుపడిన ఇంటి కార్యక్రమాల్ని మునుపటిలాగా సాగిస్తుంది. చిందర వందరైన గ్రంథాలయాన్ని తన భర్త చేత చక్కగా సర్దిస్తుంది. సరుకులన్నీ నిండుకున్న ఇంట్లో కావాల్సినవన్నీ తెప్పిస్తుంది. ఇంట్లో యథాపూర్వంగా చదువు సంధ్యలు సాగేటట్లు చేస్తుంది. తన తమ్ముడి దుర్వ్యసనాల గురించి ఇంకా రాజుకు తెలియకపోవడంతో తమ చేయి దాటిపోకుండా ఉన్న గ్రామాల పరిధిలోని మడీమన్యాలు, చెట్టుచేమల్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకుని వాటికి తమ మనుషుల్ని కాపు పెట్టిస్తుంది. ఎంతో గుట్టుగా నడచుకుంటూ, అత్తమామల్ని భక్తిశ్రద్ధలతో చూసుకుంటున్న, నవయవ్వని అయిన తన మరదల్ని చూసి ఎంతో బాధపడుతుంది.

ఇంతలో తమ్ముడు ఎక్కడ నుంచో ఊడిపడటం, చేసిన తప్పుకు సిగ్గుతో తలవంచుకున్న అతన్ని చేరదీసి, చెడిపోయిన అతన్ని లోలోపల అసహ్యించుకుంటూనే వాణ్ణి సంస్కరించాలనుకుని, వెంట్రుకల చిక్కుతీసి, 'సీమంతపు పెళ్ళికొడుకువు కమ్మని ఆశీర్వదించింది. ఎక్కడికి వెళ్ళకు. మీ బావగారితో పాటు

భోంచేద్దువు గాని, నిమిషంలో వంట సిద్ధం చేస్తానని చెప్పి వెళ్ళి, వెనుక చాటున నిలబడిన తన మరదలికి కనుసైగ చేసింది. దానితో ఆమె భర్తను సమీపించింది (పాండు. 3-24).

నిగమశర్మ అక్క అతనికిష్టమైన వంటలు సిద్ధం చేయించింది. స్నానం చేయించి, మంచి బట్టల్ని అందించింది. వెంట్రుకల ముడి విప్పి చిక్కుదీసి, పేలు చూసింది. చేతులు కడుక్కుని మరదలు వినయంగా విసురుతుండగా తాను చంటి బిడ్డకు పాలిస్తూ, తమ్ముడితో ఏరా! తమ్ముడా! ఇన్నాళ్ళైనా నన్ను చూడడానికి రాలేదు. వేద పాఠాలకు అంతరాయమవుతుందనా యేమి? నీ కోసం ఎదురు చూసి కన్నులు కాయలుగాసిపోయాయి. మీ బావగారు కూడా నువ్వు వస్తావని ఎదురు చూశారు.

> "ప్రారంభించిన వేదపాఠములకున్ ప్రత్యూహమౌ నంచునో,
> యేరా!తమ్ముడ!నన్ను జూడ చనుదే వెన్నాళ్ళనోయుండి, చ
> క్షూరా జీవ యుగంబు వాచె, నిను గనోకున్కి మీ బావయున్
> నీరాకల్ మదిగోరు, చంద్రు పొడువునీ నీరాకరంబున్ బలెన్"
>
> (పాండు. 3-33).

ఇంటి మర్యాదకు తగినట్లు నడచుకోవాలిగాని, ఇలా అడ్డమైన తిరుగుళ్ళు తిరుగవచ్చా? నేనా, కాపురానికి వెళ్ళాను. మిగిలినవాళ్ళు చిన్నపిల్లలు. పెద్దవాడివైన నువ్వే ఇలా అయితే, నీ అండకోరే ముసలి తల్లిదండ్రులు ఏమవుతారో ఊహించుకో!

> "ఏ నమ్ముడు గడవ, భవ
> త్సూనులు కనుగందు లగ్రజుండవు నీవి
> ట్లైన తతివెంత దుఃఖమొ
> యీ వీ ప్రోపొన వడెదు నీగురువులకున్"
>
> (పాం. 3-35).

మన వంశమెంత గొప్ప చరిత్ర కలదో! తలంచవైతివి. వృద్ధులైన తల్లిదండ్రుల్ని సంతోషపెట్టవైతివి. అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యనోల్లవైతివి. ధర్మశాస్త్రాదుల ద్వారా పేరు ప్రతిష్ఠలు పొందవైతివి.

శీలం, చదువు వదలి, నీతోటివాళ్లు అవహేళన చేసేటట్లు తయారయితివి. నీకెందుకీ పాడుబుద్ధి?

"పరమేష్ఠి నుండి నీ తరముదాక విశుద్ధతరమైన వంశంబు దలచవైతి;
దరిద్రాక్కియున్న యీ తల్లిదండ్రుల జాల వంచవై నంతో షవరచవైతి;
వగ్ని సాక్షిగ బెండ్లియాడిన యిల్లాలినిల్లాలితాకార నొల్లవైతి;
ధర్మశాస్త్రార్థ విత్తముల విత్తములచే నలరించి విఖ్యాతి నందనైతి;

శీలమఖిలంబు నిదిపిల్లి శీలమనుచు
చదువులన్నియు నివి చిల్క చదువులనుచు
దోడి వారలు నవ్వ నాతోడ! యేల
బేలవైతివి యీగుణంబేల నీకు?"
(పాండు. 3-36).

ముసలివాళ్లైన తల్లిదండ్రులు, పసిపిల్లలు, అమాయకురాలైన భార్య, ఆవులు, పని మనుమలతో కూడుకున్న ఈ సంసారాన్ని నీవు భరించ వలసిందే.9 నా తమ్ముడు శాస్త్ర విద్యలలో ఆరితేరి ధర్మమార్గ విషయంలో బ్రహ్మాదుల్ని మెప్పిస్తాడని, అతను చేసే యజ్ఞాలలో నేను పూజ్యురాలనై వేదికనలంకరిస్తానని, నలుగురి ముందు చెప్పుకునేదాన్ని. నువ్వు మాత్రం ఏమీ చేయకున్నావు. ఇంత పనికిమాలినవాడివి అవుతావని కలలో కూడా అనుకోలేదు.

"నాదు నహోదరుండు సుజన స్తవనీయ నయప్రవసక్తి, బ్ర
హ్మాదుల మెచ్చుడే, నతని యజ్ఞమునంగడు పూజ్యురాలనై,
వేదియలంకరింతునని వేవురి ముందర నాడుకొందు, నీ
వేదియు లేక నర్వగుణ హీనుడ వౌట యెఱుంగ దమ్ముడా!"
(పాండు. 3-39).

డబ్బు ఖర్చు పెట్టాలనిపిస్తే పెట్టుకో. అంతమాత్రానికే మూడుకార్లు పరిపంట పండే భూమిని తెగనమ్మవచ్చునా? భార్యాబిడ్డలు, వెనుకా ముందు ఎవరూ లేని వాడివా? ఇలా చేయడం నీకు న్యాయమా?

9. పాండు. 3-38.

"వీరావేశము దాల్చి సర్వధనముల్ వెచ్చింతు గాకేమి, ము
క్కారుం బండు నఖండ సేతువృతముల్ కాశ్మీర ఖండంవు, గే
దారంబుల్ తెగనమ్మగా జనునె? నిర్ధారుండవే? వెన్క, నె
వ్వారుల్ లేరె? సహోదరాదులు, కులధ్వంసంబు నీకర్హమే?"

(పాండు. 3-40).

నీకు మనసైతే మన కులం కన్యల్ని ఎంతమందినైనా పెళ్ళాడొచ్చు. సంసారులేమైనా మునులా? బ్రహ్మచర్యం పాటించడానికి. అలా కాకుండా వేశ్యా సం॰ ర్గం మంచిదా? వారి పొందు పెట్టుకున్న పెద్దపెద్ద వాళ్ళే తట్టుకోలేరు.

"కామ వికార మాత్మ నవ గాఢత దాల్చినయేని, నిర్భర
శ్రీ మెరయంగ రూపగుణశీలకులోన్నతి గల్గు విప్ర క
న్యామణులన్ సహస్రమయినన్ వరియించి రమింపరాదె, యే
మీ, మునులే గృహస్థులు? రమించుట యొగ్గె కులాంగనా తతిన్?"

(పాండు.3-41).

ఇలా ఆమె నిగమశర్మను బాగువరచడానికి, అతని మనసు మార్చడానికి శతవిధాల ప్రయత్నిస్తుంది. తమ్ముడి మనసు నొచ్చుకోకుండా ఒకసారి అతను చేసినవన్నీ తప్పేమీ కాదని అంటూనే, మరోసారి ఇలా చేయొచ్చా? అని అనునయిస్తూ, అతని ముందు సంసార బరువు బాధ్యతల్ని విప్పిచెప్పి కర్తవ్యాన్ని ఉపదేశిస్తుంది. అడపడుచుగా స్త్రీ మనస్తత్వాన్ని లోతుగా దిగి వర్ణించడమైంది.

*తల్లిగా స్త్రీలు* :- స్త్రీల మనస్సు ప్రకృతి సిద్ధంగా కరుణరసపూరితం. మాతృత్వానికి వాళ్ళు సార్థక జీవులు. ఎంత గొప్ప వ్యక్తులైనా ఒక తల్లికి బిడ్డలే! ఆ చల్లని తల్లి, చేత జోల, నోటి పాట, వెచ్చని ఒడి, కంటికి రెప్పలా చేసే సపర్యలకు పులకించిపోని జన్మ, జన్మే కాదు. ప్రళయకాలంలో శిశువుగా ఉన్న శ్రీహరిని వైకుంఠపుర స్త్రీలు తెచ్చి, అతనికి శిశోపచారాలు చేయటం సామాన్య స్త్రీల లాగా పాండురంగ మహాత్మ్యంలో సహజంగా చిత్రించబడింది.

సముద్రం నుంచి వీచే చల్ల గాలి ఆ శిశువు ఒంటికి తాకిందని వాళ్ల ఎదకు వెచ్చగా హత్తుకున్నారు. ఆ వటపత్రశాయికి పాత మర్రాకు వత్తుకుంటుందని మెత్తని గుడ్డలు పరచారు. కారుచీకటిలో ఉండి, భయపడ్డాడని పుల్లవిరిచి దిష్టి తీశారు. కన్నులు తెరవని ఈ నెత్తురు కందు ఎవ్వరి వాడో. వరదనీటిలో కొట్టుకుని వచ్చాడని జాలితో ఆ బిడ్డను వైకుంఠ పుర సతులు పెంచసాగారట.

> "జలధి వీచీ వాత్య జలిదాకెగాయని యక్కున నందంద యలమియలమి,
> ప్రామజీ యాకొత్తి రాయిడి బొందెగా యని నన్నపొత్తుల నునిచి యునిచి
> వాపోయి వాపోయి వసివాడి యాకట బెగడెగాయని, యుగ్గు పెట్టిపెట్టి
> పెన్జీకటులు గ్రమ్మ పెన్బైటవసియించి వెఱచెగాయని పుల్లవిరిచివిరిచి
>
> మంచి లక్షణములు పుట్టు మచ్చవాడు
> నేత్రములు విప్పనట్టి యీ నెత్రుగందు,
> వరద నీతెంచ, నెవ్వారివాడొ యనుచు,
> విలయ హారిదెచ్చి పెనుతు రప్పిట సతులు"
>
> (పాండు. 3-156).

*విశ్వాసాలు* :- విశ్వాసం, నమ్మకం, ఆచారం, సాంప్రదాయం, ఆనవాయితీ మొదలైన పదాల్ని ఇంచుమించు ఒకే అర్థంలో వాడుతుంటాం. ఇవి అనేక రకాలుగా ఉంటాయి. శాస్త్ర రీత్యా కొన్ని, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొన్ని, ఒక వర్గీయుల్ని తమ ఆధీనంలో పెట్టుకోవడం కోసం కొన్ని, పరిపాలకులకు లొంగి ఉండడానికి కొన్ని ఇలా ఏదో ఒక ఉద్దేశంతో మొదట్లో ఈ విశ్వాసాలు ఏర్పడి ఉంటాయి. అర్థరహితమైనవేవీ ఉండవు. కాకపోతే వాటికి మతం రంగు పులమబడి ఉంటుంది. ఈ విశ్వాసాలు దేశ కాల పరిస్థితులకు లోబడి కొన్ని, వాటికి అతీతంగా కొన్ని ఏర్పడి ఉంటాయి. ఈ రెండోరకం విశ్వాసాలు సర్వ కాల, సర్వ ప్రాంతాల్లో సజీవంగా ఉండగలవు. ఇక మొదటి రకానికి చెందినవి ఆయా దేశానికి, ఆయా కాలానికి, ఆయా పరిస్థితులకు పరిమితమై ఉంటాయి. తద్భిన్నమైన చోట్ల ఇవి మూఢాచారాలుగా ఉపేక్షించబడుతూ

ఉంటాయి. ఇన్ని దృక్కోణాల నుంచి పరిశీలించినప్పుడు ప్రతి విశ్వాసానికి వెనుక దాగి ఉన్న కారణమేదో తెలుసుకోవచ్చు.

*జ్యోతిషం* :- జ్యోతిషం ఒక శాస్త్రం. గ్రహగతులకు, భూమి మీద జీవరాశులకు ఉన్న సంబంధాన్ని, ప్రభావాన్ని ఇది తెలియజేస్తుంది. సూర్యుడు మేషాది పన్నెండు రాశుల్లో ఒక్కొక్క దానిలోకి ఒకనెలలో ప్రవేశిస్తాడు. ఈ విధంగానే కాల (ఋతు) నిర్ణయం చేయడం జరుగుతుంది. వర్షాకాలం ప్రారంభంలో సూర్యుడు కర్కాటకరాశిలో ప్రవేశిస్తాడట (ఆము. 4-76).

పుట్టిన నక్షత్రాన్ని బట్టి ఒక వ్యక్తికి పేరు పెట్టడం జరుగుతుంది. ఆ పేరులోని మొదటి అక్షరాన్ని బట్టి రాశిని నిర్ణయిస్తారు. అలా జన్మరాశి తర్వాతి మూడో రాశిలో సూర్యుడు ప్రవేశిస్తే అది వాళ్లకి ఆనందాన్ని కలిగిస్తుందట (ఆము. 4-77).

*శకునాలు* :- సూర్య గమనాన్ని బట్టి, వాళ్ల వాళ్ల నక్షత్రరాశుల్ని బట్టి వాళ్లకి జరుగబోయే శుభాశుభాల్ని తెలుసుకోవచ్చు. ఈ విషయాల్ని అంటే జరుగబోయే విషయాల్ని ఎరుకత (ఎరుకలసాని) చెప్పగలదు. దీన్నే 'సోది' చెప్పడం అంటారు. ఇలాగే గుడ్లగూబ, దబ్బగాటి, కనుంబెంటి, గబ్బులుగు మొదలైన పక్షులు, బల్లి కూడా తమ తమ అరుపులతో తెలియజేస్తాయట (ఆము. 6-66).

ఆడవాళ్లకి కుడిభుజం, కుడికన్ను, కుడిచూచుకం అదిరితే అశుభం కలుగుతుందట. ఎడమవైపు అదిరితే శుభం కలుగుతుందట. దీనికి వ్యతిరేకంగా పురుషులకు జరుగుతుందట. కృష్ణుడు తనకు నారదుడిచ్చిన పారిజాత పుష్పాన్ని రుక్మిణీదేవికి ఇచ్చే సమయంలో సత్యభామకు పైన చెప్పినట్లు జరిగిందట. దాన్ని బట్టి ఆమె తనకేదో కీడు జరుగబోతోందని, తన భర్త ఇంకో స్త్రీ మీద ప్రేమలో పడి తనను తిరస్కరించే పనేదో చేసి ఉంటాడనుకుంది.

"అకట!యదేమియో యెరుగనయ్యెద, త్రొయ్యలి, దక్షిణాంగ, చూ
చుక నయన ప్రకంప గుణ సూచన లేమియు వల్లగావు, సా
రెకు మది జాలినొందె యొకరీతి దలంకెదు, ప్రాణనాథు, డొం
డొక చపలాక్షి గూడి నను నొల్లని చెయ్యములేమి సేసెనో!"
(పారి.1-73).

*కలలు* :- కలలో కొన్ని జంతువులు కనబడితే మంచి జరుగుతుందని, కొన్ని జంతువులు కనబడితే చెడు జరుగుతుందని భావిస్తారు. కోతి కనబడితే చెడు జరుగుతుందట.10

*దిష్టితీయడం* :- కొంతమంది చూపు చాలా తీక్షణంగా ఉంటుందట. వాళ్ల చూపు ఎవరిమీద పడుతుందో, వాళ్లకి శరీరం పట్టుకోల్పోయి, రకరకాల వేదనలకు గురవుతుందట. దీన్నే దిష్టి (దృష్టి) తగిలిందంటారు. ఇది తగలకుండా ఉండడానికి నొసటి మీద చుక్కబొట్టు (తిరుమణి) పెట్టుకుంటారట. శుభ సందర్భాల్లో చక్కగా ముస్తాబైన వధూవరులకు బుగ్గల పైన నల్లని చుక్కను పెడతారు. దీన్నే 'దిష్టిచుక్క' అంటారు. ఇది పెడితే ఇక ఎలాంటి వాళ్ల చూపు పడినా ఏమీ కాదని వాళ్ల నమ్మకం. ఇలా తగిలిన దిష్టిని తీయడానికి అనేక పద్ధతులు ఉన్నాయి. గుడ్డపేలికల్ని నూనెలో తడిపి, వెలిగించి ముఖం చుట్టూ తిప్పుతారు. అప్పుడందులో నుంచి నీటి చుక్కలు బొటబొట రాలుతాయి. అవుడా వ్యక్తికి తేలిక అయినట్లు అవుతుందట. ఎండు మిరపకాయలను ముఖం చుట్టూ తిప్పి వాటిని అగ్గిలో పడవేస్తే, అవి ఏ మాత్రమూ ఘాటు రావు. ఇలా ఎన్నో విధాలున్నాయి.

అందులో ఒకటి పళ్లెంనిండా అన్నం పెట్టి, దానిపైన జ్యోతిని వెలిగించి, దిష్టి తగిలిన వారి ముఖం చుట్టూ తిప్పి, ఆ అన్నాన్ని పిశాచాదులకు ఆహారంగా,వేయడం. దిష్టితగిలిన గిరికకు చెలికత్తెలు 'తెల్లతామరలనెడి పళ్లెంలో పూలు అనే అన్నం రాశిని పేర్చి, దాని పైన

10. అము. 5-87.

ఎర్రకలువ అనే జ్యోతినుంచి ఆమె ముఖం చుట్టూ తిప్పి దిగదుడిచి, దాన్ని అదృశ్యులైన పిశాచాదులకు ఆహారంగా వేశారట.

> "అని చెలులెల్ల దూరి, ధవళాంబుజ భాజనరాజితావళిం
> చిన కుసుమాన్న రాశివయి, చక్కని చెందొవ జ్యోతినిల్పి, య
> వ్వనితకు చుట్టురాబసి, వైచి సుగంధ పలాశవాటి, బా
> యని యశరీరి బంటులకు నామిత జేసిరనేక భంగులన్"
>
> (వసు. 3-125)

*ప్రమాణంచేయించడం* :- తీర్పు చెప్పే సమయాల్లో నిజం చెప్పించడానికి మన ప్రాచీనులు అలవరుచుకున్న ఒక విధానం ప్రమాణం చేయించడం. దైవచింతన, పాపభీతి కలిగిన ఆ రోజుల్లో ఈ విధానం ఫలవంతమైంది. కాని తద్భిన్నమైన ఈ రోజుల్లో ఇది విలువ కోల్పోయింది. కోర్టుల్లో నేడు ఆయా మతగ్రంథాల మీద ప్రమాణం చేయిస్తున్నా, అబద్ధాలు, దొంగ సాక్ష్యాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రాచీనులు వ్యాజ్యాల్లో సత్యాంశాన్ని ఋజువు చేసేటప్పుడు న్యాయాధికారుల సమక్షంలోను, దైవ సాన్నిధ్యంలోను, ముద్దాయిలు నీళ్ళలో మునిగి, తడిబట్టలతో తాను చెప్పేది నిజమని చెప్పాల్సి ఉంటుంది. దేవుని గుడిలో దీపాన్ని ఆర్పాల్సి ఉంటుంది. ఈ విధానం ఇప్పటికీ కొన్ని మారుమూల ప్రాంతాల్లో కొనసాగుతోంది.

ఒక వనిత ఎంతోసేపు స్నానం చేస్తోందట. స్వరోచి ఊరేగింపుగా వస్తున్నారని తెలిసింది. వెంటనే తడిబట్టలతోనే అలాగే వచ్చి ఆయన్ని చూస్తోందట. తడి లంగా ఆమె తొడలకు అంటుకుని ఉంది. మెత్తని బట్టను ఒక చేత్తో కప్పుకుని, ఇంకో చేతిలో నీళ్లు కారుతున్న వెంట్రుకల (జుట్టు)ను సవరించి పట్టుకున్నదట. అది చూడడానికి ఆమె ప్రమాణం చేయడానికి వచ్చి నిలబడినట్లుందట.

"జిలుగుల బెట్టుచుం దొరల జెంద్రిక పావడయంట మెతడిం
బెళపెళలేని చీరగటి బింకపు జన్నుల జేర్చికొంచు, వే
జలకము లాడి యారయొక దాన కరస్థిత కేశయై నృపు
న్వెలువడి చూచె లోపడితి నీకని దానకు నిచ్చెనో యనన్"
(మను. 5-68).

*అంజనం* :- పూర్వకాలంలో అపారమైన ధనాన్ని దొంగల బారిన పడకుండా గోతిలో పూడ్చి దాచుకునేవాళ్లు. అనుకోని పరిస్థితుల్లో ఆ వ్యక్తులు మరణించినప్పుడు ఇక ఆ ధనం అలాగే మరుగున పడిపోయేది. అటువంటి ధనరాశుల్నే, 'నిధుల'ని, 'నిక్షేపాల'ని అంటారు. వాటిని భూత, పిశాచాలు కావలా కాస్తుంటాయని, వాటినే 'ధనపిశాచుల'ని అనేవాళ్లు. అలాంటి నిధులు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకునే విధానాన్నే 'అంజనం' వేయడం అంటారు. ఆ నిధి సాధకుడు కొన్ని మూలికలతోను, రసంతోను చేసిన కాటుకను కంటికి పెట్టుకుని, నిధి ఉండే స్థలాన్ని కనిపెడతాడు. దానికి కాచుకుని ఉండే భూత, పిశాచాలు తనను బాధించకుండా నెత్తురు కలిసిన అన్నాన్ని తూర్పువైపున బలిగా వేస్తారట. ఆ నిధికి ఏదో ఒక చెట్టును గుర్తుగా పెట్టుకుని, ఆ స్థలాన్ని గుర్తించి, అక్కడ త్రవ్వి, నిధిని పైకి తీస్తారట. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మనుచరిత్రకారుడు చంద్రోదయాన్ని ఇలా చిత్రించాడు.

"మన్మథుడి కోసం కాలమనే నిధి సాధకుడు చీకటి అనే కాటుక పెట్టుకుని, సంధ్యారుణకాంతి అనే విరహుల రక్తంతో తడిసిన నక్షత్రాలనే అన్నాన్ని తూర్పువైపున భూత బలిగా చల్లి, చంద్రుడిలోని మచ్చ అనే మర్రిచెట్టును గుర్తుగా పెట్టుకుని, చంద్రుడనే నిధిని పైకి తీస్తున్నాడేమో"! అనేటట్లు చంద్రుడు పైకి వచ్చాడట.

"మరున కొనంగ కాలము తమశ్చట కాటుకగా నవోదయ
స్ఫురదరుణ ప్రభా పథిక శోణిత సిక్త సితోరు భుక్తమున్
హరిహయ దిఙ్నిధ స్థలమునన్ బలిచల్లి వటాంకమున్ వనా
త్కర భరితంబు పై వెలుగ గాంచి సుధానిధి నెత్తె, నత్తరిన్"
(మను. 3-21).

*పెద్దవాళ్ళను ఇంటికి ఆహ్వానించడానికి కానుకలిచ్చేవాళ్లు* :- పెద్దవాళ్ల దగ్గరకు, దేవుని దగ్గరకు, ముత్తైదువుల దగ్గరకు వట్టి చేతులతో పోకూడదనేది సామాన్య ధర్మం. అలాగే దారిన పోయే పెద్దవాళ్లని తమ ఇంటకి ఆహ్వానించడానికి తమ చేతుల్లో కానుకలు పట్టుకుని తమ ఇంటిముందు నిలబడేవాళ్లు. ఆ పెద్దలు వాళ్ల ఆహ్వానాన్ని మన్నించేవాళ్లు. విష్ణుచిత్తుణ్ణి సాగనంపడానికి వచ్చిన రాజులు తిరిగి వెళ్తూ, ఆ గ్రామంలో తమని ఆహ్వానించడానికి కానుకలతో నిలబడినవాళ్ల ఇంట్లో ఆ రాత్రి విడిది చేశారట.

> "ఉలుపాల్పట్టిన యింద్ల మజ్జన నృపాహ్వోదార భుక్తి క్రియో
> జ్జ్వలులై, రేపరి కొల్వునన్ వివిధ లాభవ్యక్తి నుబ్రూభ్రుకుం
> నుల వాదుల్సారి దేర్చి వుచ్చి, మణివాసోభూషణ గ్రామమున్
> జలజాతాక్షునకున్ సమర్పణము నిష్ఠం జేసి, యవ్వీటికున్"
>
> (ఆము. 4-36)

*స్త్రీల ధనం మీద జీవించేవాళ్లకి ఇహపరాలు లేవు* :- ధీరులైనవాళ్లు స్త్రీల సొమ్మును ఎటువంటి పరిస్థితిలోను వాడుకోడానికి ఇష్టపడరు. ఆడపడుచులకు పుట్టింటి మీద అధికారం ఉండడం, అత్తవారింటి నుంచి వాళ్లకి కన్యాశుల్కం లభించడం దీనికి నిదర్శనం. నీతి శాస్త్రంలోనే స్త్రీధనం తీసుకోడం దోషమని చెప్పబడింది. ("ఉత్తమం స్వార్జితం విత్తం, మధ్యమం పితురార్జితం, అధమం భాతృ విత్తంచ, స్త్రీ విత్త మమ మాధమం" అని నీతిశాస్త్రం. ముగ్గురు భార్యలతో ఉన్న స్వరోచిని చూసి, మగలేడి ఆడలేళ్ళతో "బరువనుకోకుండా వీడు భోగలాలసుడై ఇంతమందిని చేసుకున్నాడే తప్ప, వీడికి వీళ్ల మీద నిజమైన ప్రేమలేదు. అందుకు కావాల్సిన ధనం కూడా వాళ్ల మూలానే లభిస్తుంది. అలా స్త్రీ ధనంతో జీవించే వీడికి ఇహపరాలు రెండూ లేవు" అని అంటుంది.

"బరువన కింతులందనకు బల్ల్వుర గూర్చుట భోగవాంఛగా
కరయగ నొండుగాదు, ధనమున్న ధ్రువంబుగ నంగనాజనో
త్కర నముపార్జితంబటుల గాపున వీనికి లేదిహంబునుం
బరమును నన్నునట్ల పరువంబని లేదిది చెప్పనేటికిన్"
(మను. 6-80).

*సుఖప్రసవానికి వేదభాగాలైన అరణ్యకాలు చదివేవాళ్లు* :- చదువును సరస్వతీదేవి ప్రతిరూపంగా భావించే ఆరోజుల్లో, ఆయా సందర్భాలను బట్టి ఆయా గ్రంథాలను పఠించేవారు. వర్షం కురవకపోతే విరాటపర్వాన్ని, కష్టాల నుంచి గట్టెక్కడానికి గజేంద్రమోక్ష కథను, ఇంట్లో పీడ తొలగడానికి నలచరిత్రను చదివించేవాళ్లు. భారత స్త్రీ పర్వాన్ని ఇళ్ళలో చదివేవాళ్లు కాదు. చదివితే పీడ కలుగుతుందని నమ్మేవాళ్లు. ఈ నమ్మకాలు నేటికీ రాయలసీమ వాసుల్లో కనబడతాయి. కొన్ని వేద భాగాల్ని అరణ్యకాలంటారు. వీటిని అరణ్యాలలో మాత్రమే చదివేవారట. కారణం వాటిని గర్భిణులు వింటే గర్భస్రావం కలుగుతుందట. మేఘాలు గర్జిస్తున్నాయి, నెమళ్ళు అరుస్తున్నాయి. మేఘగర్జన ఒక స్త్రీ ప్రసవవేదనకుగాను, నెమళ్ల అరుపులు బ్రాహ్మణులు పఠించే అరణ్యకాల ధ్వనిగాను, వర్షాన్ని సుఖప్రసవంగాను, చమత్కారంగా చెప్పబడింది.

"ఉర్వికాదంబినుల యల యుమ్మునీరు
దొరగ కేకులు కేకల తోన నేసె,
ద్విజత నారణ్యక ధ్వని వినగ జేసి
గర్భము సుఖచ్యుతము సేయ గడగె ననగ"
(ఆము. 4-79).

*తల్లిని పోలిన బిడ్డలకు ఆ తల్లి దుర్గుణాలు వస్తాయి* :- ఒక్కొక్క పూలమొక్క ఒక్కొక్క రకమైన దోహదక్రియచేత పుష్పిస్తుందని కవి సమయం. బొట్టుగుచెట్టు (తిలకం) స్త్రీలు చూడడం వల్ల, అశోక వృక్షం

కాలు మోపడంవల్ల, ప్రేంకణం (మంకెనతీగ) పాడడంవల్ల, కొండగోగు సంభాషించడంవల్ల, సంపంగి ముఖరాగం (మొగం ఎత్తుకోడం)వల్ల, పొగడచెట్టు ముఖ సీధువునించడంవల్ల, కోవిదారం మొక్క కౌగలించుకోవడంవల్ల, వావిలిచెట్టు చల్లని ముఖవాయువును కూర్చుడంవల్ల, పొన్నచెట్టు నవ్వడంవల్ల, మామిడిచెట్టు చేతితో తాకడంవల్ల పూలను ఇస్తాయట.11

ఈ మార్గాన్ని బట్టి సంపంగి స్త్రీల ముఖరాగ దర్శనంతో పుష్పిస్తుంది (ముఖరాగేణ చంపకః). ఒక స్త్రీ తన అందమైన ముఖం పైకి ఎత్తేసరికి ఆ సంపంగి చెట్టు పూలు పూసిందట. ఆ పూవులు సహజంగా పుట్టినవి కావు గదా! ఆమె ముఖచంద్రుని కూడికతో ఏర్పడినందున అవి సుధామయాలుగా ఉంటాయి కదా! అని, ఆశతో తుమ్మెదలు ఆ సంపంగి పూలపైన వాలడానికి పోగా, అవి మామూలు సంపంగి పూలలాగా ఆ తుమ్మెదల్ని పారదోలాయట (సహజంగా తుమ్మెదలకు సంపంగి వాసన గిట్టదట). ఆ పూలు తండ్రి అయిన ముఖచంద్రుడి గుణాలు కాకుండా, తల్లి అయిన సంపంగి చెట్టు గుణాలే పొందాయి. లోకంలో తల్లి పోలికలుఉన్నవారికి ఆ తల్లి దుర్గుణాలు కూడా సంప్రాప్తిస్తాయని కవి చమత్కరించారు.

> "అలులేతద్వదనేందు రాగ మిళనా ప్రాదుర్భవత్కోరకం
> బులు తేనెల్బొదలంచు రా, నొకతె నెమ్మోమెత్త, చైత్రంపు, పు
> వ్వులలో తద్గుణులయ్యె గంధఫలి పువ్వుల్పుట్టి పోదోలె, నా
> చ్ఛలఖైదై, తఱచెందు తల్లి బడికొల్చెట్టొటయే కా మహిన్"
>
> (ఆము. 5-132).

*ఏదు ముల్లున్న ఇంట్లో కలహాలు ఉంటాయి* :- ముళ్ల పందిని 'ఏదు' అంటారు. దీని ముళ్లు వాడిగా ఉంటాయి. వాటిని ఇంట్లో ఉంచుకున్నట్లయితే, నిత్యం ఆ ఇంట్లో ఏదో గొడవలు ఉంటాయట.

11. వసు. 3-148.

దీనికి ఉదాహరణగా గోదాదేవి విరహవర్ణనలో ఆమెకు రాత్రి అయ్యేటప్పటికి నిద్రపట్టకుండా మన్మథుడితో పోరాటమో! అనేటట్లు రాత్రులు గడిచేవట. రాత్రులు ఏదు ముల్లుల్లా అయి తనకు నిత్యం (మన్మథునితో) కలహాన్ని కలిగిస్తున్నాయట.

"ఎలసి యే ప్రొద్దు కనువొంద నీక మరుడు
కలహమున కంకికాడయి కాలుద్రవ్వ
పొందు బహుళక్షపా పరంపరలు వెడల
ఇంటిలో నేదుముల్లయ్యె నిందుముఖికి"
(ఆము. 5-84).

*మఱ్ఱుతీగ తొక్కితే దారి తప్పుతారు* :- 'మఱ్ఱుమాతంగి' అనేది ఒక తీగె. 'మరులు' అంటేనే మోహం. దానిలో పడినవారు విచక్షణా జ్ఞానం కోల్పోతారు. అలాగే ఈ తీగెను తొక్కినవాళ్లు ఏది సరైన దారో, ఏది కాదో తెలుసుకోలేరట. పిచ్చిగా తిరుగుతారట. మాలదాసరి ప్రతినిత్యం తెల్లవారుజామున లేచి అడవిలో శ్రీమన్నారాయణుడి గుడికి వెళ్ళి, అక్కడ దేవుణ్ణి 'మంగళకైశికి' రాగంలో స్తుతించి వచ్చేవాడు. అర్ధరాత్రి పిల్లిని చూసి కోడి అరిస్తే, అతను తెల్లవారిందనుకుని లేచి, గుడికి బయలుదేరాడు. దారిలో మఱ్ఱుతీగెను తొక్కాడు.

"మరులు తీగెమెట్టి యిరులన్న నోయని
యెరు తమిస్ర గాదువడి పొలంబు
లెల్ల తిరిగి తూర్పు దెల్ల నౌతరి నొక్క
శూన్య గహన వాటి జొచ్చి చనుచు"
(ఆము. 6-12).

*దొండపండు తిన్న వాళ్ళకి తెలివి తక్కువ* :- తలకిందు తపస్సు చేసినా, ఎంత ప్రయత్నించినా దొండపళ్లు తిన్న వాళ్లకి గ్రహణశక్తి అలవడదట (సద్యోబుద్ధి హారమ్ బింబమ్) అని శాస్త్రంలో కూడా ఈ విషయం చెప్పబడింది. గిరికతో చెలికత్తె ఇలా అంటుంది. ఓ చెలి! ఈ చిలుక నీలా ఛక్కగా మాట్లాడటం నేర్చుకోవాలని బాగా పండిన దానిమ్మపళ్లనే

అగ్నికి అధోముఖంగా తపస్సు చేస్తోంది. ఏమి చేసినా దొండపండు అనే ఆ చిలుకకు నీ వాగ్విలాసమెలా వస్తుంది? అనే,

"అలి నీలాలకో! కంటె! చిల్క భవదీయాలాప లీలాప్తి, నిం
పలరం గోరి విపక్వ దాడిమ తరువ్యాలంబి శాఖా ఫల
జ్వలనా వాఙ్ముఖమై తపంబు నవరింపన్ సాగె. నేలచ్చెడిన్
తలక్రిందైన నమాన వాగ్గ్రహణమేధాశక్తి బింబోష్ఠికిన్"
(వసు 3-143).

*శరదృతువులో పాటించే ఆచారాలు* :- ఈ ఋతువులోనే రాజులు యుద్ధసన్నాహాలు చేసేవాళ్లు. యుద్ధంలో అశ్వబలం చాలా ముఖ్యమైంది. రాజులు గుర్రాలకు మంగళహారతులిచ్చి రక్షణ కోనం వాటికి మూలికలు నింపిన రక్షతలను (తాయెత్తు) కడతారు. వానకాలంలో గురుకులాల్లో చదువుసాగదు. వానలు ఆగిపోయిన ఈ ఋతువులో మళ్లీ గురువుల ఇళ్లలో బాలురు పలకలు పట్టుకుని అక్షరాలు, గుణింతాలు నేర్చుకునే ఆర్భాటాలు ఎక్కువవుతాయి. ఎండిపోయిన అరిటాకులు మొదలైన వాటితో తోరణాలు కట్టి వాటికి నిప్పంటించి, అవి మండేటప్పుడు వాటి కింద దూరి పరుగెత్తేవాళ్లు. వీటినే 'చిచ్చురతోరణాలు' అనేవాళ్లు. అలా చేసినవాళ్లకి యమలోకంలో 'జ్వాలాతోరణాల' కింద దూరే భయముండదని విశ్వసి~-చేవాళ్లు. అలాంటి నమయంలో ఎక్కడ చూసినా విందు భోజనాలు ఏర్పరిచేవాళ్లు. ప్రజలు తలమునకలుగా కొత్త భోజన వంటకాలు తినేవాళ్లు.

"రక్ష కట్టిరి మహీరమణులశ్వములకు భూరి నీరాజన పూర్వకముగ,
ఫలక గ్రహణము చౌపదముల గరిమంబు బరగె బాలకులకు గురువులిండ్ల;
దుమికి చిచ్చర తోరణముల దూరినవారు దూరరైరి కృతాంతు తోరణములు;
భుజియించె ప్రజభుజాభోజనంబులు సిగబంటిగా తొలి క్రొత్త వంటకములు.
(పాండు. 4-44).

*ముత్తాతపండు తినడం* :- మూడు తరాల తాటిపండ్లు తినడం, అనగా చాలా కాలం జీవించడం (మూడు+తాటిపళ్లు= ముత్తాటిపళ్లు). ఒక

తాటిపండును తిని, దానిలోని టెంకను పాతిపెడితే, అది వృక్షమై ఫలిస్తుంది. ఆ పండును తిని దాని విత్తుని నాటితే అది వృక్షమై ఫలిస్తుంది. ఇలా మూడు తరాల తాటిచెట్ల ఫలాన్ని తినాలంటే చాలాకాలం పడుతుంది. అసలే తాటిచెట్టు ఆలస్యంగా పళ్లనిచ్చేది. సుశీల తన భర్తతో కలిసి ముత్తాతిపండును తినిందట. అంటే ముత్తైదువగా దీర్ఘకాలం జీవించిందని.

"అఖిల కల్యాణ గుణశీల యా సుశీల
పెట్టె, చే మీదుగా నెల్ల చుట్టములకు
భర్తతో గూడ ముత్తాతిపండు తినియె
నెత్తముని మన్మ గుణ్ణల నెందరేని"
(పాండు. 4-267).

*మరణించిన తల్లిదండ్రులకు చేసే శ్రాద్ధకర్మలు* :- మరణించిన తల్లిదండ్రుల అస్తికల భస్మాన్ని పవిత్రగంగలో కలిపేవారు. అలాగే వారికి పిండాలను గయలో పెట్టేవారు.

"పరలోకావాప్త సుఖా
దరపరతంజనిన తల్లిదండ్రుల కొనగెన్
గురుభక్తి నిగుడ కొడుకతి
కరుణామతి గంగనస్థి, గయ పిండంబున్"
(పాండు. 2-26).

హవ్యాల (దైవపూజలు) కంటే, కవ్యాలే (పితృదేవులకర్పించాల్సిన శ్రాద్ధ కర్మలే) సూక్ష్మధర్మాలట. యజ్ఞం చేయకున్నా ఎవరూ ఏమనరట. కాని తద్దినం మానితే వాణ్ణి ఆచారవంతులు ఇంట్లోకి రానీయరట. ఈ విషయమై యామనుడు తన కుమారుడికి ఇలా బోధిస్తాడు.

"పితృదేవ క్రియలను విధి
పితృక్రియలె సూక్ష్మలగుట పితృ భక్తుడవై
శ్రుతి శీల తపశ్శాంతా
చ్యుత భక్తుల కొనగి పనుపు మున్నత గతికిన్"
(ఆము. 4-275).

# ముగింపు

'పంచకావ్యాల్లో జన జీవనం-ఒక పరిశీలన' అనే ఈ సిద్ధాంత వ్యాసంలో సాహిత్యం-సమాజం-వాటి పరస్పర సంబంధాల గురించి సహేతుకంగా చర్చించడమైంది. అనేకమంది ప్రాచ్య, పాశ్చాత్య పండితుల అభిప్రాయాల్ని పొందుపరచడమైంది. పంచకావ్యాలని తెలుగులో ఏయే కావ్యాలను అంటారు? అందుకు పండితుల్లో చోటుచేసుకున్న ప్రామాణిక అంశాలేమిటి? ఏతదనుగుణమైన రచనలుగా అనేకులు అంగీకరించిన గ్రంథాలేమిటి? అని చర్చించి, పంచకావ్యాలుగా 1. ఆముక్తమాల్యద, 2. మనుచరిత్ర, 3. పారిజాతాపహరణం, 4. వసుచరిత్ర, 5. పాండురంగ మహాత్మ్యాల్ని గ్రహించడమైంది.

సంచారజీవిగా ఉన్న ఆదిమానవుడు ఎలాంటి పరిస్థితుల్లో స్థిరజీవనుడయ్యాడు? ఆ తర్వాత అంచెలంచెలుగా అతనెలా అభివృద్ధిచెందాడు? ఆ తర్వాత రూపుదిద్దుకున్న సంఘ స్వరూపం దాని అంగాలైన గుడిసెలు, ఇల్లు, మట్టిమిద్దెలు, భవనాలు, నగరాలు, నదులు, కాలువలు, చెరువులు, బావులు, పొలాలు, దేవాలయాలు, రంగస్థలాలు, సంతలు, బందెలదొడ్లు మొదలైన వాటి ప్రసక్తి పంచకావ్యాల్లో ఎక్కడెక్కడ వస్తుందో పరిశీలించడమైంది.

సోదరుడి చేతిలో ఓడిపోయి, అడవులపాలై, మత్స్యధ్వజుడు అడవిలో తలదాచుకొనే సందర్భంలో, ఆకుల గుడిసె గురించి, అంబలి తెచ్చే తన భార్యకోసం కావు యువకుడు ఎదురుచూసేటప్పుడు, జడి వానలో చేలోని గుడిసె గురించి, అటవికుల మనస్తత్వాన్ని చెబుతూ బోయపల్లె గురించి ఆముక్త మాల్యదలో చక్కగా వివరించడమైంది. అందులోనే మధురానగరంలోని భవంతుల గురించి,

పారిజాతాపహరణంలో వైజయంత భవనం గురించి వివరించడం జరిగింది. అలాగే వసుచరిత్రలో అధిష్ఠాన నగరంలోని భవంతుల గురించి, వసురాజు సౌధం గురించి విపులీకరించబడింది. పంటపొలాలు, కాలువల గురించి వసుచరిత్ర, పాండురంగ మహాత్మ్యాలలో ప్రస్తావించబడింది. పొలాలు, పంటలు, వరిలోని రకాలు, రైతుల స్థితిగతులు, ఏతాలు, కుండలఏతాం (ఘట యంత్రాలు) గురించి ఆముక్తమాల్యదలో చిత్రించినట్లు మరే తెలుగు కావ్యంలోనూ చిత్రించబడలేదని తెలుస్తోంది. కళ్లారా చూసి, మనసారా అనుభవించిన ఒక వ్యక్తి కథనంలాగా, రాయల వర్ణన సహజత్వానికి ఎంతో దగ్గరగా ఉంది. వానకాలంలో మట్టిమిద్దెల పొటుకు, వంట చేయడానికి ఆడవాళ్ళు పడే శ్రమ, ముందు తిన్నవాళ్ళకేగాని, తర్వాత తినేవాళ్లకి అన్నం మిగలకపోవడం, మళ్లీ వంటకు పెట్టడం, పొయ్యి రగుల్కొకపోతే బట్టలు చించి, నేతిలో ముంచి, వెలిగించడం, కర్రలు మండకపోతే ఇంటి వాసాలు విరిచి పొయ్యిలో పెట్టడం లాంటి సూక్ష్మాతి సూక్ష్మ విషయాలు కూడా ఆముక్తమాల్యదలో కళ్ళకు కట్టినట్లు వర్ణించబడ్డాయి. మనుచరిత్రలో గరిడీశాలలు, బండెలదొడ్లను గురించి ప్రస్తావించబడింది.

స్త్రీ పురుషుల రూపురేఖా స్వభావాల గురించి పంచకావ్యాలన్నిట్లోను ప్రస్తావించబడింది. పల్లెపడుచుల మోటు సింగారం పాండురంగ మహాత్మ్యంలో ప్రదర్శించబడింది. వేసవి చలివేంద్రాల్లో నీళ్లుపోసే యువతుల్ని (ప్రపాళికల్ని), వరిపొలాల్లో పిట్టలు కాచే శాలి గోపికల్ని, బంతులాడే ద్రావిడ స్త్రీలను, నీళ్ళ బిందెల్ని చంకలో పెట్టుకుని, పూజా గీతాలు మననం చేసుకుంటూ వచ్చే ద్రావిడస్త్రీలను, పుష్పలావికల్ని, వేశ్యల్ని కళ్ళ ముందుంచారు రాయలు ఆముక్తమాల్యదలో. జిగేలు మనిపించే నగలతో మెరిసిపోయే ధనికవర్గ యువతుల వేషధారణ మనుచరిత్ర, వసు చరిత్ర, పారిజాతాపహరణాల్లో చిత్రించబడింది. పావడా, రవికె, చీర లాంటి వస్త్రాలు, ముంగర, ఒడ్డాణం, కమ్మలు, గాజులు వంటి నగలతో నాటి స్త్రీల వేషధారణ, నేటి స్త్రీల వేషధారణతో

ముగింపు

పోల్చినప్పుడు పెద్దగా తేడా లేదనిపిస్తోంది. కాకపోతే అనాడు పునుగు, జవ్వాది, కస్తూరి, అత్తరు, వన్నీరులాంటి సహజ సుగంధ ద్రవ్యాల్ని వాడితే, నేడు కృత్రిమమైన వాటిని వాడుతున్నారు. కాని పురుష వేషధారణలో మాత్రం నాటికీ, నేటికీ ఎంతో తేడా కనిపిస్తోంది. మనుచరిత్రలో ప్రవరుడు, పాండురంగ మహాత్మ్యంలో నిగమశర్మ, అక్కృత సత్త్రియుడు, ఆముక్త మాల్యదలో విష్ణుచిత్తుడు, యమునా చార్యుడు, సోమశర్మ కనిపిస్తారు. వీళ్ల వేషధారణ నాటి సాధారణ బ్రాహ్మణుల్ని తలపిస్తుంది. మతానికి అగ్రతాంబూల మిచ్చిన ఆ రోజుల్లో శైవ, వైష్ణవ వేషధారణ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. శైవుడైన పాండ్యరాజు అతని ఆశ్రయంలో బ్రాహ్మణులు గడ్డాలవరకూ విభూది రేఖలతో, మెడలో రుద్రాక్ష మాలలతో, నీరాజనాలు అందుకుంటారు. ఆముక్తమాల్యదలో వీళ్లు శైవానికి ప్రతినిధులు. అలాగే మాలదాసరి వేషధారణ, అతని పాత్రచిత్రణ లాగే ఆకాశాన్ని తాకుతోంది. ఇతనూ, యామునుడూ, విష్ణుచిత్తుడూ, ముగ్గురూ వైష్ణవానికి ప్రతినిధులు. వరుసగా వీళ్లు భక్తి, జ్ఞాన, వైరాగ్యానికి వారసులు.

భోగిని దగ్గరకు వెళ్ళే మధురరాజు వేషం అనాటి సంఘంలోని ధనిక వర్గీయుల్ని తలపిస్తుంది. అలాగే మనుచరిత్రలో 'దేవాపి' అనే గంధర్వుడు 'పారు'డనే బ్రహ్మర్షిని, అతని కూతురైన కళావతిని తనకిమ్మని అడగడానికి వస్తాడు. అప్పుడతని వేషం ఎలా ఉందంటే, చదువుసంధ్యలు లేక, సంస్కారం లేనివాడు విపరీతంగా అలంకరించుకుంటే ఎలా ఉంటాడో అలా ఉన్నాడట. పెద్దపెద్ద మీసాలు పరాక్రమానికి చిహ్నాలైతే, సన్నని నాజూకైన మీసాలు రసికత్వానికి ప్రతీకలు కాబోలు! నిగమశర్మ మీసాలు చేవ మీసాల్లాగా, 'ఉన్నాయా? లేవా?' అనేటట్లు సన్నగా ఉన్నాయట అలాగే తక్కిన విషయాల్లోను ఆయన వేషం అనాటి పోకిరీ కుర్రాళ్ళను గుర్తుకు తెస్తోంది. గానుగలు ఆడించడానికి వెళ్ళేవాళ్లని కూడా రాయలు ఎంతో నిశితంగా పరిశీలించి చిత్రించాడు. వేసవికాలంలో

బెల్లం గానుగల్ని చల్లపొద్దునే ఆడించేవాళ్లు. మధ్యాహ్నం ఎండకు తోటల్లో విశ్రమించి, సాయంకాలం అయ్యేటప్పటికి అందరూ బారులు తీరి గానుగిండ్ల వైపు వెళ్తున్నారు. కావిరంగు బట్టలు ధరించి, తలలో మల్లెపూలు పెట్టుకుని చూడడానికి వాళ్లు తమ గుడ్లను నోటితో పట్టుకెళ్ళే ఎర్రచీమల బారులాగా' ఉన్నారట.

పంచకావ్యాలు ఆవిర్భవించిన రోజుల్లో విజయనగర సామ్రాజ్యంలో శైవం తగ్గుముఖం పట్టి, వైష్ణవం పుంజుకోసాగింది. వైష్ణవంలో మళ్లీ ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం అనే శాఖలు బయలుదేరాయి. అందులో రాయలు విశిష్టాద్వైతాన్ని ఆదరించి, ఆ మత సిద్ధాంత ప్రతిపాదనే ప్రధాన ధ్యేయంగా 'ఆముక్తమాల్యద'ను రచించాడు. ఆ దిశలోనే తెనాలిరామలింగడు, రామకృష్ణుడై పాండురంగ మహాత్మ్యాన్ని రచించాడు. సాధారణంగా రాజు ఏ మతాన్ని అనుసరిస్తాడో ప్రజలు కూడా అదే మతాన్ని అవలంబించడం పరిపాటి. పాండ్యరాజు వీరశైవుడు. ఆయన ఆస్థానపండితులంతా ఆయన దారిలోనే శైవమతాన్ని అవలంబించి, గడ్డాలవరకూ విభూదిని పూనుకుని, మెడలో రుద్రాక్షమాలలు, చంకలో పెద్దపెద్ద సూతసంహిత గ్రంథాల్ని ఇరికించుకుని అటూ, ఇటూ తిరుగుతున్నారట.

రాజు తన అభీష్టానుసారం మత సిద్ధాంత ప్రతిపాదనకు పండితుల్ని ఆహ్వానించి, శాస్త్ర చర్చలు నిర్వహించేవాడు. ఎంతో లోతుకు దిగి శాస్త్ర చర్చలు, వాదోపవాదాలు కొనసాగించేవాళ్లు. ఓడిపోయిన వాళ్లకి కూడా ఎంతో కొంత పైకం ముట్టజెప్పేవాళ్లు. అందుకని ప్రతి పండితుడు కూడా ఆ శాస్త్ర చర్చల్లో పాల్గొనడానికి అర్రులు సాచేవాడు. నిద్రాహారాలు మాని, చదివి చదివి, దానికి తగిన ఫలితం రాకపోవడంతో చదువంటేనే విముఖత ప్రదర్శించే బ్రహ్మరాక్షసుడి వంటివాళ్లు, అపారమైన శాస్త్రాల్ని అల్పమైన జీవితకాలంలో పూర్తిగా చదవడం సాధ్యం కాదని, అర్థాబద్ధం పాండిత్యంతో పొగరు

వస్తుందేగాని, జ్ఞానం సిద్ధించదని, భగవంతుడి మీద భారంవేసి, భక్తే ప్రధానంగా జీవితం సాగించే విష్ణుచిత్తుడు లాంటివాళ్లు, హీనకులంలో పుట్టి, చదువు సంధ్యలు రాకపోయినా దానుడై, భగవంతుని నామకీర్తన నియమం తప్పక పాటించే మాలదానరి వంటివాళ్లు, ఆ కాలంలో ఉండేవాళ్లని ఊహించవచ్చు. ఇలాంటి మతపరమైన సిద్ధాంతాలు, రాద్ధాంతాలు, ఉన్నతవర్గాలవాళ్లకే పరిమితమై ఉండొచ్చు. సాధారణ ప్రజలు (శూద్రులు) వాళ్లవాళ్ల వృత్తుల్ని క్రమం తప్పకుండా పాటించేవాళ్లు. వృత్తి సంకరంగాని, జాతి సంకరంగాని ఆనాడు సహించేవాళ్లు కాదని తెలుస్తోంది. అయినా అక్కడక్కడా కులం మీద పట్టు సడలిందనడానికి నిగమశర్మ, అక్కృత సత్త్రియుని వంటివాళ్లు కూడా కనిపిస్తారు. మిగిలినరైతులు, కమ్మరులు, చాకలి, మంగలి వంటి జాతులవాళ్లు తమ తమ వృత్తుల్ని ఈనాటి లాగే సాగించేవాళ్లు.

సాంస్కృతిక కార్యక్రమాలకు ఆనాడు రాజాదరణ, ప్రజాదరణ కూడా లభించింది. పండితులు, రాజులు మొదలైన ఉన్నత వర్గాలవాళ్లు, రంగస్థలాలు, కల్యాణమంటపాలు లాంటి వేదికల మీద నాటకాలు, నృత్య ప్రదర్శనలు, హరికథల వంటి కాలక్షేపాలతో తృప్తిపడేవాళ్లు. సాధారణ ప్రజలు జాతరలు, సంతలు లాంటి చోట్ల వినోద కార్యక్రమాల్ని అనుభవించేవాళ్లు. రథోత్సవాలు, వివాహాలు, పూజలు మొదలైనవి అన్ని వర్గాల వాళ్లకి ఆనందాన్నిచ్చేవి. నటులు, గాయకులు మొదలైన కళాకారులకు సమాజంలో ప్రత్యేక మన్నన, రాజాదరణ లభించేవి.

దేవాలయాలు మత కేంద్రాలుగానే కాకుండా, సాంస్కృతిక కేంద్రాలుగాను, విద్యా కేంద్రాలుగాను విలసిల్లాయి. విజయదశమిని పదిరోజులు ఘనంగా జరుపుకునేవాళ్లు. వసంతోత్సవాల పేరుతో కవి సమ్మేళనాలు జరిగేవి. పెళ్ళిళ్ళు ఐదురోజులు కొనసాగించేవాళ్లు. వరుడికి కట్నకానుకలు ఇవ్వడం ఘనంగా భావించేవాళ్లు. వేశ్యలు

సంగీత, సాహిత్య, నాట్యాలలో నెరజాణలై సమాజంలో గౌరవం కలిగి ఉండేవాళ్లు. బహుభార్యాత్వం అమల్లో ఉండేది.

రథోత్సవాలు ఏటేటా జరిగేవి. పెద్దవాళ్లను ఆహ్వానించడానికి కూడా ఉత్సవాలు నిర్వహించేవాళ్లు. ఈ ఉత్సవాల్లో 'భోగపుమేళం' వాళ్లు నాట్యం చేసేవాళ్లు. ఊరేగింపులో వీళ్లది ప్రధాన పాత్ర. హరిదాసులు పాటలు పాడుతూ తాంబూర, చిడతలు, వాయించుకుంటూ వెళ్ళేవాళ్లు. ఆ ఉత్సవాల్లో కుర్రకారు పోకిరీ చేష్టలు సర్వసామాన్యంగా ఉండేవి. ఆ ఉత్సవాల్లో ఇరుగు, పొరుగు ఊళ్ళవాళ్లు కూడా పాల్గొనేవాళ్లు. ఆముక్తమాల్యదలో ఇలాంటి ఉత్సవాన్ని విష్ణుచిత్తుడు పురప్రవేశం చేసేటప్పుడు వర్ణించడమైంది.

జాతరల్లో పామరజనులు, పల్లెటూరి స్త్రీలు పాల్గొనేవాళ్లు. వాళ్ల భక్తి వీరోచితంగా, సాహసోపేతంగా ఉండేది. 'సిడి వ్రేలడ'మనేది భయంకరమైన చర్య. నాలుకకు దబ్బనాలు, చిన్న కత్తులు గుచ్చుకోడం ఇలాంటిదే. దేవతలకు జంతుబలులు ఇచ్చేవాళ్లు. ఇవన్నీ పాండురంగమహాత్మ్యంలో వర్ణించబడ్డాయి. ఉన్నత వర్గాలవాళ్లు వ్రతాలు ఆచరించేవాళ్లు. పారిజాతాపహరణంలో 'పుణ్యక వ్రతం' గురించి వివరించబడింది. వసుచరిత్రలో రంగస్థలం, పాత్ర ప్రవేశం, తెరతీయడం వంటి విషయాలు ప్రసక్తమయ్యాయి. మనుచరిత్రలో 'వేట' గురించి విపులంగా వర్ణించబడింది. జంతువుల స్వభావం, వేటాడే విధానం, క్రూరమృగాల్ని చంపినప్పుడు చేసే పనులు, అడవిలో మాంసం వండే తీరు, ఎంతో సహజంగా వర్ణించబడ్డాయి. విద్యావిధానానికి, వైద్యానికి సంబంధించిన విషయాలు మనుచరిత్ర, ఆముక్తమాల్యదలలో పేర్కొబడ్డాయి.

వసుచరిత్ర, మనుచరిత్ర, ఆముక్తమాల్యదలలో పెళ్ళికి సంబంధించిన విషయాలు వివరంగా తెలియజేయబడ్డాయి. ఊరేగింపు సందర్భంలో ఉల్లడం పట్టడం, అగ్నియంత్రాలు కాంతులు వెదజల్లడం, నల్లచెరకు గడల్ని వెన్నుతోపాటు పట్టుకుని సుందరాంగులు ముందు నడవడం,

ముగింపు

వీరవనితల నాట్యం, చక్రాకృతి కలిగిన తొట్లల్లో అమర్చిన యంత్రాల్లో తిన్నగా తిరిగే స్త్రీలు, బంగారు చప్పరాల మీద అమర్చిన యంత్ర పాంచాలికలు, మద్దెల మోతలకు అనుగుణంగా తమంతట తామే తిరగడం లాంటి అద్భుత విషయాలు వర్ణించబడ్డాయి.

పరిపాలనా వ్యవస్థకు సంబంధించిన విషయాలు ఆముక్తమాల్యదలో మాత్రమే లభిస్తున్నాయి. రాజ్యాంగాలు, రాజుకు, మంత్రులకు ఉండాల్సిన లక్షణాలు, రాజ విధులు, మంత్రుల విషయాల్లోను, ప్రజల విషయంలోను, అతను చూపాల్సిన మెలకువలు, రాజ్యాదాయం, వ్యయం ఎలా ఉండాలో, శిక్షలు అమలు పరచాల్సిన తీరు, లంచాలు ఎవరు ఎటువంటి పరిస్థితుల్లో తీసుకుంటారో మొదలైన విషయాలు తెలియజేయబడ్డాయి.

జనజీవన పరిశీలనలో సంఘ బాహ్య స్వరూపానికి ఎంత ప్రాముఖ్యమో, అంతః స్వరూపానికి కూడా అంతే ప్రాముఖ్యం. ప్రజల ఆంతరంగిక పరిశీలనకు ఉపకరించేవి వాళ్ల అభిరుచులు, ఆచారాలు, మనస్తత్వాలు, విశ్వాసాలు మొదలైనవి. ఆనాటి ప్రజలకు తాంబూలం, సుగంధ ద్రవ్యాలు, వస్త్రాలు, నగలు మొదలైన వాటమీద మోజు దాదాపు ఐదు కావ్యాల్లోను చోటుచేసుకుంది.

మొత్తంమీద జనజీవనానికి సంబంధించిన విషయాలు వసుచరిత్ర, పారిజాతాపహరణాలలో అంతంత మాత్రంగాను, పాండురంగ మహాత్మ్యం, మనుచరిత్రల్లో కొంతవరకూ లభిస్తాయి. ఇక ఆముక్త మాల్యదలో చిన్నా, పెద్దా తేడా లేకుండా సాంఘికజీవనానికి చెందిన సమస్త విషయాలు ప్రదర్శించబడ్డాయి. అదొక సాంఘిక విజ్ఞానకోశం లాగా, పదహారవ శతాబ్ది జనజీవనానికి పట్టిన అద్దం లాగా మనకు సాక్షాత్కరిస్తుంది.

# అనుబంధం -I

*జాతరలు-ఉత్సవాలు*

ఒక గ్రామానికి సంబంధించిన ప్రజలుగానీ, కొన్ని గ్రామాలకు సంబంధించిన ప్రజలుగానీ నిర్ణీత సమయంలో, నిర్ణీత ప్రదేశంలో గ్రామదేవతను ఆరాధించడాన్ని 'జాతర' అని అంటారు. ఈ సందర్భంగా వేడుకలు ఆరాధనకు సంబంధించిన అంశాలు (ప్రార్థన, ఆత్మహింస, పవిత్రీకరణ, బలి) ఇందులో కూడుకుని ఉంటాయి. జాతర పూర్తిగా శక్తి దేవతారాధనాంశాలతో కూడుకుని ఉంటుంది. గ్రామదేవతల జాతరలో శిష్టదేవతారాధన పద్ధతులు ఏ విధంగానూ కనిపించవు. అయితే పురాణాల నుంచి, శిష్ట సాహిత్యం నుంచి గ్రహించబడిన గ్రామదేవతల ఆరాధనా సమయంలో గ్రామదేవతల పూజా పద్ధతులు, శిష్టదేవతల పూజాపద్ధతులు కలగలిసి ఉంటాయి. దీన్ని 'ఉత్సవం' అని అంటారు. ఉదాహరణకు గ్రామదేవతలైన గంగమ్మ, పోలేరమ్మ జాతర్లలో 'గరగ'ను నిలపడం, ప్రార్థన, బలి, మొదలైన అంశాలు చోటుచేసుకుని ఉంటాయి. అయితే పురాణాల నుంచి గ్రహింపబడిన గ్రామదేవతల ఉత్సవ సందర్భంగా 'గరగ', 'ధ్వజస్తంభారోహణ', 'అవరోహణ', గజవాహనం, గరుడవాహనం, శేషవాహనం, ఏకాంతసేవ, రథోత్సవం, బలి, అగ్ని గుండం మొదలైన అంశాలు కూడుకుని ఉంటాయి. ఇందులో అశ్వవాహనం, శేష వాహనం మొదలైనవి శిష్ట దేవతారాధన పద్ధతులు. అంతేకాకుండా పురాణాల నుంచి గ్రహించబడిన గ్రామదేవతల ఉత్సవ సమయంలో ఉత్సవవిగ్రహం ఊరేగింపబడుతుంది.

***కొలుపులు*** :- ఒక గ్రామంలోని ప్రధాన దేవతను ఆ గ్రామంలోని ప్రజలు ఆరాధించడాన్ని 'కొలుపులు' అంటారు. కొన్నిసార్లు అన్య గ్రామస్థులు కూడా ఆ దేవతను పూజించవచ్చు. అయితే కొలుపుల

సందర్భంగా జరిగే వేడుకలలో అన్య గ్రామస్థులు పాల్గొనరు. కొలువులలో గ్రామదేవతల జాతర ఉత్సవ పద్ధతులు కలగలిసి ఉంటాయి. శిష్ట గ్రామదేవతల ఉత్సవ సందర్భంగా జరిగే ఆరాధనా పద్ధతులు గ్రామీణ శైలిలో ఉంటాయి. గరుడవాహన, శేషవాహన మొదలైన వాటిని ముగ్గుల రూపంలో చిత్రిస్తారు. వీటిమీద గ్రామదేవత ఉన్నట్లుగా భావించి పూజిస్తారు. బలులు కూడా ఇస్తారు. అయితే ఉత్సవ సందర్భంగా వాహనాల మీద జరిగే గ్రామ దేవతారాధన విషయంలో 'జంతుబలులు' ఉండవు. శిష్ట దేవతల ఆరాధన పద్ధతులు పూర్తిగా కనిపిస్తాయి. వాహనాలమీద ఆరాధిస్తున్నప్పుడు టెంకాయలు, గుమ్మడికాయలు సమర్పిస్తారు.

ఈ విధంగా గ్రామదేవతల్ని జాతర, ఉత్సవం, కొలువులు పేరిట పూజించడాన్ని 'పండుగ' అని కూడా అంటారు. జాతర, ఉత్సవాల్ని తిరుణాళ్లు అని కూడా పల్లీయులు వ్యవహరిస్తారు.

***వేడుకలు*** :- జాతరలు, ఉత్సవాలు, కొలువుల సందర్భంగా వేడుకలు లేకపోతే జనం గుమిగూడరు. జాతర్లు, ఉత్సవాలు, కొలువుల ముఖ్యోద్దేశం గ్రామదేవతల్ని పూజించడానికి మాత్రమే పరిమితం కాదు. అందులో వేడుకలు కూడా అత్యంత ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటాయి. జనాకర్షణ శక్తి కలిగి, మనస్సును రంజింపచేసే కార్యక్రమాన్ని కూడా కలిగించే శక్తిని పొంది ఉంటాయి. జాతర, ఉత్సవాలు, కొలువులు సందర్భంగా జరిగే సంభ్రమాలకు, వేడుకలకు మూలకారణాలు ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా చెబుతున్నా, శాస్త్రీయ దృక్పథంతో చూస్తే, మానవుని మనస్తత్వం విశదమవుతుందని, తనకన్నా భిన్న స్థితి రూపంలో ఉన్న వ్యక్తుల్ని, పురాణపురుషుల్ని అనుకరించాలనే నిగూఢ తపన మనసులో ఇమిడి ఉంటుంది. ఈ భావం మనసులో చోటు చేసుకుని బయటికి వెల్లడి కావాలని ఉబలాట పడుతుంది. అతనిలో అంతరతంగా నిగూఢమై ఉన్న ఈ కోర్కె తీరకపోతే సాక్షిగా [illegible]

ప్రమాదముంది. ఈ కోర్కెలు వెల్లడైపోతే మనసు ప్రశాంత పడుతుంది. అందువలననే వేషాలు వేయడం, జాతర, ఉత్సవాలు, కొలుపులలో ప్రవేశ పెట్టారని గ్రహించవచ్చు.

[చిత్తూరు జిల్లా - గ్రామదేవతలు - ఒక అధ్యయనం - డా॥ టి. నారాయణ డిసెం. 1986 సిద్ధాంత వ్యాసం, బెంగళూరు విశ్వవిద్యాలయం పేజి 233-236 (అముద్రితం)]

# అనుబంధం -II

అముక్తమాల్యదలో రాయలు గొప్ప మానవతావాదిగాను, ధార్మికుడిగాను తన కలాన్ని కదం తొక్కించాడు. ఆ దిశలో తాను కవినన్ను సంగతి పక్కకు పెట్టి ఒక చక్రవర్తి హోదాలో 'పారువారల నుద్ది చెప్పంగనేల?' (అము. 4-4) అని బ్రాహ్మణులకు చురక వేస్తాడు. అలాగే క్షత్రియుల్ని కూడా "మూర్ధాభిషిక్తుడు సోకోర్చి యిలకగు నలజళ్లు తీర్చినంగాక జన్మంబు నఫలంబగునె? కేవలేంద్రియ ప్రీతి బంధీకృత వరకళత్ర పథిక-పరివత్త హరణ ప్రాప్త విత్తముల బాటచ్చర ప్రభులకు జరగదే?" (రాజు తన ప్రజల కష్టాలను తీరిస్తేనే అతని జన్మ ధన్యం. కేవల ఇంద్రియ సుఖములే ముఖ్యం కాదు. అలాంటి సుఖం దారి దోపిడీ దొంగల నాయకుడికి కూడ లభిస్తుంది కదా!) అని ఎత్తి చూపుతాడు. అలాంటి రాజుల్ని తీవ్రంగా గర్హిస్తాడు. కాని శూద్ర కర్షకుల శ్రమశక్తికి మాత్రం రాయలు అనితర సాధ్యమైన రీతిలో విలువ కట్టాడు. వినుతించాడు. 'నృపుల పదహాలరేఖల కెల్ల మా భుజాగ్రహాలరేఖలే మూలమంచు కోటి! కొండలుగ ధాన్యరాశులు పండుపీట! నుజన భజనైక విఖ్యాతి శూద్రజాతి' (అము. 2-36). శూద్రజాతికి చెందిన కర్షకులు తమ పొలాల్లో దున్నే నాగలిదాళ్ళు, ఆ దాళ్ళలో పండే పంటలే చక్రవర్తుల దిగ్విజయ యాత్రలకు, సామ్రాజ్యాల వైభవాలకు మూలమని, రాయల నిశ్చితాభిప్రాయం. చక్రవర్తుల కంటే రైతులే ఉన్నతులని ఇంత విస్పష్టంగా తాకీదునిచ్చిన పరిపాలకులు బహు అరుదు. ప్రపంచ ప్రసిద్ధ చెందిన విజయనగర సామ్రాజ్యపు సింహాసనాధిపతియై ఉండి కూడా రాయలు చూపిన ఈ వినయం ఆయన మానసిక పరిణతి ఔన్నత్యానికి నిదర్శనం.

ఇక మాలదానరి కథ గురించి చెప్పబోయేముందు జ్ఞానపీఠ ప్రశస్తి గ్రహీత కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు చేసిన ఒక

వ్యాఖ్యను మననం చేసుకోవాలి. 'మాలదాసరి కథవంటి కథ ఆంధ్ర భాషలో ఆముక్తమాల్యద మహాకావ్యంలో ఉండడం సాధ్యం. అటువంటి రచనను సృష్టిలో ఎవ్వరును చేయలేరు'' అని అన్నారాయన. ఆముక్తమాల్యద మహాకావ్యంలో మాలదాసరి కథను చదివినవాళ్లకే ఈ వ్యాఖ్యానపు ఔచిత్యం అర్థమవుతుంది. కుల ప్రధానమైన, అగ్రవర్ణాలదే ఆధిపత్యమైన ఆ రోజుల్లో, ఒక చక్రవర్తి కులం ప్రధానం కాదు, గుణమే మహత్తరమైంది. గుణం కలవాడే మహాత్ముడు అనే ప్రాతిపదిక మీద సమాజంలో అట్టడుగు జాతిగా పరిగణించబడిన మాలకులస్థుడికి కథానాయకుడి స్థానం కట్టబెట్టి ప్రతినాయకుడిగా ఉన్నతకుల సంజాతుడైన బ్రాహ్మణుణ్ణి నిలబెట్టి అతని దురాశ దుర్గుణాల్ని మాలకులస్థుడి సద్గుణాలతో పోల్చుతూ కథారూపంలో అద్భుత దృశ్యాలు కళ్ళకు కట్టే విధంగా వర్ణించాడు. ఇక్కడే ఇంకొక మలుపు ఉంది. కన్నడ దేశంలో సుప్రసిద్ధుడైన భక్త కనకదాసు శ్రీకృష్ణదేవరాయలకు ఆంతరంగికుడు. కనకదాసుకు లభించిన ప్రసిద్ధికి గల కారణాల్లో ఇది కూడా ఒకటి. పదవీ ఔన్నత్యం దివ్య వ్యక్తిత్వాలతో వెలుగొందిన కృష్ణరాయలలో ద్వారకా కృష్ణుని దర్శించుకున్న కనకదాసు, పారవశ్యానికి లోనై తన 'మోహన తరంగిణి' కావ్యంలో కృష్ణరాయల వైభవ విలాసాలనే శ్రీకృష్ణుని మహద్విలాసాలుగా వాళ్లిరువురికీ అభేదం చేసి, స్తుతించాడని కన్నడ కావ్య విమర్శకుల అభిప్రాయం. రాయలు విష్ణువు అంశంలో జన్మించినవాడని+ రాయల సమకాలీనులు తలచినప్పుడు రాయలకు ఆత్మీయుడైన కనకదాసు మరొకలాగా భావించలేదు.

రాయలు చాలా వినమ్ర స్వభావం కలవాడు. సహాయం చేసినవాళ్ల ఋణంగాని, సేవచేసినవాళ్ళ ఋణంగాని ఉంచుకోరాదనేది రాయల

చైతన్యలహరి. ఉపన్యాసమంజరి, మానవత్రిక (అగష్టు, 94).
i. అచ్యుతాయాంశజు శ్రీకృష్ణరాయనిన్ను.... ఆము. 1-31.
ii. అవతరించిన కృష్ణుడౌ ననగ మించె పారి. 1-17.
iii. కృష్ణదేవరాయడను పేర నాదినారాయణుండు పారి. 1-19.

అభిమతం. కనకదాసును అజ్ఞానులైన కొందరు అగ్రవర్ణీయులు అవహేళన చేశారని ప్రచారంలో ఉన్న కథల నేపథ్యం వాస్తవం అయితే, ఆ సంఘటనలు రాయలకు మనస్తాపం కలిగించి ఉండడం కూడా సహజం. అలాంటి ఛాయలేమైనా ఆముక్తమాల్యదలో దొరకగలవేమోనని వెదికితే, ఆశ్చర్యకరమైన అంశాలు బయట పడతాయి.* విగ్రహ రూపంలోను, ప్రచారంలోను ఉన్న కనకదాసు వేషభూషణాలకు, రాయల చేత వర్ణించబడిన మాలదాసరికి చాలా దగ్గరి పోలికలున్న అంశం మన దృష్టికి వస్తుంది.

"చముర్రైన తోల్కుబునంబు....నురియాకు వ్రైవ్వుండు" (ఆము. 6-06).

అగ్రవర్ణీయుల్ని చూసిన వెంటనే ముకుళిత హస్తుడై దూరంగా తొలగిపోయే మాలదాసరిని చూసి, అందరూ బాధపడ్డట్లు రాయలు చెప్పినా, అసలు బాధపడింది సున్నితమైన రాయల కవితా హృదయమేఅ కర్తవ్య విముఖుడై, భ్రష్టుడై, బ్రహ్మరాక్షసుడైన హీన బ్రాహ్మణుని మాలదాసరితో పోల్చి, అతని మహనీయతను పూస గుచ్చినట్టు వివరించాడు. కులం కంటే గుణమే ఉత్కృష్టమైంది. దైవసాన్నిధ్యం కోసం పరితపించిన మాలదాసరి మహాత్ముడు అని చాటి చెప్పాడు. రాయల సమకాలీనులలో అధమ వర్ణుడు, అవమానితుడైనవాడు కనకదాసే. కనకదాసును దృష్టిలో ఉంచుకొనే రాయలు మాలదాసరి వంటి సజీవమైన పాత్రను సృష్టించాడని ఊహించడం సముచితమవుతుంది. వాస్తవానికి చాలా చేరువగా ఉంటుంది. తనను మోహనతరంగిణిలో నిబద్ధుణ్ణి గావించి కావ్యాన్ని సృష్టించిన కనకదాసు పట్ల రాయలు పెంపొందించుకున్న ఆత్మీయతా భావం ఋణాన్ని తీర్చుకునే తత్త్వాలే రాయలచేత కనకదాసుకు ప్రతిరూపమైన మాలదాసరి పాత్రను సృష్టింపజేయడానికి గల ప్రబల కారణాలని భావించాల్సి ఉంటుంది.

* మాలదాసరివేషం, వర్ణన కనకదాసును పోలి ఉంది(ఆము. 6-06).

# అనుబంధం -III

మెకంజీద్వార కృషిఫలితంగా సేకరించిన గ్రామకైఫీయతులు చరిత్రను పునర్నిర్మించడానికి ఎంతో తోడ్పడుతూ ఉన్నాయి. బహుశ ధర్మాసనాలకు వ్యతిరేకంగా రాజుకు ఫిర్యాదు చేయడానికి భయపడడంవల్లగానీ, వ్యాజ్యాలు వ్యక్తిగతమైనవి కావడంవల్లగానీ, ఈ విషయాలేవీ శాసనాలలోగాని, సాహిత్యంలోగాని ప్రస్తావించబడలేదు. అయితే స్థానిక చరిత్రల (కైఫీయతుల) వల్ల న్యాయం అభ్యర్థించడానికి తమ వద్దకు వచ్చేవాళ్లకి న్యాయమైన తీర్పు ఇవ్వాల్సిన బాధ్యతాయుతమైన అధికారులే కూటపత్ర సృష్టికోసం, ప్రోత్సహించడం, వాళ్ల నుంచి లంచాలు తీసుకోడం, న్యాయాన్ని అన్యాయమని తీర్పు చెప్పడం లాంటి ఆసక్తికరమైన విషయాలు తెలుస్తున్నాయి.

"న్యాయస్థానాల్లో తీర్పు చెప్పడానికి నోటిమాటల కంటే, లిఖిత ప్రమాణ పత్రాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. కాని తెలివిగా నకిలీ పత్ర సృష్టిచేసేవాళ్లు. ఆయా ప్రదేశాల్ని, కాలాన్ని బాగా సుపరిచితం చేసుకుని, నిజమైన పత్రాల లాగే నకిలీ పత్రాలు రాసేవాళ్లు. ఇందుకు "హనుమానిగురేడం - పేరు సోములవారి మధ్యనున్న భూముల పంపిణీ వ్యాజ్యం నిదర్శనం".1

*నకిలీ పత్రసృష్టి* :- కావడి నారాయణ సోమయాజులు గండికోట ధర్మాసనం మహాజనంలోని సభ్యుల్లో ఒకరు. ఈయన మూడు వరహాలు లంచంగా పేరు సోమల లింగరాజు మనుముల నుంచి తీసుకుని, ప్రత్యర్థులు న్యాయం కోసం ఇతని దగ్గరకు రాగా, వాళ్లని

1. Sukladas 'crime and punishment in Ancient India. P.20-21;

వాళ్ల చెంతనున్న 'జయరేఖ'ను బిగ్గరగా చదవమని కోరగా, వాళ్లు అలాగే చేశారు. రావడి నారాయణ సోమయాజుల సూచనల పేరు సోమలవారు తడికె వెనుక దాగి ఉండి, ఎదుటి పక్షం వాడి దగ్గర ఉన్న జయరేఖల్లోని విషయాలన్నీ పూర్తిగాను, క్షుణ్ణంగాను ఆలకించి, అదే విధంగా 'నకిలీ జయరేఖ'నొకదాన్ని తయారుచేశారు".2

*ధర్మాసనంవాళ్లు లంచాలు తీసుకునేవాళ్లు* :- 'వాది ప్రతివాదులిద్దరూ న్యాయాన్ని అభ్యర్థిస్తూ, తిప్పనముద్రానికి వెళ్ళగా, అక్కడ ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఒకటి ప్రత్యేకంగా వీళ్ల వ్యాజ్యానికి తీర్పు చెప్పే నిమిత్తం ఏర్పాటు చేయబడింది. ఇరు పక్షాలవాళ్ల వాద, ప్రతివాదనలు విన్న తర్వాత, ధర్మాసన సభ్యులు వాళ్లలో వాళ్లు తర్కించుకుని, మానిగుండంవాళ్ల వద్ద ఉన్న 'జయరేఖ' నిజమైందని నిర్ధారించుకుని, ఆ మేరకు ఒక నిర్ణయం తీసుకోడానికి సిద్ధమయ్యారు. హానుమాని గుండం వాళ్లవైపు న్యాయనిర్ధారణ జరుగనున్న తరుణంలో, పేరు సోమలవారు. వాళ్లలో వాళ్లు మాట్లాడుకుని ధర్మాసన సభ్యులకు డెబ్బై అయిదు వరహాలు లంచంగా ఇవ్వడానికి నిర్ణయించి, ఈ విషయాన్ని వాళ్లకి ప్రతిపాదించారు. దానికి ధర్మాసన సభ్యులు అంగీకరించగానే, పేరు సోమల వారు వారి వద్ద నున్న డెబ్బయి వరహాలు రొక్కంగా ఇచ్చి తక్కిన అయిదు వరహాల్ని తర్వాత ఇచ్చేటట్లుగా పత్రం పెట్టారు".3

2. Local Record K.A.N. Sastri, P. 21 & 23-32;
3. N. Venkataramanaiah. ' Further sources of Vijayanagar Histroy Vol. II, Text, P. 423-425.Madras. 1946.

*సేకరణ* : మైనేని కృష్ణకుమారి. తెలుగు మాసపత్రిక ఆగష్టు, 1994. సంచిక.

# ఉపయుక్త గ్రంథాలు

1. అవలోకన (కర్నాటకద పరంపరెయ సమీక్ష), కన్నడ సంపాదకులు: ఎచ్చెస్కె, విశ్వకన్నడ సమ్మేళన, కన్నడ మత్తు సంస్కృతి, నిర్దేశనాలయ, 14-2- అ, నృపతుంగరస్తె, బెంగళూరు- 560 002 - 1985.

2. ఆంధ్ర ప్రబంధ అవతరణ వికాసములు, ఆచార్య నరసింహం, కె.వి.ఆర్, ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ -1965.

3. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి, లక్ష్మీరంజనం, ఖండవల్లి, బాలేందు శేఖరం, ఖండవల్లి (పునస్సంశోధకుడు, చీమకుర్తి శేషగిరిరావు), బాలసరస్వతీ బుక్ డిపో, విద్యా విషయక ప్రచారకులు, కర్నూలు- మద్రాసు -1985.

4. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ప్రతాపరెడ్డి, సురవరం (ప్రథమ ముద్రణ) సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి, హైదరాబాదు -1982.

5. ఆంధ్రసాహిత్య చరిత్ర, లక్ష్మీకాంతం, పింగళి, గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ -1985.

6. ఆంధ్ర సాహిత్యము - సాంఘిక జీవన ప్రతిఫలనము, వేంకట సత్యరామారావు, నందూరి, తెలుగు సాహితీ సమాఖ్య, తాడేపల్లిగూడెం -1979.

7. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, వెంకటావధాని, దివాకర్ల, ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్‌రోడ్, హైదరాబాదు -1.

ఉపయుక్తగ్రంథాలు
8. ఆముక్తమాల్యద, శ్రీకృష్ణదేవరాయలు, వావిళ్ళవారి వ్యాఖ్యానము -1960.

9. ఆముక్త మాల్యద (సంజీవనీ వ్యాఖ్య) వేదంవారి వ్యాఖ్యానము, వేదం వెంకటరాయ శాస్త్రి అండ్ బ్రదర్స్ ,4. మల్లికేశ్వరస్వామి గుడి నందు, మద్రాను-1. 1964.

10. చిత్తూరుజిల్లా - గ్రామదేవతలు-ఒక అధ్యయనం, నారాయణ. టి, సిద్ధాంత వ్యాసం. బెంగుళూరు విశ్వవిద్యాలయం -1986.

11. చైతన్యలహరి (ఉపన్యాస మంజరి), యువ భారతి, సాహితీ సంస్థ 5, కింగ్స్‌వే, సికిందరాబాదు - 3, -1991.

12. నరస భూపాలీయం (కావ్యాలంకారసంగ్రహం), భట్టుమూర్తి, (సటీక, బులుసు వెంకటేశ్వర్లు), వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్-1969.

13. పరిశీలన (వ్యాససంకలనం), కృష్ణకుమారి. నాయని, 8-3-898/2, నాగార్జుననగర్, హైదరాబాదు - 500 073.

14. పాండురంగమహాత్మ్యం (సవ్యాఖ్యానం), వెంకటరమణయ్య. బులుసు, వావిళ్ళ రామస్వామి & సన్స్, చెన్నపురి -1952.

15. పాండురంగమహాత్మ్యం, (తెనాలి రామకృష్ణుడు), పరిష్కర్త: అనంతకృష్ణశర్మ. రాళ్లపల్లి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, కళాభవన్, సైఫాబాదు, హైదరాబాదు -4, -1967

16. పారిజాతాపహరణము, (నంది తిమ్మన), సురభి వ్యాఖ్యాన సహితం, వావిళ్లరామస్వామి శాస్త్రులు & సన్స్ చెన్నపురి -1960.

17. ప్రబంధములలో ప్రకృతి వర్ణన, నరసింహం. అంతటి, సమతా సాహితి, నారాయణగూడ, హైదరాబాదు - 1979.

18. ప్రబంధ సుధామాధురి (ఆముక్తమాల్యద), వేంకటేశ్వర్లు, వుల్లాభొట్ల, శ్రీకృష్ణనగర్, ఖమ్మం - 4, - 1994.

19. ప్రబంధ వాఙ్మయ వికాసము (రాయలయుగం), సిద్ధాంత వ్యాసం, దుర్గయ్య, పల్లా. 3-5-1027, నారాయణగూడ, హైదరాబాదు - 29, - 1973.

20. ప్రవాసి కండ ఇండియా (కన్నడం)సంపుటి.2, నాగేగౌడ, H.L, I.A.S, డైరెక్టర్, ప్రసారాంగ, మైసూరు విశ్వవిద్యాలయం, మైసూరు.

21. ప్రాచీన కావ్యాలు-గ్రామీణ జీవనచిత్రణ, చెన్నప్ప. మనన, గాయత్రీ పబ్లిషర్స్, ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్‌రోడ్, హైదరాబాద్-1, - 1991.

22. భారతదేశ చరిత్ర-సంస్కృతి, 9వ సంపుటం ( విజయ నగరము) శాస్త్రి, బి.యన్, మూసీ పబ్లికేషన్స్, 3-3-245/1, లింగంపల్లి హైదరాబాద్-27, - 1994.

23. మనుచరిత్ర (అల్లసాని పెద్దన), వ్యాఖ్యాత, సూర్యనారాయణ, వెంపరాల, వెంకట్రామ అండ్ కో, విజయవాడ, మద్రాసు, హైదరాబాదు - 1968.

24. రాయవాచకం, సంపాదకులు, రామచంద్రరావు, సి.వి, ఆంధ్రప్రదేశ్, సాహిత్య అకాడమీ, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్-4, - 1982.

25. వసుచరిత్ర, భట్టుమూర్తి, సవ్యాఖ్యానము, శొంఠి. భద్రాది రామశాస్త్రి, వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ చెన్నపురి - 1935.

26. విజ్ఞాన సర్వస్వము 3, 4, 6 సంపుటములు తెలుగు భాషా సమితి
27, విశ్వవిద్యాలయ భవనములు. మద్రాసు - 5. - 1959, 60, 61

27. సమగ్రాంధ్ర సాహిత్యము - 7వ సంపుటం - ఆరుద్ర
యం. శేషాచలం & కో. మద్రాసు. మచిలీపట్నం
సికిందరాబాదు - 1966.

28. సమాజ శాస్త్రం, సామాజిక మానవ శాస్త్రం. ఖండికలు - 4, 7
ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. హైదరాబాదు - 1985

29. సాంఘిక జానపద ఆచారాలు - మోహన్ జి.ఎస్.
తెలుగు విభాగాధ్యక్షులు, బెంగళూరు విశ్వవిద్యాలయం - 1994

30 సాహిత్య మత్తు సమకాలీన వాస్తవికత (కన్నడం) - ఓ. ప్రసన్న, తోష్టి
చాముండీ ఎంటర్‌ప్రైజెస్, మైసూరు - 8.

ఆంగ్లం :-

1. A Forgotten Empire - Robert Sewell
Asian Educational Services, New Delhi - 1987.

2. Further Sources of Vijaynagar History Vol II Text
Madras - 1946.

3. History of Third Dynasty of Vijaynagar
Madras - 1935.

4. Sukladas Crime and Punishment in Ancient History
(300 A.D. - 1100 A.D.), New Delhi - 1977.

5. · International Encyclopaedia
Redcriffe - Brown - 1952.

6. The Vijayanagar Heritage, Edited by J.R. Ramamurthy, Sri Vidya, Vijayanagara Hampi Heritage, Trust, Anegondi House, 1997. N.C. Colony, Hospet.

*పత్రికలు* :

1. ఉదయవాణి, (కన్నడం).

2. దీపావళి విశేషాంక 1991.

3. తెలుగు మాసపత్రిక, తెలుగు అకాడెమీ, హిమాయత్‌నగర్, హైదరాబాద్-29, - 1994.



| | | |
|---|---|---|
| పేరు | : | సమ్మెట మాధవరాజా |
| తల్లిదండ్రులు | : | శ్రీ నరసరాజా, శ్రీమతి సుబ్బమ్మ |
| భార్య | : | శ్రీమతి జయలక్ష్మి |
| కుమారులు | : | చి. రాజశేఖర్, బి.ఇ., చి. విజయవర్ధన్ (బి.టెక్)<br>చి. వంశీమోహన్ |
| పుట్టిన తేది | : | 20-12-1950 |
| జన్మస్థలం | : | మైల సముద్రం, సత్యసాయి తాలూకా<br>అనంతపురం జిల్లా |
| విద్యాభ్యాసం | : | బుక్కపట్నం సత్యసాయి ఉన్నత పాఠశాల,<br>తిరుపతి ప్రాచ్యకళాశాలలో విద్వాన్<br>ఎమ్.ఎ. తెలుగు,<br>పిహెచ్.డి. బెంగుళూరు విశ్వవిద్యాలయం,<br>కన్నడ డిప్లొమా |
| వృత్తి | : | తెలుగు పండిత పదము<br>శ్రీ గొట్టిపాటి వెంకటరత్నం ఉన్నత పాఠశాల<br>విద్యానగర్<br>గంగావతి, కొప్పల్ జిల్లా, కర్నాటక. |
| అభిరుచులు | : | సాహిత్య వ్యాసంగం, అష్టావధానం |
| రచనలు | : | కచదేవయానీయము |